సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 29
సోమవారం 21-4-2025


'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'


ఇటు రోహిత్... అటు కోహ్లి
దంచికొట్టిన స్టార్ బ్యాటర్లు. పంజాబ్‌పై బెంగళూరు... చెన్నైపై ముంబై విజయం -14లో



'మార్పు' మంచిదే!
కొత్త పన్ను విధానంతో గందరగోళానికి చెక్.. రిటర్నులు ఎంతో సరళతరం -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


నేడే జె.డి. వాన్స్ రాక
అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్ తన సతీమణి ఉషా చిలుకూరి, పిల్లలతో కలిసి సోమవారం భారత పర్యటనకు రానున్నారు.
- వివరాలు 6లో


కశ్మీర్‌లో ఆకస్మిక వర్షాలు
జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో ఆదివారం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించాయి.
- వివరాలు 6లో


ట్రంప్‌పై ప్రజాగ్రహం
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలను తప్పుబడుతూ వివిధ రాష్ట్రాల్లో వేలాది మంది ప్రజలు రోడ్డెక్కారు.
- వివరాలు 6లో


హైడ్రోజన్ బాంబ్‌ను పరీక్షించిన చైనా
రేడియోధార్మికత వెలువర్చని, భారీ వినాశనం సృష్టించే అధునాతన హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది.
- వివరాలు 6లో

రాష్ట్రమంతా 'నెట్టిల్లు'


ఇంటింటికీ ఇంటర్నెట్ దిశగా సర్కారు అడుగులు.. ఈ ఏడాదిలోగా 93 లక్షల ఇళ్లకు డిజిటల్ కనెక్టివిటీ

- తక్కువ ఖర్చు.. నిరంతరం అపరిమిత హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్
- తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ సన్నాహాలు
- లోకల్ కేబుల్ ఆపరేటర్లను భాగస్వాములను చేయనున్న సంస్థ
- 20 వేల మంది ఫైబర్ ఆప్టిక్ టెక్నీషియన్లకు కూడా ఉపాధి
- ఇంట్లోని టీవీ, కంప్యూటర్, సీసీ టీవీ మానిటర్‌గా మారేందుకు చాన్స్
- కేబుల్ టీవీ చానళ్లతో పాటు టీ శాట్ చానళ్లు అందుబాటులోకి..
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా నాలుగు గ్రామాల డిజిటలైజేషన్

సాక్షి, హైదరాబాద్: ఒకే ఒక్క ఇంటర్‌నెట్ కనెక్షన్.. మీ నట్టింట్లోని టెలివిజన్ తెరను కంప్యూటర్‌గా (వర్చువల్ డెస్క్ టాప్) మార్చేస్తుంది. వైఫై సేవలతో పాటు కేబుల్ టీవీ అందుబాటులోకి వస్తుంది. మీ టీవీని, లేదా సెల్‌ఫోన్‌ను సీసీ కెమెరాలతో అనుసంధానించుకోవచ్చు. కేబుల్ టీవీ చానళ్లతో పాటు పిల్లలకు పాఠాలు చెప్పే టీ శాట్ చానళ్లు కూడా చూసేందుకు వీలవుతుంది. కేబుల్ ఆపరేటర్‌కు మీరు నెలా చెల్లించే మొత్తంలోనే వీటితో పాటు యూట్యూబ్, గూగుల్, ఓటీటీ లాంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. తక్కువ ఖర్చు తో అపరిమిత హై స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను నిరంతరం వినియోగించుకునే వెసులుబాటు వినియోగదారులకు దక్కుతుంది. 'భారత్ నెట్' ప్రాజెక్టులో భాగంగా ఈ తరహా సౌకర్యాన్ని త్వరలో తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ ప్రయత్నాలు చేస్తోంది.

రూ.300కే కనెక్షన్

ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌తో పాటు పలు ప్రైవేటు సంస్థలు ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. తాజాగా టీ ఫైబర్ ప్రాజెక్టులో భాగంగా, ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో 30 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల గృహాలకు రూ.300కే ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చే దిశగా తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా 12,751 గ్రామ పంచాయతీలను ఆప్టిక్ ఫైబర్ కేబుల్ (ఓఎఫ్‌సీ)తో అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు 5,001 గ్రామ పంచాయతీలను ఓఎఫ్‌సీతో కనెక్ట్ చేసింది. టీ ఫైబర్ పనులను పూర్తి చేసి ఇంటింటికీ ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇవ్వడం ద్వారా 2028 నాటికి రూ.500 కోట్ల మేర ఆదాయం పొందాలని ఫైబర్ మిగతా 3వ పేజీలో ▶



ఆదివారం కిటాక్యుషు నగర మేయర్ కజుషియా టేకుచితో సీఎం రేవంత్‌రెడ్డి


హైదరాబాద్‌లో ఎకో టౌన్!

- వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, పర్యావరణ పునరుద్ధరణలో సహకారం.. సర్క్యులర్ ఎకానమీ కార్యకలాపాల్లో కూడా..
- జపాన్ కంపెనీలతో సీఎం రేవంత్ బృందం ఎల్‌ఓఐ ఒప్పందం

కిటాక్యుషు-హైదరాబాద్ మధ్య సిస్టర్ సిటీ ఒప్పందంపై చర్చ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ఎకో టౌన్ ఏర్పాటు, అలాగే సర్క్యులర్ ఎకానమీ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, పర్యావరణ పునరుద్ధరణ వంటి రంగాల్లో సహకారం కోసం ప్రముఖ జపనీస్ ఎకో టౌన్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ) రూపంలో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈఎక్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్‌సీ, నిప్పన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమిటా హోల్డింగ్స్ వంటి కంపెనీలు వీటిల్లో ఉన్నాయి. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జపాన్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ బృందం ఆదివారం అక్కడి కిటాక్యుషు నగరాన్ని సందర్శించి ఈ మేరకు పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. హైదరాబాద్, కిటాక్యుషు నగరాల మధ్య బలమైన బంధానికి ఈ ఒప్పందాలు నిదర్శనమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. రెండు నగరాల మధ్య పరస్పర సహకారం కోసం మేయర్ కజుషియా టేకుచి ఆలోచన మేరకు 'సిస్టర్ సిటీ' ఒప్పందం చేసే అంశాన్ని తప్పనిసరిగా పరిశీలిస్తామని రేవంత్ హామీ ఇచ్చారు. సత్వర అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సంపద సృష్టి, పర్యావరణ పరిరక్షణ పట్ల తామే నిబద్ధతతో పనిచేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు కలిసి పనిచేయనుండడంపై ఆనందం వ్యక్తం చేశారు.

నగరాలు, సమాజాల మధ్య వారధి కోసం..

'రెండు నగరాలు, సమాజాల మధ్య వారధి నిర్మించడానికి మనం చేతులు కలిపాం. ఇది భవిష్యత్తు తరాలకు ప్రయోజనకరం. స్వచ్ఛత, పచ్చదనం, సుస్థిరత, మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ఆర్టీసీలో 3,038 ఖాళీల భర్తీకి ఏర్పాట్లు

తెలంగాణ ఆర్టీసీలో 3,038 పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది. ఇప్పటివరకు ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీని సంస్థే చేపట్టే విధానం ఉండేది. తొలిసారి నియామక సంస్థలకు ప్రభుత్వం ఈ బాధ్యత అప్పగించింది.
- వివరాలు 5లో

పోడు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

ఏజెన్సీలో పోడు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఇంద్రవెల్లిలో ఆదివారం అధికారికంగా నిర్వహించారు.
- వివరాలు 3లో

మళ్లీ పర్యావరణ అనుమతులు!

ఎస్ఎల్‌బీసీ సొరంగం ఇన్‌లెట్ వైపు నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు చేపట్టేందుకు పర్యావరణ, అటవీ అనుమతులు కోరుతూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో దరఖాస్తు చేసుకోనుంది.
- వివరాలు 16లో

మన వివాహ మార్కెట్ రూ. 11 లక్షల కోట్లు

మన దేశ వివాహ మార్కెట్ విలువ రూ.11 లక్షల కోట్లుగా మార్కెట్ వర్గాల అంచనా. ఏటా దేశంలో దాదాపు కోటి వివాహాలు జరుగుతున్నాయి. వివాహాల ఖర్చుపై ఓ సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.
- వివరాలు 12లో

కేసీఆర్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

బీఆర్ఎస్ ఓటమితో తెలంగాణనే ఎక్కువ నష్టపోయింది
దేశంలో మత పిచ్చితో బీజేపీ రాజకీయాలు: కేటీఆర్


సమావేశంలో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/ అత్తాపూర్: కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవటం తెలంగాణ సమాజానికి చారిత్రక అవసరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని పూడ్చుకోవలసిన బాధ్యత తెలంగాణ సమాజంపైనే ఉందని తెలిపారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివచ్చి కేసీఆర్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లపాటు కేసీఆర్ అభివృద్ధి చేసిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ మళ్లీ వెనక్కు తీసుకెళ్తోందని మండిపడ్డారు. 'మొన్నటి ఎన్నికల్లో ఓడిపోవడంతో మనకు జరిగిన నష్టం తక్కువ. మన ఓటమితో తెలంగాణ సమాజానికి ఎక్కువ నష్టం జరిగింది. స్వరాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్. ఈ రికార్డును ఎవరూ చెరపలేరు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామని ఎవరన్నా అనుకుంటే అది వారి అజ్ఞానం. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆనాడు ఆరోగ్యశ్రీ పథకం తెచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారు. దండయాత్రలు చేసిన రాజులు కూడా ఆనవాళ్లు లేకుండా చేస్తామని చెప్పరు' అని కేటీఆర్ అన్నారు.

బీజేపీకి మత పిచ్చి లేపడమే తెలుసు

'దేశంలో మత పిచ్చి లేపడం తప్ప బీజేపీ చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ నాయకత్వంలో తెలంగాణ వెనక్కి పోయినట్టే.. మోదీ నాయకత్వంలో దేశం వెనక్కి పోతుందని అన్నారు. 'మత పిచ్చి మంచిది కాదు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయకూడదు. హిందువులు ప్రమాదంలో ఉన్నారట! 2014 వరకు మంచిగా ఉన్న హిందువులు ఇప్పుడు ప్రమాదంలో ఉన్నారట. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లేని పంచాయితీ ఇప్పుడు ఎందుకు కొత్తగా పెడుతున్నారు? రాజకీయం కోసం దేశాన్ని విడగొడుతున్నారు. మంచి పనులు చేసి ఓట్లు అడగాలి. హిందూ, ముస్లిం, పాకిస్తాన్, జై శ్రీరాం, మోదీ.. ఈ ఐదు పదాలు మిగతా 12వ పేజీలో ▶



మీ రైస్‌లో ఆర్సెనిక్ ఉందా!?

- వాతావరణ మార్పులతో వరిలో పెరుగుతున్న ఆర్సెనిక్ పాళ్లు
- చర్మ, ఊపిరితిత్తుల కేన్సర్లు సహా పొంచి ఉన్న ప్రాణాంతక వ్యాధుల ముప్పు
- కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి
- చైనాలో వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగవుతున్న 28 రకాల వరి వంగడాలపై పదేళ్లపాటు పరిశోధన
- వరి అన్నం తినడం వల్ల ఒక్క చైనాలోనే 1.93 కోట్ల కేన్సర్ కేసులు పెరగొచ్చని ఆందోళన
- అధ్యయన ఫలితాలు ప్రచురించిన 'లాన్సెట్ ప్లానిటరీ హెల్త్' జర్నల్

- వివరాలు 6లో

డిగ్రీ కాలేజీల ఎదురీత..



గ్రామీణ ప్రాంతాల్లో మూసివేత దిశగా అడుగులు
- హైదరాబాద్ పరిసరాల్లోనే మనుగడ.. ఏటా సగం కూడా నిండని సీట్లు
- పేరుకుపోతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- సిలబస్ మార్పుతో నిర్వహణ కష్టమనే ఆందోళన

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్య విషయంలో విద్యార్థుల ఎంపికల్లో మార్పుల కారణంగా రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సాధారణ డిగ్రీ చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటంతో చాలా కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా నమోదు కావటంలేదు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కాలేజీల్లోనే 40 శాతం సీట్లు నిండితే గొప్ప అన్నట్లుగా పరిస్థితి ఉంది. మిగతా జిల్లాల్లో అంతకంటే చాలా తక్కువగా ఉంటున్నాయి. వందకుపైగా కాలేజీల్లో జీరో అడ్మిషన్లు నమోదవుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో యాజమాన్యాలు కాలేజీల మూసివేత దిశగా అడుగులేస్తున్నాయి. అడ్మిషన్లు తగ్గటం ఒక సమస్య అయితే.. రూ.5 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉండటం కాలేజీలను మరింత కుంగదీస్తోంది. సిబ్బందికి వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం ఉన్నత విద్యలో సంస్కరణల వైపు అడుగులేయటం గ్రామీణ ప్రాంత డిగ్రీ కాలేజీలను మరింత సంక్షోభంలోకి నెట్టివేస్తోంది.

అఫిలియేషన్‌కూ వెనకడుగు

రాష్ట్రంలో 1,054 డిగ్రీ కాలేజీలున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 362 ఉండగా, మిగతా జిల్లాల్లో 692 ఉన్నాయి. గత ఏడాది 150 కాలేజీలు కొన్ని కోర్సుల్లో, సెక్షన్లలో అఫిలియేషన్ తీసుకునేందుకు వెనుకాడాయి. ఈసారి కూడా పరిస్థితి అలాగే ఉందని నిర్వాహకులు అంటున్నారు. అన్ని కాలేజీల్లో కలిపి 4.60 లక్షల డిగ్రీ సీట్లున్నాయి. ఇందులో ఏటా సగటున 2.20 లక్షల సీట్లే భర్తీ అవుతున్నాయి. దోస్త్ పరిధిలోని కాలేజీల్లో 3,85,573 సీట్లు ఉండగా, గతేడాది 2,12,188 సీట్లు భర్తీ అయ్యాయి. ఇంటర్ మిగతా 3వ పేజీలో ▶

ఇదంజుగ్గారి






రెండు రోజులు తేలికపాటి వర్షాలు

24 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఈశాన్య విదర్భ నుంచి తెలంగాణ, అంతర్గత కర్ణాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉత్తర-దక్షిణ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది క్రమంగా ఈశాన్య మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా సముద్రమట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తులో మిగతా 5వ పేజీలో ▶

మావోయిస్టుల లొంగు'బాట'

పెరిగిన నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరి.. కేడర్‌ను కాపాడుకోవడానికి లొంగుబాటు వ్యూహం
సరెండర్ అవ్వాలని కేడర్‌కు సూచిస్తున్న అగ్రనేతలు.. భారీ ఎత్తున లొంగిపోతున్న కిందిస్థాయి కేడర్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వరుస ఎన్‌కౌంటర్లు, తీవ్ర నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు లొంగుబాటు వ్యూహాన్ని ఎంచుకున్నారా? ప్రస్తుత పరిస్థితుల్లో బతికి ఉండాలంటే ప్రభుత్వానికి లొంగిపోవటం ఒక్కటే మార్గమని భావిస్తున్నారా? తాజా పరిణామాలు గమనిస్తే ఇది నిజమే నని అంటున్నారు విశ్లేషకులు. నెల రోజులుగా మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యులు, జనమిలీషియా, చేతన నాట్య మండలికి చెందిన వారు భారీ ఎత్తున లొంగిపోతున్నారు. ఓవైపు శాంతి చర్చల అంశంపై స్పష్టత రాకముందే లొంగుబాట్లకు మావోయిస్టులు ముందుకు రావడం చర్చనీయాంశంగా మారింది.

అష్టదిగ్బంధనం..

మావోయిస్టులకు కేంద్రస్థానమైన బస్తర్ అరణ్యంపై ప్రభుత్వ దళాలు ఆపరేషన్ కగార్ పేరుతో విరుచుకుపడుతున్నాయి. వరుసగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లతో ఇప్పటివరకు 400 మందికి పైగా తమ సభ్యులు మరణించినట్టు మావోయిస్టులే ప్రకటించారు. కేంద్ర కమిటీ సభ్యుడు చలపతితోపాటు కీలక నేతలైన రేణుక, ఊర్మిళ, మాచర్ల ఏసోబు వంటి అగ్రనేతలు మృతిచెందడం ఆ పార్టీకి భారీ నష్టాన్ని కలిగించింది. అడవుల్లో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా దళాలు బేస్ క్యాంప్ ఏర్పాటు చేయటంతో మావోయిస్టుల కదలికలు పరిమితమయ్యాయి.

లొంగిపోవాలని నేతల పిలుపు..!

నిర్బంధం పెరిగిపోవడంతో మావోయిస్టు ముఖ్య నాయకులు, సాయుధ దళాలు ఒకటిరెండు ప్రాంతాలకే పరిమితమయ్యాయి. భద్రత దృష్ట్యా కీలక నేతలు కిందిస్థాయి కేడర్‌ను కలిసే అవకాశం దక్కడం లేదు. దీంతో పార్టీ విస్తరణ, మిగతా 5వ పేజీలో ▶



విశ్రాంత డీజీపీ దారుణ హత్య..

- బెంగళూరు నివాసంలో కత్తిపోట్లకు గురై మృతిచెందిన ఓం ప్రకాశ్
- భార్య, కుమార్తెను ప్రశ్నిస్తున్న పోలీసులు.. ఆర్థిక విభేదాలే కారణం!
- దగ్గరి వారి నుంచి ప్రాణహాని ఉన్నట్లు ఇటీవల సన్నిహితులకు వెల్లడి!
- బళ్లారి ఏఎస్పీగా ఉద్యోగ జీవితం ప్రారంభం.. 2015–17 మధ్య కర్ణాటక డీజీపీగా సేవలు

- వివరాలు 6లో

LOVELY PROFESSIONAL UNIVERSITY

Transforming Education Transforming India

NAAC GRADE A++

LPU'S B.TECH. FINAL YEAR STUDENT GETS ₹2.5 CRORE PACKAGE



Sri Saravana Vishnu JSB Subbhulakshmi Ranganathan
B.Tech. in Robotics & Automation
Batch 2025

ANOTHER B.TECH. FINAL YEAR STUDENT PLACED AT ₹1.03 CRORE PACKAGE

$1,18,000



Betireddy Naga Vamsi Reddy
B.Tech. in Robotics & Automation
Batch 2025

1700+ LPU students selected at packages of ₹10 Lakh-₹2.5 Crore*



Pavan Kunchala	Arjun S	Anjali	Nukavarapu Vamsi	Nazia Parveen
₹1 Crore	₹63 Lakh	₹53 Lakh	₹51 Lakh	₹51 Lakh

and many more...

Scan QR code for all details of students placed at different packages

A RESEARCH INTENSIVE UNIVERSITY

- **27000+** PUBLICATIONS
- **160** H-INDEX
- **216000+** SCOPUS CITATIONS
- **2900+** IPR GRANTED

RANKED AMONGST TOP UNIVERSITIES OF INDIA

- Times Higher Education Impact Rankings 2024
- QS World University Rankings By Subjects 2025
- Times Higher Education World University Rankings 2025
- NIRF Rankings 2024 — Ministry of Education, Government of India

and many more...

LPU: Top 10 University in India Scan QR Code

BE A PART OF LPU'S EDU-REVOLUTION

- 50% of learning may happen outside the classroom, inside the industry, and on real-life projects, in a gamified way.
- Students may earn up to 50% of Grades and 50% Attendance based on their achievements outside the classroom.
- Students may earn equivalent to their fees through marketing, sales, freelancing, start-ups, trading, e-commerce, or consulting.
- Students play an active role in shaping university academic policies & decision making.

#EDU-REVOLUTION

ADMISSIONS OPEN 2025 AI-ENABLED PROGRAMMES AFTER 10TH, 12TH, GRADUATION & POST GRADUATION

- Engineering
- Computer Science and Engineering
- Artificial Intelligence and Machine Learning (CSE)
- Data Science and Data Engineering (CSE)
- AI and Data Engineering (CSE)
- Mechanical Engineering
- Electrical Engineering
- Electronics and Communication Engineering
- Robotics and Automation
- Civil Engineering
- Aerospace Engineering
- Management
- Commerce
- Economics
- Computer Applications and IT
- Biotechnology
- Food Technology
- Nutrition and Dietetics
- Microbiology
- Forensic Sciences
- Mathematics and Statistics
- Library Science
- Law
- Architecture
- Planning
- Design
- Fashion Design
- Product and Industrial Design
- Multimedia and Animation, Gaming, Graphics & UI/UX
- Interior and Furniture Design
- Interaction Design(UI/UX)
- Journalism and Mass Communication
- Film & TV Production
- Agriculture
- Hotel Management and Tourism
- Mathematics
- Physics/ Chemistry
- Zoology/ Botany
- History
- Psychology
- Sociology
- Political Science
- Performing Arts/ Fine Arts
- Punjabi/ Hindi
- Pharmaceutical Sciences
- Ayurvedic Pharmaceutical Sciences
- Physiotherapy
- Medical Laboratory Tech.
- Paramedical Sciences
- Embryology
- Geography
- Education
- Physical Education
- Public Administration
- English and Foreign Languages

*in 2021 - 2025 batches

MEET OUR COUNSELLORS

HYDERABAD (21 - 30 April)
#2/2A, Ameer Estate, Near S.R. Nagar, Bus Stand.
Ph: 7888398857

WARANGAL (24- 27 April)
Hotel ML Grand, 3rd Floor PNR Prime, Kishanpura, Naim Nagar, Hanamkonda
Ph: 7888398835

KHAMMAM (28- 30 April)
Budget Hotel, 2-2-58, Gandhi Chowk, Near Gandhi Statue, Ramachandra Nagar Colony, Moti Nagar
Ph: 7888398835

Apply for LPUNEST 2025

How to Apply: Applicants can apply online at *www.lpu.in*
For last date and other details, refer university website *www.lpu.in*

Scholarships of upto **₹9.52 Lakh** on the basis of merit

APPLY NOW
Scan QR Code

LOVELY PROFESSIONAL UNIVERSITY (LPU)
Jalandhar-Delhi G.T. Road, Phagwara, Punjab

admissions@lpu.co.in
www.lpu.in

Contact us: 01824-406688

ThinkBIG

మూడేళ్లలో 80% వరకు
ఫీజుల మోత

తల్లిదండ్రుల తపనను సొమ్ము చేసుకుంటున్న పలు ప్రైవేటు పాఠశాలలు

స్కూల్ ఫీజుల విషయంలో 44 శాతం మంది పేరెంట్స్ అభిప్రాయం ఇదే

ఫీజుల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర శూన్యం

లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడించిన 93% మంది తల్లిదండ్రులు



పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు నిరంతరం తపిస్తుంటారు. వారికి అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే తపనతో తలకు మించిన భారమైనా, భారీ ఫీజులను భరించేందుకు సిద్ధపడుతుంటారు. అయితే ఇటీవల కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల 'మోత'బాగా పెరిగిందనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అయితే ప్రైవేటు యాజమాన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు కంటితుడుపుగానే ఉంటున్నాయనే విమర్శలున్నాయి. ఇది దేశంలోని ఏ ఒక్క రాష్ట్రానికో పరిమితం కాదని.. చాలా రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్టు 'లోకల్ సర్కిల్స్' సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వే తేటతెల్లం చేసింది. వేసవి అనంతరం విద్యాసంవత్సరం ప్రారంభమవనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీ'జులుం'ఎలా ఉంది?..ప్రభుత్వాలు ఫీజుల నియంత్రణ చర్యలు చేపడుతున్నాయా? తదితర అంశాలపై నిర్వహించిన సర్వేలో అనేక ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత మూడేళ్లలోనే కొన్ని పాఠశాలలు ఫీజులను ఏకంగా 50 నుంచి 80 శాతానికి పెంచినట్టు సర్వేలో పాల్గొన్న 44 శాతం మంది తల్లిదండ్రులు తెలిపారు. ఇక ఫీజుల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర దాదాపు శూన్యమని 93 శాతం మంది వెల్లడించారు.

సర్వేలో వెల్లడైన ముఖ్యాంశాలు..

- రాబోయే విద్యా సంవత్సరంలో తమ పిల్లల్ని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు సంప్రదిస్తే, ప్రస్తుత ఫీజుకు రెట్టింపు చెల్లించాలని యాజమాన్యాలు డిమాండ్ చేసినట్లు హైదరాబాద్ నుంచి సర్వేలో పాల్గొన్న కొందరు తల్లిదండ్రులు వెల్లడించారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకుంటున్నట్టు లేదని వారు వ్యాఖ్యానించారు.
- బెంగళూరులో అనేక పాఠశాలలు 2025–26 విద్యా సంవత్సరానికి పాఠశాల ఫీజులను 10% నుంచి 30% పెంచుతున్నట్లు ప్రకటించడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్షిక ఫీజు పెంపుదల వెనుక ఉన్న హేతుబద్ధతను వారు ప్రశ్నించారు. కొన్ని పాఠశాలలు 10 నుంచి 15 శాతం ఫీజులు పెంచగా, మరికొన్ని ఎక్కువగా పెంచాయని వారు తెలిపారు.
- పాఠశాలల మధ్య పెరిగిన పోటీ నేపథ్యంలో ఉపాధ్యాయుల వేతనాలు ఏటా పెంచక తప్పని పరిస్థితి ఉందని, ఈ నేపథ్యంలో ఫీజుల పెంపు తప్పదంటూ కర్ణాటక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సంఘం సమర్థించుకుంది.
- తమిళనాడు, మహారాష్ట్ర పాఠశాలల ఫీజులను నియంత్రిస్తున్నాయని, కర్ణాటక ప్రయత్నించినా చట్టపరమైన పోరాటాలు దాని పురోగతిని నిలిపివేశాయని కొందరు తల్లిదండ్రులు వెల్లడించారు.
- మరికొందరి తల్లిదండ్రుల అభిప్రాయం ప్రకారం.. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, యూనిఫామ్‌లు, రవాణా మొదలైన అంశాలను తమకు అనుకూలమైన వ్యాపారంగా మార్చుకున్నాయి. చాలామంది రాజకీయ నాయకులు కూడా ప్రైవేట్ పాఠశాలల యజమానులు కావడంతో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోలేక పోతున్నాయి.

2022 నుంచి 2025 మధ్య మీ పిల్లల పాఠశాల ఫీజులు ఎంత శాతం పెరిగాయి?

ఎంతమంది తల్లిదండ్రులు	ఫీజు పెంపు
8 శాతం మంది	80 శాతానికి పైగా
36 శాతం మంది	50 నుంచి 80 శాతం
8 శాతం మంది	30 నుంచి 50 శాతం
27 శాతం మంది	10 నుంచి 30 శాతం
8 శాతం మంది	0 నుంచి 10 శాతం
13 శాతం మంది	ఫీజులు పెరగలేదు

ఫీజుల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయా..? (తల్లిదండ్రుల అభిప్రాయం)

అవును తీసుకుంటున్నాయి: 7 శాతం మంది

మాటలు చెప్పడం తప్ప చేతల్లో లేదు: 46 శాతం మంది

అసలు పట్టించుకోవడమే లేదు: 47 శాతం మంది

సర్వే నిర్వహణ ఇలా..

దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించిన జిల్లాలు: 309	సర్వేలో పాల్గొన్న తల్లిదండ్రుల సంఖ్య: 31,000	ఇందులో పురుషులు 62 శాతం మంది మహిళలు 38 శాతం మంది

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధే మా లక్ష్యం

భూ భారతి చట్టంతో భూమి సమస్యలు పరిష్కారం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాయపట్నం లిఫ్ట్ ఆయకట్టు భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి

మధిర: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గతంలో ధరణి వెబ్‌సైట్ ప్రవేశపెట్టాక అనేక సమస్యలు తలెత్తాయని, ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టంతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా మధిర మండలంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీజతో కలసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చివరి ఆయకట్టుకు సైతం సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు చేసినప్పటికీ కొత్తగా ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తక్కువ ఖర్చుతో కూడిన పనులు చేపడుతున్నామని, అయినా అధిక ఆయకట్టు సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను సమాంతరంగా చేపడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూనే.. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ సరఫరా, 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్స్ చార్జీల పెంపు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, రైతుల సంక్షేమం కోసం సన్నాలకు బోనస్, రైతుబీమా, ఉచిత విద్యుత్ వంటి పథకాలకు భారీగా నిధులు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

పోడు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

అమరవీరుల వారసులకు ఉద్యోగాలు: మంత్రి సీతక్క

అధికారికంగా ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం



ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ నగేశ్, ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే బొజ్జు

కైలాస్‌నగర్: ఏజెన్సీ ప్రాంతంలోని పోడు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఇంద్రవెల్లిలో ఆదివారం అధికారికంగా నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ఆదివాసీలతో కలిసి అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. ఆదివాసీ జెండా ఆవిష్కరించారు. అమరవీరుల కుటుంబ సభ్యుల్లో నలుగురికి రూ.10 లక్షల విలువైన మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 44 ఏళ్ల క్రితం జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనాన్ని నిర్మిస్తామని పీసీసీ హోదాలో మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన ఆరు నెలల్లోనే దాన్ని నిలబెట్టుకున్నారని తెలిపారు. ఏజెన్సీలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జీవో 3కి ప్రత్యామ్నాయంగా ఏం చేయాలనే దానిపై మేధావులతో ప్రత్యేక కమిటీ వేసినట్లుగా తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐటీడీఏలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని సీతక్క ఆరోపించారు. ఉట్నూర్, ఏటూరునాగారం ఐటీడీఏలకు రూ.15 కోట్ల వ్యయంతో అధునాతన భవనాలను నిర్మిస్తున్నామని, అందులోని 29 శాఖలను బలోపేతం చేసేదిశగా దృష్టి సారించామన్నారు.

సరికొత్త ఫీచర్స్‌తో వోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్‌-లైన్



సాక్షి, హైదరాబాద్: మోడీ వోక్స్‌వ్యాగన్ డెక్కన్ సరికొత్త ఫీచర్లతో వోక్స్‌వ్యాగన్ టిగువాన్ ఆర్‌-లైన్‌ను తీసుకొచ్చింది. ఇది హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, మెహిదీపట్నం షోరూంలలో అందుబాటులో ఉన్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. వోక్స్‌వ్యాగన్ రీజినల్ మేనేజర్, కార్పొరేట్ సేల్స్ అండ్ సీపీఓ రాజనాథ్ పటేల్, రీజినల్ సేల్స్ మేనేజర్ ఉమేశ్ శర్మ, మోడీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థ్ మోడీ, వోక్స్‌వ్యాగన్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో దీన్ని గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ఈ సందర్భంగా పార్థ్ మోడీ మాట్లాడుతూ 'ఇన్నోవేషన్‌లో వోక్స్‌వ్యాగన్ నిబద్ధతకు టిగువాన్ ఆర్‌-లైన్ నిదర్శనం. హైదరాబాద్‌లోని వినియోగదారులకు దీన్ని అందుబాటులోకి తీసుకురావడం పట్ల మేం ఎంతో ఆనందిస్తున్నాం'అని పేర్కొన్నారు.

డిగ్రీ కాలేజీల ఎదురీత..

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తీర్ణులంతా డిగ్రీలో చేరినా ఇంకా 70 వేల సీట్లు మిగిలిపోయే పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థులను ఆకర్షించటంలో తీవ్ర పోటీ నెలకొంది. ఈ పోటీని గ్రామీణ ప్రాంత కాలేజీలు తట్టుకోలేకపోతున్నాయి. తమ ఇళ్లకు సమీపంలోని కాలేజీల్లోనే చదవాలనుకునే విద్యార్థులు ఆర్ట్స్ గ్రూపులు మాత్రమే తీసుకుంటున్నారు. దీంతో సైన్స్ గ్రూపుల్లో చేరికలు నామమాత్రంగా ఉంటున్నాయి. గత మూడేళ్లలో గ్రామీణ ప్రాంత కాలేజీల్లో చేరికలు 42 శాతం తగ్గిపోయాయి. ముఖ్యంగా సైన్స్ గ్రూపుల్లో ఈ పరిస్థితి ఉంది.

కొత్త కోర్సులతో చిక్కులు

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నారు. డేటాసైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్ వంటి కోర్సులు తీసుకొస్తున్నారు. కామర్స్‌లోనూ కంప్యూటర్ కోర్సుల కాంబినేషన్ వస్తోంది. రాజధానికి సమీపంలో ఉండటం వల్ల ఈ కోర్సుల బోధకులు దొరకుతున్నారు. విద్యార్థులు కూడా రాజధానిలో ఉంటే ఇతర కోర్సులు నేర్చుకోవచ్చని, పార్ట్‌టైం ఉద్యోగాలు దొరుకుతాయని ఇటువైపు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ కాలేజీల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కంప్యూటర్ కోర్సులకు లెక్చరర్‌ను తీసుకోవాలంటే నెలకు కనీసం రూ.50 వేల వేతనం ఇవ్వాలి. ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. ఇదంతా చేస్తే ఫీజులు పెంచాలి. ఫీజులు పెంచితే విద్యార్థులు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగా కొత్త కోర్సుల జోలికి వెళ్లడం లేదు. ప్రభుత్వం ఈ ఏడాది నుంచి సిలబస్ మార్చాలని నిర్ణయించింది. 20 శాతం కంప్యూటర్ అనుసంధానిత సిలబస్ తీసుకొస్తున్నారు. ఇవన్నీ గ్రామీణ ప్రాంత కాలేజీల మనుగడకు ప్రమాదంగా మారే పరిస్థితి కన్పిస్తోంది. దీంతో కొన్ని కాలేజీలు మూతబడే ప్రమాదం కనిపిస్తోంది.

హైదరాబాద్‌లో ఎకో టౌన్!

▶ మొదటి పేజీ తరువాయి

సర్క్యులర్ ఎకనామీ మన ఉమ్మడి లక్ష్యాలు. చిత్తశుద్ధితో చేసే ఆవిష్కరణలతో ఏం సాధించగలమో మీ పర్యావరణ హిత నగరం చూస్తే అర్థం అవుతోంది. హైదరాబాద్ నగరంలో సున్నా స్థాయి కర్బన ఉద్గారాల (నెట్ జీరో)తో ఫ్యూచర్ సిటీని ఇదే తరహాలో నిర్మించాలని కోరుకుంటున్నా..'అని సీఎం తెలిపారు. గ్రీన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. మెట్రో రైలు, ఫ్యూచర్ సిటీ, ఆర్‌ఆర్‌ఆర్, రేడియల్ రోడ్లు, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు.

విమాన సేవలు ప్రారంభించాలి

హైదరాబాద్‌-కిటాక్యుషు నగరాల మధ్య నేరుగా విమాన సేవలను ప్రారంభించాలని అక్కడి మేయర్ చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. జపనీస్ భాష పాఠశాలను హైదారాబద్‌లో స్థాపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నైపుణ్యం కలిగిన యువతను తమకు అందించాలని, అక్కడి మేయర్ కోరడంతో సీఎం ఈ మేరకు సూచన చేశారు. మా వద్ద నైపుణ్యం కలిగిన వారు ఉన్నారు. వారికి జపనీస్ భాష నేర్పిస్తే మీ అవసరాలు తీరుతాయి..'అని చెప్పారు. రెండు పక్షాల మధ్య



హైదరాబాద్‌-కిటాక్యుషు నగరాల మధ్య ఒప్పంద కార్యక్రమంలో సీఎం రేవంత్, కిటాక్యుషు మేయర్ కజుషియా

జరిగిన ఒప్పందాలను నిర్దిష్ట గడువుల్లోగా అమలు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై నిరంతరం చర్చించాలని, సంప్రదింపులతో పురోగతి సాధించాలని నిర్ణయం తీసుకున్నారు.

కలిసి పనిచేస్తాం: కిటాక్యుషు మేయర్

రేవంత్ బృందం అంతకుముందు ఓసిన్‌–ఓసాకా ప్రాంతం నుంచి కిటాక్యుషు నగరానికి బుల్లెట్ ట్రైన్‌లో చేరుకుంది. చారిత్రాత్మక కోకుర క్యాజిల్ వద్ద నగర మేయర్ కజుషియా టేకుచి వారికి సాంప్రదాయ స్వాగతం పలికారు. సమురాయ్ ఖడ్గ వీరులు, టైకో డ్రమ్ బృందాల సభ్యులు ఆటపాటలతో అలరించారు. ఒకప్పుడు ప్రపంచంలోని అత్యంత కాలుష్య కారక నగరాల్లో ఒకటిగా కిటాక్యుషు ఉంది. అదే ఇప్పుడు అత్యంత స్వచ్ఛమైన నగరాల్లో ఒకటిగా ఉంది. ఈ అంశాన్ని మేయర్ టేకుచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.కిటాక్యుషు ప్రభుత్వం ..తెలంగాణ, హైదరాబాద్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. కాగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వివరించారు. కిటాక్యుషు నగరంలో ఒకప్పుడు అత్యంత కలుషితమైన మురాసకి నదిని అత్యంత స్వచ్ఛమైన నదిగా పునరుద్ధరించారు. దీని అధ్యయనంలో భాగంగా సీఎం బృందం ఓ మ్యూజియాన్ని సందర్శించింది. నడక ద్వారా నదీ తీరాన్ని పరిశీలించింది.

ఓకే.. కానీ!

ప్రభుత్వ పనితీరు బాగానే ఉంది.. ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

ప్రజావాణి కార్యక్రమం, సన్న బియ్యంలపై ప్రజల్లో మంచి అభిప్రాయం ఉంది

ఆసరా పింఛన్లు, రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై టీపీసీసీ చీఫ్‌కు భారత్ జోడో అభియాన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు బాగానే ఉందని భారత్ జోడో అభియాన్ అభిప్రాయపడింది. ప్రజాస్వామ్యయుత పాలన జరుగుతోందనే అభిప్రాయం ప్రజల్లో ఉందని తెలిపింది. విద్య, వ్యవసాయ కమిషన్ల ఏర్పాటు, లోకాయుక్త, హెచ్‌ఆర్సీల నియామకం లాంటి చర్యల ద్వారా పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఆహ్వానిస్తోందనే భావనలో ప్రజలున్నారని, ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నుంచి రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ వరకు సానుకూలత ఉందని వెల్లడించింది. అయితే ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల అమలును వేగవంతం చేయాలని సూచించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయి నుంచి పలు దఫాల్లో సేకరించిన అభిప్రాయాలను టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్‌కుమార్‌గౌడ్‌కు భారత్ జోడో అభియాన్ వెల్లడించింది. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, స్వరాజ్ అభియాన్ వ్యవస్థాపకుడు, భారత్ జోడో అభియాన్ కన్వీనర్ యోగేంద్ర యాదవ్ నేతృత్వంలోని బృందం ఇటీవల హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్‌తో గంటకు పైగా భేటీ అయింది. ఈ సందర్భంగానే తమ క్షేత్రస్థాయిలో పరిశీలనలో వెల్లడయిన అనేక అంశాలను ఆయనకు వివరించినట్టు తెలిసింది. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న సానుకూల, ప్రతికూల అభిప్రాయాలు వెల్లడించిన ఈ బృందం.. రాష్ట్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేయించాలని, ఆయా శాఖలకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాలను మంత్రివర్గ సభ్యులకు తాము వివరిస్తామని కోరగా, ఇందుకు పీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించినట్టు తెలిసింది.

కొన్ని అంశాల్లో సానుకూలత

విశ్వసనీయ సమాచారం ప్రకారం..ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ బాగుందని, ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పించడం, ఆ సమస్యలను చెప్పుకునేందుకు వచ్చిన వారి విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు తీసుకుంటున్న వైనంపై ప్రజలు సానుకూలంగా ఉన్నారని బృందం వివరించింది. అయితే ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, వీలున్నంత త్వరగా వీటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా ప్రజల్లో మరింత సానుకూలత వస్తుందని తెలిపింది. 'ముఖ్యంగా ఆసరా పింఛన్లు (కొత్త వాటితో పాటు పింఛన్ల పెంపుదల), కొత్త రేషన్‌కార్డుల కోసం గ్రామీణ ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా 2022లో కొత్త పింఛన్లకు దరఖాస్తులు తీసుకున్నారు. ఆ తర్వాత పింఛన్లు కొత్తవి రాలేదు. పింఛన్ల కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రావడంపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా కనీసం 5 లక్షల మంది కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. కొత్త రేషన్‌కార్డుల మంజూరు ప్రక్రియను కూడా వేగవంతం చేయాలి. డొమెస్టిక్ వర్కర్స్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఇందులో రవాణా కార్మికులను కూడా చేర్చాలి. గిగ్ వర్కర్ల పాలసీని అమలు చేయాలి..'అని యోగేంద్రయాదవ్ బృందం సిఫారసు చేసింది.

రాష్ట్రమంతా 'నెట్టిల్లు'



నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని ఓ ఇంట్లో..

▶ మొదటి పేజీ తరువాయి

గ్రిడ్ కార్పొరేషన్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇంటింటికీ ఇంటర్‌నెట్ సేవలు అందించడంలో లోకల్ కేబుల్ ఆపరేటర్లను భాగస్వాములను చేసేందుకు తాజాగా టీ ఫైబర్ దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. దీనిద్వారా లోకల్ కేబుల్ ఆపరేటర్లతో పాటు సుమారు 20 వేల మంది ఫైబర్ ఆప్టిక్ టెక్నీషియన్లకు కూడా ఉపాధి లభించనుంది.

తొలి విడతలో సాంకేతిక సమస్యలు

భారత్ నెట్ ప్రాజెక్టులో భాగంగా తొలి విడత రాష్ట్రంలోని మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఓఎఫ్‌సీ నెట్‌వర్క్ పనులు ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామ పంచాయతీలకు ఓఎఫ్‌సీని వేసే బాధ్యతను బీఎస్‌ఎన్‌ఎల్‌కు అప్పగించారు. ఓఎఫ్‌సీ కేబుల్ లైన్లతో గ్రామాలను అనుసంధానించినా, నిర్వహణ లోపంతో (ఓవర్ ది ఎయిర్) స్తంభాలపై వేసిన కేబుల్ లైన్లను ఇష్టారీతిన తొలగించడం, ఓఎఫ్‌సీని కత్తిరించడం మూలంగా లైన్లు దెబ్బతిని కనెక్టివిటీ ప్రశ్నార్థకంగా మారింది. దేశ వ్యాప్తంగా ఇదే తరహా సమస్యలు తలెత్తడంతో 'భారత్ నెట్'రెండో దశలో ఓఎఫ్‌సీ లైన్లు వేయడంలో ఏ తరహా సాంకేతికతను అనుసరించాలనే స్వేచ్ఛను రాష్ట్రాలకు కేంద్రం వదిలేసింది.

రింగ్ టెక్నాలజీ వైపు తెలంగాణ మొగ్గు

భారత్ నెట్ రెండో దశలో తెలంగాణ ఒక్కటే ఓఎఫ్‌సీని భూగర్భంలో వేసే 'రింగ్ టెక్నాలజీ'వైపు మొగ్గు చూపింది. రెండో దశలో భాగంగా రాష్ట్రంలో 32 వేల కిలోమీటర్ల మేర ఓఎఫ్‌సీ విస్తరించగా, మరో 3,500 కిలోమీటర్ల పొడవునా కేబుల్స్ వేయాల్సి ఉంది. తెలంగాణ ప్రభుత్వం అనుసరించిన 'రింగ్ టెక్నాలజీ' విజయవంతం కావడంతో భారత్ నెట్ ప్రాజెక్టు మూడో దశలో అన్ని రాష్ట్రాలు రింగ్ టెక్నాలజీ అనుసరించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అంతేకాకుండా రింగ్ టెక్నాలజీ ద్వారా ఓఎఫ్‌సీ విస్తరణకు అయ్యే ఖర్చును భారత్ నెట్ ప్రాజెక్టు భరించేందుకు ముందుకు వచ్చింది. ఈ నేపథ్యంలో రెండో దశలోనే రింగ్ టెక్నాలజీ అనుసరించేందుకు తాము వెచ్చించిన రూ.1,779 కోట్లను కనీసం వడ్డీలేని రుణంగా అయినా ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది.

టీ ఫైబర్ ప్రాజెక్టు ప్రస్తుత స్థితి

పనులు పూర్తయిన జిల్లాలు: మహబూబ్‌నగర్, జనగామ, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, జగిత్యాల, యాదాద్రి భువనగిరి, కరీంనగర్, గద్వాల, నారాయణపేట, వనపర్తి, వరంగల్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్

పనులు పురోగతిలో ఉన్న జిల్లాలు: నల్లగొండ, నాగర్‌కర్నూల్ మెదక్, సూర్యాపేట, సంగారెడ్డి

భారత్ నెట్ మొదటి దశలో సాంకేతిక సమస్యలు తలెత్తిన జిల్లాలు: మేడ్చల్‌-మల్కాజిగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, కామారెడ్డి

అటవీ అనుమతులు రాక పనులు ఆగిన జిల్లాలు: ఆదిలాబాద్, భూపాలపల్లి, నిర్మల్, మహబూబాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ములుగు

ప్రస్తుతం పనుల పరిస్థితి

మొత్తం పంచాయతీలు: 12,751

పనులు పూర్తయినవి: 5,001

పనుల పురోగతి: 3,888

అటవీ అనుమతులు కావాల్సినవి: 773

భారత్‌నెట్ మొదటి దశ సమస్యలు: 3,089

హెచ్‌ఎండీఏ పరిధిలో పనులు కావాల్సినవి: 1.1 కోట్ల జనాభా (18 లక్షల గృహాలు)

4 గ్రామాల్లో ఉచితంగా ప్రయోగం



టీ ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే కార్యక్రమంలో భాగంగా ప్రయోగాత్మకంగా నాలుగు గ్రామాల్లో డిజిటలైజేషన్ చేపట్టాం. హాజిపల్లి (రంగారెడ్డి జిల్లా), మద్దూర్ (నారాయణపేట), సంగుపేట (సంగారెడ్డి), అడవి శ్రీరాంపూర్ (పెద్దపల్లి) గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఇంటర్‌నెట్ కనెక్షన్ ఇచ్చాం. ఈ బాధ్యతను మూడు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించి 3 నెలల పాటు ఇంటర్‌నెట్ సేవలు ఉచితంగా అందిస్తాం. తర్వాత ఒక్కో వినియోగదారుడి నుంచి కనిష్ఠంగా సుమారు రూ.300 చొప్పున వసూలు చేస్తాం. ప్రస్తుతం రాష్ట్రంలో 70శాతం గృహాల్లో 30 శాతం లోకల్ కేబుల్ ఆపరేటర్లు, 31శాతం డీటీహెచ్, మరో 39 శాతం ఇంటర్‌నెట్ ద్వారా డిజిటల్ కనెక్టివిటీ ఉంది. ఈ గృహాలన్నింటినీ భవిష్యత్తులో టీ ఫైబర్ పరిధిలోకి తీసుకువచ్చి నామమాత్ర చార్జీలతో అపరిమిత నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి తెస్తాం. 15 జిల్లాల్లో డిజిటల్ కనెక్టివిటీ పనులు చివరి దశలో ఉన్నాయి.

- వేణు ప్రసాద్, ఎండీ, టీ ఫైబర్

ఉచితంగానే ఇస్తున్నారు..



నాలుగు నెలల క్రితం మా కాలనీలో స్మార్ట్ టీవీ ఉన్నవారికి టీ ఫైబర్ కనెక్షన్ ఇచ్చారు. మొదట యూట్యూబ్ మాత్రమే వచ్చేది. వైఫై ద్వారా నెట్ సౌకర్యం అంతంత మాత్రమే వచ్చింది. నెల తర్వాత కొన్ని చానల్స్ ఆన్ అయ్యాయి. ప్రస్తుతం యూట్యూబ్, గూగుల్, నెట్‌ఫ్లిక్స్ లాంటి ఓటీటీ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. జియో, ఎయిర్‌టెల్ లాంటి ప్రైవేట్ సంస్థలు ఆప్టిక్ ఫైబర్ ద్వారా సేవలందిస్తున్నాయి. ప్రతినెలా రూ.700 నుంచి రూ.900 వరకు చెల్లించాల్సి వచ్చేది. టీ ఫైబర్‌కు ప్రస్తుతం ఎలాంటి రుసుము తీసుకోవడం లేదు.

- మిట్టె చంద్రశేఖర్, మద్దూర్, నారాయణపేట జిల్లా

అప్పుడప్పుడు సిగ్నల్స్ సమస్య..



ఫైబర్ నెట్ వినియోగంలో కొంత సిగ్నల్స్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కరెంట్ పోయి వచ్చిన సందర్భాల్లో సిగ్నల్స్ రావడానికి 20 నిమిషాల సమయం పడుతోంది. అయితే సిగ్నల్స్ సమస్య వచ్చినప్పుడు గ్రామంలో ఫైబర్ నెట్ ఆపరేట్ చేసే వ్యక్తికి తెలియజేయగానే వెంటనే వచ్చి సరిచేస్తున్నారు. గ్రామంలో నెట్ వినియోగించుకోవడం తెలియని వారికి వివరంగా తెలియజేస్తున్నారు.

- వెంకటేశ్వర్ గౌడ్, సంగుపేట, సంగారెడ్డి జిల్లా



మిమ్మల్ని ఆందోళనకు గురిచేసేదే
మిమ్మల్ని నిపుణుడిని చేస్తుంది.
– జాన్ లాకె

సాక్షి
సోమవారం, 21 ఏప్రిల్ 2025

స్తుతి మర్దనం

'మర్దనం గుణవర్ధనం' అని మనకో నానుడి ఉంది. లోకంలో కొన్నింటిని ఎంతగా మర్దిస్తే, వాటి గుణాలు అంతగా వృద్ధిచెందుతాయని అర్థం. మర్దనానికి అచ్చతెలుగులో నలగగొట్టడం, పిసకడం, నూరడం అనే అర్థాలు ఉన్నాయి. చెరకుగడను, తాంబూలాన్ని, చందనాన్ని, పెరుగును ఎంతగా మర్దిస్తే, వాటి గుణాలు అంతగా ఇనుమడిస్తాయని ఈ నానుడికి మూలమైన సంస్కృత శ్లోకం చెబుతోంది. మర్దనకు అణచివేయడం, అంతమొందించడం అనే అర్థాలు కూడా ఉన్నట్లు పురాణ గాథలను గమనిస్తే అర్థమవుతుంది. ఉదాహరణకు 'కాళీయమర్దనం'లో బాలకృష్ణుడు కాళింది మడుగును విషభరితం చేసిన కాళీయ సర్పం పడగల మీదకెక్కి తాండవనృత్యం చేసి, కాళీయుడి పొగరును అణచేశాడు. కృష్ణుడిపై శ్లోకాలలో 'వసుదేవ సుతం దేవం కంసచాణూర మర్దనం' అనే సంబోధన ఉంటుంది. కృష్ణుడి మీదకు కంసుడు ఉసిగొలిపిన చాణూరుడు, ఆ తర్వాత కంసుడు కూడా కృష్ణుడి చేతిలో అంతమొందారు. లోకకంటకుడైన మహిషాసురుడిని సంహరించడం వలన దుర్గాదేవి మహిషాసురమర్దినిగా పేరుపొందింది. నిఘంటువులను శోధిస్తే 'మర్దన' పదానికి అనేక పర్యాయపదాలు, అనేక నానార్థాలు ఉన్నాయి. ఇవి ఎన్ని ఉన్నా, మర్దన అంటే నొప్పుల నుంచి ఉపశమనం కలిగించి, ఒంటికి హాయినిచ్చే దేహమర్దన అనే అర్థమే విస్తృతంగా వాడుకలో ఉంది. ఊరూరా వ్యాపిస్తున్న అధునాతన మర్దన కేంద్రాల పుణ్యాన మర్దన కళ ఇదివరకు ఎన్నడూ లేనంతగా వర్ధిల్లుతోంది.

ఆయుర్వేదం సహా నానా సంప్రదాయ వైద్యపద్ధతుల్లో మర్దనకు ప్రత్యేక స్థానం ఉంది. తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, చర్మవ్యాధులు వంటి వాటికి మర్దనమే తగిన చికిత్స అని సంప్రదాయ వైద్యులు చెబుతారు. మర్దన చికిత్సలో రకరకాల తైలాలను ఉపయోగిస్తారు. మర్దన వల్ల శరీరానికి బడలిక తీరి, విశ్రాంతి కలుగుతుంది. శ్రమ వల్ల కలిగిన నొప్పులు తగ్గుముఖం పడతాయి. రక్త ప్రసరణ మెరుగవుతుంది. శరీరానికి ఉల్లాసం కలిగి, చక్కగా నిద్రపడుతుంది. క్రమం తప్పని మర్దన వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఆరోగ్యం మెరుగుపడుతుంది. మర్దన ఒక పురాతన శాస్త్రీయ కళ. ఆయుర్వేదాది సంప్రదాయ శాస్త్రాలు చెప్పేదంతా భౌతిక మర్దన పద్ధతుల గురించి మాత్రమే!

లోకంలో మరో రకమైన మర్దన కళ కూడా విస్తృత వ్యాప్తిలో ఉంది. అయితే, అది అభౌతికమైనది, ఇంకా నిర్గుణ నిరాకార పరబ్రహ్మ వలె అగోచరమైనది కూడా! భౌతిక మర్దనకు దేహసౌఖ్యం, ఆరోగ్యం మాత్రమే పరమ ప్రయోజనాలైతే, అభౌతిక మర్దనకు అంతకు మించిన ఆధిభౌతిక ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి. 'మహదానందానికి మీరు కేవలం ఒక మర్దన దూరంలో ఉన్నారు' అనేది ఒక మర్దన కేంద్రం వ్యాపార నినాదం. మర్దన కలిగించే మహదానందం కోసమే మనుషులు అర్రులు చాస్తుంటారు. చాలామంది అందుకోసమే మర్దన కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించుకుంటూ ఉంటారు.

భౌతిక మర్దనలో కించిత్ శారీరక శ్రమ ఉంటుంది గాని, అభౌతిక మర్దనలో అలాంటిదేమీ ఉండదు. ఊరకే నోటికి పనిచెప్పి, ఎదుటివారికి పరమానందం కలిగించే మాటలు అదను చూసి మాట్లాడితే చాలు– భౌతిక మర్దనకు మించిన ప్రయోజనాలు అనాయాసంగానే నెరవేరుతాయి. అభౌతిక మర్దనకు కీలక సాధనం పొగడ్త. పొగడ్త అగడ్త అని అంటారు. చాలామందికి ఈ సంగతి తెలిసినా, తెలిసి తెలిసి మరీ పొగడ్తలకు పడిపోతారు. పొగడ్త మనోమర్దన కళ. పొగడ్తలతో ఎదుటివారిని పడగొట్టడం ఒక కళ అయితే, పొగడ్తలకు పడిపోవడం ఒక బలహీనత. మనుషులన్నాక బలహీనతలు సహజం. మరి మనుషులన్నాక కొంత కళాపోషణ కూడా ఉండాలి కదా! అధికారంలో ఉన్న అత్యధికులకు పొగడ్తలు ఒక వ్యసనం. అధికారంలో ఉన్నవారిని పొగుడుతూ పబ్బం గడుపుకోవడం చాలామంది బతకనేర్చరులకు ఒక సత్కాలక్షేపం. అధికారంలో ఉన్నవారు చండశాసనులుగా ఎంతటి ప్రచండ ప్రఖ్యాతి పొందినా, 'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి' అని ఎరిగిన ధీమంతులు అలాంటివారిని కూడా తమ వాగ్మర్దన కళతో ఇట్టే లోబరచుకుంటారు.

కళలో రాణించాలంటే, నిరంతర సాధనతో నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నాడు వేమన. ఈ సూత్రం మర్దన కళకు కూడా వర్తిస్తుంది – అది దేహమర్దన కళ అయినా, మనోమర్దన కళ అయినా సరే! తగినంత సాధన, కావలసినంత నైపుణ్యం లేకుంటే, రసాభాస తప్పదు. అప్పుడు ఆశించిన ఫలితాలు దక్కకపోగా, పరిస్థితులు వికటించే ప్రమాదం కూడా తలెత్తవచ్చు. అలా వికటించే ప్రమాదాలు ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు. చైనాలో ఇటీవల అలాంటి ప్రమాదమే ఒకటి జరిగింది. హునాన్ ప్రావిన్స్ రాజధాని చాంగ్షా నగరంలో ఐటీ ఉద్యోగం చేసే ఒక ఇరవయ్యారేళ్ల కుర్రాడు మెడనొప్పికి ఉపశమనం కోసం మర్దనకేంద్రాన్ని ఆశ్రయించాడు. అక్కడ మర్దనచేసే మహానుభావుడు ఎవరో గాని, దాదాపుగా గొంతు నులిమే స్థాయిలో మర్దన చేశాడు. ఆ మర్దనధాటికి అర్భకపు ఐటీ కుర్రాడు పక్షవాతంతో ఆస్పత్రి పాలయ్యాడు. మర్దన చేసేటప్పుడు మితిమీరిన ఒత్తిడి ప్రయోగించడం వల్ల అతడి మెడలోని రక్తనాళాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వైద్యులు చెప్పారు. ఈ సంఘటనకు ముందు ఇలాగే మెడనొప్పికి మర్దన చేయించుకున్న థాయ్ గాయకుడు ఒకరు ఏకంగా పరలోకగతుడయ్యాడు. ఎలాంటి మర్దన అయినా, శ్రుతి మించితే, అది మరణశాసనం కూడా కాగలదు.

అబ్దుల్లాకు జరిగిన నమ్మక ద్రోహం

కామెంట్



కరణ్ థాపర్


అమర్‌జీత్ సింగ్ దులత్ పుస్తకం జమ్ము–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఫరూఖ్ అబ్దుల్లాను ఎందుకంత తీవ్రంగా బాధించిందో అర్థం కాని విషయం. ఆర్.ఎ. డబ్ల్యూ(రా) మాజీ ఉన్నతాధికారి దులత్ ఆయన మీద రాసిన 'ద చీఫ్ మినిస్టర్ అండ్ ద స్పై' పుస్తకం ఏమీ ఫరూఖ్‌కు తెలియకుండా వెలువడలేదు. ''ఫరూఖ్ అబ్దుల్లా మీద నా అవగాహనతో రాసిన నా కథ'' అని రచయిత ముందుమాటలో చెప్పుకొన్న ఈ రచనకు ఫరూఖ్ మద్దతు ఉంది. దాని గురించి వారిద్దరూ ''అనేకసార్లు మాట్లాడుకున్నారు.'' ఆయన ''కరో నా (కానీయ్)'' అంటూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే పుస్తకం వెలుగు చూసింది. కానీ పుస్తకం బయటకు వచ్చాక ఫరూఖ్ ఎంతో నొచ్చుకున్నారు. ఇది ఆశ్చర్యకరమైన విషయమే.

ఈ పుస్తకం ఒక ప్రశంసా గీతిక అనేది సత్యం. 'నేషనల్ కాన్ఫరెన్స్' (ఎన్సీ) పార్టీ అంటే ఫరూఖ్ అబ్దుల్లానే అనీ, ఆయన లేకపోతే ఎన్సీ ఎక్కడ ఉండేదో ఊహించలేమనీ పుస్తకం చెబుతుంది. అంతటితోనే ఆగదు. ''డాక్టర్ సాహిబ్ కేవలం ముఖ్యమంత్రి కారు, ఆయనే కశ్మీర్'' అని తేల్చిచెప్పుంది. ఫరూఖ్ తన తండ్రి షేక్ అబ్దుల్లా కంటే గొప్ప వ్యక్తి అనీ, బహుశా ఆయనే నేడు దేశంలో అత్యున్నత నాయకుడు అనీ దులత్ ఇంటర్వ్యూలలో చెప్పారు. ఈ ప్రశంస అతిశయోక్తి. కానీ, దులత్ దృష్టిలో అక్షర సత్యం.

ఫరూఖ్ ఎదుర్కొన్న పలు సంక్షోభాల గురించి ఈ పుస్తకం చెబుతుంది. ఫరూఖ్ ''శ్రీనగర్‌కు ఢిల్లీకి నడుమ వారధిగా ఉండాలని కోరుకున్నారు... ఆయన రాజకీయాల్లో ఉన్నది ఢిల్లీతో కలిసి పని చేయడానికే గానీ, వ్యతిరేకంగా కాదు.'' కానీ సమస్య ఏమిటంటే, ఢిల్లీ ఆయన ఆలోచనను గ్రహించలేక పోయింది. ''ఫరూఖ్ అబ్దుల్లాను, ఆయన ఆశయాలను ఢిల్లీ ఏనాడూ అర్థం చేసుకోలేదు... దేశ రాజధానికి అంతు చిక్కనిది ఏదో ఆయనలో ఉంది.''

ఇది ఒక పార్శ్వమైతే, రెండోది – కశ్మీరు ప్రజలతోనూ ఆయన సంబంధాలు. అవి ఏనాడూ సవ్యంగా లేవు. ఢిల్లీ మీద కశ్మీర్ ప్రజలకు విశ్వాసం లేదు. ''ఢిల్లీతో ఏ మాత్రం సంబంధం ఉన్నా సరే ఆ వ్యక్తులను, సంస్థలను వారు అనుమానిస్తారు.'' ఈ క్రమంలో ''ఇండియా పట్ల విధేయత కారణంగా ఫరూఖ్ అబ్దుల్లా కుటుంబం కశ్మీరు పౌరుల ఆగ్రహానికి గురైంది.''


ఫరూఖ్ అబ్దుల్లా అడకత్తెరలో పోకచెక్క అయ్యారు. ఢిల్లీకి చేరువ కావడం కోసం ఆయన ప్రయత్నించారు. కాని అక్కడ ఆయనకు పూర్తి ఆదరణ లభించలేదు. ఇక తాను దేని కోసం తపన పడుతున్నదీ తన సొంత ప్రజలకు అర్థం కాలేదు. వారి నుంచి మద్దతుకు బదులుగా అనుమానం, ఆగ్రహం ఎదుర్కోవలసి వచ్చింది.



జమ్ము–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా



'రా' మాజీ ఉన్నతాధికారి ఎ.ఎస్. దులత్



వివాదాస్పద పుస్తకం: 'ద చీఫ్ మినిస్టర్ అండ్ ద స్పై'

◆ 'రా' మాజీ ఉన్నతాధికారి ఎ.ఎస్. దులత్ రాసిన 'ద చీఫ్ మినిస్టర్ అండ్ ద స్పై' పుస్తకం వివాదానికి దారితీసింది. జమ్ము–కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ఎదుర్కొన్న మూడు నమ్మక ద్రోహాల గురించి ఈ పుస్తకం ప్రధానంగా మాట్లాడుతుంది. 370 అధికరణ రద్దు వాటిలో ఒకటి. తనను విశ్వాసంలోకి తీసుకుని ఉంటే 370 అధికరణం రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతిచ్చేందుకు ఫరూఖ్ అబ్దుల్లా సుముఖమే అని అర్థం వచ్చేలా రాయడం వివాదాస్పదమైంది. అబ్దుల్లా దాన్ని ఖండించారు. చిత్రంగా ఒక స్నేహితుడిగా ఆయన సమ్మతితో, ఆయన గొప్పతనాన్ని కీర్తించడానికి రాసిన ఈ పుస్తకం ఆయనే దూరం జరిగేట్టుగా చేసింది.

కశ్మీరు రాజకీయాలను మిగతా దేశం నుంచి విడదీసిన క్లిష్ట సమస్య ఏమిటో దులత్ బాగానే అర్థం చేసుకున్నారు. ''కశ్మీరు నాయకులు కశ్మీరులో ఒక విధంగా మాట్లాడతారు, ఢిల్లీ వెళ్లి అక్కడ వేరేలా మాట్లాడతారు'' అని ఆయన వివరించారు. ఆయన ఈ రెండు నాలుకల వైఖరిని కపటత్వంలా కాకుండా 'ఫ్రెంచి భాష'లో పేర్కొనే ఒక రకమైన సభ్యతగా భావిస్తారు. వారున్న పరిస్థితిలో మనుగడ కోసం అలా మాట్లాడక తప్పదు. అది అవకాశ వాదం కాదు.

దులత్ కథనం ప్రధానంగా ఫరూఖ్ అబ్దుల్లా ఎదుర్కొన్న మూడు నమ్మక ద్రోహాల చుట్టూ కేంద్రీకృతమై ఉంది. కశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలను ఇచ్చిన 370వ అధికరణం రద్దు వాటిలో ఒకటి. దులత్ దీన్ని సరిగ్గా చెప్పలేక పోయారు. అది వేరే విషయం. మిగిలిన రెండూ ఫరూఖ్ మెచ్చేలానే రాశారు.

మొట్టమొదటి ద్రోహం – 1984లో ఒక అర్ధరాత్రి జరిగింది. ఇందిరా గాంధీ ఆయన్ను ముఖ్యమంత్రి పీఠం నుంచి కూలదోశారు. అది ఆయన మనసులో మానని గాయాన్ని మిగిల్చింది. ''... ఆయన దీన్నుంచి కోలుకున్నారని నేననుకోవడం లేదు'' అని ఇందిరను తీవ్రంగా దుయ్యబడుతూ దులత్ వ్యాఖ్యానించారు. దీంతో ఫరూఖ్ విభేదిస్తారని నేను అనుకోను.

రెండోది – 2002 నాటిది. వాజ్‌పేయి, అద్వానీ కలిసి ఫరూఖ్‌కు ఉప రాష్ట్రపతి పదవి వాగ్దానం చేశారు. అయితే, వారు తర్వాత ఆ మాట నిలబెట్టుకోలేక పోయారు. వారి వాగ్దానానికి ''ఫరూఖ్ ఉప్పొంగిపోయారు... ఏదో ఒక రోజు భారత రాష్ట్రపతి కావాలన్నది ఆయన జీవితాశయం. దానికి ఇది తొలి మెట్టు అనుకున్నారు.''

దులత్, ఫరూఖ్ స్నేహబంధం ఇప్పుడు చిక్కులు ఎదుర్కొంటున్నా అది తెగేది కాదు. దులత్ తమను కలిపి ఉంచే ఆ బంధంపై ఇలా అంటారు. ''డాక్టర్ సాహిబ్ నన్ను ఎంత నమ్మారో నేను ఎప్పటికీ తెలుసుకోలేను – ఆయన గురించి నాకు ఎంత తెలుసో ఆయన ఎప్పటికీ అర్థం చేసుకోలేరు.''

ఏమైనప్పటికీ, దులత్ అవగాహనలో లోపాలు స్పష్టంగా కనబడతాయి. లేనట్లయితే, తనను విశ్వాసంలోకి తీసుకుని ఉంటే 370వ అధికరణం రద్దు విషయంలో సాయం అందించడానికి ఫరూఖ్ అబ్దుల్లా సుముఖమే అనే ఆరోపణ మీద దురదృష్టకరమైన ఈ వివాదం తలెత్తేదే కాదు. తన పుస్తకం మొదటి అధ్యాయంలోనే దులత్ ఇంతటి కీలకాంశం లేవనెత్తడం హాస్యాస్పదం. ''ఫరూఖ్ మూడు దశాబ్దాలుగా నాకు తెలిసి ఉన్నా, నాకు ఆయన నిజంగా తెలుసు అని పూర్తి నమ్మకంగా ఏనాడూ చెప్పలేను. అదీ డాక్టర్ సాహిబ్ అనే ప్రహేళిక. ఆయన్ను తెలుసుకోవడం అంత సులభం కాదు.''

గత వారం తలెత్తిన వివాదం, దులత్ చెప్పిన అంశాన్నే విషాదకరంగా రుజువుచేసింది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

దేశ వాస్తవం



పూట గడవడానికి దాదాపు ఐదింట ఒక వంతు అమెరికన్లు రోజుకు రెండు పనులు చేయాల్సి వస్తుంది. వీళ్లు దుకాణాలు, గిడ్డంగులు, రెస్టారెంట్లలో చిన్న చిన్న పనులు చేస్తారు. అయినా ఆర్థికవేత్తలు సగటు అమెరికన్లు కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా లేరనీ, అందువల్లే యూఎస్ ఉద్యోగాలను ఔట్‌సోర్స్ చేయాలనీ చెబుతుంటారు.

– అనింద్యో చక్రవర్తి, ఆర్థికాంశాల వ్యాఖ్యాత

ఫీడ్‌బ్యాక్ ముఖ్యం



ఆంట్రప్రెన్యూర్స్ చేసే అతి పెద్ద తప్పిదం ఏమిటంటే, మార్కెట్‌లో వాటికి ఉండే అనుకూలతను పరీక్షించకుండా తమ ఐడియాలను ప్రేమించడం! ఐడియా ఉత్సాహపూరితంగా, కొండల్ని పిండిచేసేలా కనబడొచ్చు. కానీ నిజమైన వినియోగదారులకు దాన్ని చేర్చేదాకా అది థియరీ మాత్రమే. ఉత్తమ వ్యాపారాలు అంచనాల మీద కాకుండా ఫీడ్‌బ్యాక్ మీద నిర్మితమవుతాయి.

– హర్ష్ మారీవాలా, వ్యాపారవేత్త

సూటిగా చెప్పొచ్చుగా!



పాత ట్విట్టర్‌లో 140 అక్షరాల పరిమితి ఉన్నట్టుగానే, మెడికల్ జర్నల్స్‌లో ప్రచురితమయ్యే వ్యాసాలకు కూడా రెండు పేజీల పరిమితి పెట్టాలి. అప్పుడు వ్యాసంలో సైన్స్ మాత్రమే మిగిలి ఊకంతా ఎగిరిపోతుంది. సంక్షిప్తతే వివేకం!

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

జాగ్రత్త



భారతీయ మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో బ్రెస్ట్ క్యాన్సర్ మొదటి స్థానంలో ఉంది. దాదాపు లక్ష మంది మహిళల్లో 25.8 మందికి ఇది వస్తుండగా, లక్ష మందికి 12.7 మంది చనిపోతున్నారు. ఇండియాలో బతికే అవకాశం తక్కువగా 66.1 శాతం మాత్రమే. అదే యూఎస్, ఆస్ట్రేలియాల్లో ఇది 90 శాతం.

– సిల్వియా కర్పగం, ఎండీ – కమ్యూనిటీ మెడిసిన్

చూసుకోండి మరి!



ఒకవేళ వాస్తవాలు మీ మనోభావాలను గాయపరుస్తుంటే... మీకు కావాల్సినవి కొత్త వాస్తవాలు కాదు, కొత్త మనోభావాలు.

– రికీ గెర్వాయిస్, నట – దర్శకుడు

అసలు సంపద



సంతోషంతో నిండిన ఇల్లు, మంచి ఆరోగ్యం, స్వేచ్ఛ, మనశ్శాంతి అనేవి నిజమైన సంపద.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

వైజ్ఞానిక వేగుచుక్కలు - 23

భారతీయ తొలి మహిళా డాక్టరేట్

తొమ్మిది దశాబ్దాల క్రితం ఓ యువతి విజ్ఞాన శాస్త్రంలో ఎంఎస్సీ చేయడం కోసం ఒక పోరాటమే చేయాల్సివచ్చింది. ఆవిడ పోరాడింది చిన్న వ్యక్తితో కాదు. నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్‌తో! ఆ యువతి కమలా సోహోనీ. ఈవిడే సైన్సు విభాగంలో పీహెచ్‌డీ పొందిన తొలి భారతీయ మహిళ! బొంబాయిలో 1911 జూన్ 18న జన్మించారు కమలా భాగవత్. బొంబాయి ప్రెసిడెన్సీ కళాశాల నుంచి రసాయన శాస్త్రంలో బీఎస్సీ పట్టా పొందారు. తర్వాత సీవీ రామన్ డైరెక్టర్‌గా ఉన్న టాటా సైన్స్ ఇన్‌స్టిట్యూట్ (నేడు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరు)లో ఎమ్మెస్సీ చదవాలని ప్రయత్నించారు. ఆ రోజుల్లో ఉన్నత చదువుకు మహిళలు అర్హులు కాదని భారతీయ సమాజం భావించేది. సీవీ రామన్ కూడా దాన్నే నమ్మి ఆమెకు ప్రవేశాన్ని నిరాకరించారు. అయితే ఆ నిర్ణయాన్ని స్వీకరించక, గాంధీజీ ఆదర్శాలను బలంగా నమ్మిన కమలా భాగవత్ సత్యాగ్రహం చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత రామన్ మహాశయుడు కమల పట్టుదలను గమనించ లేకపోయారు. ఆమె మౌనంగా రోజుల తరబడి నిరసన తెలపడంతో రామన్ దిగిరాక తప్పలేదు. చివరకు ప్రవేశమిచ్చారు. అయితే కొన్ని నిబంధనలతో! అది కూడా రెగ్యులర్ విద్యార్థిగా తీసుకోలేదు. ఒక సంవత్సరం పాటు ప్రొబేషనరీగా చేరవలసి వచ్చింది. 'అవసరమైతేనే రాత్రింబవళ్లు కష్టపడాలి. ప్రయోగశాల వాతావరణాన్ని పాడు చేయకూడదు'– ఇలాంటివి ఆ అధ్వాన్నపు నిబంధనలు!



కమలా సోహోనీ

అయితే లక్ష్యసాధన కోసం ఓర్చుకుని కష్టపడి 1936లో ఎమ్మెస్సీ డిగ్రీ పొందారు. పాలు, పప్పు, చిక్కుళ్లలో ప్రొటీన్ల గురించి కమల శోధించి ఎమ్మెస్సీ పట్టా కోసం సిద్ధాంత గ్రంథం రాశారు. దీంతో రామన్ మహిళాశక్తిని గుర్తించి ఆ సంవత్సరం నుంచే విద్యార్థినులకు అవకాశం కల్పించడం ప్రారంభించారు. అలా కమల విజ్ఞాన శాస్త్రాల అధ్యయనానికి సంబంధించి మహిళలకు తొలి దారి దీపమయ్యారు.

పీహెచ్‌డీ కోసం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో చేరారు. తన 16 నెలల పరిశోధనలో 'సైటోక్రోమ్ సి' అనే ఎంజైమ్ ఉందనీ, అన్ని మొక్కల కణాలలో జరిగే ఆక్సీకరణలో దీని పాత్ర ఉంటున్నదనీ కనుగొన్నారు. తన పరిశోధనా ఫలితాలను కేవలం 40 పుటలు ఉన్న సిద్ధాంత గ్రంథంగా కేంబ్రిడ్జి యూనివర్సిటీకి సమర్పించి పీహెచ్‌డీ పట్టా పొందారు. విజ్ఞాన శాస్త్ర రంగంలో పీహెచ్‌డీ పొందిన తొలి భారతీయ మహిళగా కమల అవతరించారు. ఇండియా వచ్చి వివిధ ఉద్యోగాలు చేస్తున్న సమయంలో ఎం.వి. సోహోనీతో 1947లో వివాహం జరిగింది. అప్పటి నుంచి కమలా భాగవత్ పేరు కమలా సోహోనీగా మారింది. ఆమె చేసిన పరిశోధనలు భారతీయ సమాజానికి చాలా విలువైనవి. పప్పు ధాన్యాలు, చిక్కుళ్ళు, తాటి బెల్లం, నీరా లేదా ఈత కల్లు, తాటి మొలాసిస్, బియ్యప్పిండి మొదలైన వాటి పోషక విలువలకు సంబంధించి ఆమె చేసిన పరిశోధనలు తిరుగులేనివి.

ఎనభయ్యారేళ్ళ వయసులో న్యూఢిల్లీలో తనను గౌరవించడానికి ఏర్పాటు చేసిన సమావేశంలో 1998 జూన్ 28న ఆమె హఠాత్తుగా మరణించడం ఆమె జీవన యాత్రకు ఆశ్చర్యకరమైన ముగింపు!

– డా॥ నాగసూరి వేణుగోపాల్, ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి ၊ 94407 32392

పుడమితల్లిని రక్షించుకుందాం!

సందర్భం



డా॥ సి.వి. సర్వేశ్వర శర్మ

పర్యావరణ పరిరక్షణకు మద్దతును ప్రదర్శించడానికి జరిగే వార్షిక కార్యక్రమాన్ని 'ధరిత్రీ దినోత్సవం' (ఎర్త్ డే) అంటున్నాం. ఈనాడు పర్యావరణ ఉద్యమాలకు మద్దతు ఇవ్వడానికీ, పర్యావరణ ప్రమాదాల గురించి అవగాహన కల్పించడానికీ ప్రపంచవ్యాప్తంగా 1970 ఏప్రిల్ 22 నుండి ఈ ఉత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఈ 55వ వార్షిక దినోత్సవానికి ఎంపిక చేసిన విషయం 'మన శక్తి–మన గ్రహం'. ఈ సందర్భంగా 'భూమి మొదట – మిగిలినవన్నీ తరువాత' అనీ, 'ప్రపంచ వ్యాప్తంగా ఆలోచించి స్థానికంగా వ్యవహరించండి' అనీ పిలుపు ఇస్తున్నారు. అంతేకాదు 'పరిశుభ్రమైన భూమి – ప్రకాశవంతమైన భవిష్యత్' అని గుర్తు చేస్తున్నారు.

భూమి ఉపరితలం 70 శాతం నీరు, 30 శాతం భూమి మాత్రమే కలిగి ఉంది. మహా సముద్రాలు, నదులు, సరస్సులు, హిమానీ నదాలు, సముద్రాల వంటివి ముఖ్యమైన నీటివనరులు. పర్వతాలు, కొండలు, పీఠ భూములు, మైదానాలు వంటివి ముఖ్యమైన భూరూపాలు. నీటిలో కానీ, నేలపై కానీ మానవునితో సహా వృక్షాలు, జంతువులు, కీటకాలు వంటి జీవులు లెక్కకు మించి జీవిస్తున్నాయి. భూమిని కాపాడుకోకపోతే ఇందులో కొన్ని అదృశ్యం అయిపోయే ప్రమాదం ఉంది.



శిలాజ ఇంధనాలు మాత్రమే మన గ్రహానికి శక్తి నివ్వగలవనే అబద్ధాన్ని సంవత్సరాలుగా కొన్ని శక్తులు మనకు చెబుతూనే ఉన్నాయి. కానీ శిలాజ ఇంధనాలు ప్రమాదకరమైన గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధాన వనరులు. ఇవి గ్లోబల్ వార్మింగ్‌కు ప్రత్యక్షంగా దోహదం చేస్తాయి. ఫలితంగా శ్వాసకోశ సమస్యల నుండి కేన్సర్ వరకు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

గ్రీన్ హౌస్ ఎఫెక్ట్

బొగ్గు, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ లాంటి శిలాజ ఇంధనాలు మండినపుడు కార్బన్ డై ఆక్సైడ్ పుడుతుంది. పూర్తిగా మండని ఇంధనం నుండి వచ్చే పొగలో కూడా కార్బన్ డై ఆక్సైడ్ ఉంటుంది. కుళ్లిన పదార్థాల నుండి, చెత్త గుట్టల నుండి, వరి పంట నుండి మీథేన్ వాయువు వెలువడుతుంది. వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి కలిసి సూర్యుని నుండి వచ్చిన వేడిని గ్రహించి బయటకు పోనీయకుండా పట్టేస్తాయి. మానవులతో సహా జంతువులు, పక్షులు శ్వాస క్రియలో భాగంగా ఆక్సిజన్ వాడుకుని కార్బన్ డై ఆక్సైడ్‌ను వదిలి వేస్తాయి. మీథేన్, కార్బన్ డై ఆక్సైడ్, ఓజోన్, కార్బన్ మోనాక్సైడ్, క్లోరో ఫ్లోరో కార్బన్లు, నైట్రోజన్ ఆక్సైడ్లు వంటి కొన్ని రకాల వాయువులు పరారుణ కిరణాలను పీల్చుకుని ఇముడ్చుకుంటాయి. ఫలితంగా వేడిమి పెరిగి ప్రపంచ వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. దీనినే గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ అంటారు.

మనకు శక్తి అవసరం. దానిని పొందడానికి మన గ్రహం యొక్క వనరులను పూర్తిగా వినియోగించుకోవాలి. శిలాజ ఇంధనాలు పరిమితమైనవి. ఎప్పటికైనా అయిపోయేవే. పునరుత్పాదక ఇంధనాలపై ఇప్పటికే దృష్టి సారించారు. పునరుత్పాదక శక్తి అనేది గేమ్–ఛేంజర్. ఇది చౌకైనదే కాక స్థిరమైన విద్యుత్‌ను అందిస్తుంది. దీని వలన వాతావరణ మార్పులు ఉండవు. మానవ ఆరోగ్యానికి ఏ విధమైన హానీ ఉండదు.

సౌర, పవన, జల, భూ ఉష్ణం, అలలు వంటివి పునరుత్పాదక శక్తులు. ఈ వనరులు ఎప్పటికీ తరిగిపోవు. 2030 నాటికి ప్రపంచ వ్యాప్తంగా పునరుత్పాదక వనరుల నుంచి ఉత్పత్తి అయ్యే ఇంధన ఉత్పత్తి మూడు రెట్లు పెరగాలని ఆశిస్తున్నారు. ఈ లక్ష్య సాధనకై సమష్టి కృషి అవసరం. ఆస్ట్రేలియాలోని ఇళ్ళలో మూడింట ఒక వంతు ఇప్పటికే సౌర శక్తిని ఉపయోగిస్తున్నారు. ఐస్‌లాండ్, నార్వే, ఇథియోపియాలు ఎక్కువగా శక్తిని పునరుత్పాదక వనరుల నుంచే పొందుతున్నాయి. ఉరుగ్వే పునరుత్పాదక వనరుల నుండి 98 శాతం విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. డెన్మార్క్ పవన టర్బైన్ల ద్వారా 50 శాతం కంటే ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటోంది. ఈ విషయంలో ఆఫ్రికాలో కెన్యా అగ్రగామిగా ఉంది. దాని విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు సగం భూ ఉష్ణ శక్తి ద్వారా లభిస్తోంది. మన దేశంలో కూడా సౌర శక్తి వినియోగం బాగా పెరుగుతోంది. తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్రలలో పవన విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. సౌర ఫలకాలు, పవన టర్బైనులు నిర్మించడానికి కాడ్మియం, రాగి, వెండి ఎంతో అవసరం. ఈ సమస్య పరిష్కారానికి శాస్త్రవేత్తలు తీవ్రంగా పరిశోధనలు చేస్తున్నారు.

వ్యాసకర్త పాపులర్ సైన్స్ విషయాల రచయిత

(నేడు 55వ 'ధరిత్రీ దినోత్సవం')

అనుస్మృతి

అనుస్మృతి అంటే పదే పదే దైవాన్ని తలచుకోవటం. నియమ పూర్వకంగా అనుస్మృతిని జపిస్తే విష్ణు దర్శనం ప్రాప్తిస్తుంది. ఒకసారి నారద మునీంద్రుడు విష్ణువును దర్శించి 'దేవా! ముక్తి కోరే జనులు నిన్ను ఏ విధంగా తలచుకుంటారు? ఏమని స్మరిస్తారు? వారు జపించే మంత్రం ఏది? తెలప'మని ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు 'విష్ణు ధ్యాన క్రియకు భక్తి, శ్రద్ధ, ఇంద్రియ నిగ్రహం' అనే మూడు లక్షణాలు అవసరమని చెబుతాడు. ఇవి అలవడాలంటే భక్తుడు పాప రహితుడు కావాలి. పాపాలను నశింపజేయటానికి తాను మెచ్చిన పద్ధతి అనుస్మృతి అని చెబుతాడు.

ఇది ఒక ఆరాధనా ప్రక్రియ. దేవుని దయను పొందటానికి భక్తుడు చేసే నిరంతర స్మరణ ఇది. ఓంకారం తర్వాత నమశ్శబ్దాన్ని జోడించి, ఆ తర్వాత భగవంతుని గుణగణాలను తెలిపే శబ్దాలను చేర్చి, చతుర్థీ విభక్తి చేరిస్తే 'ఓం నమో వాసుదేవాయ' అనే మంత్రం రూపుదిద్దుకుంటుంది. ఈ మంత్రాన్ని నిశ్చల మనసుతో జపించి తర్వాత అనుస్మృతి స్తోత్రాన్ని పఠించాలి.



అనుస్మృతి అంటే దేవుని లీలలను, చేష్టలను, రూపాన్ని వర్ణించే నిరంతర స్మరణ రూపమైన స్తోత్రం. ఇది, 'శాశ్వతునీ, విశ్వవ్యాపకునీ, నాశం లేని వానినీ దోసిలి జోడించి సేవిస్తాను. తెల్ల తామరల వంటి కన్నులు కలవానినీ, లోకాలకు సాక్షినీ ఎపుడూ వర్ణిస్తాను. వేయి కన్నుల వేల్పునూ, త్రికాలాలకు అధిపతి అయిన వానినీ, ఆద్యంతాలు లేని వానినీ సేవిస్తాను. సృష్టిలో లోకాలన్నీ లయమైపోయినా, శాశ్వతంగా ఉండే విష్ణువును శరణు కోరుతూ నియమంగా 'సేవిస్తాను' అన్న రీతిగా సాగుతుంది. అనుస్మృతి స్తోత్రం స్వయంగా విష్ణువే నారదునికి ఉపదేశించాడు. ఈ అనుస్మృతి స్తోత్రం మహాభారతం శాంతి పర్వంలో విపులంగా, విస్తారంగా ఉంది. ముక్తి సాధనలో మొదట పాప పరిహారం చేసుకోవాలి. తర్వాత పుణ్య సముపార్జన చేయాలి. తర్వాత పాపపుణ్య ద్వంద్వ తిరస్కారం అవసరం. భగవానుని రక్షణ కవచం పొందాలంటే ఈ అనుస్మృతి పఠనం, మననం తప్పక చేయాలంటారు పెద్దలు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.అష్టమి ప.1.50 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తరాషాఢ ఉ.8.04 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ప.12.04 నుండి 1.40 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.25 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.9.44 నుండి 11.20 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.44, **సూర్యాస్తమయం:** 6.12.

క్లుప్తంగా...

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

• అత్తా కోడళ్ల పంచాయితీలో డబ్బులు డిమాండ్

తరిగొప్పుల: అత్తా కోడళ్ల కొట్టుకున్న వివాదంలో డబ్బులు డిమాండ్ చేసిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన అత్తా కోడళ్లు ఎదునూరి లచ్చవ్వ, ఎదునూరి మంజుల నల్లా నీటి విషయంలో ఈనెల 15న గొడవపడ్డారు. ఈ ఘటనలో ఎదునూరి లచ్చవ్వ తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు తన చిన్న కోడలు మంజుల, కుమారుడు నాగరాజుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో హెడ్‌కానిస్టేబుల్ గుగులోతు బాలోజీ, కానిస్టేబుల్ నునావత్ రాజు నాగరాజుకు ఫోన్‌చేసి కేసు నమోదు చేయవద్దంటే రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని నాగరాజు గ్రామానికి చెందిన వ్యక్తికి తెలుపగా.. వీరి మధ్య సంభాషణను రికార్డుచేసి... కమిషనర్‌కు పంపించి చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ చేపట్టిన సీపీ డబ్బులు డిమాండ్ చేసినట్లు తేలడంతో బాలోజీ, రాజును సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వడదెబ్బకు గురై వృద్ధుడు మృతి


వీరయ్య

కొల్చారం (నర్సాపూర్): వడదెబ్బకు గురైన వృద్ధుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఎండుగుల వీరయ్య (81) తనకున్న పాడి గేదెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. పశువులకు కాపలాగా వెళ్తుండటం వల్ల ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మూడు రోజుల కిందట అస్వస్థతకు గురయ్యాడు. శనివారం పరిస్థితి విషమించడంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య శాంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

హమాలీలపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

• ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

సిరికొండ: ఓ డ్రైవర్ నిర్లక్ష్యంతో అతి వేగంగా ట్రాక్టర్‌ను నడపడంతో రోడ్డు పక్కన సేదతీరుతున్న హమాలీల పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం కొండాపూర్‌లో ఈ ఘటన జరిగింది. బిహార్‌కు చెందిన పలువురు వ్యక్తులు కొండాపూర్ గ్రామానికి వచ్చి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీలుగా పని చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వద్ద బస్తాలను లారీలో లోడ్ చేశారు. అనంతరం రోడ్డు పక్కన చెట్టు నీడన సేద తీరారు. అదే సమయంలో ఒంటిప్ప తండాకు చెందిన బట్టు జబ్బార్ అనే వ్యక్తి అతి వేగంతో ట్రాక్టర్ నడుపుతూ వచ్చి, హమాలీలపైనుంచి తీసుకెళ్లాడు. ఈ ప్రమాదంలో భూమాశ్రీ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చింటు, గోవింద్ అనే వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్ తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య


కుమార్

జైపూర్: వ్యవసాయ భూమిలో వేసిన బోర్లు ఫెయిల్ కావడం, పంటల సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో వాటిని తీర్చలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పొనూర్‌లో ఈ ఘటన జరిగింది. ఎస్సై శ్రీధర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మంతెన కుమార్ (39) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యాసంగిలో తనకున్న మూడెకరాల్లో వరి సాగు చేశాడు. చివరి దశలో నీరందకపోవడంతో రెండు బోర్లు వేయించాడు. అయినా నీరు పడలేదు. మరోవైపు పంటల సాగుకు అప్పులు చేశాడు. రూ.4 లక్షల వరకు అప్పులు పెరిగిపోవడం, రెండేళ్లుగా పంట దిగుబడి సరిగా రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. ఈ ఏడాది కూడా యాసంగి దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చే అవకాశం ఉండడంతో మనస్తాపం చెందాడు. శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. దీంతో వారు పొలం వద్దకు వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న కుమార్‌ను మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమార్‌కు భార్య మమత, కుమారుడు అభినేశ్, కుమార్తె ఐశ్వర్య ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నేత్రోత్సవం.. 'త్రివేణి' సంగమం

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మూడు నదులు ఒకే చోట కలుస్తాయి. దానినే త్రివేణి సంగమంగా పిలుస్తారు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో రెండు రోజుల క్రితం డ్రోన్ కెమెరాతో త్రివేణి సంగమం వీడియో, ఫొటోలను అధికారులు చిత్రీకరించారు. నదులు కలిసే చోటు అద్భుతంగా కనిపిస్తుంది. ఇక్కడ తెలంగాణ మీదుగా ప్రవహిస్తున్న గోదావరి, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుంచి వచ్చే ప్రాణహిత నదులు కలిసిన తరువాత అంతర్వాహినిగా సరస్వతి (గుప్తనది) ఉద్భవిస్తుంది. ఈ నది మాత్రం కంటికి కనిపించదు. ఈ మూడు నదులు కాళేశ్వరం వీఐపీ (సరస్వతి) ఘాటు వద్ద కలుస్తుండటంతో త్రివేణి సంగమంగా పేరు వచ్చింది. గుప్తనదిగా పిలువబడే సరస్వతి నదికి కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు పుష్కరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే గోదావరి, ప్రాణహిత నదులకు కూడా 12 ఏళ్లకు ఒకసారి పుష్కరాలు జరుగుతాయి.

ఆర్టీసీలో 3,038 ఖాళీల భర్తీకి ఏర్పాట్లు

టీజీఎస్ ఆర్టీసీలో తొలిసారి పూర్తిస్థాయి నియామకాలు

- ఎస్సీ వర్గీకరణ పూర్తవటంతో మార్గం సుగమం
- నియామక సంస్థలకు బాధ్యత అప్పగింత
- త్వరలో అందుబాటులోకి 2 వేల మంది కొత్త డ్రైవర్లు!



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీలో తొలి నియామక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో చివరిసారి వివిధ కేటగిరీల్లో నియమకాలు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ ఇప్పటివరకు పోస్టుల భర్తీ జరగలేదు. సుదీర్ఘ విరామం తర్వాత ఇప్పుడు ఏకంగా 3,038 పోస్టుల భర్తీకి కసరత్తు మొదలైంది. ఇప్పటివరకు ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీని సంస్థే చేపట్టే విధానం ఉండేది. తొలిసారి నియామక సంస్థలకు ప్రభుత్వం ఈ బాధ్యత అప్పగించింది. టీజీపీఎస్సీ, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు, మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డులు కేటగిరీల ప్రకారం నియామక ప్రక్రియలను చేపట్టనున్నాయి.

ఏడెనిమిది నెలల క్రితమే కసరత్తు

తెలంగాణ ఆర్టీసీలో ప్రసుతం చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రతినెలా సగటున 200 మంది రిటైర్ అవుతుండటంతో ఖాళీల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోంది. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీ చేపట్టాలని ఏడెనిమిది నెలల క్రితమే ఆర్టీసీ కసరత్తు ప్రారంభించింది. దాదాపు ఐదు వేల ఖాళీల భర్తీకి ప్రతిపాదించింది. కానీ ప్రభుత్వం 3,038 పోస్టులకే అనుమతి ఇచ్చింది. అయితే తాము నియామక పరీక్షలకు రూపొందించుకున్న కేలండర్ ఆధారంగానే ఆర్టీసీలో పోస్టుల భర్తీ కూడా ఉంటుందని ఆయా సంస్థలు ప్రకటించాయి. దీంతో వెంటనే నియామకాలు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. ఇంతలో ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి రావటంతో, అది తేలిన తర్వాతే నియామకాలుంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇటీవల ఎస్సీ వర్గీకరణ జరిగి, రోస్టర్ పాయింట్లపై స్పష్టత రావడంతో ఖాళీల భర్తీకి రంగం సిద్ధమైంది. కీలకమైన డ్రైవర్ల ఎంపిక ప్రక్రియ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చూడనుంది. మరో రెండు నెలల్లో ప్రక్రియ మొదలవుతుందని, నాలుగు నెలల్లో కొత్త డ్రైవర్లు అందుబాటులోకి వస్తారని సంస్థ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. జోనల్ పోస్టులు, రీజియన్ పోస్టుల వారీగా ఖాళీలు, రోస్టర్ పాయింట్లను సూచిస్తూ ఆర్టీసీ సంబంధిత బోర్డులకు వివరాలు అందజేయాల్సి ఉంది. బోర్డులు అడగ్గానే వాటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

అప్పటి వరకు ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లతో..

ప్రస్తుతం ఆర్టీసీలో 1,600 డ్రైవర్‌పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న డ్రైవర్లపై తీవ్ర పనిభారం పెరిగింది. డబుల్ డ్యూటీలు చేయాల్సి వస్తోంది. దీంతో 1,500 మంది ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకునేందుకు సంస్థ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. మ్యాన్‌పవర్ సప్లయర్స్ సంస్థల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు ఎంపిక చేసిన డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నారు. వీరిని మూడు నెలల పాటు కొనసాగిస్తామని ఒప్పందంలో సంస్థ పేర్కొంది. తాజాగా రెగ్యులర్ డ్రైవర్ల నియామకం వరకు వీరిని కొనసాగించాలని నిర్ణయించింది. ఇలా తాత్కాలిక పద్ధతిలో ఎంపికైన వారు, రెగ్యులర్ నియామకాల కోసం కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. వీరు శిక్షణ పొంది ఉన్నందున, రెగ్యులర్ నియామకాల్లో వీరికి ఆయా బోర్డులు ప్రాధాన్యం ఇచ్చే వీలుందని అధికారులు చెబుతున్నారు.

రెగ్యులర్ నియామకంలో భర్తీ అయ్యే పోస్టులు ఇలా..

కేటగిరీ	పోస్టులు	నియామక సంస్థ
డ్రైవర్లు	2000	పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
శ్రామిక్	743	పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానికల్)	114	పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్)	84	పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్‌మేనేజర్	25	టీజీపీఎస్సీ
అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్	18	టీజీపీఎస్సీ
అసిస్టెంట్ ఇంజినీర్ (సివిల్)	23	టీజీపీఎస్సీ
సెక్షన్ ఆఫీసర్	11	టీజీపీఎస్సీ
అకౌంట్స్ ఆఫీసర్	6	టీజీపీఎస్సీ
మెడికల్ ఆఫీసర్స్(జనరల్)	7	మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు
మెడికల్ ఆఫీసర్స్(స్పెషలిస్టు)	7	మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు

త్వరలో భర్తీ ప్రక్రియ



తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాత యువత ఉపాధికి పెద్దపీట వేస్తూ 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం. ఇప్పుడు తెలంగాణ ఆర్టీసీలో తొలిసారి భర్తీ ప్రక్రియ చేపడుతున్నాం. 3,038 ఖాళీలను నియామక బోర్డుల ద్వారా భర్తీ చేయనున్నాం. ఇందుకోసం ఆయా బోర్డులు నియామక క్యాలెండర్‌ను సిద్ధం చేసుకున్నాయి. వాటి ప్రకారం వీలైనంత త్వరలో భర్తీ ప్రక్రియ జరుగుతుంది.

– రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

మావోయిస్టుల లొంగు'బాట'

▶ మొదటి పేజీ తరువాయి

జనతన సర్కార్ నిర్వహణ కష్టంగా మారాయి. మరోవైపు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నాయకులకు వైద్యసాయం అందించడం కత్తి మీద సాములా మారింది. దీంతో మావోయిస్టు పార్టీ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఓవైపు శాంతి చర్చలకు పిలుపునివ్వడంతోపాటు కింది స్థాయి కేడర్‌ను ప్రభుత్వానికి లొంగిపోవాలని సూచించినట్టు తెలుస్తోంది. తిరిగి అనుకూల సమయం వచ్చినప్పుడు పార్టీని విస్తరించుకుందామని చెబుతున్నట్లు సమాచారం.

ఛత్తీస్‌గఢ్ నుంచి బయటకు..

లొంగుబాటుకు ప్రయత్నిస్తున్న నక్సల్స్‌లో చాలామంది బస్తర్ ఎన్‌కౌంటర్లలో చనిపోతుండడంతో అక్కడ లొంగుబాటు ప్రక్రియకు ఆదిలోనే బ్రేకులు పడ్డాయి. దీంతో ఛత్తీస్‌గఢ్‌లో లొంగుబాటు సేఫ్ కాదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర వైపునకు తరలివస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 203 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గతేడాది ఈ సంఖ్య 36 మాత్రమే. గత మార్చి 15న ఒకేసారి 64 మంది లొంగిపోగా, ఏప్రిల్ 5న రికార్డు స్థాయిలో 86 మంది లొంగిపోయారు. ఈ నెల 12న ములుగులో 22 మంది లొంగిపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. మరోవైపు ఏపీలోని అల్లూరి జిల్లాలో ఈ నెల 5న 11 మంది లొంగిపోయారు.

రూటు మార్చిన ఛత్తీస్‌గఢ్

లొంగిపోయే మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏప్రిల్ 10న కొత్త పథకం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని 120 రోజుల్లోగా అందిస్తామని పేర్కొంది. అదే విధంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి రూ.10 వేల వంతున స్టైఫండ్ అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో అయితే వ్యవసాయ భూమి, పట్టణ ప్రాంతాల్లో అయితే ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించింది.

రెండు రోజులు తేలికపాటి వర్షాలు

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం వెల్లడించింది. 24 జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది.

మరింత పెరిగిన గరిష్ట ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. ఆదివారం ఆదిలాబాద్‌లో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 43.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 23.8 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డయ్యింది. ఆదిలాబాద్, ఖమ్మం, నిజామాబాద్‌లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు పలు ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ విభాగం పేర్కొంది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	43.5	25.2
భద్రాచలం	39.4	29.0
దుండిగల్	38.7	27.2
హకీంపేట్	38.5	27.5
హనుమకొండ	40.0	25.5
హైదరాబాద్	38.8	26.5
ఖమ్మం	40.4	27.0
మహబూబ్‌నగర్	40.0	30.1
మెదక్	41.8	23.8
నల్లగొండ	40.0	24.4
నిజామాబాద్	43.1	27.2
రామగుండం	41.4	26.2

రూ.17.51 లక్షలతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు

చిన్న రాష్ట్రమైన సిక్కింలో పేదలకు ఖరీదైన పేదింటి పథకం

- ఇంటితోపాటు సోఫా, టీవీ, రెండు బీరువాల బహుమతి
- స్టడీ టూర్‌లో పరిశీలించిన తెలంగాణ అధికారులు


సిక్కిం గరీబ్ ఆవాస్ పథకం కింద నిర్మించిన ఇంటి వద్ద తెలంగాణ గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ చైతన్య కుమార్

సాక్షి, హైదరాబాద్: కేంద్రప్రభుత్వంతోపాటు అనేక రాష్ట్రాలు నిరుపేదలకు ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్నాయి. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇస్తోంది. అయితే, వీటి నిర్మాణ వ్యయం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలకు మించదు. కానీ, దేశంలోని అతిచిన్న రాష్ట్రాల్లో ఒకటైన సిక్కింలో పేదలకు ఏకంగా రూ.17.51 లక్షలతో డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇస్తోంది ఆ రాష్ట్ర ప్రభుత్వం. ఇంటితోపాటు సోఫా, రెండు బీరువాలు, ఓ టీవీని కూడా ఉచితంగా ఇస్తోందట. తెలంగాణ గృహనిర్మాణ శాఖకు చెందిన ఎస్ఈ స్థాయి అధికారులు చైతన్య, ఈశ్వరయ్య కేంద్రప్రభుత్వ స్టడీ టూర్‌లో భాగంగా ఇటీవల సిక్కిం వెళ్లి, ఆ పేదల ఇళ్లను పరిశీలించారు.

సకల సదుపాయాలు

పేదలకు ఉచిత ఇళ్లు అంటే ప్రభుత్వాలు ఏదో కొంత మొత్తం ఇచ్చి మమ అనిపించటం చూస్తుంటాం. కానీ, సిక్కిం ప్రభుత్వం మాత్రం సకల సౌకర్యాలతో పేదలకు ఉచిత ఇళ్లు అందిస్తోంది. సిక్కిం గరీబ్ ఆవాస్ యోజన పథకంలో భాగంగా 678 చదరపు అడుగుల వైశాల్యంతో ఇల్లు నిర్మించి ఇస్తోంది. ఇందులో రెండు పడకగదులు, వంటశాల, లివింగ్ రూమ్, టాయిలెట్ ఉంటాయి. ఇదంతా మామూలే. కానీ, లబ్ధిదారుల కోసం ఒక సోఫా, రెండు స్టీల్ బీరువాలు, ఓ టీవీ సెట్‌ను కూడా ప్రభుత్వం అందిస్తుండటం విశేషం. ఈ సకల సౌకర్యాల ఇంటికి అక్షరాలా రూ.17.51 లక్షలు ఖర్చవుతోందట. ఇలాంటివి పది వేల ఇళ్లు నిర్మించాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

అవాక్కైన అధికారులు

ఈ పథకం తీరు చూసి స్టడీ టూర్‌కు వెళ్లిన అధికారులు అవాక్కయ్యారు. ఒక చిన్న రాష్ట్రం ఇంత భారీ వ్యయంతో పథకాన్ని అమలు చేస్తున్న తీరును ఆసక్తితో పరిశీలించారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మిజోరం, మహారాష్ట్ర, త్రిపుర, నాగాలాండ్, అస్సాం అధికారులతోపాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, హడ్కో ప్రతినిధులు కూడా ఈ టూర్‌లో పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ ఆర్థిక సాయంతోపాటు రాష్ట్రప్రభుత్వ సొంత నిధులతో ఈ పథకం అమలవుతోంది. కొండ ప్రాంతం కావటంతో ఈ ఇళ్ల నిర్మాణంలో సిక్కిం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించి నిర్మిస్తున్నట్టు చైతన్య తెలిపారు. అక్కడ రూ.1.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మరో ఇళ్ల పథకం కూడా ఉందని చెప్పారు. పేదల్లో అతి పేదలు, వార్షిక ఆదాయం రూ.లక్ష మించని వారికి ఖరీదైన ఇళ్ల పథకాన్ని వర్తింపచేస్తున్నారని వెల్లడించారు.

ఆ అనాథలకు అండగా ఉంటాం

• 'సాక్షి'కథనానికి పలువురి స్పందన

సాక్షి ఎఫెక్ట్


పోతిరెడ్డి ఫాతిమారెడ్డి

పాపన్నపేట (మెదక్)/ కొత్తపల్లి(కరీంనగర్): తల్లి తండ్రి లేని ముగ్గురు అనాథ బాలల వ్యథపై 'బడికి సెలవులంటేనే భయం'శీర్షికన సాక్షి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనానికి పలువురు స్పందించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలోని ప్యారడైజ్ అండ్ సెయింట్ జార్జ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఫాతిమారెడ్డి ఈ ముగ్గురు పిల్లలలో ఒకరికి ఉచిత విద్య, వసతి, పుస్తకాలు అందిస్తానని తెలిపారు. ఆ విద్యార్థుల్లోని ఒకరిని ప్యారడైజ్, సెయింట్‌జార్జ్ విద్యాసంస్థల్లో చేర్పించేందుకు వారి బంధువులు, మరెవరైనా 'సాక్షి'ద్వారా సంప్రదించాలని ఫాతిమారెడ్డి కోరారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఈ బాలల వివరాలు తెలుసుకోవాలని మహిళా శిశు సంక్షేమ అధికారులను ఆదేశించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ చెప్పారు. మరికొంతమంది రిటైర్డ్ అధికారులు కూడా ఈ బాలలకు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. వారి బ్యాంకు ఖాతా వివరాలు పంపాల్సిందిగా కోరారు.

మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలి

• తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు: కూనంనేని



కరీంనగర్: మావోయిస్టులను మార్చి 2026 నాటికి తుదముట్టిస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని, వారిని శాంతిచర్చలకు పిలవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తప్పు చేస్తే కేసులు పెట్టాలిగాని చంపేసే అధికారాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మతం పేరుతో రెచ్చగొడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. వ్యక్తిగత రాజ్యాంగాన్ని అమలు పరుస్తూ 370 ఆర్టికల్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, ట్రిపుల్ తలాక్ చట్టంతోపాటు తాజాగా వక్ఫ్‌బోర్డు అంశాన్ని బరితెగించి బలవంతంగా అమలు చేస్తోందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గించే కుట్రచేస్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవని, రాష్ట్రానికి ఏం చేశారని ఆ పార్టీ నేతలు ఇక్కడ ఓట్లు అడుగుతారని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నా ఒరిగేదేమీ లేదని చెప్పారు. కనీసం అసెంబ్లీకి రావాలి కదా అని కేసీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలపై అడిగే హక్కు కేవలం సీపీఐకి మాత్రమే ఉందన్నారు. కాంగ్రెస్ సర్కారుకు అవసరమైన సలహాలిస్తామని, కుదరని పక్షంలో ప్రజలతో కలిసి ప్రజాఉద్యమాలు నిర్మిస్తామని కూనంనేని తెలిపారు.

ఆదివాసీలపై నరమేధాన్ని ఆపాలి

• ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సదస్సులో వక్తలు


ఎన్.వేణుగోపాల్

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేత పేరుతో ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాల్లో ఆదివాసీలపై కొనసాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు కోరారు. ఇంద్రవెల్లి మారణకాండ జరిగి 44 ఏళ్లు అవుతున్న సందర్భంగా మధ్యభారతంలో ఆపరేషన్ కగార్‌తో సాగుతున్న ఆదివాసుల హననానికి వ్యతిరేకంగా ముడిమడుగుల మల్లన్న, గుమ్మడి కొమురయ్య అధ్యక్షతన ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు మాట్లాడుతూ, ఆదివాసీల ఉద్యమాలను నిర్వీర్యం చేసి వనరులను కార్పొరేట్లకు అందించడానికి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 15 నెలల కాలంలో 400 మంది అమాయకులను బూటకపు ఎన్‌కౌంటర్ పేరిట చంపారని ఆరోపించారు. వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ, మోహనరావు, చలపతి, ఊర్మిళ, మిడ్కో వంటివారిని పట్టుకొని చంపారని, ఆరు నెలల మంగ్లీ పొడి నుంచి మిడ్కో వరకు అన్ని కగార్ హత్యలేనని మండిపడ్డారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా

• ఇద్దరికి తీవ్ర గాయాలు


బోల్తాపడిన ఆర్టీసీ బస్సు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): బైక్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు బోల్తా పడిన ఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం శివారులో ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా.. మరో 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కోదాడ నుంచి నక్కగూడేనికి సుమారు 60 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు చింతలపాలెం శివారులోని మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి దాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బానోత్ వెంకటేశ్, బి.కోటిలింగంకు తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నర్సయ్యతో పాటు బస్సులో ఉన్న దాదాపు 25 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్‌ను హైదరాబాద్‌కు, కోటిలింగంను సూర్యాపేట హాస్పిటల్‌కు తరలించారు. ఘటనా స్థలాన్ని కోదాడ రూరల్ సీఐ రజిత, చింతలపాలెం ఇన్‌చార్జి ఎస్సై పరమేశ్ పరిశీలించారు. ప్రయాణికుడు సీహెచ్.నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరమేశ్ తెలిపారు.

కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి..

• కూతురుకు తాగించి, తాను తాగిన మహిళ
• చిన్నారి మృతి.. చికిత్స పొందుతున్న తల్లి


జెశ్విక

నిజాంపేట్: కుటుంబ కలహాలా! లేక అనారోగ్యమో తెలియదుకాని.. ఆ ఇల్లాలు తనువు చాలించాలనుకుంది. తనతో పాటు తన నాలుగేళ్ల కూతురును సైతం తీసుకెళ్లాలని.. కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి తాను తాగి, కూతురుకు కూడా తాగించింది. దీంతో కూతురు మృతి చెందగా తల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాలిలా ఉన్నాయి.. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, హరితా ఆర్కేడ్ అపార్ట్‌మెంట్‌లో నంబూరి సాంబశివరావు, కృష్ణా పావని దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి నాలుగేళ్ల కూతురు జెశ్విక ఉంది. సాంబశివరావు ఐటీ ఉద్యోగికాగా, పావని గృహిణి. ఈ నెల 18న శుక్రవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో పావని కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగింది. కూతురు జెశ్వికకు కూడా తాగించింది. దీంతో ఆరోజు రాత్రి ఇద్దరూ పలు మార్లు వాంతులు చేసుకున్నారు. రాత్రి ఇంటికి వచ్చిన భర్తకు పావని ఈ విషయం చెప్పలేదు. శనివారం ఉదయం కూడా వాంతులు అవుతుండటంతో పావని భర్తకు ఈ విషయం చెప్పింది. దీంతో సాంబశివరావు వెంటనే వారిని కూకట్‌పల్లిలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. జెశ్విక పరిస్థితి విషమించడంతో రెయిన్‌బో ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి మరింత విషమించడంతో సాయంత్రం జెశ్విక మృతి చెందింది. పావని పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు తెలుస్తోంది. సాంబశివరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పావని తన కూతురుతో పాటు ఆత్మహత్య చేసుకోవాలనుకోవడానికి కారణం ఏమిటన్నది ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసుల ప్రాథమిక విచారణలో మాత్రం పావని గత కొద్ది సంవత్సరాలుగా మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది. కుటుంబ కలహాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీ రైస్‌లో ఆర్సెనిక్ ఉందా!?

వాతావరణ మార్పులతో వరిలో పెరుగుతున్న ఆర్సెనిక్ పాళ్లు • పొంచి ఉన్న పలు దారుణ వ్యాధుల ముప్పు • తాజా అధ్యయనంలో వెల్లడి

వరి. విశ్వవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలకు నిత్యం కడుపునింపే అమృతం. ఇక తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎన్ని చిరు తిళ్లు, ఇతర చల్లనిపానీయాలు తాగినా కాస్తంత వరి అన్నంతో భోజనం చేస్తేనే కడుపు నిండిన సంతృప్తికర భావన కల్గుతుంది. జీవకోటి ప్రాణాలు నిలుపుతున్న వరిలో ఇప్పుడు అత్యంత విషపూరిత ఆర్సెనిక్ మూలకం స్థాయిలు ఎక్కువ అవుతున్నట్లు తాజా అధ్యయనం ఒకటి చేదు నిజాన్ని బయటపెట్టింది. యథేచ్ఛగా జరుగుతున్న మానవ కార్యకలాపాలు, అడవుల దహనం, శిలాజ ఇంధనాల వాడకంతో వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. ఇప్పుడీ వాతావరణ మార్పుల విపరిణామాలు వరి పంటలపై పడుతున్నాయని స్పష్టమైంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగి, కార్బన్‌డయాక్సైడ్ కర్బన ఉద్గారాల స్థాయిలు పెరగడంతో వాటి కారణంగా పొల్లాల్లో మట్టి, నీటి నుంచి ఆర్సెనిక్ మూలకం అత్యధికంగా వరిధాన్యంలోకి చేరుతోంది. విషాల రారాజుగా పేరొందిన ఆర్సెనిక్ పాళ్లు వరిలో పెరిగితే ఆరోగ్యంపై దాని దుష్ప్రభావాలు దారుణంగా ఉంటాయి. ఆర్సెనిక్ స్థాయి పెరిగిన వరి అన్నాన్ని ఆహారంగా తీసుకుంటే చర్మ, ఊపిరితిత్తుల సంబంధ క్యాన్సర్లతో పాటు ఎన్నోరకాల తీవ్ర ఆరోగ్య సమస్యలు మనిషిని చుట్టుముట్టడం ఖాయం. రక్తసరఫరా, రోగ నిరోధక వ్యవస్థలు, కాలేయం, మూత్రపిండాలు, మూత్రాశయం, చర్మం, ప్రోస్టేట్ గ్రంధి వంటి శరీర భాగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. హృద్రోగ సమస్యతోపాటు మధుమేహ వ్యాధి ప్రబలే ప్రమాదముంది. గర్భిణుల్లో పిండం సరిగా ఎదగపోవడం, అకాల మరణాలు సంభవించే ముప్పు ఉంది. వాతావరణ మార్పుల కారణంగా వాతావరణంలోని వెలువడుతున్న అధిక కర్బన ఉద్గారాలు, ఉష్ణోగ్రతల పెరుగుదలతో అమృతాహారం కాస్తా విషాహారంగా మారుతున్న వైనాన్ని శాస్త్రవేత్తలు వివరించారు. కొలంబియా విశ్వవిద్యాలయంలోని పరిశోధకుల బృందం చేసిన ఈ అధ్యయన ఫలితాలు 'లాన్సెట్ ప్లానిటరీ హెల్త్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అకర్బన ఆర్సెనిక్‌తో మరింత ప్రమాదం

ఆర్సెనిక్ కర్బన, అకర్బన రూపాల్లో సహజంగానే నేల పొరల్లో ఉంటుంది. మానవునికి అకర్బన ఆర్సెనిక్‌తో పోలిస్తే అకర్బన ఆర్సెనిక్‌తో ముప్పు చాలా ఎక్కువ. వరిపంట మడుల్లో నీటితో నింపినప్పుడు మట్టిలోని ఆర్సెనిక్ వరినాట్ల ద్వారా వరిధాన్యంలోకి చేరుతుంది. అధ్యయనంలో భాగంగా పదేళ్లపాటు చైనాలో వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగుచేస్తున్న 28 రకాల వరి వంగడాలపై శాస్త్రవేత్తలు పరిశోధన చేశారు. వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ స్థాయిలు పెరిగినప్పుడు ఆర్సెనిక్ శోషణ స్థాయిలూ పెరుగుతున్నాయి. దీంతో వరి ధాన్యంలో ఆర్సెనిక్ స్థాయిలు ఎక్కువవుతున్నాయి. ఇలాగే కొనసాగితే ఒక్క చైనాలోనే వరి అన్నం తినడం వల్ల 1.93 కోట్ల క్యాన్సర్ కేసులు పెరుగుతాయని న్యూయార్క్‌లోని కొలంబియా వర్సిటీలోని వాతావరణ ఆరోగ్య శాస్త్ర సహాయ అధ్యాపకులు, ఈ పరిశోధనలో సహ రచయిత లెవీస్ జిస్కా చెప్పారు. ఉష్ణోగ్రత మరో 2 డిగ్రీల సెల్సియస్ పెరిగితే మరో పాతికేళ్లలో వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ ప్రతి 10 లక్షలకు 200 పాళ్లు ఎక్కువవుతుందని ఆయన పేర్కొన్నారు.

అరికట్టే మార్గాలున్నాయి

వరిధాన్యంలోని ఆర్సెనిక్ వంట ద్వారా ఒంటిలోకి చేరకుండా అడ్డుకునే చిట్కాలున్నాయి. బ్రౌన్ రైస్‌తో పోలిస్తే తెల్ల బియ్యంలో పోషకాలు తక్కువ. అలాగే ఆర్సెన్ పాళ్లు కూడా తక్కువే. అందుకే బ్రౌన్‌రైస్ బదులు తెల్ల అన్నం తింటే కాస్త దీని ముప్పు నుంచి తప్పించుకోవచ్చు. ఇతర రకాలతో పోలిస్తే బాస్మతి రకం బియ్యంలోనూ ఆర్సెనిక్ తక్కువగా ఉంటుంది. ఆగ్నేయాసియా, అమెరికా, యూరప్ దేశాల్లోని రకాలతో పోలిస్తే తూర్పు ఆఫ్రికాలో దొరికే వరిలో ఆర్సెనిక్ తక్కువగా ఉంటోంది. '' అప్పటికే మరుగుతున్న నీటిలో బియ్యాన్ని పోసి ఉడకబెట్టండి. ఒక ఐదు నిమిషాల తర్వాత ఆ నీటినంతా పారబోయండి. తర్వాత మళ్లీ కొత్తగా నీళ్లు జతచేసి అన్నం వండండి. గంజి వార్చకండి'' అని బ్రిటన్‌లోని షెఫీల్డ్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు. '' వండటానికి ముందు బియ్యాన్ని బాగా కడగండి. తర్వాత ఒక పాలు బియ్యానికి, ఆరు పాళ్ల నీటిని జతచేసి వండండి'' అని బ్రిటన్ ఆహార ప్రమాణాల ప్రాధికార సంస్థ సూచించింది.



బ్రౌన్ రైస్ కంటే తెల్ల అన్నమే మంచిది!

''బ్రౌన్ రైస్‌లో అకర్బన ఆర్సెనిక్ ఎక్కువగా ఉంటుంది. తెల్ల అన్నంలో ఇది తక్కువగా ఉంటుంది. విషపూరిత ఆర్సెనిక్ కోణంలో చూస్తే ఆహారంగా బ్రౌన్ రైస్ కంటే పాలిష్ చేసిన తెల్ల అన్నమే మంచిది'' అని శాస్త్రవేత్తలు చెప్పారు. తెల్ల అన్నంతో పోలిస్తే ముడి అన్నం, బ్రౌన్ రైస్ మంచివి అంటూ జనం కొత్తపోకడలో వెళుతున్న ఈ తరుణంలో శాస్త్రవేత్తలు తెల్ల అన్నమే ఉత్తమమని చెప్పడం గమనార్హం. '' వరిధాన్యంలో ఆర్సెనిక్ స్థాయిని తేల్చేందుకు ప్రపంచంలో విస్తృతస్థాయిలో జరిగిన తొలి అధ్యయనం ఇది'' అని బెల్‌ఫాస్ట్‌లోని క్వీన్స్ యూనివర్సిటీ బయోలాజికల్ సైన్సెస్ విభాగ ప్రొఫెసర్ ఆండ్రూ మెహార్గ్ చెప్పారు.

రంగు, రుచి, వాసన ఉండదు

ఆర్సెనిక్ విషపూరితమైనదని ప్రాచీన మానవులకు కూడా తెలుసు. ఇది ఎలాంటి రంగు, రుచి, వాసన ఉండదు. ప్రాచీనకాలంలో రోమ్, యూరప్ దేశాల్లో శత్రువులను చంపేసేందుకు ఆర్సెనిక్‌ను ఇచ్చేవారని కథలు కథలుగా చెప్పేవారు. అయితే అత్యల్ప స్థాయిలో దీనిని తీసుకుంటే వెంటనే ఎలాంటి ప్రభావం చూపించదుగానీ స్లో పాయిజన్‌లా పనిచేసి దీర్ఘకాలంలో శరీరంపై తీవ్ర దుష్ప్రభావాలను చూపిస్తుంది. అకర్బన ఆర్సెనిక్ అణువులు మానవశరీరంలోని జీవఅణువులతో అత్యంత సులభంగా బంధం ఏర్పర్చుకుంటాయి. కర్బన ఆర్సెనిక్ సహజంగా శిలలు, నేలల్లో ఉంటుంది. అకర్బన ఆర్సెనిక్ ఎక్కువగా గనుల తవ్వకం, బొగ్గును కాల్చడం ఇతర పారిశ్రామిక కార్యకలాపాల వల్ల వాతావరణంలోకి చేరుతుంది. ఇది నీటిలో కరుగుతుంది. పారిశ్రామిక వ్యర్థాలు నదీజలాల్లోకి పారి ఆ నీటితో పండించే పంటల ద్వారా మానవ శరీరాల్లోకి చేరుతోంది. దక్షిణ అమెరికా, దక్షిణ, మధ్యాసియా దేశాల్లోని భూగర్భ జలాల్లోనూ అకర్బన ఆర్సెనిక్ ఉంటోంది. అమెరికాలో దాదాపు 21 లక్షల మంది ప్రజలు ఇలా అకర్బన ఆర్సెనిక్ ఉన్న నీటినే తాగుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన పరిమితులను దాటిన ఆర్సెనిక్ ఉన్న జలాలనే ప్రపంచవ్యాప్తంగా 14 కోట్ల మంది జనం తాగుతున్నారు.

మతలబు అంతా వరిమళ్లలోనే

వేల సంవత్సరాల క్రితం వరిసాగు లేదు. అక్కడక్కడా పెరిగిన వరికంకుల నుంచే వరిధాన్యాన్ని సేకరించి వండుకుని తిన్నారు. ఆ వరిమొక్కల మొదళ్ల వద్ద ఎలాంటి నీరు నిల్వ ఉండేదికాదు. ఇప్పుడు నాగరిక సమాజంలో మడులు కట్టి నీటిని నిల్వచేసి వరిసాగు చేస్తున్నారు. వరి మొక్కల మొదళ్ల వద్ద పూర్తిగా నీరు ఉంటుంది. దీంతో మట్టిలో సహజ ఆక్సిజన్ ఉండదు. దీంతో మొక్క వేర్ల వద్ద అన్‌ఏరోబిక్ బ్యాక్టీరియా శక్తి సంగ్రహణ కోసం ప్రత్యామ్నాయంగా ఆర్సెనిక్ అణువులను లాగేస్తుంది. అలా గతంతో పోలిస్తే ఆర్సెనిక్ వరిధాన్యంలోని వచ్చి చేరుతోంది. కాలుష్యం, తదితర మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల కారణంగా నేలలో కర్బన ఉద్గారాలు పెరిగి, ఉష్ణోగ్రత ఎక్కువై ఈ ఆర్సెనిక్ సంగ్రహణ రేటు పెరుగుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

జంధ్యం ఉంటే నో ఎగ్జామ్

కర్ణాటకలో విద్యార్థులను పరీక్షకు అనుమతించని పోలీసులు

బెంగళూరు: కర్ణాటకలో జంధ్యం వివాదం చర్చనీయాంశంగా మారింది. జంధ్యం ధరించి వచ్చిన విద్యార్థులను పరీక్షకు అధికారులు అనుమతించడం లేదు. ఇంజనీరింగ్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సెట్)తోపాటు ఇతర పోటీ పరీక్షల్లో జంధ్యం ధరిస్తే 'నో ఎగ్జామ్' అంటున్నారు. ఇటీవల శివమొగ్గ పట్టణంలో ఓ బ్రాహ్మణ విద్యార్థిని పరీక్షకు అనుమతించకపోవడం వివాదంగా మారింది. తాజాగా బీదర్, గదగ్, ధార్వాడ్‌లో ఈ తరహా ఘటనలు చోటుచేసుకున్నాయి. జంధ్యం తొలగిస్తేనే పరీక్ష రాయనిస్తామంటూ అధికారులు తేల్చిచెప్పారని విద్యార్థులు ఆరోపించారు. గదగ్, ధార్వాడ్‌లో అధికారులు ఇద్దరు విద్యార్థుల జంధ్యాలను కత్తిరించి, చెత్తబుట్టలో పడేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనివల్ల తాను చాలా కలత చెందానని, పరీక్ష రాయకుండా వెనక్కి వెళ్లిపోయానని ధార్వాడ్ విద్యార్థి చెప్పాడు. బీదర్ జిల్లాలో జంధ్యం తొలగించిన ఘటనపై బాధిత విద్యార్థి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. కాలేజీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

బీజేపీ వివరణ రాజకీయ వంచన

- ఎంపీలు నిశికాంత్ దూబే, దినేష్ శర్మలపై చర్యలు తీసుకోవాలి
- వీరి వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదన్న నడ్డాపై కాంగ్రెస్ ఆగ్రహం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తి లక్ష్యంగా పలు వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీలు నిశికాంత్ దూబే, దినేష్ శర్మలపై ఆ పార్టీ చర్యలెందుకు తీసుకోలేదని కాంగ్రెస్ ప్రశ్నించింది. వారి విమర్శలు వ్యక్తిగతమని చెబుతూ దూరంగా ఉండేందుకు ప్రయత్నించడం రాజకీయ వంచనగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. 'ఆ ఎంపీలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు, కనీసం షోకాజ్ నోటీసులు ఎందుకివ్వలేదు?' అని నిలదీశారు. తరచూ వివిధ వర్గాలు, వ్యక్తులు, సంస్థలే లక్ష్యంగా విద్వేష, వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న నిశికాంత్ దూబే, దినేష్ శర్మలకు పార్టీతో సంబంధం లేదంటూ దూరంగా ఉండటం కేవలం నష్ట నివారణ చర్య మాత్రమేనన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానానికి వ్యతిరేకంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మౌనంగా ఉండటం తగదని పేర్కొన్నారు. ఒక వేళ ఉపరాష్ట్రపతి అభిప్రాయాలతో పార్టీ ఏకీభవిస్తోందా? అని జేపీ నడ్డాను ప్రశ్నించారు. భారత రాజ్యాంగంపై ఇలా పదే పదే జరుగుతున్న దాడులపై ప్రధాని మౌనంగా ఉండటమంటే వారికి పరోక్షంగా మద్దతు ఇవ్వడమేనని జైరామ్ రమేశ్ అన్నారు. ఇదంతా బీజేపీ రాజకీయ వంచన అని ఆయన అభివర్ణించారు. జార్ఖండ్‌కు చెందిన ఎంపీ నిశికాంత్ దూబే పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల జరిగిన అల్లర్లు, వక్ఫ్ చట్టంపై చేసిన వ్యాఖ్యలు ధిక్కారం కిందికే వస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. 'ఇది కోర్టు ధిక్కారానికి, రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన స్పష్టమైన కేసు. తేలిగ్గా తీసుకోలేం. భారత ప్రధాన న్యాయమూర్తిపై ఈ ఎంపీ తీవ్రమైన ఆరోపణలు చేశారు. న్యాయవ్యవస్థను బెదిరించడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం. ఇది న్యాయవ్యవస్థపై జరిగిన ప్రత్యక్ష దాడి. స్పీకర్, సుప్రీంకోర్టు ఆ ఎంపీపై చర్య తీసుకోవాలి' అని వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఎంపీ దూబే శనివారం సుప్రీంకోర్టుపై విమర్శలు చేయడం తెల్సిందే. సుప్రీంకోర్టే చట్టాలు చేస్తుంటే పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలను మూసివేసుకోవాల్సిందేనన్నారు. దేశంలో సివిల్ వార్‌లకు సీజేఐ కారణమని నిందించారు. అదేవిధంగా, రాష్ట్రపతి తన వద్దకు వచ్చిన బిల్లులపై 90 రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావించిన యూపీ డిప్యూటీ సీఎం దినేశ్ శర్మ ఇటీవల.. పార్లమెంట్‌ను, రాష్ట్రపతిని ఎవరూ ఆదేశించలేరంటూ వ్యాఖ్యానించారు. అయితే, వీరి వ్యాఖ్యలతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదని శనివారం బీజేపీ చీఫ్ జేపీ నడ్డా స్పష్టం చేశారు. 'న్యాయవ్యవస్థ, భారత ప్రధాన న్యాయమూర్తిపై ఎంపీలు నిశికాంత్ దూబే, దినేశ్ శర్మ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి ఎటువంటి సంబంధం లేదు. ఇవి వారి వ్యక్తిగతం. పార్టీ వీటితో ఏకీభవించదు. ఇలాంటి వ్యాఖ్యలకు ఎప్పుడూ మద్దతివ్వదు. పూర్తిగా తిరస్కరిస్తుంది' అని నడ్డా తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు.

యెమెన్ పోర్టుపై మళ్లీ అమెరికా దాడులు

సనా: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్ల మౌలిక వనరులే లక్ష్యంగా అమెరికా మరోసారి భీకర దాడులకు పాల్పడింది. హొదైడా నౌకాశ్రయం, విమానాశ్రయాలపై ఆదివారం 13 సార్లు అమెరికా వైమానిక దాడులు జరిపిందని హౌతీల అధీనంలో అల్ మసీరాహ్ టీవీ చానెల్ పేర్కొంది. హొదైడా ప్రావిన్స్‌లోనే ఉన్న రాస్ ఇసా పోర్టుపై అమెరికా రెండు రోజుల క్రితం చేపట్టిన దాడుల్లో 80 మంది మృతి చెందారు. 150 మందికి గాయాలయ్యాయి. అమెరికా బలగాలు శనివారం రాజధాని సనాలోని రెండు ప్రాంతాలపై జరిపిన దాడుల్లో ముగ్గురు చనిపోగా నలుగురు గాయపడినట్లు అల్ మసీరాహ్ తెలిపింది. అమెరికా ఎన్ని దాడులు చేసినా తాము వెనక్కి తగ్గేది లేదని హౌతీలు ప్రకటించారు. గాజాలోని పాలస్తీనియన్లకు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యానికి ఎంతో కీలకమైన ఎర్ర సముద్రంలో ప్రయాణించే పశ్చిమదేశాల నౌకలపై హౌతీలు ఇప్పటివరకు 100కు పైగా దాడులు జరిపారు. దీంతో, హౌతీల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజా దాడులకు శ్రీకారం చుట్టారు. ఈ దాడులపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాస్ ఇసా పోర్టుపై దాడి ఫలితంగా దెబ్బతిన్న ట్యాంక్‌ల నుంచి లీకైన చమురు ఎర్ర సముద్ర జలాలను కలుషితంగా మార్చే ప్రమాదముందన్నారు. ఈ దాడిలో ఐదుగురు ఐరాస సహాయక సిబ్బంది సైతం గాయపడ్డారన్నారు. యెమెన్ దిగుమతుల్లో 70 శాతం, మానవతాసాయంలో 80 శాతం రాస్ ఇసా, హొదైడా, అస్ సలీఫ్ పోర్టుల ద్వారానే జరుగుతుంటాయి. రాస్ ఇసాలో యెమెన్ ప్రధాన ఆయిల్ పైప్ లైన్‌కు టెర్మినస్‌తోపాటు, అత్యంత కీలక మౌలిక వనరులున్నాయని ఐరాస పేర్కొంది.

నేడే సతీసమేతంగా జె.డి.వాన్స్ రాక

భారత్‌లో నాలుగు రోజులపాటు పర్యటించబోతున్న అమెరికా ఉపాధ్యక్షుడు

- నేడు ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక సమావేశం
- భారత్–అమెరికా సంబంధాలు, వాణిజ్య ఒప్పందంపై చర్చించే అవకాశం
- వాన్స్ దంపతులకు విందు ఇవ్వనున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ సతీసమేతంగా భారత పర్యటనకు రాబోతున్నారు. భార్య ఉషా చిలుకూరి, ముగ్గురు పిల్లలు ఇవాన్, వివేక్, మిరాబెల్‌తో కలిసి ఆయన సోమవారం ఇటలీ నుంచి ఢిల్లీకి చేరుకుంటారు. దేశంలో మొత్తం నాలుగు రోజులపాటు పర్యటిస్తారు. అమెరికా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వాన్స్ దంపతులు ఇండియాకు వస్తుండడం ఇదే మొదటిసారి. ఉషా చిలుకూరి తెలుగు మూలాలున్న అమెరికా మహిళ అనే సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశ ఉత్పత్తులపై 26 శాతం ప్రతీకార సుంకాలు విధించడం, తర్వాత 90 రోజులపాటు వాయిదా వంటి పరిణామాల నేపథ్యంలో జె.డి.వాన్స్ ఇండియా పర్యటన ఎనలేని ప్రాధాన్యం సంతరించుకుంది. భారత ప్రధాని మోదీతో ఆయన భేటీ కాబోతున్నారు. ద్వైపాక్షిక, వాణిజ్య అంశాలపై ఇరువురు నేతలు చర్చించబోతున్నారు.

వ్యాపారం, వాణిజ్యం, టారిఫ్‌లు, ప్రాంతీయ భద్రత

వాన్స్ దంపతులకు ప్రధాని మోదీ ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సోమవారం సాయంత్రం విందు ఇవ్వనున్నారు. అంతకంటే ముందు ఇరువురు నేతలు సమావేశమవుతారు. అమెరికా–భారత్ మధ్య వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా చర్చలు జరుగుతాయని సమాచారం. ఇరు దేశాల నడుమ సంబంధాల పురోగతిని వారు సమీక్షిస్తారు. సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవడానికి అందుబాటులో ఉన్న అవకాశాలపై సంప్రదింపులు జరుపుతారు. వ్యాపారం, వాణిజ్యం, టారిఫ్‌లు, ప్రాంతీయ భద్రత వంటి కీలక అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. అత్యంత కీలకమైన ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై మోదీ–వాన్స్ భేటీలో ముందడుగు పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చర్చల్లో భారత్ తరఫున ప్రధాని మోదీతోపాటు విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా పాల్గొంటారని తెలిసింది. అమెరికా తరఫున వాన్స్‌తోపాటు ఐదుగురు సీనియర్ అధికారులు హాజరవుతారని సమాచారం

జైపూర్, ఆగ్రా సందర్శన

ఢిల్లీకి చేరుకున్న తర్వాత వాన్స్, ఉషా దంపతులు ప్రఖ్యాత స్వామినారాయణ్ అక్షర్‌ధామ్ ఆలయాన్ని దర్శించుకోనున్నారు. భారతీయ సంప్రదాయ హస్త కళాకృతులు విక్రయించే మార్కెట్‌ను సందర్శిస్తారు. ఐటీసీ మౌర్య షెరటాన్ హోటల్‌లో బస చేయబోతున్నారు. సోమవారం రాత్రి వారు రాజస్తాన్ రాజధాని జైపూర్‌కు చేరుకుంటారు. రామ్‌భాగ్ ప్యాలెస్‌లో బస చేస్తారు. మంగళవారం అమేర్(అంబర్) కోటతోపాటు రాజస్తాన్‌లోని ప్రఖ్యాత కట్టడాలను సందర్శిస్తారు. సాయంత్రం జైపూర్‌లోని రాజస్తాన్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఓ కార్యక్రమంలో వాన్స్ ప్రసంగిస్తారు. ట్రంప్ పాలనలో భారత్–అమెరికా సంబంధాలపై ఆయన అభిప్రాయాలు వెల్లడిస్తారని సమాచారం. బుధవారం వాన్స్ దంపతులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో చరిత్రాత్మక కట్టడం తాజ్‌మహల్‌ను సందర్శించబోతున్నారు. సాయంత్రం మళ్లీ జైపూర్‌కు తిరిగివెళ్తారు. వాన్స్ కుటుంబం జైపూర్ నుంచి గురువారం అమెరికాకు పయనమవుతుంది



వాటికన్ సిటీలో పోప్ ఫ్రాన్సిస్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్న జేడీ వాన్స్

హైడ్రోజన్ బాంబ్‌ను పరీక్షించిన చైనా

- రేడియోధార్మికత లేకున్నా అణుబాంబు స్థాయిలో విధ్వంసం సృష్టించే సత్తా
- రెండు సెకన్లలో 1,000 డిగ్రీ సెల్సియస్ వేడితో పరిసరాలను బూడిదచేసే బాంబు

బీజింగ్: రెండో ప్రపంచయుద్ధంలో రెండు అణుబాంబులను ప్రయోగించి యుద్ధంలో గెలవడంతోపాటు ఆనాటి నుంచి అగ్రరాజ్యం హోదాను కైవసం చేసుకున్న అమెరికా గురించి తెల్సిందే. అయితే ఇప్పుడు అలా అణుబాంబులను ప్రయోగిస్తే రేడియోధార్మికత ముప్పుతోపాటు అంతర్జాతీయ ఆంక్షలను ఎదుర్కొనే ఆస్కారముంది. ఒక దెబ్బకు రెండు పిట్టలు తరహాలో రేడియోధార్మికత వెలువర్చని, అత్యంత వినాశనం సృష్టించే అధునాతన బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. నాన్-న్యూక్లియర్ హైడ్రోజన్ బాంబ్‌ను చైనా పరీక్షించిందని 'సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్' ఒక సంచలన కథనాన్ని ప్రచురించింది. సుంకాల సమరంలో అమెరికాతో వాణిజ్యయుద్ధానికి దిగిన వేళ చైనా తన సైనికసత్తాను చాటడం గమనార్హం. ఈ వివరాలు 'ప్రొజెక్టైల్స్, రాకెట్స్, మిస్సైల్స్, గైడెన్స్' జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి.

శుద్ధ ఇంధన సాంకేతికతతో..

చైనా ప్రభుత్వ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్‌లోని '705 రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ రెండు కేజీల బరువైన హైడ్రోజన్ బాంబును తయారుచేసింది. అణుబాంబు మాదిరికాకుండా తక్కువ స్థలంలో ఎక్కువగా ఘన హైడ్రోజన్‌ను తనలో ఇముడ్చుకునే మెగ్నీషియం హైడ్రైడ్‌ను ఈ బాంబులో వాడారు. రేడియోధార్మికతను వెదజల్లకుండా వినాశనం సృష్టించే లక్ష్యంతో శుద్ధ సాంకేతికతతో ఈ హైడ్రోజన్ బాంబును సృష్టించారు. ఈ బాంబు పేలితే మెగ్నీషియం హైడ్రైడ్ పొడి చుట్టూతా పరిసరాల్లో పరుచుకుంటుంది. దాన్నుంచి హైడ్రోజన్ వాయువు ఉద్భవించి రెప్పపాటులో పేలుళ్లు సంభవిస్తాయి. ఇవి భయంకర ట్రైనైట్రోటోలిన్(టీఎన్‌టీ) బాంబు పేలినదానికంటే 15 రెట్లు అధిక వినాశనం కల్గిస్తాయి. ఈ పరిసరాల ఉష్ణోగ్రత కేవలం రెండు సెకన్లలోనే 1,000 డిగ్రీ సెల్సియస్‌కు చేరుకుంటుంది. అంటే బాంబును ప్రయోగించిన చోట శత్రు దేశ ఆయుధాగారాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, వంతెనలు ఉంటే సెకన్లలోనే ధ్వంసమవడం, కాలి బూడిద కుప్పలుగా మారడం ఖాయం. బాంబు పేలినప్పుడు కేవలం రెండు మీటర్ల దూరంలో ఏకంగా 428.43 కిలోపాస్కల్‌ల పీడనం ఏర్పడిందని దీంతో ఊహించనంత వినాశనం జరుగుతుందని సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తన కథనంలో పేర్కొంది.

నిశ్శబ్దంగా తయారీ

ఈ ఏడాది తొలినాళ్ల నుంచే మెగ్నీషియం హైడ్రైడ్ తయారీని చైనా మొదలెట్టింది. షాన్జీ ప్రావిన్సులో 150 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని ప్రారంభించింది. వాస్తవానికి రోజుకు కేవలం కొన్ని గ్రాముల మెగ్నీషియం హైడ్రైడ్‌ను మాత్రమే తయారుచేయగలం. అదికూడా అత్యంత జాగ్రత్తగా ల్యాబ్‌లలోనే తయారుచేయొచ్చు. కానీ చైనా భారీ స్థాయిలో ఉత్పత్తికి సిద్ధపడటం గమనార్హం.

డొనాల్డ్ ట్రంప్‌పై ప్రజాగ్రహం

- ఆయన నిర్ణయాలు, విధానాలను వ్యతిరేకిస్తున్న అమెరికన్లు
- అమెరికాను నాశనం చేయొద్దని డిమాండ్
- దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు
- ట్రంప్ రాచరిక పోకడలు ప్రదర్శిస్తున్నారని జనం మండిపాటు

వాషింగ్టన్: అమెరికాను మరోసారి గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు ఊపందుకుంటున్నాయి. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు అమెరికన్లకు ఎంతమాత్రం నచ్చడం లేదు. ట్రంప్ తీరును మెజార్టీ జనం తప్పుపడుతున్నారు. అమెరికాను నాశనం చేయొద్దని కోరుతున్నారు. అమెరికాలో రాచరికం లేదు, ట్రంప్ రాజు కాదు అంటూ జనం గొంతెత్తి నినదిస్తుండడం గమనార్హం. ట్రంప్‌కు వ్యతిరేకంగా శనివారం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. జనం వీధుల్లోకి వచ్చి అధ్యక్షుడికి వ్యతిరేకంగా గొంతు విప్పారు. ప్లకార్డులు ప్రదర్శించారు. వైట్‌హౌస్ ఎదుట, టెస్లా కార్యాలయాల వద్ద, నగరాల్లోని ప్రధాన సెంటర్లలో జనం పెద్ద ఎత్తున గుమికూడారు. ట్రంప్ వ్యవహార శైలిపై ఆగ్రహం వెళ్లగక్కారు. చాలాచోట్ల ర్యాలీలు జరిగాయి. ఈ నిరసన ఉద్యమం '50501'గా పేరు పొందింది. '50 నిరసనలు, 50 రాష్ట్రాలు, ఒక ఉద్యమం' అనేదే దీని అర్థం. సరిగ్గా 250 ఏళ్ల క్రితం అమెరికాలో ఇదే రోజు విప్లవ యుద్ధం ఆరంభమైంది.

బ్రెగో గార్సియాను వెనక్కి రప్పించాలి

ప్రభుత్వ ఉద్యోగాల్లో కోతలు విధించడానికి, ప్రభుత్వ ఖర్చులు తగ్గించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) పేరిట ట్రంప్ ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ పట్ల అమెరికన్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. శనివారం నాటి ప్రజాందోళనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. ఎల్‌సాల్వెడార్ దేశానికి చెందిన బ్రెగో గార్సియా అనే వ్యక్తిని ప్రభుత్వం ఇటీవల బలవంతంగా స్వదేశానికి పంపించింది. ఈ ఉదంతాన్ని అమెరికన్లు తప్పుపట్టారు. గార్సియాను తిరిగి అమెరికాకు రప్పించాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌ను ఎల్‌సాల్వెడార్‌కు తరిమేయాలంటూ కొందరు తేల్చిచెప్పారు. ప్రజల నిరసనలు చాలావరకు శాంతియుతంగానే జరిగాయి. ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగినట్లు తెలియరాలేదు. 'నో కింగ్స్' అని రాసి ఉన్న ప్లకార్డులు జనం ప్రదర్శించారు. ట్రంప్ రాచరిక పోకడలు ప్రదర్శిస్తున్నారంటూ పరోక్షంగా మండిపడ్డారు.

ట్రంప్ పనితీరుకు 45 శాతం సానుకూలత

మొదటి త్రైమాసికంలో ట్రంప్ పనితీరు పట్ల ఇటీవల నిర్వహించిన గ్యాలప్ సర్వేలో 45 శాతం మంది సానుకూలత వ్యక్తం చేశారు. తొలిసారిగా ఆయన అధ్యక్షుడైనప్పుడు తొలి త్రైమాసికంలో ఆయన పనితీరుకు 41 శాతం మంది అనుకూలంగా ఓటేశారు. అంటే ఈసారి ప్రజాదరణ కొంత పెరిగినట్లు స్పష్టమవుతోంది. కానీ, 1952 నుంచి 2020 దాకా అధ్యక్షులుగా పనిచేసిన నేతల తొలి త్రైమాసికం పనితీరుకు సగటున 60 శాతం జనామోదం లభించింది. అంటే వారితో పోలిస్తే ట్రంప్ వెనుకబడే ఉన్నారు. ఆయన జనవరిలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పుడు అప్రూవల్ రేటింగ్ 47 శాతంగా ఉన్నట్లు ఒక సర్వేలో తేలింది. అది ఇప్పుడు 43 శాతానికి పడిపోయింది.

విశ్రాంత డీజీపీ దారుణ హత్య

బెంగళూరులో సంచలనం



యశవంతపుర: కర్ణాటకలో సంచలనం చోటుచేసుకుంది. విశ్రాంత డీజీపీ ఓం ప్రకాశ్ (68) అనుమానాస్పద స్థితిలో చనిపోయారు. ఆదివారం బెంగళూరులోని హెచ్ఎస్ఆర్ లేఔట్ పోలీసుస్టేషన్ పరిధిలోని నివాసంలో ఆయన కత్తి పోట్లకు గురయ్యారు. శనివారం రాత్రి ఘటన జరగ్గా ఆదివారం ఉదయం బయటపడింది. ప్రకాశ్ భార్య పల్లవి ఈ విషయం బంధువులకు తెలపగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి చూడగా మూడంతస్తుల నివాసం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ఓ గదిలో ఓం ప్రకాశ్ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించారు. ఆయన శరీరంపై అనేక కత్తి గాట్లున్నాయి. కత్తితో పాటు ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనకు సంబంధించిన ఆయన భార్య పల్లవితోపాటు కుమార్తెను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విషయం తెల్సిన సీనియర్ పోలీసు అధికారులు ఆయన నివాసానికి తరలివచ్చారు. ఓం ప్రకాశ్ దంపతుల మధ్య కొంతకాలంగా ఆర్థిక సంబంధమైన గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. తనకు దగ్గరి వారి నుంచే ప్రాణహాని ఉన్నట్లు ప్రకాశ్ ఇటీవల కొందరు సన్నిహితులతో ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఘటనకు ప్రకాశ్‌కు సన్నిహితులైన కుటుంబసభ్యులే కారణమై ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయన కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు. ప్రకాశ్ బిహార్‌లోని చంపారన్ వాసి. అక్కడే జియాలజీలో పీజీ చేశారు. 1981లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. బళ్లారిలో ఏఎస్పీగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన కెరీర్‌లో పూర్తికాలం కర్ణాటకలో పనిచేశారు. భత్కల్ మత కలహాల నివారణ సహా పలు ముఖ్య ఆపరేషన్లలో పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఆకస్మిక వర్షాలు

ముగ్గురు మృతి, 100 మందిని కాపాడిన పోలీసులు



ఆకస్మిక వరద, బురదలో కూరుకుపోయిన వాహనాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో ఆదివారం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో జనజీవనం స్తంభించింది. వివిధ ఘటనల్లో ముగ్గురు చనిపోయారు. 100 మందిని పోలీసులు రక్షించారు. సెరి బగ్నా గ్రామంలో కురిసిన కుండపోత వాన, వరదల్లో ముగ్గురు మృతి చెందారు. గ్రామంలో రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. దీంతో, రెండు రోజుల వ్యవధిలో వర్షాలకు సంబంధించిన ఘటనల్లో కశ్మీర్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఐదుకు చేరింది. శనివారం రియాసీ జిల్లా అర్నాస్‌లో పిడుగుపాటుకు గురై ఇద్దరు చనిపోయారు. రాంబన్ జిల్లా ధరంకుండ్ గ్రామంలో ఆదివారం సంభవించిన ఆకస్మిక వరదలతో 40 నివాసాలు పూర్తిగా, 10 ఇళ్లు పాక్షికంగానూ దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. పోలీసులు వరదల్లో చిక్కుకున్న 100 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాశ్రి, బనిహాల్ మధ్య దాదాపు డజను చోట్ల కొండచరియలు, బురద చరియలు విరిగిపడటంతో జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. పంథియాల్ వద్ద రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనదారులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. వాతా వరణం మెరుగుపడే వరకు జాతీయ రహదారిపై ప్రయాణాలు మాను కోవాలని ప్రజలకు సూచించారు. దాదాపు 250 కిలోమీటర్ల పొడవైన హైవేపై ప్రస్తుతం వందలాదిగా వాహనాలు నిలిచిపోయా యన్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం ı 21 ı ఏప్రిల్ ı 2025



కోల్‌కతా కాప్స్ వర్సెస్..

ఓ మోసగాడి అరెస్టు విషయంలో కోల్‌కతా కాప్స్ వర్సెస్ హైదరాబాద్ పోలీసు అనే పరిస్థితి నెలకొంది. జస్విందర్ సింగ్‌ను నగర పోలీసులు అరెస్టు చేశారు. -8లో



జంతుప్రేమికులూ.. జర భద్రం!

వీధి కుక్కలు, పిల్లులు, పక్షులు వంటి జీవులకు ఆహారం పెడుతున్నారా? కాస్త ఆలోచించండి. చట్టం, పర్యావరణ పరంగా పరిమితులు, నిబంధనలున్నాయని తెలుసుకోండి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
39.0/26.0

వాతావరణం

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 26 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

క్రికెట్ ఆడుతూ

కుప్పకూలాడు

గుండెపోటుతో యువకుడి మృతి



ప్రణీత్ (ఫైల్)

కీసర: మైదానంలో క్రికెట్ ఆడుతూ ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఆదివారం రాంపల్లిదాయరలో చోటుచేసుకుంది. కీసర సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఎం.ప్రణీత్ (32) కెనరా బ్యాంకులో పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్నేహితులతో కలిసి రాంపల్లిదాయర సమీపంలోని మైదానంలో క్రికెట్ ఆడుతుండగా ఆకస్మాత్తుగా కిందపడిపోయాడు. వెంటనే స్నేహితులు సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. ప్రణీత్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడటానికి వచ్చి గుండెపోటుతో మృతి చెందడంతో ప్రణీత్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కీసర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వరి టెంపుల్‌లో ప్రత్యేక ప్రార్థనలు




కల్వరి టెంపుల్‌కు 'ఈస్టర్' కళ!

కల్వరి టెంపుల్ వద్ద భక్తుల కోలాహలం



నగరంలో ఆదివారం ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. క్రీస్తు పునరుత్థానం సందర్భంగా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. - చందానగర్

జీసస్ పునరుత్థాన దృశ్యం



మాయా జూదం!

- గెలిచినప్పటికీ డబ్బు వెనక్కు తీసుకోలేని పరిస్థితి
- ప్రధాన సూత్రధారులందరూ చైనీయులే
- సిట్ ఏర్పాటు చేసినా సాగుతున్న దందా
- మూడు రోజుల్లో ఒకరి ఆత్మహత్య.. మరొకరి హత్య

ప్రత్యేక ఆల్గర్‌థెమ్‌తో పని చేస్తున్న బెట్టింగ్ యాప్స్



సాక్షి, సిటీబ్యూరో: అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం ఆత్మహత్య చేసుకున్న పవన్.. షాద్‌నగర్ ఠాణా పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చిన సాయిరాహుల్ హత్య.. మూడు రోజుల వ్యవధిలోనే ఈ రెండు దారుణాలకు బెట్టింగ్ యాప్సే కారణం. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసినప్పటికీ... వీటి కార్యకలాపాలు మాత్రం ఆగట్లేదు. ఈ బెట్టింగ్, గేమింగ్స్ యాప్స్ వెనుక చైనీయులే ఉంటున్నారు. ఉత్తరాదిలోని మెట్రో నగరాల కేంద్రంగా, స్థానికులతో షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి దందా నడిపిస్తున్నారు. ప్రత్యేక ఆల్గర్‌థెమ్ ఆధారంగా పని చేసే ఈ యాప్స్ నిర్వాహకులకే లాభం చేకూర్చేలా పని చేస్తుంటాయి. వీటిలో డబ్బు వేయడానికి పరిమితులు లేకపోయినా.. డ్రా చేసుకోవడానికి మాత్రం పరిమితులు ఉంటాయి. ఇలా గెలిచినా, ఓడినా ఆ మొత్తం తమ అధీనంలోనే ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

మరో రెండు ప్రాణాలు బలి..

సీరియర్ ఐపీఎస్ అధికారి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రారంభించిన 'హ్యాష్ ట్యాగ్ సే నో టు బెట్టింగ్ యాప్స్' ప్రచారం తర్వాత ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్స్ కేసుల దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసింది. అయినప్పటికీ యాప్స్ తమ కార్యకలాపాలు మాత్రం ఆపలేదు. ఇప్పటికీ కొన్ని యాప్స్ ఆన్‌లైన్ ద్వారా తమ ప్రచారం కొనసాగిస్తున్నాయి. బెట్టింగ్‌కు బానిసగా మారిన యువకుడు అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నాళ్లుగా ఈ బెట్టింగ్‌కు అలవాటుపడిన పవన్ స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి డబ్బు తీసుకున్నాడు. చివరకు తాను ఎంతో ముచ్చటపడి ఖరీదు చేసుకున్న బుల్లెట్, ఐఫోన్ సైతం అమ్మేశాడు. బెట్టింగ్ విషయంలో నగరంలోని ఓ హాస్టల్‌లో ఉంటున్న సాయి రాహుల్, వెంకటేష్ మధ్య ఏర్పడిన వివాదం రాహుల్ ప్రాణాలు తీసే వరకు వెళ్లింది.

ఓ చోట కంపెనీ, మరోచోట అకౌంట్లు..

ఈ గేమింగ్ యాప్స్‌లో లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. ఈ నేపథ్యంలో కరెంట్ బ్యాంకు ఖాతాలు నిర్వాహకులకు అనివార్యం. చైనీయులకు నేరుగా ఖాతాలు తెరిచే అవకాశం లేకపోవడంతో దళారుల ద్వారా ఉత్తరాదికి చెందిన వారిని సంప్రదిస్తున్నారు. డమ్మీ డైరెక్టర్లను ఏర్పాటు చేసి షెల్ కంపెనీలు రిజిస్టర్ చేయించుకుంటున్నారు. ఓ నగరంలో కంపెనీ రిజిస్టర్ చేస్తే.. మరో నగరంలో దాని పేరుతో బ్యాంకు ఖాతాలను తెరుస్తున్నారు. డమ్మీ కంపెనీల పేరుతో వెబ్‌సైట్స్‌ను రిజిస్టర్ చేస్తున్నారు. వీటి ముసుగులోనే బెట్టింగ్, గేమింగ్ యాప్స్ నిర్వహిస్తున్నారు. ఆ కంపెనీల పేరుతోనే పేమెంట్ గేట్‌వేస్ అయిన కాష్ ఫ్రీ, పేటీఎం, రేజర్ పే, ఫోన్ పే, గూగుల్ పేలతో లావాదేవీలకు ఒప్పందాలు చేసుకున్నారు.

లింకుల ద్వారానే యాప్స్ చలామణి..

ఈ యాప్స్‌ను నిర్వాహకులు ప్లేస్టోర్ లేదా యాప్ స్టోర్స్‌లో హోస్ట్ చేయట్లేదు. కేవలం టెలిగ్రాం, వాట్సాప్ గ్రూపుల ద్వారా లింకుల రూపంలో మాత్రమే చలామణి చేస్తున్నారు. ఈ లింకు ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత యాక్టివేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆపై అందులో నగదు నింపడాన్ని లోడింగ్‌గా పిలుస్తారు. ఒక వ్యక్తి, ఒక రోజు ఎంత మొత్తమైనా లోడ్ చేసుకోవచ్చు. ఎదుటి వ్యక్తికి తమ గేమ్‌కు బానిసలుగా మార్చడానికి గేమింగ్ కంపెనీలు పథకం ప్రకారం వ్యవహరిస్తున్నాయి. ఈ గేమ్స్ అన్నీ వాటి నిర్వాహకులు రూపొందించిన ప్రత్యేక ఆల్గర్‌థెమ్ ద్వారా నడుస్తుంటాయి. దాని ప్రకారం గేమ్ ఆడటం కొత్తగా ప్రారంభించిన వారి ఐపీ అడ్రస్ తదితర వివరాలను నిర్వాహకులు సంగ్రహిస్తారు. దీని ఆధారంగా తొలినాళ్లల్లో దాదాపు ప్రతి గేమ్‌లోనూ వాళ్లే గెలిచేలా చేసి బానిసలుగా మారుస్తారు. ఆపై గెలుపు–ఓటములు 3:7 రేషియోలో ఉండేలా ఆల్గర్‌థెమ్ పని చేస్తుంది.

రోజుకు విత్‌డ్రా రూ.500..

ఈ బెట్టింగ్, గేమింగ్‌లో ఓ వ్యక్తి ఎంత మొత్త గెలిచాడనేది ఆయా యాప్స్‌కు సంబంధించిన వర్చువల్ అకౌంట్లలో కనిపిస్తూ ఉంటుంది. ఆ మొత్తాన్ని గేమింగ్‌లో వెచ్చించడానికి పరిమితులు ఉండవు. విత్‌డ్రా చేసుకోవడానికి ఆ మొత్తాన్ని తొలుత యాప్ నుంచి బ్యాంకు ఖాతాలోకి బదిలీ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి మాత్రం నిర్వాహకులు పరిమితులు విధిస్తున్నారు. కనిష్ఠంగా రూ.500 నుంచి రూ.1000 వరకు మాత్రమే విత్‌డ్రా చేసుకునే అవకాశం ఇస్తున్నారు. ఈ కారణంగా ఎవరైనా ఆయా గేమ్స్, బెట్టింగ్‌లో గెలిచినా.. డబ్బు డ్రా చేసుకోలేని పరిస్థితి ఉంటోంది. దీంతో అప్పటికే బానిసై ఉండటంతో ఆ మొత్తం వెచ్చించి ఆడటానికే ఆసక్తి చూపి నష్టపోతున్నారు. ఆర్థిక లావాదేవీలతో ముడిపడి ఉన్న ఆన్‌లైన్ గేమింగ్‌కు రాష్ట్రంలో అనుమతి లేదు. ఇక్కడ ఎవరైనా ఆ యాప్‌ను ఓపెన్ చేస్తే.. జీపీఎస్ ఆధారంగా విషయం గుర్తించే నిర్వాహకులు గేమ్‌కు అక్కడ అనుమతి లేదంటూ స్క్రీన్‌పై సందేశం కనిపించేలా చేస్తారు. అయితే ఫేక్ జీపీఎస్ యాప్స్‌ను ఇన్‌స్టల్ చేసుకుంటున్నారు.

నిద్ర మత్తు.. అతివేగం

- ఓఆర్ఆర్‌పై అదుపుతప్పిన కారు
- ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దుర్మరణం



ప్రమాద స్థలిలో భాను ప్రకాశ్, నళినికంత బిస్వాల్ మృతదేహాలు

దుండిగల్: ఓఆర్ఆర్‌పై వేగంగా దూసుకువచ్చిన కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు సాఫ్‌వేర్ ఇంజినీర్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన భాను ప్రకాశ్ (36), నళినికంత బిస్వాల్ (37)లు స్నేహితులు. వీరు తమ కుటుంబాలతో కలిసి రాజేంద్రనగర్ మంచిరేవులలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. వీరిద్దరు ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో మేడ్చల్ నుంచి పటాన్‌చెరు వైపు కారులో వస్తున్నారు. ఈ క్రమంలో మల్లంపేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భాను ప్రకాశ్, బిస్వాల్ అక్కడికక్కడే మృతి చెందారు. భాను ప్రకాశ్ భార్య సాయి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిద్రమత్తుతో పాటు అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు.

పాత కక్షలతో యువకుడి దారుణ హత్య



మనోజ్ (ఫైల్)

చైతన్యపురి: పాత కక్షలతో ఓ యువకుడిని కత్తితో పొడిచి దారుణంగా చంపేసిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. ఓల్డ్ నాగోల్ విలేజ్‌కు చెందిన వంగ మనోజ్ (21) శనివారం అర్ధరాత్రి సమయంలో స్నేహితుడు బండెల వంశీతో కలిసి నాగోల్ ఫ్లైఓవర్ సమీపంలోని ఓ రెస్టారెంట్ ముందు బైక్‌పై కూర్చుని టిఫిన్ చేస్తున్నాడు. అదే సమయంలో నాగోలు జైపురి కాలనీకి చెందిన సంజయ్ ముగ్గురు స్నేహితులతో కలిసి బైక్‌పై వచ్చి మనోజ్ మెడను గట్టిగా పట్టుకుని వెంట తెచ్చుకున్న కత్తితో కడుపులో పొడిచాడు. కింద పడిపోయిన మనోజ్‌ను మరో వ్యక్తి పట్టుకోగా పైన కూర్చుని చాకుతో గొంతుకోశాడు. అతని స్నేహితుడు వంశీ అడ్డుకోవటానికి ప్రయత్నించగా అతనిపైనా కత్తితో దాడి చేయటంతో గాయాలయ్యాయి. మనోజ్ రక్తపు మడుగులో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు.

రాజీ కుదుర్చుకున్నా..

మనోజ్, సంజయ్‌లు గతంలో స్నేహితులు. ఈ నేపథ్యంలోనే పోయిన ఏడాది ఏప్రిల్ నెలలో వీరి మధ్య గొడవ జరిగింది. సంజయ్‌పై కత్తితో దాడి చేయగా అప్పట్లో మనోజ్‌పై ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం కొన్ని రోజుల తర్వాత పెద్దల సమక్షంలో ఇద్దరి మధ్య రాజీ కుదిరింది. అయినా సంజయ్ పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న మనోజ్‌ను హతమార్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతుడి సోదరుడు మధు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సిటీలో వెదర్ అలర్ట్!

- వాతావరణంలో విభిన్న మార్పులు
- మధ్యాహ్నం వరకు ఎండలు..
- సాయంత్రం ఈదురు గాలులు, జడివానలు
- నగరంలో మూడురోజులుగా ఇదే వరస
- నగటున గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీల వరకు
- 20 డిగ్రీలకు పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రత



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో గత మూడు రోజులుగా భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. మధ్యాహ్నం వరకు మండుతున్న ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. ఆ తర్వాత వాతావరణంలో మార్పులతో పూర్తిగా చల్లబడుతోంది. ఇక వర్షం ప్రారంభమైతే అతలాకుతలం చేస్తోంది. భారీ ఈదురుగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చెట్లు విరిగిపడుతున్నాయి. వాహనాలు ధ్వంసమవుతున్నాయి. విద్యుత్ వైర్ల తెగిపడుతున్నాయి. రోజువారీగా సగటున గరిష్ఠ ఉష్ణోగ్రతలు సగటున 36 నుంచి 39 డిగ్రీల వరకు, కనిష్ఠంగా 26.5 నుంచి 20.8 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కి.మీ మేర వీస్తున్నాయి. అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి.

మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు..



నగరంలో ఉదయం 7 గంటల నుంచే ఎండ పెరుగుతోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టలేని పరిస్థితి. మరో వారం రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీలు దాటే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 కి.మీ ఎత్తులో కొనసాగిన ఉత్తర దక్షిణ ద్రోణి ఆదివారం ఈశాన్య మధ్య ప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ మీదుగా 0.9 కి.మీ ఎత్తులో కొనసాగుతుండటంతో వరుసగా మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

విద్యుత్ టవర్‌ను ఢీకొన్న ఇసుక లారీ.. డ్రైవర్ దుర్మరణం



బేతయ్య మృతదేహం

శామీర్‌పేట్: ఇసుక లారీ అదుపు తప్పి విద్యుత్ టవర్‌ను ఢీకొట్టడంతో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఆర్‌సీ పురంనకు చెందిన ఆశాల బేతయ్య (44) వృత్తిరీత్యా లారీ డ్రైవర్. కాళేశ్వరం నుంచి ఇసుక లోడ్‌తో ఆదివారం తెల్లవారుజామున రాజీవ్ రహదారి నుంచి నగరాకినికి వస్తున్నాడు. మార్గం మధ్యలో శామీర్‌పేట వద్ద ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే లారీ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి విద్యుత్ టవర్ పైకి దూసుకెళ్లింది. దీంతో విద్యుత్ టవర్ విరిగిపడి లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బేతయ్య తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. శామీర్‌పేట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన లారీ

ఆర్టీఏ పౌరసేవలకు

సాంకేతిక చిక్కులు

- ఓటీపీలు అందక పడిగాపులు
- తరచూ తలెత్తే తప్పిదాలతో జాప్యం



సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీఏ పౌరసేవలు సాంకేతిక చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. సకాలంలో ఓటీపీలు లభించక వాహనదారులు పడిగాపులు కాస్తున్నారు. రవాణా శాఖ అందజేసే అన్ని రకాల పౌరసేవలను ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చారు. వాటిలో కొన్నింటిని నేరుగా మొబైల్ ఫోన్ నుంచే పొందే సదుపాయం ఉంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'టీ–ఫాలియో' మొబైల్ యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చు. కానీ.. సాంకేతిక సమస్యలతో వాహనదారులకు ప్రత్యక్ష సేవలు లభించడం లేదు.

టీ–ఫాలియో ద్వారా 17 సేవలు..

- డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, బదిలీలు, ఫీజులు, పన్ను చెల్లింపులు, పర్మిట్‌లు, పర్మిట్‌ల పునరుద్ధరణ వంటి సుమారు 56 రకాల పౌరసేవలను రవాణాశాఖ 2016లో ఆధునికీకరించింది. పౌరసేవలు పొందేందుకు వాహన వినియోగదారులు మొదట ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని, ఫీజు చెల్లించి ఆ తర్వాత కేటాయించిన సమయానికి ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులను సంప్రదించాలి. రవాణా కార్యకలాపాలను సరళతరం చేయడంతో పాటు పారదర్శకతను పెంచేందుకు ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టారు. అంతేకాకుండా.. ఆ తర్వాత మరో అడుగు ముందుకేసి వీటిలో 17 రకాల పౌరసేవల కోసం వాహనదారులు ఆర్టీఏకు వెళ్లాల్సిన అవసరం లేకుండా మరింత సులభం చేశారు. ఇంట్లో కూర్చొని నేరుగా మొబైల్ ఫోన్ నుంచే వాటిని పొందేసదుపాయం అందుబాటులో ఉంది.
- లెర్నింగ్ లైసెన్సుల కాల పరిమితి పొడిగింపు, డ్రైవింగ్ లైసెన్సుల పునరుద్ధరణ, వాహన రిజిస్ట్రేషన్‌ల పునరుద్ధరణ, డూప్లికేట్ డాక్యుమెంట్‌లను తీసుకోవడం, వాహనాలు, లైసెన్సుల చిరునామా బదిలీలు, నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) వంటి 17 రకాల సేవలను మొబైల్ ఫోన్ నుంచే పొందే సదుపాయం ఉంది. మొదట్లో విజయవంతంగా అమలయ్యాయి. ఆర్టీఏ ఆఫీస్‌కు నేరుగా రాలేనివాళ్లు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. కానీ.. గత ప్రభుత్వం అన్ని రకాల పౌరసేవల కోసం ప్రవేశపెట్టిన 'టి–ఫాలియో' మొబైల్ యాప్‌తో ఈ 17 సేవలను అనసంధానం చేసిన తర్వాతే ఆటంకాలు మొదలయ్యాయి.

జాడ లేని ఓటీపీలు..

- సాధారణంగా పౌరసేవను ఎంపిక చేసుకున్న వెంటనే వాహనదారుడి మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీ నంబర్‌ను నమోదు చేసిన తర్వాత మాత్రమే ముందుకెళ్లేందుకు అవకాశం ఉంటుంది. కానీ తరచుగా సకాలంలో ఓటీపీలు లభించకపోవడంతో వినియోగదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. కొన్నిసార్లు ఫీజులు చెల్లించిన తర్వాత కూడా నిర్ధారణ కావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సంబంధిత డాక్యుమెంట్‌లు డౌన్‌లోడ్ కాకపోవడం మరో సమస్య. 'డ్రైవింగ్ లైసెన్సుల రెన్యువల్స్‌లో తరచుగా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. మొదట్లో ఓటీపీల వద్దనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒకవేళ ఆ దశను దాటుకొని ముందుకు వెళ్లి అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి, ఫీజులు చెల్లించిన తర్వాత రెన్యువల్ డాక్యుమెంట్‌లు లభించడం లేదు' అని బంజారాహిల్స్‌కు చెందిన శ్రీకాంత్ తెలిపారు.
- లెర్నింగ్ లైసెన్సుల కోసం ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి పరీక్షలకు హాజరు కావాలి. ఆరు నెలల్లోపు డ్రైవింగ్ పరీక్షలకు వెళ్లాలి. ఆ కాలపరిమితిలో వెళ్లలేని వాళ్లు గడువు పొడిగించుకోవచ్చు. మొదట ఒకే వాహనం నడిపేందుకు ఆసక్తి చూపిన వాళ్లు మరో కేటగిరీ వాహనాన్ని కూడా ఆన్‌లైన్‌లో జత చేసుకోవచ్చు. కానీ ఇలాంటి సేవలు కూడా సాంకేతిక ఇబ్బందులతో సకాలంలో లభించడం లేదని వినియోగదారులు చెబుతున్నారు. మరోవైపు టీ–ఫాలియో యాప్‌ను ఈ సేవ కేంద్రాలు నిర్వహించడం వల్లే సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే సాంకేతిక వైఫల్యాలను అధిగమించనున్నట్లు చెప్పారు.

2.36 కిలోల గంజాయి పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ధూల్‌పేట్ పురానాపూల్, ఆసిఫ్‌నగర్‌లలో రెండు చోట్ల జరిపిన దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు 2.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పురానాపూల్‌లోని ఒక ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు లభించిన సమాచారం మేరకు ఎస్టీఎఫ్ ఏ టీం పోలీసులు దాడి చేసి 1.206 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో చంద్రముఖి, ఆకాష్ సింగులను అరెస్ట్ చేసినట్లు ఎస్టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. అలాగే ఆసిఫ్ నగర్ బాలాజీ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మహమ్మద్ అఫ్జల్ అమిత్‌ను ఎస్టీఎఫ్ డీ టీం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద 1.16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని స్థానిక ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించారు.

కోణార్క్ రైలుకు ఎదురెళ్లి..

నాంపల్లి: జీవితంపై విరక్తి చెందిన ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో ఆదివారం చోటుచేసుకుంది. నాంపల్లి జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సుమారు 35 సంవత్సరాల వయసు కలిగిన ఓ గుర్తు తెలియని యువకుడు బోరబండ–హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ల మధ్యలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై బూడిద రంగు టీ షర్టు, నీలం రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 9848349544, 040–23202238 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అద్దె పేరుతో యూపీఐ మోసం

బంజారాహిల్స్: అద్దె పేరుతో యూపీఐ మోసానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ ఓల్డ్ సఫిల్‌గూడకు చెందిన వెంకటేషన్ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–14 నవోదయకాలనీలోని ఓ కంపెనీలో హెచ్ఆర్ విభాగంలో పనిచేస్తున్నాడు. వెంకటేషన్ నాగ్‌పూర్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుగోలు చేశాడు. దీనిని అద్దెకు ఇవ్వాలనే ఉద్దేశంతో మ్యాజిక్ బ్రిక్స్.కామ్‌లో నమోదు చేసుకున్నాడు. దీనిని చూసిన ఆశిష్‌కుమార్ పరహరి అనే వ్యక్తి సదరు 2బీహెచ్‌కే ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుంటానని చెప్పాడు. తాను భారత సైన్యానికి చెందిన వాడినని, తాను నాగ్‌పూర్‌కు బదిలీ అయినందున అక్కడకు మకాం మార్చాలనుకుంటున్నానని చెప్పాడు. ఆశిష్‌కుమార్ తన ఆధార్‌కార్డుతో పాటు భారత సైన్యం ఐడీ కార్డు వంటి వివరాలను కూడా పంపించాడు. ఇండియన్ ఆర్మీ నుంచి రాజేంద్రసింగ్ షెకావత్ మీ అకౌంట్‌కు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఫోన్ చేస్తారని కూడా చెప్పాడు. అయితే ముందుగా ఒక రూపాయిని తనకు యూపీఐ ద్వారా పంపించాలని కోరాడు. ఆ తర్వాత అతని అకౌంట్ ద్వారా రూ.5 ట్రాన్స్‌ఫర్ చేశాడు. ముందుగా మాట్లాడుకున్న దాని ప్రకారం మూడు నెలలు అద్దె రూ.51వేలు ఆశిష్‌కుమార్ చెల్లించాల్సి ఉంది. కానీ సైబర్ టోకరా కారణంగా వెంకటేషన్ ఖాతా నుంచే రూ.51 వేలు బదిలీ కాగా, ఆశిష్‌కుమార్ అకౌంట్ నుంచి తిరిగి రాలేదు. దీంతో తాను మోసపోయాయని గ్రహించి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోల్‌కతా కాప్స్ వర్సెస్ హైదరాబాద్ పోలీస్



రూ.75 లక్షలు మోసం కేసులో నిందితుడిగా జస్బిందర్

- అక్కడకు వెళ్లి అరెస్టు చేసుకొచ్చిన గోల్కొండ పోలీసులు
- దీనిపై షేక్స్పియర్ సరానీ ఠాణాలో కిడ్నాప్ కేసు నమోదు
- తమకు ముందస్తు సమాచారం లేదంటున్న ఆ అధికారులు
- సమాచారం ఇస్తే ఫలితాలు తారుమారని చెప్తున్న సిటీ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో/గోల్కొండ: ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్–సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య పోరు మాట అటుంచితే...ప్రస్తుతం ఓ మోసగాడి అరెస్టు విషయంలో కోల్‌కతా కాప్స్ వర్సస్ హైదరాబాద్ పోలీసు అనే పరిస్థితి వచ్చింది. గోల్కొండ పోలీసుస్టేషన్‌లో నమోదైన మోసం కేసులో నిందితుడు జస్బిందర్ సింగ్‌ను నగర పోలీసులు గురువారం కోల్‌కతాలో అరెస్టు చేసి తీసుకువచ్చారు. ఇది కిడ్నాప్ అంటూ అతడి స్నేహితుడు ఇచ్చిన సమాచారంతో అక్కడి షేక్స్పియర్ సరానీ ఠాణాలో కిడ్నాప్ కేసు నమోదైంది. ఈ నిందితుడి అరెస్టుపై తమకు ముందస్తు, తదనంతర సమాచారం లేదని కోల్‌కతా అధికారులు చెప్తుండగా..అలా సమాచారం ఇస్తే ఫలితాలు తారుమారు అవుతున్నాయని నగర పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

నగర వ్యాపారిని మోసం చేసిన కేసు...

నగరంలోని సౌత్ వెస్ట్ జోన్ పరిధిలో ఉన్న గోల్కొండకు చెందిన సాజిద్ అహ్మద్ ఖాన్ అల్కాపూర్‌లో దుకాణం నిర్వహిస్తున్నారు. కొన్నాళ్ల క్రితం ఇరువురు తన స్నేహితుడి ద్వారా ఖాన్‌ను పరిచయం అయ్యారు. ఈయన వ్యాపారాల లావాదేవీలు, విస్తరణపై ఉన్న ఆసక్తిని తెలుసుకున్నారు. ఫుడ్ ప్రొడక్ట్స్ వ్యాపారంలో ఉన్న హల్దీరామ్స్ సంస్థ డీలర్‌షిప్ ఇప్పిస్తామంటూ ఖాన్‌ను నమ్మించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసే దళారి అంటూ కోల్‌కతాకు చెందిన జస్బిందర్ సింగ్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సింగ్ చెప్పినట్లే ఆయన కంపెనీకి చెందిన ఖాతాలోకి ఖాన్ ఈ నెల 9న రూ.75 లక్షలు బదిలీ చేశారు. ఆపై సింగ్‌తో సహా అందిరి ఫోన్లు స్విచ్ఛాఫ్ కావడంతో తాను మోసపోయినట్లు ఖాన్ గ్రహించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గోల్కొండ పోలీసులు ఈ నెల 13న కేసు నమోదు చేసుకున్నారు. ఇందులో జస్బిందర్ సహా నలుగురిని నిందితులుగా చేర్చారు.


జస్బిందర్ సింగ్

అరెస్టు విషయంలో ఏర్పడిన వివాదం...

ఈ కేసు దర్యాప్తులో భాగంగా గోల్కొండ పోలీసులు నిందితుల ఆచూకీ ఆరా తీశారు. సాంకేతిక ఆధారాలను బట్టి హౌరాకు చెందిన సింగ్ కోల్‌కతాలోని కామిక్ స్ట్రీట్‌లో ఉన్న ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించారు. నగరం నుంచి వెళ్లిన ప్రత్యేక బృందం గురువారం ఉదయం ఆ హోటల్‌లోని రూమ్ నెం.418లో ఉన్న సింగ్‌ను అరెస్టు చేసి తీసుకువచ్చారు. దీనిపై సింగ్ స్నేహితుడు, జార్ఖండ్‌కు చెందిన అజిత్ కుమార్ దాస్ సమాచారంతో షేక్స్పియర్ సరానీ పోలీసులు 'హైదరాబాద్ పోలీసులుగా చెప్పుకున్న వ్యక్తుల'పై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఈ అరెస్టుపై తమకు ముందస్తు, తదనంతర సమాచారం లేదని ఆ పోలీసులు చెప్తున్నారు. హోటల్ నిర్వాహకుడు చెప్పిన వివరాల ప్రకారం ఆ వ్యక్తులు గోల్కొండ పోలీసులుగా భావిస్తూ షేక్స్పియర్ సరానీ అధికారులు ఈ–మెయిల్ ద్వారా సమాచారం అడిగారు. దీంతో తామే చీటింగ్ కేసులో సింగ్‌ను అరెస్టు చేసినట్లు నగర అధికారులు జవాబు ఇచ్చారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇలా అరెస్టు చేయడం చట్ట వ్యతిరేకం అని కోల్‌కతా పోలీసులు ఆరోపిస్తున్నారు.


నిందితుడిని అరెస్టు చేసిన హోటల్

వారికి చెప్తే వీళ్లు చెక్కేస్తున్నారు...

ఇతర రాష్ట్రాల్లో నిందితుల అరెస్టు అనేది సర్వసాధారణమే. ప్రధానంగా చీటింగ్ కేసులతో పాటు సైబర్ నేరాల్లో నిందితులుగా ఉన్న వారి కోసం గాలిస్తూ పోలీసులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక అనుమతి తర్వాతే ఇలా వెళ్తారు. గతంలో ఇలా వెళ్లిన బృందాలు కచ్చితంగా అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి, వారితో కలిసి నిందితుల వద్దకు వెళ్లేవి. అయితే కొన్నాళ్లు ఇలా సమాచారం ఇచ్చిన వెంటనే ఆ విషయం నిందితులకు తెలిసిపోతోంది. ఆ వెంటనే అజ్ఞాతంలోకి వెళ్లిపోతున్న కేటుగాళ్లు నగర పోలీసులను ముప్పతిప్పలు పెడుతున్నారు. దీంతో తమ పంథా మార్చిన నగర పోలీసులు రహస్యంగా వెళ్లి నిందితుల్ని పట్టుకుంటున్నారు. ఇలా అరెస్టు చేసినప్పుడు పరిస్థితుల్ని బట్టి అక్కడి కోర్టులో హాజరుపరిచి పీటీ వారెంట్‌పై తీసుకురావడమో... నేరుగా తీసుకువచ్చి ఇక్కడి కోర్టులో హాజరుపరచడమో చేస్తున్నారు. జస్బిందర్ సింగ్ అరెస్టు విషయంలోనూ తాము నిబంధనలు పాటించామని, కోల్‌కతా పోలీసుల కేసును చట్ట పరంగా ఎదుర్కొంటామని సిటీ అధికారులు చెప్తున్నారు.

ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమం

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని కర్నాటి మనోహర్ కాంప్లెక్స్‌లో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో మండలాన్ని విలీనం చేస్తే కలిగే లాభాల గురించి ప్రజలకు తెలియజేసేందుకు త్వరలో జేఏసీ ఆధ్వర్యంలోభారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉద్యమం చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు మహేశ్వరాన్ని మహా నగరంగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహే శ్వరం మండలంలోని 2 గ్రామ పంచాయతీలనే ఫ్యూచర్ సిటీలో విలీనం చేసి ఇంకా 28 గ్రామ పంచాయతీలను విలీనం చేయకుండా వదిలేశారన్నా రు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరి గౌడ్, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, సీనియర్ నాయకలు అంధ్యా నాయక్, ఎద్మ మోహన్‌రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య, పోతర్ల సుదర్శన్, దత్తు నాయక్, జగన్‌రెడ్డి, సుభాష్, రమేష్, ఆనంద్ నాయక్ పలువురు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

హుడాకాంప్లెక్స్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచెన్న గారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు దేపభాస్కర్ రెడ్డి, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ భార్గవ్ రాములు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర ద్వారా దేశ ప్రజలను చైతన్యవంతం చేశారని గుర్తు చేశారు. 11 ఏళ్లగా రాజ్యాంగాన్ని రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. జనవరిలో పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్ యాదవ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చిక్కుళ్ల శివ ప్రసాద్, గుల్షన్, షఫీ, గంగమ్మ కిషోర్, యూనుస్, అజీజ్, సంతోష్ కుమార్, నాగరాజు, భాస్కర్, జంగారెడ్డి, చిన్నా యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని, దేశంలో మత విద్వేశాలు రెచ్చగొట్టేందుకు కుట్ర చేస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం తుక్కుగూడ పురపాలిక వ్యాప్తంగా కొనసాగుతుంది. ఆదివారం పుర పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు సమత, నాయకులు శివగళ్ల యాదయ్య, రాజు కుమార్, రాజు, ప్రశాంత్, స్వామి, రాజు, చంద్ర శేఖర్, అరుణ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి


మనోజ్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: మద్యం మత్తులో గ్రానైట్ గడపపై పడి ఓ వ్యక్తి మరణించిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ సత్యకుమార్ సమాచారం మేరకు... రాజస్తాన్‌కు చెందిన మనోజ్ (47) భార్య, పిల్లలతో కలిసి నగరానికి వచ్చి మైలార్‌దేవ్‌పల్లి వినాయక్‌నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో అతడి భార్య, పిల్లలు రాజస్తాన్ వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లోంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా మనోజ్ మద్యం మత్తులో బెడ్రూంలో బాత్రూం గ్రానైట్ గడపపై పడి తలకు రక్తగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

మహనీయుల స్ఫూర్తితో ఉద్యమబాట

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ఇబ్రహీంపట్నం: మహిళలు, దళిత, గిరిజన హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాతీయ నాయకురాలు టి.జ్యోతి అన్నారు. ఈనెల 14న ప్రారంభమైన «పూలే, అంబేడ్కర్ యాదిలో మహిళ హక్కుల పరిరక్షణ యాత్ర» రాష్ట్రంలో 18 జిల్లాల్లో కొనసాగింది. ఇబ్రహీంపట్నంలో ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా హక్కుల పరిరక్షణకు కృషిచేసిన మహనీయులైన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అనేక మంది వీరమణులు పోరాడి సాధించుకున్న మహిళా హక్కులు ప్రస్తుతం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ పాలనలో రాజ్యాంగం, మహిళల హక్కులను పక్కన పెట్టే పరిస్థితి దాపురించిందన్నారు. మనుధర్మాన్ని రాజ్యాంగ స్థానంలో అమలు పరిచే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మహిళలకు రక్షణ, ఉపాధి కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని పేర్కొన్నారు. మున్సిపల్, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికుల, మహిళల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఆశాలత, సరళ, నాగలక్ష్మి, శశికళ, సాయిలీల, వినోద, గీత, వరలక్ష్మి, అనురాధ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థిక స్వావలంబన

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఆదివారం శ్రీరామ రెడ్డి పొదుపు సంఘం ఐదోవార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు గొడెల్లి దామోదర్ రెడ్డి, అధ్యక్షుడు సూరెడ్డి నాగేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఉప కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి సురేందర్ రెడ్డి పర్యవేక్షణలో గడిచిన ఐదేళ్లలో పొదుపు వివరాలను పరిశీలించారు.

మృత్యుపాశాలు

- ప్రాణాలు తీస్తున్న విద్యుత్ తీగలు
- గత సంవత్సరం 69 మంది మృత్యువాత
- తాజాగా కొందుర్గు, శంషాబాద్‌లో విద్యుత్‌షాక్‌తో ఇద్దరి మృతి
- సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నా.. చర్యలు శూన్యం



గ్రేటర్‌లో విద్యుత్‌షాక్ మరణాలు

సర్కిల్	మృతులు
మేడ్చల్	15
రాజేంద్రనగర్	13
సైబర్‌సిటీ	12
సరూర్‌నగర్	12
బంజారాహిల్స్	04
హబ్సిగూడ	04
హైదరాబాద్ సెంట్రల్	04
హైదరాబాద్ సౌత్	03
సికింద్రాబాద్	02



భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఇటీవల కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్ల శివారులోని ఓ వ్యవసాయ పొలంలో విద్యుత్ స్తంభం నేలకూలి, వైర్లు తెగిపడ్డాయి. పర్వతాపూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి (35) అటు వైపు వెళ్లగా ప్రమాదవశాత్తు తెగిపడిన వైరు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సాధారణంగా వైర్లు తెగిపడిన వెంటనే ఫీడర్ ట్రిప్పై సరఫరా నిలిచిపోతోంది. కానీ ఇక్కడ అలా జరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

శంషాబాద్ మండలం పెద్దషాపూర్ రైల్వేట్రాక్ సమీపంలోని ఓ తోటలో ఇబ్రహీంపట్నానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కె.చేతన్‌రెడ్డి(26) మామిడికాయలు కోసేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

సాక్షి, సిటీబ్యూరో: వెలుగులు పంచాల్సిన విద్యుత్ తీగలు.. ప్రాణాలు తోడేస్తున్నాయి.. కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగుల్చుతున్నాయి.. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో ప్రమాదాల సంఖ్య తగ్గకపోగా మరింత పెరుగుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాతపడుతున్న వారిలో అధికంగా సంస్థతో సంబంధం లేని ప్రైవేటు కార్మికులు, సాధారణ ప్రజలే ఉంటుండటం విశేషం. గ్రేటర్ పరిధిలో గత సంవత్సరం ఏకంగా 69 మంది విద్యుతాఘాతలతో మృత్యువాత పడటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలల్లోనే అత్యధిక ప్రమాదాలు వెలుగు చూస్తుండటం గమనార్హం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో అనేక చోట్ల ఇళ్లపైనే వైర్లు వేలాడుతున్నాయి. భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు తెగిపడుతున్నాయి. తరచూ చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతున్నాయి. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్నాయి. వాటి చుట్టూ సరైన కంచె సహా ఎర్తింగ్ సిస్టం సరిగా లేకపోవడంతో సాధారణ పౌరులతో పాటు మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయి.

బయటివారితో విద్యుత్ పనులు

మెజార్టీ సెక్షన్ల పరిధిలో అనుభవం, అర్హత ఉన్న జూనియర్ లైన్‌మెన్‌లకు బదులు ఎలాంటి అనుభవం, అర్హత లేని ప్రైవేటు కార్మికులతో పని చేయిస్తున్నారు. విద్యుత్ లైన్లపై వీరికి సరైన అవగాహన కూడా ఉండటం లేదు. లైన్ల పునరుద్ధరణ, ఇతర మరమ్మతుల సమయంలో ఎల్సీ తీసుకున్నప్పటికీ.. గృహాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమల్లోని ఇన్వర్టర్లు/ జనరేటర్లు ఆన్‌లో ఉండటం వాటి నుంచి రివర్స్‌లో కరెంట్ సరఫరా కావడం తెలిసిందే. ఈ విషయం తెలియక కార్మికులు వాటిని ముట్టుకుని ప్రమాదాల బారిన పడుతున్నారు. వాస్తవానికి స్తంభాలు ఎక్కే ముందే టంగ్ టెస్టర్‌తో ఎర్తింగ్ చెక్ చేయాల్సి ఉంది. కానీ కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా ఏకంగా స్తంభాలు ఎక్కి సర్వీసు వైర్లు కలుపుతున్నారు. ఇప్పటి వరకు నమోదైన మృతుల్లో జేఎల్ఎంలు, ఆర్టిజన్లతో పాటు ప్రైవేటు కార్మికులే ఎక్కువగా ఉన్నట్లు డిస్కం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తీరా ప్రమాదాల్లో చనిపోయిన తర్వాత సంస్థ నుంచి వారికి ఎలాంటి బెనిఫిట్స్ కూడా అందడం లేదు. కార్మికుల మృతదేహాలను సబ్‌స్టేషన్ల ముందు పెట్టి ఆందోళన చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి, ప్రైవేటు కార్మికుల మరణాలకు కారణమైన సంబంధిత క్షేత్రస్థాయి అధికారులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవు.

ఉచిత సంగీత శిక్షణ

ఫిలింనగర్: అను మ్యూజిక్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకురాలు పూర్ణిమ తెలిపారు. ఈ నెల 23 నుంచి 30 వరకు ఫిలింనగర్‌లోని తమ అకాడమీలో దేశభక్తి, సంస్కృతి శ్లోకాలపై శిక్షణ ఇస్తామని పూర్తి వివరాలకు 9705058680 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్‌లో శిక్షణ


సయ్యద్ ముక్రం

పంజగుట్ట: ఫ్రెషర్స్ ప్లాట్‌ఫాం గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బికామ్ పూర్తిచేసిన విద్యార్థులకు ఫైనాన్షియల్ అకౌంటింగ్ ఎక్స్‌పర్ట్స్ పేరుతో ప్రత్యేక కోచింగ్ ఇస్తున్నట్లు సంస్థ సీఈవో సయ్యద్ ముక్రం తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాలా కంపనీలు కేవలం 100, 90 శాతం ఉన్నవారినే ఎంపిక చేసుకుంటున్నాయని 50 శాతం కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారికి కూడా తాను ఫైనాన్సియల్ అకౌంటింగ్‌లో శిక్షణ ఇస్తానన్నారు. ఈ శిక్షణ 10 రోజులు ఉంటుందని, శిక్షణ పూర్తిచేసుకోగానే ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

జీరాక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గౌరీ శంకర్

హిమాయత్‌నగర్: ప్రజలందరికీ సేవ చేయడమే లక్ష్యమని జీరాక్లబ్ అధ్యక్షుడు గౌరీ శంకర్ అన్నారు. జీరాక్లబ్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ రెడ్డి, శ్రీధర్ రావు, మురళీధర్, వినోద్ కుమార్, కమల్ కిషోర్ అగర్వాల్, మహమ్మద్ షరీఫ్, జగన్నాథం, శంకర్ పాల్గొన్నారు.

శ్రీ మాతా దేవాలయం పునఃప్రారంభం

పంజగుట్ట: ఎమ్.ఎస్ మక్తాలో శ్రీ మాతా దేవాలయం పునఃప్రారంభ వేడుకలకు సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ ఎ.మహేష్ యాదవ్ పూజలు చేసి ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణమ్మ, స్థానిక బస్తీ నాయకులు జకీర్, మధుకర్ యాదవ్, రోహిత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సన్మానం

హిమాయత్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర ధార్మిక సలహాదారుడిగా నియమితులైన ఆర్.గోవింద్ హరిని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

సైబర్ మోసం

-రూ.70 వేలు మాయం

బంజారాహిల్స్: తన ఖాతా నుంచి రూ.70 వేలు వేరే ఖాతాకు బదిలీ అయ్యిందంటూ బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్వరనగర్ కాలనీ నందినగర్‌కు చెందిన రమేష్‌రెడ్డికి రెండు వారాల క్రితం తాను పోలీసు అధికారినంటూ ఫోన్ వచ్చింది. మీరు మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డారని, ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. డబ్బులు చెల్లించకపోతే హైదరాబాద్ వచ్చి అరెస్టు చేసి ముంబాయి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తామని బెదిరించారు. ఈ విషయాన్ని రమేష్‌రెడ్డి అంతగా పట్టించుకోలేదు. ఆ తర్వాత అతని అకౌంట్ నుంచి రూ.70 వేలు వేరే అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ కావడంతో సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు. నిషా భగత్ అని పేరిట ఉన్న స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఖాతాకు డబ్బులు మళ్లినట్లు గుర్తించారు.

ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా బాలగంగిరెడ్డి



అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా బాలగంగిరెడ్డి నియమితులయ్యారు. సౌత్ జోన్ స్పెషల్ బ్రాంచిలో ఏసీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో బాలగంగిరెడ్డి చిలకలగూడ ఇన్స్‌పెక్టర్‌గా, సుల్తాన్‌బజార్ ఏసీపీగా బాధ్యతలు నిర్వహించారు. ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా ఉన్న వెంకటరమణ సిటీ సెక్యూరిటీ వింగ్‌కు అదనపు ఎస్పీగా పదోన్నతిపై బదిలీ గాకా ఆయన స్థానంలో ఏసీపీగా సీసీఎస్‌లో పనిచేసిన కిరణ్‌కుమార్ ఎస్ఆర్‌నగర్ ఏసీపీగా నియమితులై శనివారం కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యతలు చేపట్టకుండా వెనుదిరిగారు.దాంతో బాలగంగిరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఆయనకు స్వాగతం పలికారు.

ఒక యాప్..20 రకాల సేవలు..

అందుబాటులోకి టీజీఎస్‌పీడీసీఎల్ అప్లికేషన్

ఇంటి నుంచే ఫిర్యాదులూ చేయవచ్చు



బంజారాహిల్స్: విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న వారు సమయానికి నంబర్ దొరక్క, తమ సమస్య ఏ దశలో ఉందో తెలుసుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. అయితే ముఖ్యంగా కరెంటు మీటర్లలో లోపాలు ఉన్నా, బిల్లింగ్‌లో అవకతవకలు ఉన్నా.. వాటిని సరి చేసుకోవడానికి ఎవరిని సంప్రదించాలో తెలియక సతమతమవుతుంటారు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ వినియోగదారుల కోసం దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారుల సమయం, పనుల్లో పారదర్శకతను దృష్టిలో పెట్టుకుని ఒక యాప్‌లో 20 రకాల సేవలు పొందేలా వీలు కల్పించింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినా, బిల్లుల్లో సందేహాలు ఉన్నా, సిబ్బంది అందుబాటులో లేకపోయినా ఏ చిన్న సమస్య తలెత్తినా తమ చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌లో ఈ యాప్ ద్వారానే పరిష్కారం పొందే అవకాశాన్ని కల్పించారు. దీంతో విద్యుత్ వినియోగదారులకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చి ఇంట్లో కూర్చొనే తమ సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించింది.

మీటర్లలో లోపాలు ఉంటే..

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర సెక్షన్ల పరిధిలో ఈ మొబైల్ యాప్ అందుబాటులోకి వచ్చి 20 రకాల సేవలను అందిస్తోంది. నివాస గృహంలోని మీటర్ కోసం కొత్త సర్వీసు ఎలా పొందాలో తెలుసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న తర్వాత అది మంజూరైందా.. ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది. సర్వీసు సామర్థ్యం పెంచాలన్నా, మీటర్లలో లోపాలు ఉన్నా మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఇంటి నుంచి లేదంటే వ్యాపారం నుంచి గృహ కేటగిరికి మార్చుకునే అవకాశం ఉంటుంది. దానికి అనుగుణంగా యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రీడింగ్..

స్పాట్ బిల్లింగ్ చేసే వ్యక్తి సరైన సమయంలో రాకుంటే సొంతంగా బిల్లింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. తాను వినియోగించే విద్యుత్‌ను తానే లెక్కించుకునే అవకాశం కల్పించారు. ప్రతినెలా బిల్లులు చెల్లింపులు, గతంలో చెల్లించిన వివరాలు తెలుసుకోవచ్చు. తాజాగా వస్తున్న బిల్లులను ఈ యాప్ ద్వారా చెల్లించవచ్చు. సరఫరాలో లోపాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుకు పరిష్కారం ఏ దశలో ఉందో కూడా చూసుకోవచ్చు. పరిష్కారం సంతృప్తికరంగా లేకపోతే మళ్లీ ఫిర్యాదు చేయవచ్చు.

అధికారుల వివరాలు..

తమ పరిధిలోని విద్యుత్ అధికారుల వివరాలు కూడా ఈ యాప్‌లో పొందుబర్చారు. ఏ ప్రాంతానికి ఏ అధికారి బాధ్యుడిగా ఉన్నారో గుర్తించి నేరుగా సదరు సమస్య గురించి ప్రస్తావించి పరిష్కారం పొందవచ్చు. 20 రకాల సేవల ద్వారా సమస్యల పరిష్కారం ఉంటుండడమే కాకుండా ఫీల్డ్‌లో అధికారుల పనితీరు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఈస్టర్ వేడుకలతో ఆదివారం ఖైరతాబాద్ నియోజకవర్గంలోని చర్చిలన్నీ కళకళలాడాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీస్తు జననానికి సంబంధించిన నాటికలను కళాకారులు, యువత ప్రదర్శించారు. అనంతరం పాస్టర్ ఎం.ప్రభుదాస్ క్రీస్తు సందేశాన్ని అందించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.9లోని సెయింట్ ఆల్ఫోన్సస్ చర్చితో పాటు, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్‌లలో ఉన్న పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

హోసన్న షాలేమ్ చర్చిలో..

రహమత్‌నగర్: ఈస్టర్ పర్వదిన వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎస్పీఆర్‌హిల్స్ బ్రహ్మశంకర్ నగర్‌లోని హోసన్న షాలేమ్ చర్చిలో రెవరెండ్ కే. సురేష్‌బాబు నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రేమ విందును ఏర్పాటు చేశారు. బోరబండ పలు చర్చిల్లో ఈస్టర్ ప్రార్థనలు నిర్వహించారు.


హోసన్న షాలేమ్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ సురేష్‌బాబు

ప్రజా సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు


మాట్లాడుతున్న గండె సురేంద్రనాథ్

హిమాయత్‌నగర్ : రైతులు, సైనికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేస్తున్నాయని భారతీయ జవాన్ కిసాన్ పార్టీ(బీజేకేపీ) రాష్ట్ర అధ్యక్షులు గండె సురేంద్రనాథ్ ఆరోపించారు. సమస్యలను పరిష్కరించడానికి జై జవాన్ జై కిసాన్ నినాదంతో బీజేకేపీ అవతరించిందని అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షులు నారాయణ ప్రభాకర్ అంకుష్, జాతీయ సమన్వయకర్త సుదర్శీ మోహన రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేంద్రనాథ్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అరికట్టడం కోసం తమ పార్టీ పని చేస్తుందన్నారు. దేశం కోసం పోరాడిన సైనికులు, దేశానికి అన్నం పెట్టే రైతన్నలు అందరూ ఏకం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసేందుకు త్వరలోనే జిల్లా పర్యటనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు జగ్‌బీర్‌సింగ్, తెలంగాణ, ఏపీ నేతలు పి.సత్యప్రసాద్ రావు, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి, జి.ప్రశాంత్, డి.నారాయణ రెడ్డి, ఆర్.రజిత, ఆర్.సునీత, శివప్రసాద్ గౌడ్, ఎం.రాజయ్య, పి.నిరంజన్ రెడ్డి, ఎం.మాధవరెడ్డి, హనుమంతరావు, ప్రేమ్‌సింగ్ రాథోడ్, టి.మంజుల పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాట రూ.15, నల్లవంకాయ 18, బెండకాయ.35, పచ్చిమిర్చి 38, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 40, కాకరకాయ 32, పందిరిబీర 35, క్యాబేజ్ 9, క్యారెట్ 18, దొండకాయ 18, గుండు బీన్నీస్ 65, చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 15, దోసకాయ 13, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 18, కందగడ్డ 85, కాలీఫ్లవర్ 18, సొరకాయ 09, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 4, మామిడికాయ 40, ముల్లంగి 4-5, ఉల్లిపొరక 28. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా

బంజారాహిల్స్: జేఈఈ మెయిన్స్ ర్యాంకింగ్‌లో మాడ్యులస్ విద్యాసంస్థ విద్యార్థులు సత్తా చాటారని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో షార్ట్‌టర్మ్ క్లాస్‌రూమ్ ప్రోగ్రాం విద్యార్థులలో టాప్-100లో 5 మంది, టాప్ 200లో పది మంది వరకు విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. అధ్యాపకుల నైపుణ్యంతో పాటు మాడ్యులస్ సంస్థ బోధనా పద్ధతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడిందని పేర్కొన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం బీసీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు 11 ఏళ్ల కాలంలో ఏ ఒక్క బీసీ సమస్యనైనా కేంద్ర ప్రభుత్వం పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, రాష్ట్రపతి, ప్రధానమంత్రికి విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు.

కమర్షియల్ స్పేస్ లీజుకు ఇస్తామంటూ రూ.15.36 లక్షలు వసూలు

దంపతులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

బంజారాహిల్స్: కమర్షియల్ స్పేస్‌ను లీజుకు ఇస్తానని రూ.15.36 లక్షలు వసూలు చేసి లీజుకు ఇవ్వకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా భార్యాభర్తలు తనను బెదిరింపులకు గురి చేస్తున్నారంటూ ఓ వ్యాపారి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అబిడ్స్ చిరాగ్ అలీ లేన్‌లోని కరీమాబాద్ హౌసింగ్ సొసైటీకి చెందిన సికిందర్ దరేడియా వ్యాపారి. బర్కతాలీ భవానీ అనే కమిషన్ ఏజెంట్ ద్వారా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని శివశక్తిటవర్స్ నాలుగో అంతస్తులో 6,400 చదరపు అడుగుల విస్తీర్ణంలో లీజు నిమిత్తం భార్యాభర్తలతో గతేడాది సెప్టెంబర్ 14న ఒప్పందం కుదుర్చుకున్నాడు.

ఇంకా ఆ ఫ్లోర్‌లో టైల్స్, ఇతరత్రా పనులు జరగాల్సి ఉంది. అక్టోబర్ రెండో వారంలో పూర్తిచేసి అందిస్తామని సికిందర్ దరేడియాకు హామీనిచ్చి లీజు డీడ్ ప్రకారం రూ.15,36,000 కూడా చెల్లించాడు. ఇప్పటి వరకు భార్యాభర్తలు ఆ పనులను చేయించకపోగా కాలం వెళ్లదీస్తూ వస్తున్నారు. లీజు ఒప్పందం ప్రకారం స్పేస్ అద్దెకు ఇవ్వాలని, లేదంటే డబ్బులు తిరిగి ఇవ్వమని సికిందర్ దరేడియా ఆ దంపతులను కోరగా వారు బెదిరింపులకు గురిచేస్తుండడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీరభద్రుడు తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎంఎస్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మలిశెట్టి సీతారామ్ స్మారక వార్షిక సాహితీ పురస్కార మహోత్సవ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు జబ్బారి వేణుకి మలిశెట్టి సీతారామ్ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విశ్రాంత ఐఏఎస్ అధికారి చిన వీరభద్రుడు మాట్లాడుతూ..ప్రపంచ సాహిత్యం నేడు మనకు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రజలు సినిమాల నుంచి ఏమీ కోరుకోవడం లేదు కానీ తొక్కిసలాడుతూ..సినిమాలకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక అంశంపై రాసేటపుడు నిజం మాత్రమే రాయాలని రచయితపై ఎలాంటి ప్రభావం ఉండకూడదని సూచించారు. అనంతరం కథాప్రపంచం, లోపల ఏదో కదులుతుననట్లు సాక్షాత్కారం నవల పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్ నాయక్, సాహితీ వేత్త తాడి ప్రకాష్, కవులు యాకూబ్, కేపీ అశోక్‌కుమార్, ఎంఎస్ఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు మలిశెటి శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

26, 27 తేదీలలో అవార్డుల ప్రదానం

లిబర్టీ: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న నెట్వర్కింగ్ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ వెల్లడించారు. ఆదిలీలా ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పీపుల్ సెలెక్టెడ్ అవార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26, 27 తేదీల్లో ఫోర్ స్టార్ లగ్జరీ రిసార్ట్స్ గోవాలో అవార్డుల అందజేయనున్నట్లు వెల్లడించారు.

మద్యపానం నిషేధించాలి

లిబర్టీ: మద్యపానం నిషేధించి ప్రజల జీవితాలను కాపాడాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు కె.బి.శ్రీధర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లోనూ మద్యం నిషేధించి ఆర్థికంగా కుటుంబాలు నష్టపోకుండా ప్రజల జీవితాలను కాపాడే బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఈ సమావేశంలో పుష్పాంజలి, నాగిళ్ల నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన చైత్ర చంద్రిక వర్క్‌షాప్


ఔత్సాహిక కళాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాట్య గురువు

సుల్తాన్‌బజార్: శాస్త్రీయ సంగీత నృత్యాలు, లలిత కళలు, భారతీయ సాంస్కృతిలో భాగమని రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర అన్నారు. శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నవ్య నాటక సమితి నిర్వహించిన మూడు రోజుల చైత్ర చంద్రిక అభినయ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి.వసుంధర హాజరై ఔత్సాహిక కళాకారులకు వర్క్‌షాప్‌లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యువ కళాకారులందరూ మన సాంస్కృతిక రాయబారులన్నారు. అనేక మంది కళాకారులు ఉత్సాహ బరితంగా ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థ పక్షాన నాట్య గురువు స్వప్న సుందరిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా హేమ, లక్ష్మీమానస, మాధవి మాల, విజయ్‌కుమార్, బాలాజీ, కృష్ణ కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ వీధిలో స్పీడ్ బ్రేకర్లు

అల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి వివేకానందనగర్, రామకృష్ణ వీధిలోని మిత్రమండలి ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రగతి మహిళా కళాశాల యాజమాన్యం రవీందర్‌రావు, జి. ప్రసాద్, చంగల్‌రెడ్డి, శ్రీనివాసరావు, మహేష్ రెడ్డి, వెంకటేశ్వరరావుల సహకారంతో కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. త్వరలో ఇంకా మిగిలిన పనులు త్వరలో మొదలవుతాయని, రేడియం పెయింటింగ్ సైన్ బోర్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు.

రేపు పురస్కారాల ప్రదానం

పంజగుట్ట: సమీకృత (అంతర్జాతీయ) తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం (ఇట్‌క్లా) ఆధ్వర్యంలో ఈ నెల 22వ 'ఇట్‌క్లా-2025 విశ్వ తెలుగు వెలుగు పురస్కారాలు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇవ్వనున్నట్లు ఇట్‌క్లా అధ్యక్షుడు కె.ధర్మారావు తెలిపారు. తెలుగు భాషా సంస్కృతి పెంపొందించడం, కళలు, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులు ఇస్తున్నామన్నారు.

అఫ్జల్‌అలీ సేవలు అమోఘం


మాట్లాడుతున్న షేక్ హబీబ్ మియా

హిమాయత్‌నగర్ : దివ్యాంగుల అవసరాలకు అనుగుణంగా బైకులు, కార్లను ఆల్టేషన్ చేసి వారి జీవితాలలో వెలుగులు నింపిన మహనీయులు అఫ్జల్‌అలీ అని డిఫరెంట్లి ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబీబ్ మియా అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన అఫ్జల్‌అలీ సంస్మరణ సభలో షేక్ హబీబ్ మియా మాట్లాడారు. దివ్యాంగుల అభివృద్ధి కోసం తన జీవితం చివరి వరకు అఫ్జల్ అలీ సేవలు అందించారని కొనియాడారు. అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరబోయిన లక్ష్మయ్య, బొల్లం మహేందర్, ఎం.సుబ్రమ్మణ్యం, ఎన్.కృష్ణకుమార్, మొహమ్మద్ అమీనుద్దీన్, తాజాముల్ అఫ్జల్‌అలీ సమాజం పట్ల చూపిన త్యాగ నిరతి, సేవా గుణాన్ని కొనియాడారు. ఈ సమావేశంలో అఫ్జల్ సతీమణి సయ్యద్ ముజఫర్ సుల్తానా, కుమారుడు వాజిద్ అలీ, కూతుళ్లు సానియా అఫ్జల్, సనా అఫ్జల్, సోదరులు జాందార్ అలీ, జబీర్ అలీ, జరీనా బేగం పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన అధ్యాపకుల నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. రెండో రోజు వివిధ వర్సిటీలలో జరిగిన సమ్మె వివరాలను టీజీయూసీటీఏ జేఏసీ నాయకులు వివరించారు. ఓయూ పాలన భవనం ప్రవేశ ద్వారం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలతో నిరసన తెలిపారు. ఐఐటీ బాసరలో కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వర్సిటీలో కాంట్రాక్టు అధ్యాపకులు వారి కుటుంబ సభ్యులు, పిల్లలతో కలసి సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డా.ధర్మతేజ, డా.పరుశురామ్, డా.వేల్పుల కుమార్, డా.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సురేందర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఇంగ్లిష్ విభాగం పరిశోధక విద్యార్థి సురేందర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఇంగ్లిష్ విభాగం అధ్యాపకురాలు ప్రొ.మృదుల లక్కరాజు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సనత్‌నగర్: ఈజీ మనీ కోసం గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సనత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. ముంబాయికి చెందిన సునీల్‌కుమార్ శర్మ (36) నగరానికి వలస వచ్చాడు. క్యాటరింగ్ పనులు చేస్తూ రోజుకు రూ.500లు సంపాదించేవాడు. అయితే తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలంటే గంజాయిని విక్రయించాలనుకున్నాడు. ఆ మేరకు బీదర్ ప్రాంతం నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి సనత్‌నగర్, బాలానగర్ ప్రాంతాల్లో అవసరమైన వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు ఫతేనగర్ ప్రాంతంలో సికిందర్ మున్నా అన్సారీ అనే వ్యక్తికి గంజాయి విక్రయిస్తుండగా సనత్‌నగర్ పోలీసులు దాడులు నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు వారి నుంచి 170 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సునీల్‌కుమార్ శర్మతో పాటు కొనుగోలు చేసిన సికిందర్‌మున్నా అన్సారీని కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి : సీపీఎం


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అల్విన్‌కాలనీ: పెన్షనర్ల సంఘం నాయకులు ఎల్.డీ. ప్రసాద్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, సీపీఎం నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం హైదర్‌నగర్ శాఖ కార్యదర్శి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రసాద్ హెచ్ఎంటీలో పని చేస్తున్న సమయంలో కార్మిక ఉద్యమంలో చురుగ్గా పని చేశారన్నారు. ఎల్.డి. ప్రసాద్ నేత్ర దానం చేయటం ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డి.జి. నరసింహారావు, జిల్లా కార్యదర్శి పి. సత్యం, జనార్దన్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆర్. వరప్రసాద్, సీపీఎం కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ రెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మమతా గుప్తా సేవలు అభినందనీయం


మందుల పంపిణీ చేస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి, మమతా గుప్తా తదితరులు

అబిడ్స్: మాజీ కార్పొరేటర్, మమతా సంతోష్‌గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మమతా గుప్తా సేవలు అభినందనీయమని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం అబిడ్స్ నేతాజీ నగర్‌లో వైశ్య యూత్ అసోసియేషన్, మమతా సంతోష్‌గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంపును ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో మమతా సంతోష్‌గుప్తా కుటుంబం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. తరచు మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేద బడుగు వర్గాల కోసం పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ సంక్షేమానికి, సమాజ అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ కుమార్, మాజీ చీఫ్ జస్టిస్ భాస్కర్‌రావ్, సంతోష్‌గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న వారందరికీ ఉచితంగా మందులు అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో పంచమ వేద నాట్య నిలయం 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య గురువు ఆర్.కనకదుర్గ శిష్యబృందం వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నాట్య గురువు వేదాంతం రాధేశ్యామ్ ముఖ్యఅతిథిగా హాజరై కళాకరులు, చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, విశ్రాంత ఆచార్యలు ఆర్.ప్రసన్న రాణి, యువ కళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, విశ్రాంత భరతనాట్యం అధ్యాపకురాలు మంజులరాణి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హజ్ యాత్రికులకు ఆరోగ్యపరీక్షలు

గోల్కొండ: ఈ సంవత్సరం హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో సోమవారం నుంచి ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర హజ్ కమిటీ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేసిందని కాంగ్రెస్ సీనియర్ నేత హబీబ్ జైనులాబిదీన్ అబిద్ తెలిపారు. ప్రతిరోజూ 123 మందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంప్ ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.

గోవా విమానం ఆలస్యం

ప్రయాణికుల ఆందోళన



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి గోవా బయలుదేరాల్సిన విమానం ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఆదివారం ఉదయం గోవా నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన ఇండిగో విమానం ఆలస్యమైంది. దీంతో ఇక్కడి నుంచి ఉదయం 7 గంటలకు బయలుదేరాల్సిన విమానం వేళల్లోనూ అంతరాయం ఏర్పడింది. 8.30 గంటల వరకు కూడా అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. ఆ తర్వాత గోవా నుంచి విమానం రావడంతో ఉదయం 9 గంటలకు తిరిగి బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

రైల్వే ప్రయాణికురాలి నగలు, నగదు చోరీ

జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన రైల్వే పోలీసులు.. ఎల్‌బీనగర్ పీఎస్ బదిలీ

నాగోలు: మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి సికింద్రాబాద్‌కు రైలులో వచ్చిన ఓ ప్రయాణికురాలి బ్యాగులోని బంగారు, వెండి అభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆదివారం ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌కు కేసు బదిలీ చేశారు. వివరాలు... ఎల్‌బీనగర్ వాస్తు కాలనీలో నివాసం ఉండే పర్వీన్ బేగం ఎల్‌బీనగర్‌లోని దిశా హాస్పిటల్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. ఈ నెల 3వ తేదీన సికింద్రాబాద్ నుంచి మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. అక్కడ నుంచి రాత్రి సికింద్రాబాద్ స్టేషన్‌కు లగేజీతో వచ్చింది. అనంతరం ఆటోలో ఎల్‌బీనగర్‌లోని తన ఇంటికి చేరుకుంది. ఈ నెల 4న బ్యాగ్ తెరిచిచూడగా, అందులో ఉన్న మరో చిన్న బ్యాగ్ కనిపించలేదు.

దీంతో సికింద్రాబాద్‌లోని రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన బ్యాగులో ఉన్న 30 గ్రాముల బంగారు గొలుసు, 10 గ్రాముల బంగారు చెవి రింగులు, రెండు బంగారు ఉంగరాలు, వెండి నగలు, రూ. 25 వేల నగదు కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హవాలా నగదు తరలింపు.. ఇద్దరి అరెస్టు

రూ.4 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాల స్వాధీనం



ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

సుల్తాన్‌బజార్: రూ.4.50 లక్షల హవాలా నగదును అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను సుల్తాన్ బజార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఓ సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌చారి తెలిపిన వివరాల ప్రకారం... కోఠి హనుమాన్ టేక్డీలో హోండా యాక్టివా ద్విచక్ర వాహనాలపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు సుల్తాన్‌బజార్ పోలీసులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరుగులు తీశారు. ఎట్టకేలకు వారిని పట్టుకొని వాహనాలు తనిఖీలు చేయగా మహ్మద్ సమీ(31) అనే వ్యక్తి వద్ద రూ.4.50 లక్షలు దొరికాయి. వారి యజమాని పటేల్ లాలాభాయి సూచనల మేరకు ఈ హవాలా సొమ్మును రవాణా చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాయాబజార్ 2.0 అదుర్స్

- ఆటపాటలతో ఆకట్టుకున్న హెచ్‌సీయూ విద్యార్థులు
- ఏకబిగిన 9.30 గంటల పాటు కార్యక్రమ నిర్వహణ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)లో విద్యార్థులు సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమంతో కోలాహలం నెలకొంది. మాయా బజారు ప్రత్యక్షమైంది. ఏకబిగిన సుమారు పది గంటలపాటు విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఆడిపాడుతూ క్యాంపస్‌లో జోష్ నింపారు. విద్యార్థుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఆంపీ థియేటర్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు సంప్రదాయాన్ని చాటుతూ చేసిన ప్రదర్శనలు, డైలాగ్‌లు, కోలాటం, గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్‌సీయూ క్యాంపస్‌లో చదువుతున్న రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులంతా కలిసి 'మాయాబజార్ 2.0'పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజామున 4.30 గంటల వరకు ఈ కార్యక్రమం సాగింది. ఆంధ్రనాట్యం, కోలాటం, వివిధ రకాల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు., తెలంగాణ జానపద గీతాలతో కూడిన నృత్యాలు విద్యార్థులను కనువిందు చేశాయి. నాలుగేళ్ళ దీక్షిత అనే అమ్మాయి అనర్గళంగా ఆలపించిన శ్లోకం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అర్ధరాత్రి వేళ కార్యక్రమాలను తిలకిస్తున్న విద్యార్థులు తమ సెల్‌ఫోన్ల లైట్లను ఆన్ చేసి ఊపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌సీయూ విద్యార్థులు వేణుగోపాల్, శశికర్ నందా, శ్రావణి, అర్జున్, మశీరా పర్యవేక్షణలో సాగాయి. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుల్లో ఒకరైన వేణుగోపాల్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని క్యాంపస్‌లోని వారందరికీ తెలియజెప్పేందుకు గత ఏడాది మాయాబజార్ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి మంచిస్పందన వచ్చిందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది మాయాబజార్ 2.0 పేరుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్‌లోని పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.







హెచ్‌సీయూలో తెలుగు విద్యార్థుల ఆధ్వర్యంలో మాయాబజార్ 2.0 కార్యక్రమంలో సంప్రదాయ నృత్య ప్రదర్శనల దృశ్యాలు

తెలుగు రాష్ట్రాలపై క్రానిక్ కిడ్నీ డిసీజ్ ప్రభావం



సాక్షి, సిటీబ్యూరో: తెలుగు ప్రజల్లో 20 శాతం కంటే ఎక్కువ మందిలో క్రానిక్ కిడ్నీ డిసీజ్(సీకేడీ) ప్రాబల్యం పెరుగుతోందని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ నెఫ్రాలజిస్ట్ రాజశేఖర చక్రవర్తి అన్నారు. ఆదివారం చేయూత ఫౌండేషన్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్స్, కేర్ ఫర్ యువర్ కిడ్నీ ఫౌండేషన్, కిడ్నీ వారియర్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న వారితో 'సెలబ్రేటింగ్ సెకండ్ చాన్స్ లైఫ్ విత్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్'పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధుల భారం పెరుగుతోందన్నారు. ఏటా 5 లక్షల మంది కొత్తగా కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని పేర్కొన్నారు. వీరిలో 20 వేల మందికి మాత్రమే కిడ్నీ మార్పిడి సాధ్యమవుతోందని, మిగిలిన వారు డయాలసిస్ దశలోనే ఉండిపోతున్నారని తెలిపారు. అవయవ మార్పిడికి సిద్ధంగా ఉన్నవారు అపోహలను వీడి ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కిడ్నీ మార్పిడికి ముందు అనుభవించిన అనారోగ్య సమస్యలు, తరువాత క్వాలిటీ లైఫ్‌పై తమ అభిప్రాయాలను, అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ఎండీ జీఎస్ రావు, తెలుగు రాష్ట్రాల నుంచి 280 మంది కిడ్నీ దాతలు, గ్రహీతలు, డయాలసిస్ రోగులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

ఫైనాన్సియర్ల ఒత్తిడే కారణమంటున్న స్థానికులు



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఫసియుద్దీన్



మృతుడు మొయిన్(ఫైల్)

రహమత్‌నగర్: ఇటీవల ఆత్మహత్యకు యత్నించి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొయిన్ అహ్మద్(30) శనివారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం ఆదివారం ఎస్ఆర్టీ నగర్‌లోని ఆయన నివాసానికి మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. బస్తీవాసులు పెద్ద ఎత్తున తరలి వచ్చి నివాళులు అర్పించారు. అయితే మొయిన్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫైనాన్సియర్ల ఒత్తిడి మూలంగానే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎస్ఆర్టీనగర్‌లోని మాంసం దుకాణంలో మొయిన్ పనిచేస్తున్న క్రమంలో కొంతమంది వద్ద రూ.లక్షల్లో ఫైనాన్స్ తీసుకున్నాడని, డబ్బులు తిరిగి చెల్లించాలని వారు ఒత్తిడి చేయడం వల్లే ఆత్మహత్యకు యత్నించాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మోయిన్‌కు ఒక పాప, బాబు ఉన్నారు. సమాచారం అందుకున్న జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ ఘటనాస్థలానికి చేరుకొని మృతుడికి నివాళులు అర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉసురు తీస్తున్న ఫైనాన్సియర్లు

బోరబండ డివిజన్‌లో ఫైనాన్సియర్లు అధిక వడ్డీకి నిరుపేదలకు డబ్బులు ఇస్తూ, తిరిగి రాబట్టుకునేందుకు ఒత్తిడి చేస్తున్నారని ఫసియుద్దీన్ ఆరోపించారు. బోరబండలో ఇప్పటికే ఒకరు ఫైనాన్సియర్ల వేధింపులకు బలయ్యారని తెలిపారు. బ్లాక్ దందాలు నిర్వహిస్తున్న ఫైనాన్సియర్ల వివరాలతో పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన చెప్పారు. పోలీసులు మొయిన్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.

బాబా ఫసియుద్దీన్

నిమ్స్‌లో అగ్ని ప్రమాదంపై విచారణ జరిపించాలి

పంజగుట్ట: నిమ్స్ ఆసుపత్రి అత్యవసర విభాగంలో జరిగిన అగ్ని ప్రమాదంపై, ఆసుపత్రిలో బాణసంచా ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారంపై విచారణ చేపట్టాలని కోరుతూ నిమ్స్ ఆసుపత్రి అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్ పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిమ్స్ అత్యవసర విభాగం ఐదో అంతస్తులో శనివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. కిటికీల నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ప్రమాదం జరిగిన ఫ్లోర్‌లోనే ఒక గదిలో బాణసంచా ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయిందని, కాని బాణసంచా ఉన్నట్లు తాము గుర్తించలేదని, దీనిపై కూడా విచారణ జరిపించాలని సూపరింటెండెంట్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, నిమ్స్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం జరిగిందని తెలియగానే అక్కడకు పోలీసులు వెళ్లారని, అంతా తనిఖీ చేసినా ఎక్కడా బాణసంచా ఉన్నట్లు గుర్తించలేదని పోలీసు అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సన్నబియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- ఎంపీ చామల వీడియో మార్ఫింగ్‌పైనా మరో కేసు

సాక్షి, సిటీబ్యూరో: ఓ ఎంపీకి సంబంధించిన వీడియో మార్ఫింగ్, ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారు. వీటిని అధికారులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ రెండు కేసులు గురువారం నమోదు కాగా విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినట్లు మార్ఫింగ్ చేసిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. దీన్ని గమనించిన టీపీసీసీ మీడియా కోఆర్డినేటర్ కె.శ్రీకాంత్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ 'ఎక్స్'ఖాతా నుంచి ఆ వీడియో పోస్టు అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సన్నబియ్యంపై దుష్ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ సజ్జన్ మరో ఫిర్యాదు చేశారు. సన్నబియ్యం పేరుతో ప్రభుత్వం ప్లాస్టిక్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లుగా మరో వీడియో వైరల్ అవుతోందంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసు అధికారులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ రెండు కేసుల్నీ సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేయాలి

- క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్



ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న రవికుమార్

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉండాలని తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ విజ్ఞప్తి చేశారు. క్రైస్తవులకు రావాల్సిన సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకొని బేతేలు ప్రార్థన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పరిశుద్ధుడైన యేసుక్రీస్తు మానవాళి కోసం తన రక్తాన్ని చిందించారన్నారు. గుడ్ ఫ్రైడే రోజు ప్రాణాన్ని అర్పించి తిరిగి మూడో రోజు ఆదివారం పునరుత్థానుడై మరణాన్ని జయించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సులేమాన్, థామస్, జాన్సన్ మహేష్, తిమోతి, విశాల్, ప్రీతి, స్వప్న, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆరె కటికలను బీసీ-సీలోకి మార్చాలి



సమావేశంలో ఆరె కటిక్ సంఘ్ అధ్యక్షుడు రమేష్‌కుమార్, సుభాష్ చందర్ జీ

కాచిగూడ: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో వెనుకబడిన ఆరె కటికలను బీసీ-డీ నుంచి బీసీ-సీలోకి మార్చాలని ఆరె కటిక సంఘ్ ఇసామియా బజార్ అధ్యక్షుడు హెచ్. రమేష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలిఅడ్డాలోని ఏకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రంగాలలో వెనుకబడిన ఆరె కటికలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. తమ సంక్షేమం కోసం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కొన్నేళ్లుగా ఆరె కటిక సంగ్ ఆధ్వర్యంలో విడో పెన్షన్లు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, టెక్స్ట్ బుక్స్, బ్యాగుల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటు, పేద మహిళలకు కుట్టు మెషిన్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంగ్ కార్యదర్శి జ్ఞానేందర్, ఉపాధ్యక్షుడు సాయి సచితానంద్, కోశాధికారి సూర్యప్రకాష్ సింగ్, హరినారాయణ, 25మంది ట్రస్టు సభ్యులు, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, శంకర్, నరహరి, శ్యాంసుందర్, రఘునాథ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి

- విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



ఆకునూరి మురళిని సత్కరిస్తున్న ప్రొఫెసర్ సుదర్శన్ రావు, పూస మల్లేష్

నాంపల్లి: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఆకాంక్షించారు. గంగపుత్ర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆకునూరి మురళి మాట్లాడుతూ నిరుపేద గంగపుత్ర విద్యార్థులను తీర్చిదిద్దడానికి, తన వంతు సహాయం చేయడానికి విద్యావంతుల వేదిక ముందుకు రావడం సంతోషదాయకమని అన్నారు. గంగపుత్ర విద్యావంతుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్. సుదర్శన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరుపేద విద్యార్థులను చైతన్యవంతులను చేసి సమాజంలో ఉన్నత స్థానంలో నిలిచే విధంగా కృషి చేయాలన్నారు. వృత్తి విద్యాకోర్సుల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. గంగపుత్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ పూస మల్లేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుండే నైతిక విలువలను పెంపొందింపజేయాలని కోరారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.లక్ష్మీనారాయణ, జేఎన్టీయూ కాకినాడ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.తులసీదాస్, రాష్ట్ర జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే నా పేరు తొలగించారు

- మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ వ్యాఖ్య



మాట్లాడుతున్న అజహరుద్దీన్

బంజారాహిల్స్: ఉప్పల్ స్టేడియంలోని నార్త్ స్టాండ్‌కున్న తన పేరును తొలగించడంపై భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ విచారం వ్యక్తం చేశారు. నార్త్ స్టాండ్ నుంచి అజహరుద్దీన్ పేరును తొలగించాలంటూ అంబుడ్స్‌మెన్ జస్టిస్ ఈశ్వరయ్య ఆదేశించిన నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పదేళ్లపాటు ఇండియన్ క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా, 19 ఏళ్ల క్రికెటర్‌గా సేవలందించానని పేర్కొన్నారు. కొంత మంది కావాలని రాజకీయం చేసి లార్డ్స్ క్రికెట్ క్లబ్‌తో కోర్టుల్లో పిటిషన్స్ వేయించారని ఆరోపించారు. తనపై వచ్చిన పలు ఆరోపణలను గతంలోనే కోర్టు కొట్టేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఒక హైదరాబాదీగా దేశం గర్వించే స్థాయికి ఎదిగానని, కుట్రలకు న్యాయపరంగా సమాధానం చెప్తానని అన్నారు. ఉదయం నుంచి తనకు వేలాదిగా తన అభిమానులు, శ్రేయోభిలాషులు ఫోన్లు చేస్తున్నారని, నార్త్ స్టాండ్స్‌కు తన పేరును తొలగించడాన్ని వారు ఖండిస్తున్నారని అన్నారు. ఆనాడు క్రికెట్ అభిమానుల కోరిక మేరకే తన పేరును స్టాండ్స్‌కు పెట్టారని గుర్తు చేశారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి, మేకల శ్రీహరి, శంకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో జరగనున్న స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల్లో ఓటర్లందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకమని పేర్కొన్నారు ఓటూ విలువైనదని, ఓటర్లందరూ దానిని వినియోగించుకోవాలని, స్థానిక సంస్థల శాసన మండలి ఎన్నికల్లో మంచి అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో

ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల సిబ్బందికి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలి

డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.మొయినుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మొయినుద్దీన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి సింగిల్ విండో పద్ధతిలో ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్(డేటా) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ మొయినుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డెమొక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్(డేటా) ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం జరిగింది. ఆ సమావేశానికి ప్రొఫెసర్ మొయనుద్దీన్, ప్రజాకవి జయరాజు, ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ విజయ్, ప్రొఫెసర్ వెంకటదాసు మారేడు, ప్రొఫెసర్ ఎం.నరసయ్య, ప్రొఫెసర్ స్వామిదాసు, ప్రొఫెసర్ శోభారాణి, ప్రొఫెసర్ శ్రీశోభ, ప్రొఫెసర్ బాగయ్య, కోల జనార్దన్ డాక్టర్ వనమాల హాజరయ్యారు. ఈ సందర్భంగా మొయనుద్దీన్ మాట్లాడుతూ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు ఇంజనీరింగ్ విద్యను వ్యాపారంగా మార్చి లాభాలు గడిస్తున్నాయేగానీ అధ్యాపకులకు సరైన జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడం లేదని, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వ యూనివర్సిటీలు కనీసం స్పందించడంలేదని, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా వారితో కుమ్మక్కై విద్యార్థులకు, అధ్యాపకులకు, నాన్ టీచింగ్ సిబ్బందికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

వివాహ వేడుకలో కేటీఆర్

ఉప్పల్/రామంతాపూర్: హైటెక్ సిటీలోని హైటెక్స్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కూతురు అలేఖ్యరెడ్డి-దినేశ్‌రెడ్డిల వివాహానికి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు అన్ని రాజకీయ పక్షాల నేతలు హాజరై వధూవరులు ఆశీర్వదించారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి గంగుల తదితరులు

బాధ్యతతో కృత్రిమ మేథను వాడాలి

- సింగరేణి చైర్మన్ బలరామ్



బలరామ్‌కు మొక్కను అందజేస్తున్న పీఆర్ఎస్ఐ ప్రతినిధులు

నాంపల్లి: మానిషి జీవితంలోని అన్ని అంశాలను కృత్రిమ మేథ(ఏఐ) ప్రభావితం చేస్తోందని, ఈ సాంకేతిక విప్లవంపట్ల వ్యతిరేక ధోరణి మాని దాన్ని సమర్థవంతంగా, బాధ్యతగా వినియోగించుకోవడం మీద దృష్టి పెట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ ప్రజా సంబంధాల దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మానవాళి మనుగడ దీని మీద ఆధారపడి ఉందనడం అతిశయోక్తి కాదని అన్నారు. సింగరేణి సంస్థలో కూడా కాలానుగుణంగా టెక్నాలజీ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఆయన చెప్పారు. మహీంద్రా యూనివర్సిటీ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ స్కూల్ ప్రొఫెసర్ శశిధర్ నంజుండయ్య కీలకోపన్యాసం చేస్తూ వృత్తి నిపుణులు ఏఐని ప్రభావశీలంగా ఎలా వాడుకోవచ్చునో వివరించారు. సమాచార ప్రసారంలో టెక్నాలజీ పాత్ర అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో నైతికతకు పెద్ద పీట వేయాలని సూచించారు. పీఆర్ఎస్ఐ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు కృష్ణబాజీ తన నలభై ఏళ్ల కెరీర్‌లో పీఆర్‌ను శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్ పంపిన సందేశాన్ని నేషనల్ కమిటీ సభ్యుడు మోహన్‌రావు చదివి వినిపించారు. పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్, ఎంఎన్ఆర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాము మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవడం ఎలాగో విద్యార్థులకు బోధించాలని సూచించారు. చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కంభంపాటి యాదగిరి వందన సమర్పణ చేశారు.

జంతుప్రేమికులూ.. జర భద్రం!!

ఆహారం పెట్టేముందు ఆలోచించండి?!

మూగ జీవాల పట్ల కనికరంగా ఉండడం అనేది సాటి ప్రాణిగా, మనుషులుగా మన బాధ్యత. ఇందులో భాగంగా వీధిలో నివసించే జంతువులు.. ముఖ్యంగా కుక్కలు, పిల్లులు వంటి జీవులు నిరాశ్రయంగా, ఆకలితో అలమటిస్తుంటాయి. నగరంలోని ఇలాంటి ప్రాణులకు నగరవాసులు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులు ఆహారం అందించడం అతి సహజంగా కనిపిస్తుంది. హైదరాబాద్ నగరంలో ఐతే కుక్కలకు అన్నం పెట్టడం, పక్షులకు గింజలు, నీళ్లు పెట్టడం కూడా తరచూ కనిపించే దృశ్యం. అయితే నగరం, శివారు ప్రాంతాలు అటవీ ప్రాంతాలతో కలసిపోయి ఉంటుంది. ఈ నేపథ్యంలో నగరంలో సాధారణ సాధు జంతువులతో పాటు పలు సందర్భాల్లో వన్యప్రాణులు కనిపిస్తుంటాయి. ఇలా అన్ని జంతువులకూ ఆహారం అందించడంలో చట్టపరంగా కొన్ని నిబంధనలు, పరిమితులు ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు.







హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఆవులు, కుక్కలు, పిల్లులతో పాటు విభిన్న రకాల పక్షులు వంటి మూగ జీవాలకు కొదవలేదు. అయితే వాటి సహజ జీవనాన్ని కొనసాగించడానికి అనువైన, అవసరమైన పర్యావరణ వ్యవస్థ లేదనేది వాస్తవ సత్యం. ఈ నేపథ్యంలో ఇలాంటి మూగజీవాలకు నగరవాసులు ఆహారం పెట్టడం అనేది సాధారణ అంశంగా మారింది. దయతో నగర పౌరులు వీధి కుక్కలు, పిల్లులు, పక్షులు వంటి జీవులకు ఆహారం పెడుతున్నారు. ఇది మానవీయతకు నిదర్శనం అయినప్పటికీ చట్ట పరంగా, పర్యావరణ పరంగా కొన్ని పరిమితులు, నిబంధనలూ ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ఈ అంశానికి సంబంధించి కొన్ని ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ అంశాలపైన నగర వాసులు దృష్టి కేంద్రీకరించారు.

- సాక్షి, సిటీబ్యూరో

భద్రతకు భంగం కలగకుండా..

మూగజీవాల పట్ల మానవీయతతో ఉండటం, వాటి సంరక్షణకు మన వంతు బాధ్యతను అందించడం మంచి విషయమే.. కానీ మానవీయత పేరుతో మనం జంతువులకు ఆహారం పెడితే, అది ఇతరుల హక్కులను, భద్రతను హరించేలా ఉండకూడదు. చట్టాన్నీ, సమాజాన్నీ గౌరవిస్తూ, జంతు సంక్షేమం పట్ల మన బాధ్యతను సమతుల్యంగా నిర్వహించాలని నిబంధలను సూచిస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు, గృహ సంఘాల నిబంధనలు పాటిస్తూ.. మనుషుల ప్రేమను, కనికరాన్ని సమర్థవంతంగా చాటుకోవాలని జంతు ప్రేమికులు నినదిస్తున్నారు.





చట్టం ఏం చెబుతోంది..

మూగ జీవాలను కాపాడేందుకు భారతదేశంలో ప్రివెన్షన్ ఆఫ్ క్రూరిటీ టు యానిమల్ (పీసీఏ) యాక్ట్ - 1960 అమలులో ఉంది. ఈ యాక్ట్ ప్రకారం జీవాలకు ఉద్దేశపూర్వకంగా హాని చేయడం నేరం. కానీ జీవాలకు ఆహారం పెట్టే విషయంలో ప్రత్యేకంగా నిషేధం లేదు. అయితే, కొన్ని సందర్భాల్లో ఇది ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే, స్థానిక మున్సిపల్ చట్టాలు, గృహ సంఘాలు నిబంధనలు విధించవచ్చు.

- ఆటవిడుపు అనర్థాలకు కారణం కావొచ్చు
- జంతు సంరక్షణకూ కొన్ని పరిమితులున్నాయి
- అటవీ జంతువులకు ఆహారం ఇవ్వడం శిక్షార్హం
- పెంపుడు జీవాలకు మాత్రమే ఆహారం అందించాలంటున్న అధికారులు

ఏ జీవాలకు ఆహారం వేయవచ్చు?

సాధారణంగా మనుషులతో మమేకమై జీవనం కొనసాగిస్తున్న వీధి కుక్కలు, పిల్లులు వంటి జీవాలకు ప్రజలు ఆహారం అందించవచ్చు. అయితే అది బహిరంగ ప్రదేశాల్లో కాకుండా, నివాస ప్రాంగణాల్లో ఇవ్వడం మంచిది. అనవసరంగా రోడ్లపై జంతువులు గుమిగూడడం వల్ల ప్రమాదాలు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా నగరంలో అధికంగా ఉండే ట్రాఫిక్‌కు ఇది అంతరాయంగా మారుతుంది. నగరంలో ఎక్కువ సంఖ్యలో ఉండే పక్షులకు నీళ్లు, గింజలు వంటివి పెట్టవచ్చు. కాని అది ఎలక్ట్రిక్ వైర్ల దగ్గర, అపరిశుభ్ర ప్రాంతాల్లో ఉండకూడదు. ఆవులు, ఇతర జంతువుకు ఆహారం పెట్టే వారు రోడ్ల పైన కాకుండా సురక్షిత ప్రాతాల్లో పెట్టడం మంచిదని, అంతేకాకుండా ఆ జీవులు తినే ఆహారాన్ని మాత్రమే అందించాలని నిపుణులు సూచిస్తున్నారు.



వన్యప్రాణుల పట్ల జాగ్రత్త..

నగరంలో అరుదుగా కనిపించినా, అటవీ ప్రాంతానికి శివార్లలో నివసించేవారు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. జింకలు, పులులు, ఎలుగుబంట్లు వంటి అటవీ జంతువులకు ఆహారం ఇవ్వడం అటవీ చట్టం ప్రకారం నేరం. అడవి జంతువులకు ఆహారం అందించడం, వాటిని ఆకర్షించేలా చేయడం, వాటి సహజ జీవన విధానాన్ని భంగపెట్టేలా చేయడం చట్టవిరుద్ధం. వీటిని ఉపేక్షిస్తే చట్టరిత్యా కఠిన చర్యలకు, శిక్షలకు గురికాక తప్పదు. అధిక సంఖ్యలో తారసపడే కోతుల వంటి వన్య ప్రాణులకు ఆహారం అందించకూడదు. దీని వల్ల అవి సహజంగా ఆహారాన్ని సేకరించడం క్రమంగా కోల్పోవడమే కాకుండా సులభంగా లభించే ఆహారం కోసం జనావాసాల్లోకి వలసపడతాయి. ప్రమాదకరమైన విషసర్పాల వంటి ఇతర ప్రాణులకు ఆహారం ఇవ్వకూడదు. ముఖ్యంగా ప్రమాదకర వన్యప్రాణులను ఏ విధంగా ఆకర్షించినా వాటికి, మనుషులకు శ్రేయస్కరం కాదు.



సందేశాత్మకం హూ ఈజ్ రైట్ లఘు చిత్రం

ఆవిష్కరణ సభలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: మానవ హక్కుల గురించి ప్రజలకు అవగాహన కలిగేలా చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మైత్రి క్రియేటర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన 'హూ ఈజ్ రైట్' లఘు చిత్ర ఆవిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి, ఆ సమస్యలను ఎదుర్కోడానికి కల్పించినటువంటి హక్కులను ఆధారంగా తీసుకొని ఈ చిత్రాన్ని తీయడం విశేషమని కొనియాడారు. ఓటు హక్కు, జీవించే హక్కు, సమానత హక్కు, విద్యా హక్కు వంటి 8 మానవ హక్కుల గురించి చిత్రీకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు జబర్దస్త్ అప్పారావు, హైకోర్టు న్యాయవాది పి.శ్రీరామమూర్తి, బొడ్డుగూడెం గ్రామానికి చెందిన చిత్ర దర్శకులు రేఖల సుధాకర్, స్వాతి రేఖల, నిర్మాతలు మదిలి విజయ్, సందీప్ చుక్కా, హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు చల్లా అనిల్ పాల్గొన్నారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం

ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి

సెకండ్ ఎడిషన్ 5కె, 10కె రన్‌లో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: అవంతిక కన్‌స్ట్రక్షన్స్, ఇగ్నైట్ కళాశాల, తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో మియాపూర్‌లో సెకండ్ ఎడిషన్-5కె, 10కె రన్ ఆదివారం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాక్షి డైరెక్టర్ దివ్యారెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌లతో కలిసి జెండా ఊపి ఈ రన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉరుకుల, పరుగుల జీవితంలో శారీరక దృఢత్వానికి రన్, యోగా, వ్యాయామం ఎంతో అవసరమన్నారు. ఇవి మానసిక ఉల్లాసానికి, ప్రశాంతతకు దోహదం చేస్తాయని తెలిపారు. 5కిలోమీటర్లు, 10కిలోమీటర్ల రన్ నిర్వహించడం అభినందించదగ్గ విషయమన్నారు. రన్ ద్వారా వచ్చిన విరాళాలను ఆకార్ ఆశా ఫౌండర్ డాక్టర్ భరతేందు స్వైన్ చెక్కు రూపంలో అందించారు. అదేవిధంగా రన్‌లో విజేతలు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతిక కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాస్ రెడ్డి, ఇగ్నైట్ కళాశాల చైర్మన్ రమేష్, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున్ వార్డు గ్రహీత చేతన్ ఆనంద్, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, ఆకార్ ఆశా ఫౌండర్ డాక్టర్ భరతేందు స్వైన్, హోలిస్టిక్ ఆస్పత్రి చైర్మన్ రామచంద్ర, బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, మియాపూర్ సీఐ క్రాంతికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





నేత కార్మికులను మరింత ప్రోత్సహించాలి

మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ బ్యూటిఫుల్-2025 విజేత ప్రియాంక ఆనంద్



బంజారాహిల్స్: నేత కార్మికులను, చేనేత కళను, ఇతర చేతి వృత్తిదారులను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మిస్ అండ్ మిసెస్ స్ట్రాంగ్ బ్యూటిఫుల్- 2025 విజేత ప్రియాంక ఆనంద్ చిలక అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గని ఆదరణ ఉందని, నేటి తరం యువత హ్యాండ్లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని అన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగుతుందని, దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కారులు, చేతిపని బృందాలు తమ ఉత్పత్తులైన సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.



సుభానీ చిత్రాలు.. నగర చరిత్రకు సాక్ష్యాలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ కార్టూనిస్ట్, ఆర్టిస్ట్ సుభానీ లైన్ స్కెచ్‌లు గత చరిత్రను ప్రతిబింబించే వారధులుగా నిలుస్తున్నాయని నిజాం వారసులు రౌనక్ యార్ ఖాన్ కొనియాడారు. నగరంలోని జేఎన్ఏఎఫ్‌యూ వేదికగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ కొనసాగిన కళా ప్రదర్శన తెలంగాణ గొప్ప చరిత్రను, అసఫ్‌జాహి రాజవంశ స్మారక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందని రౌనక్ అన్నారు. ఈ ప్రదర్శనను ప్రత్యేకంగా సందర్శించిన రౌనక్ యార్ ఖాన్ అసఫ్‌జాహి రాజవంశానికి చెందిన రాజభవనాలు, ఇతర నిర్మాణ సౌందర్యానికి ముగ్దుడినైపోయానని పేర్కొన్నారు. వ్యంగ్య చిత్రాల రంగంలో సుభానీ కళకు తానొక అభిమానినని, అతని కళ ఆనాటి సంఘటనలపై హాస్యభరితమైన, లోతైన ప్రతిబింబాన్ని అందిస్తుందని కొనియాడారు. ఈ సందర్భంగా సుభానీని అభినందించారు.

ఓరల్ క్యాన్సర్‌పై అవగాహన రన్



గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

రాయదుర్గం: ఓరల్ క్యాన్సర్ అవగాహన రన్-2025 విజయవంతంగా ముగిసింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ వద్ద గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రారంభించారు. అనంతరం మైహోమ్ భుజ ముందు నుంచి ఐటీసీ కోహినూర్ హోటల్ వరకూ 10కె, 5కె, 2.5కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ముఖ్యంగా 200 మంది డాక్టర్లు ఈ రన్‌లో పాల్గొనడం విశేషం. నిర్వాహకులు, డాక్టర్లు ప్రధానంగా క్యాన్సర్‌తోపాటు డ్రగ్స్, మద్యపానం, దూమపాన వినియోగం పట్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించారు.అంతేకాకుండా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, వ్యాయామం, నడక, యోగా వంటివి క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. క్యాన్సర్ ప్రాణాంతకంగా మారిందని, వ్యాధి లక్షణాలను మొదట్లోనే గుర్తిస్తే దాన్ని తగ్గించుకోడానికి ఆస్కారం ఉంటుందని డాక్టర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో మైహోమ్ గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వరరావు, మల్లారెడ్డి విశ్వ విద్యాపీఠం వైస్‌చైర్మన్ డాక్టర్ సిహెచ్ ప్రీతిరెడ్డి, ఎంఎస్ఆర్ యూనివర్శిటీ చాన్స్‌లర్ రవివర్మ, యశోధ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి సురేందర్ రావు, వైద్యాధికారులు దిలీప్ కుమార్, నాగదీపిక, ప్రణీత్, సౌమ్య శరజ్ పాల్గొన్నారు.



క్లుప్తంగా...

దీర్ఘాయుష్షుతో మీరు జీవించాలి

ఏపీ సీఎం చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జగన్



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 'నారా చంద్రబాబు నాయుడుగారు.. మీకు జన్మదిన శుభాకాంక్షలు. ప్రశాంతమైన ఆరోగ్యకరమైన దీర్ఘాయుష్షుతో మీరు జీవించాలని కోరుకుంటున్నాను'అంటూ 'ఎక్స్'లో ఆదివారం వైఎస్ జగన్ పోస్ట్ చేశారు.

దేశభక్తి ఉంటే బీజేపీకి ఓటేయాలి

- చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశ భక్తి ఉన్న వాళ్లు బీజేపీకి ఓటు వేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. హైదరాబాద్ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి లొంగిపోయాయని ఆరోపించారు. అందుకే ఈ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలు పోటీ చేయకుండా తప్పుకున్నాయన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విశ్వేశ్వరరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో పాల్గొనని పార్టీలకు అంబేడ్కర్ గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ప్రధాని మోదీపై ఎంపీ అసద్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, కేసీఆర్ మాదిరి అసద్‌కు బూతుల రోగం అంటుకుందని దుయ్యబట్టారు. పేద ముస్లింల కోసం వక్ఫ్ బిల్లు అవసరమని, వక్ఫ్ అనేది మతానికి సంబంధించిన అంశం కాదని, దేశానికి సంబంధించిన అంశమన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించేలా ఎంఐఎం, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఉందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆత్మ పరిశీలన చేసుకొని ఓటు వేయాలని విశ్వేశ్వరరెడ్డి సూచించారు. అధికారం లేకుంటే కేటీఆర్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని, కనీసం ఆయన మాటలు ఆయనకు అర్థమైతే చాలన్నారు.

రైతులు కన్నీరు పెడుతున్నారు: కవిత



ఖమ్మం మయూరిసెంటర్: వర్షాలతో ధాన్యం, పంటలు తడిసి రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది రైతులు కన్నీరు పెడుతున్నారని, వారి కష్టాలపై ప్రభుత్వం ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆదివారం ఖమ్మం వచ్చిన కవిత.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ధాన్యం తడిసిపోతే కనీసం పట్టించుకోలేదని, ఉప ముఖ్యమంత్రి ఉండి కూడా రైతులను పలకరించిన పాపాన పోలేదని మండిపడ్డారు. తాను ఖమ్మం రాగానే ఒక కాంగ్రెస్ నాయకుడు తన బాధను వ్యక్తం చేశాడని, గ్రామ శాఖ పదవికి రాజీనామా చేసినట్లు చెప్పారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటన చేస్తున్నారే తప్ప.. రాష్ట్రంలో వానలు పడి రైతులు అవస్థలు పడుతుంటే కనీసం స్పందించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.20 వేల చొప్పున వెంటనే పరిహారం చెల్లించాలని కవిత డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాధికార సాధనకు బీసీలు ఏకం కావాలి'



సదస్సులో పాల్గొన్న బీసీ ముఖ్య నాయకులు

జనగామ: రాజ్యాధికార సాధనకు బీసీలు ఏకం కావాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీసీ రాజ్యాధికార సమితి ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు దక్కాల్సిన 42 శాతం అవకాశాలను.. 4 శాతం ఉన్న ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి అప్పజెప్పటం ఏవిధమైన సామాజిక న్యాయమో ప్రభుత్వం చెప్పాలన్నారు. క్షేత్రస్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా ఫార్ములా 21ను అనుసరించి జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల పరిధిలో 21 మంది ముఖ్యులతో స్థానిక కమిటీలను ఏర్పాటు చేసి రెండ్రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

పెద్దదోర్నాల: శ్రీశైలం నుంచి బెంగళూరు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ స్లీపర్‌కోచ్ బస్సు ఘాట్ రోడ్‌లో అదుపుతప్పి పక్కనున్న గుంతలోకి దూసుకుపోవటంతో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం శ్రీశైలం ఘాట్ రోడ్డులోని ఎకో టూరిజం సమీపంలో జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న 25 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

ఏటా కోటి పెళ్లిళ్లు

మన వివాహ మార్కెట్ రూ.11 లక్షల కోట్లు

ప్రపంచంలోనే అతిపెద్ద వివాహ పరిశ్రమగా భారత్



- దేశంలో వైభవంగా పెళ్లిళ్లు
- సగటు వివాహ వ్యయం రూ.29.60 లక్షలు
- కుటుంబ వార్షిక ఆదాయం కంటే మూడు రెట్లు అధికం
- ఒక్క పెళ్లి మండపానికే 20 శాతానికి పైగా ఖర్చు
- అతిథి సత్కారాలకు వెనుకాడకుండా ప్రణాళిక
- వెడ్డింగ్‌వైర్ ఇండియా సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో వివాహ ఖర్చు భారీగా పెరుగుతోంది. సగటు కుటుంబ వార్షిక ఆదాయం కంటే మూడు రెట్ల అధిక వ్యయం జరుగుతోంది. ఆభరణాల కొనుగోలు నుంచి దుస్తులు, పెళ్లి మండపాలు, అతిథి సత్కారాలకు వెనుకడుగు వేయకుండా భారీ వ్యయాలు చేస్తున్నారు. దీనికి తోడు వధూవరుల ప్రత్యేక కోర్కెలు సైతం వివాహ ఖర్చులను అమాంతం పెంచేస్తున్నాయి. ఔట్‌ఫిట్స్, ఫస్ట్‌లుక్, మెహందీ, హల్దీ, ఫొటోషూట్, వినోద కార్యక్రమాలను యువత అమితంగా ఇష్టపడుతోంది. ఈ నేపథ్యంలో భారతీయ వివాహాలు ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమగా రూపాంతరం చెందడం ఆసక్తి కలిగిస్తున్న అంశం. దేశ వివాహ మార్కెట్ విలువ రూ.11 లక్షల కోట్లుగా మార్కెట్ వర్గాల అంచనా. ఏటా దేశంలో దాదాపు కోటి వివాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా 'వెడ్డింగ్‌వైర్ ఇండియా' సర్వే వివాహాల ఖర్చుపై ఆసక్తికర విషయాలు వెల్లడించింది.

భారతీయ కుటుంబ వివాహాల్లో విలాసానికి ప్రాధాన్యం పెరుగుతోంది. సగటున పెళ్లిళ్ల కోసం రూ.29.60 లక్షలకుపైగా ఖర్చవుతోంది.

ఆకాశమంత పందిరి... భూదేవంత పీట

ఇందులో వివాహ వేదికకే 20 శాతానికిపైగా వెచ్చిస్తుండటం విశేషం. 2023లో ఒక వేదికకు సగటున రూ.4.70 లక్షలు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.6 లక్షలకు పైగా కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇది ఒక్కోసారి రూ.7.50 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెరుగుతున్నట్లు సర్వే నివేదిక పేర్కొంది. ఆ సందర్భాల్లో మొత్తం వివాహ వ్యయం రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ ఉండడం విశేషం.

రెండో అతిపెద్ద మార్కెట్

2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశీయ రిటైల్ మార్కెట్‌లో వివాహ పరిశ్రమ రూ.11 లక్షల కోట్లతో ఆహారం, నిత్యావసరాల తరువాత రెండో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించింది. కొన్ని కీలక విభాగాల మార్కెట్ విలువలు ఇలా...

వర్గం	మార్కెట్ విలువ (రూ.కోట్లలో)
ఆహారం, నిత్యావసరాలు	56,52,300
వివాహాలు	11,00,000
దుస్తులు, ఉపకరణాలు	6,97,200
ఆభరణాలు	6,47,400
గృహోపకరణాలు, కార్లు	3,23,700
మొబైల్స్	2,65,600

తగ్గేదేలే..

భారతీయ వివాహ వేడుకలు కనీసం మూడు, నాలుగు రోజులు కొనసాగుతున్నాయి. భారీగా వివాహ వ్యయం ధోరణి గ్రామాల్లోకీ విస్తరిస్తోంది. అవసరమైతే అప్పుచేసి మరీ భారీగా శుభ కార్యాన్ని నిర్వహిస్తున్నారు తప్ప, ఖర్చుకు వెనుకాడని పరిస్థితి కనబడుతోంది. అతిథులకు చిరస్మరణీయ ఆతిథ్యం ఇవ్వాలని యువత భావిస్తోంది. ఇందులో భాగంగా ఆహారం, పానీయాలపై దృష్టి పెడుతున్నారు. క్యాటరింగ్, వినోద కార్యక్రమాలపై ఖర్చులు పెరుగుతున్నాయి. శుభ లేఖలూ 'వైభవంగా' ఉండాల్సిందే. అయితే వివాహ ఆహ్వానాలు డిజిటల్ రూపంలోకి మారుతుండడం కొత్త ట్రెండ్.

ఏపీలో పంచుకు తినేందుకు రూ.3,000 కోట్ల భూమి పందేరం

ఊరూ పేరు లేని 'ఉర్సా'

హైదరాబాద్‌లో కనీసం కార్యాలయం కూడా లేని డొల్ల కంపెనీ 'ఉర్సా క్లస్టర్స్'

- అమెరికాలోని ఉర్సా క్లస్టర్స్ ఎల్ఎల్‌సీ పరిస్థితి కూడా అంతే
- గతేడాది లోకేష్ పర్యటనకు నెల ముందు ఆగమేఘాలపై ఏర్పాటు
- డొల్ల కంపెనీతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం
- విశాఖలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో దాదాపు 60 ఎకరాల భూమి ధారాదత్తం
- కారుచౌకగా ఎకరా 99 పైసలకే కేటాయించేలా ప్రణాళిక.. రూ.3,000 కోట్ల ఖరీదైన భూమిని కొట్టేసే ఎత్తుగడ..
- 'ఉర్సా'తో ముఖ్యనేతల కుమ్మక్కుపై "సాక్షి" పరిశోధనలో బయటపడ్డ నిజాలు

సాక్షి, అమరావతి: రూ.10,000 కోట్లు పెట్టుబడులు పెట్టే కంపెనీ అంటే దాని స్థాయి ఎంత గొప్పగా ఉండాలి..? నిత్యం వేలాది మంది ఉద్యోగుల కోలాహలంతో పాటు పెద్ద ఎత్తున వ్యాపార లావాదేవీలు ఉండాలి కదా..? కానీ రూ.వేల కోట్ల పెట్టుబడులు పెడతామంటూ ముందుకొచ్చిన ఆ కంపెనీలో కనీసం పది మంది సిబ్బంది కూడా లేరు. ఇప్పటి వరకు ఎలాంటి కార్యకలాపాలు చేసిన దాఖలాలు కూడా లేవు. కనీసం కార్యాలయం కూడా లేని కంపెనీకి ఎకరం 99 పైసలకే అత్యంత ఖరీదైన భూమిని ఉరుకులు పరుగులపై అప్పగించడం నీకింత.. నాకింత! దోపిడీకి పరాకాష్ఠ. ప్రపంచ చరిత్రలో ఇది వింతల్లో వింత! ఊరు పేరు లేని 'ఉర్సా క్లస్టర్స్'కు విశాఖలో దాదాపు రూ.3,000 కోట్ల విలువైన భూమిని టీడీపీ సర్కారు అప్పనంగా కట్టబెట్టడం తాజాగా అధికార వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

రెండు నెలలు తిరగక ముందే..

సొంత కార్యాలయం.. కనీసం ఫోన్ నెంబరు కూడా లేని ఓ అనామక కంపెనీ ఏర్పాటై రెండు నెలలు తిరగక ముందే తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల పెట్టుబడులు పెడతామనడం.. ఆ ప్రతిపాదనకు ముచ్చట పడి టీడీపీ కూటమి సర్కారు విశాఖలో కారు చౌకగా అత్యంత ఖరీదైన భూములు కేటాయించేయడం.. ఇందుకోసం టీసీఎస్‌ని తెరపైకి తెచ్చి ఆ ముసుగులో ఎకరం 99 పైసలకే అంటూ ప్రత్యేకంగా పాలసీ తెస్తుండటంపై రాష్ట్ర ఐఏఎస్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యనేతలు తమ కుట్ర అమలులో భాగంగా తొలుత టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించి, అదే ధరకు ఉర్సా కస్టర్స్‌కు విలువైన భూములు ధారాదత్తం చేసేలా పావులు కదిపారు. 'ఉర్సా క్లస్టర్స్'పేరుతో విశాఖలో డేటా సెంటర్, ఐటా క్యాంపస్ ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించడమే తడవుగా చౌకగా భూములు కేటాయించాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిపాదించడం.. ఆ వెంటనే క్యాబినెట్‌లో భూ కేటాయింపులు చేయడంపై అనుమానాలు బలపడుతున్నాయి. ఉర్సా క్లస్టర్స్ రూ.5,728 కోట్లతో విశాఖలో డేటా సెంటర్, ఐటా క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదనకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఇందుకోసం విశాఖ మధురవాడలోని ఐటీ హిల్ నెంబర్ 3లో ఐటా క్యాంపస్‌కు 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో డేటా సెంటర్‌కు 56.36 ఎకరాలు కేటాయించేందుకు పచ్చ జెండా ఊపింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు పెడతామంటూ ఒప్పందాలు చేసుకున్న ఉర్సా కంపెనీ గురించి 'సాక్షి'పరిశోధనలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

హైదరాబాద్‌లో కార్యాలయమే లేదు..!

టీడీపీ కూటమి సర్కారు భూ కేటాయింపులు చేయడానికి కేవలం రెండు నెలల ముందు అంటే 2025 ఫిబ్రవరి 12న ఉర్సా క్లస్టర్స్ హైదరాబాద్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైంది. హైదరాబాద్‌కు చెందిన పెందుర్తి విజయ్‌కుమార్, అమెరికాలో చిన్న ఉద్యోగం చేసుకుంటున్న సతీష్ అబ్బూరి డైరెక్టర్లుగా ఈ కంపెనీ ఏర్పాటైంది. ప్లాట్ నెంబర్ 705, ఏక్తా బాసిల్ హైట్స్, కొత్తగూడ, హైదరాబాద్, తెలంగాణ 500084 చిరునామాతో దీన్ని నెలకొల్పారు. అయితే ఆ చిరునామాకు వెళ్లి పరిశీలించగా... అది పూర్తిగా నివాస ప్రాంతమని తేలింది. పెందుర్తి విజయ్‌కుమార్‌కు అత్యంత దగ్గరి బంధువైన పెందుర్తి పద్మావతికి చెందిన త్రీ బెడ్ రూమ్ నివాస ప్లాట్‌ను ఉర్సా ఆఫీసు కార్యాలయంగా పేర్కొన్నారు. అందులో ఓ కుటుంబం నివాసం ఉంటోందని.. అసలు అక్కడ ఐటీకి సంబంధించి ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలు జరగడం లేదని స్థానికులు వెల్లడించారు. ఇక రూ.వేల కోట్ల పెట్టుబడులు పెడతామంటున్న ఉర్సా క్లస్టర్స్ వాణిజ్య విద్యుత్ కాకుండా గృహ విద్యుత్తు కనెక్షన్‌ను వినియోగిస్తోంది. ఉర్సా క్లస్టర్ కంపెనీకి కనీసం ఓ ఫోన్ నెంబరు గానీ వెబ్‌సైట్‌గానీ లేకపోవడం గమనార్హం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



ఉర్సా ఆఫీస్ అడ్రస్ ఇదే..

అమెరికాలోనూ అంతే..

ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మాతృసంస్థగా చెబుతున్న అమెరికాలోని ఉర్సా క్లస్టర్స్ ఎల్ఎల్‌సీ పరిస్థితి కూడా ఇంతే. అది లిమిటెడ్ లయబులిటీ కంపెనీ. ఏడు నెలల క్రితం.. అంటే 2024 సెప్టెంబర్ 27న ఉర్సా క్లస్టర్స్ అమెరికాలో ఏర్పాటైంది. అమెరికాలోని డెలావర్‌లో 611, సౌత్ డ్యూపాంట్, హైవే సూట్, 102 డోవెర్, డీఈ 19901 చిరునామాతో ఈ కంపెనీ నమోదైంది. పెందుర్తి విజయ్‌కుమార్ తనయుడు కౌశిక్ దీనికి డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అమెరికా పర్యటనకు సరిగ్గా నెల రోజుల ముందు ఈ కంపెనీ ఏర్పాటు కావడం గమనార్హం. ఇక ఈ కంపెనీ ఇప్పటి వరకు చెల్లించిన పన్ను కేవలం 300 అమెరికన్ డాలర్లు మాత్రమే. అంటే మన కరెన్సీలో సుమారు రూ.25,000. అమెరికా చిరునామాతో ఉన్న ఇల్లు కూడా పూర్తిగా నివాసప్రాంతం. కేవలం 1,560 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక చిన్న కుటుంబం నివాసం ఉండటానికి అనువుగా ఉన్న ఇంటిని ఆఫీసు కార్యాలయంగా పేర్కొన్నారు. ఇక అక్కడ కూడా ఉర్సా క్లస్టర్స్ పేరిట ఉద్యోగులు లేరు. కనీసం ఫోన్ నెంబర్లు లేవు. కౌశిక్ పెందుర్తి ప్రస్తుతం టాలస్ పే అనే కంపెనీలో సీపీటీవోగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన లింక్‌డిన్ ఖాతా ద్వారా తెలుస్తోంది. మరో డైరెక్టర్ సతీష్ అబ్బూరి ఎలిసియం అనలిటిక్స్‌కు వ్యవస్థాపకుడు, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా ఉన్నారు.

దేశ నిర్మాణంలో కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి శంకుస్థాపన చేస్తున్న కిషన్‌రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): దేశ నిర్మాణంలో కంపెనీ సెక్రటరీల పాత్ర కీలకమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖైరతాబాద్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్ నూతన భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కంపెనీ కార్యదర్శులు మన దేశ కార్పొరేట్ సంస్కృతిని కాపాడతారని, భారతీయ వ్యాపారంపై నమ్మకాన్ని పెంచుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, ఈ నగరంలో ఎన్నో అవకాశాలుంటాయన్నారు. 2047లో దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చాలన్నా, అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టాలన్నా కంపెనీ కార్యదర్శులు ఎంతో ముఖ్యమని తెలిపారు. భారత్ 5 ట్రిలియన్ల ఆర్థికవ్యవస్థ మైలురాయిని వేగంగా చేరుకుంటుందని, ఈ ప్రయాణంలో కార్పొరేట్ గవర్నెన్స్ నిపుణులు కీలకపాత్ర పోషిస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. ఐసీఎస్ఐ జాతీయ అధ్యక్షుడు ధనంజయ్ శుక్లా మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్ 2 వేల మందికి పైగా సభ్యులు, 6 వేల మంది విద్యార్థులతో మొత్తం 74 చాప్టర్‌లలో శక్తివంతమైన చాప్టర్‌గా ఎదిగిందన్నారు. ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ బాధ్యులు వెంకటరమణ మాట్లాడుతూ నూతన భవనం 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, ఐదు ఫ్లోర్‌లలో, రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు పవన్ జి.చండక్, బి.నరసింహన్, ఆశిష్ మోహన్, మంజిత్ బుచా, మహాదేవ్ తిరునగరి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పేదముస్లింల మేలు కోసమే వక్ఫ్ చట్ట సవరణ

- 'మజ్లిస్' విషసర్పాలకన్నా డేంజర్: బండి సంజయ్



పెద్దపల్లి రూరల్: ముస్లింల ముసుగులో బడాచోర్‌లు అందరూ వక్ఫ్‌బోర్డు ఆస్తులు అనుభవిస్తున్నారని, అందుకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదముస్లింలకు మేలు కలిగేలా వక్ఫ్ బోర్డు చట్ట సవరణ చేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, కందుల సంధ్యారాణితో కలిసి ఆయన మాట్లాడారు. పేద ముస్లిం కుటుంబాలను మురికికూపంలోకి నెట్టేసిన మజ్లిస్ పార్టీ విషసర్పాలకన్నా ప్రమాదకరమన్నారు. వక్ఫ్ చట్ట సవరణతో తమ బండారం బయటపడుతుందన్న భయంతోనే బీజేపీకి మతం రంగు పులిమి, విద్వేషాలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. హరియాణాలో గురుద్వార భూములు, కర్ణాటకలో లింగాయత్‌ల వ్యవసాయ భూములు, కేరళలో క్రైస్తవ మత్స్యకారుల భూములు, తమిళనాడులో పురాతన ఆలయాల భూములు వక్ఫ్ భూములంటూ ఆక్రమించుకుంది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇతరుల భూములను వక్ఫ్ పేరిట ఆక్రమించుకుంటే చూస్తూ ఊరుకోవాలా? అని బండి మండిపడ్డారు. కాగా, హైదరాబాద్ దారుస్సలాంలో మజ్లిస్ పార్టీ నిర్వహించిన సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందించారని కేంద్రమంత్రి ఆరోపించారు. పాతబస్తీలో ఒక్క అంబేడ్కర్ విగ్రహం కూడా ఏర్పాటుచేయని ఒవైసీలకు అంబేడ్కర్ పేరెత్తే అర్హత లేదని సంజయ్ అన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు ఆవేదనలో ఉంటే.. పరామర్శించి, పరిహారం అందించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలు చేస్తున్నారని సంజయ్ మండిపడ్డారు.

బీఆర్ఎస్ సభకు ఎడ్ల బండ్లతో సిద్ధం

- వారం ముందే ప్రయాణమవుతున్న సూర్యాపేట రైతులు
- 22న బయలుదేరి 27 నాటికి సభకు చేరుకుంటామని వెల్లడి



ఆత్మకూర్(ఎస్) మండలం రామోజీతండాలో సిద్ధమవుతున్న ఎడ్లబండ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సూర్యాపేట జిల్లా నుంచి ఎడ్ల బండ్లలో వెళ్లేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం అవుతున్నాయి. వివిధ తండాలు, గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇందుకోసం ఎడ్ల బండ్లను ముస్తాబు చేస్తున్నారు. వారం రోజుల ముందే తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో ఆత్మకూరు (ఎస్) మండలం కేంద్రంతోపాటు రామోజీతండా, నశింపేట తదితర గ్రామాల రైతులు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. 22వ తేదీన ఉదయం 5 గంటలకు ఆత్మకూర్ (ఎస్) మండలంలోని నెమ్మికల్ దండు మైసమ్మ తల్లికి మొక్కి బయలుదేరుతామని తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు జిల్లా ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారని జగదీశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే ఎడ్ల బండ్లపై సభకు వెళ్తున్నామని రామోజీ తండాకు చెందిన రైతు బానోతు హరి చెప్పారు. రైతుబంధు, రుణమాఫీ చేయకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, ఈ విషయాన్ని ప్రచారం చేస్తూ వరంగల్ సభకు ఎడ్లబండ్లతో వెళుతున్నామని ఆత్మకూరుకు చెందిన రైతు చిత్తలూరి మల్లయ్య చెప్పాడు. రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకున్న కేసీఆర్‌ను చూసేందుకు వరంగల్ సభకు వెళ్తున్నట్లు మరో రైతు గుగులోతు పార్వతి తెలిపారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావడం చారిత్రక అవసరం

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పకుండా ఓట్లు అడిగేటోళ్లు ఎవరైనా ఉన్నారా? తెలంగాణకు అటు కాంగ్రెస్ ఇటు బీజేపీ రెండూ శత్రువులే'అని కేటీఆర్ విమర్శించారు.

గరీబోళ్ల ఇండ్లపైకే హైడ్రా బుల్డోజర్లు

హైడ్రా పేరుతో ప్రభుత్వం పేదల ఇళ్లపైకి బుల్డోజర్లు నడిపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. 'హైడ్రాతో ఆస్తులు కాపాడుతాం అంటున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, కేవీపీ రామచంద్రర్‌రావు, సీఎం సోదరుడు తిరుపతి రెడ్డి ఇళ్లను మాత్రం ముట్టరు. అల్కగా దొరికే గరీబోని పైకి బుల్డోజర్లు పంపుతున్నారు. రైతుబంధు, తులం బంగారం, రుణమాఫీ, స్కూటీలకు పైసల్లేవు కానీ.. మూసీకి మాత్రం లక్షన్నర కోట్లు ఇస్తారట'అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.1,200 కోట్ల ఖరీదైన ప్రభుత్వ భూమి స్వాధీనం

అక్రమ నిర్మాణాల కూల్చివేత • చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం



స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు...

బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఉన్న రూ.1,200 కోట్ల ఖరీదైన ప్రభుత్వ భూమిని ఆదివారం షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు, ప్రైవేటు వ్యక్తులనుంచి స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థలంలో ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి, అందులో ఉన్న వ్యక్తులను బయటకు పంపించారు. 12 ఎకరాల ఈ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవడమే కాకుండా చుట్టూ ఫెన్సింగ్ కూడా నిర్మించారు. గత కొన్నేళ్లుగా కొంతమంది ఈ భూమిని ఆక్రమించి గదిని నిర్మించుకొని తమ అధీనంలో ఉంచుకున్నారు. కాపలాగా కొందరు వ్యక్తులను కూడా నియమించారు. ఇటీవల షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి ఈ భూమికి సంబంధించిన రికార్డులు పరిశీలించి, అది పూర్తిగా ప్రభుత్వ స్థలమని నిర్ధారించారు. దీంతో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.

ఏపీ మెగా డీఎస్సీలో మెలిక!

డిగ్రీలో 50 శాతం, పీజీలో 55 శాతం మార్కులు తప్పనిసరి

సాక్షి, అమరావతి : డీఎస్సీ-2025లో ఏపీలోని కూటమి సర్కారు మెలిక పెట్టింది. ఇంటర్మీడియట్, డిగ్రీల్లో కనీస అర్హత మార్కులు ఉండాలని నిబంధన విధించి, దరఖాస్తు దశలోనే సగం మంది అభ్యర్థులపై అనర్హత వేటు వేసింది. డిగ్రీలో అర్హత మార్కుల నిబంధన విధించి దాదాపు 8 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లింది. బీఈడీ అర్హతతో రాసే స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, ఇంటర్ అర్హతతో రాసే ఎస్‌జీటీ పోస్టులకు ఇదే తరహా నిబంధన విధించడంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. 2024 ఫిబ్రవరిలో 6,100 పోస్టులతో ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో అర్హత మార్కుల నిబంధనను విధించలేదని, ఆ నోటిఫికేషన్‌ను పూర్తి చేసి ఉంటే తమకు మేలు జరిగేదని అభ్యర్థులు వాపోతున్నారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇలాకాలో

దళితులకు సాంఘిక బహిష్కరణ




పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

పిఠాపురం: ''వాళ్ల కెవరూ పాలు పోయకూడదు.. ఏ హోటళ్లోనూ వారికి టీ, కాఫీ ఇవ్వకూడదు.. టిఫిన్ పెట్టకూడదు.. కిరాణా కొట్లలో సరుకులు విక్రయించకూడదు..''ఇలాంటి మాటలు ఎప్పుడో దశాబ్దాల క్రితం గ్రామాల్లో వినిపించేవి. ఈ ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాల యుగంలో కూడా ఈ మాటలు వినిపించాయంటే స్వతంత్ర భారత రాజ్యాంగ వ్యవస్థ సిగ్గు పడుతోంది. ఇంతటి దారుణ అంటరానితం సాక్షాత్తు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో కలకలం రేపుతోంది. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం గ్రామంలో ఓ చిన్న కారణానికి దళితులు సాంఘిక బహిష్కరణకు గురైన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, అధికారుల కథనం ప్రకారం.. మల్లాంలో వెలిశెట్టి జల్లిబాబు ఇంట్లో అదే గ్రామానికి చెందిన దళితుడు పల్లపు సురేష్ (37) ఈ నెల 16న కరెంటు పని చేస్తూ, విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సురేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 17న దళితులు ధర్నా నిర్వహించారు. ఇరు వర్గాల సమక్షంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ చర్చలు జరిపి సమస్య పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు సమావేశమై, దళితులపై సాంఘిక బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పలువురు దళితులు పిఠాపురం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

మాకు ఇబ్బంది రాకూడదనే అలా..

'మా పొలాలు, వ్యాపారాల్లో దళితులు పని చేస్తున్నారు. ఏదైనా చిన్న పొరపాటు జరిగితే మాపై తప్పుడు కేసులు పెట్టి, డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇటువంటి సంఘటనలు చాలా జరిగాయి. దీంతో వాళ్లకు ఏ పనీ చెప్పకపోతే మనకు ఇబ్బంది ఉండదు కదా అని ఒక నిర్ణయం తీసుకున్నాం. అంతే తప్ప మేము ఎవ్వరినీ సాంఘికంగా బహిష్కరించలేదు' అంటూ రెండో వర్గం వారు అధికారుల వద్ద చెప్పారు.



మంచిమాట

వారి పని వారినే చేయనీయటం మర్యాద

ఎంతోమందికి పేరు ప్రఖ్యాతులు రాకపోవటానికి కారణం ఆయా రంగాలలో నిష్ణాతులైన వారు అప్పడే వృద్ధిలోకి వస్తున్న వారికి అవకాశం ఇవ్వకుండా అన్నీ తామే చేసి, ఘనతని చాటుకుంటూ ఉండటమే. దీని వల్ల రెండు ప్రమాదాలు జరుగుతాయి. ఒకటి అవతలి వారు ఎప్పటికీ ఆ పని చేయలేరు. రెండవది వారికి తనని నిరూపించుకునే అవకాశం లభించక పోవటం. వాళ్ళు సరిగ్గా చేయరు కనుక మేము చేశాం అని సమర్థించుకుంటారు. పోనీ, ఒకసారి సరిగ్గా చేయక పోయినా నేర్చుకుంటారు మరొకసారికి. ఎవరూ మొదటిసారి నిర్దుష్టంగా చేయరు, ఈ మాట అన్నవారితో సహా!

చిన్నప్పుడు తెలుగు వాచకంలో గాడిద, కుక్క కథ చదివిన వారే అందరూ. ఎవరి పని వారే చేయాలి, చేయనియ్యాలి అన్నది ఆ కథలో ఉన్న నీతి అనుకుంటాం. అంతకు మించి ఉంది. అవతలి వారు చేసే పని తనకు కూడా వచ్చు కదా అని చేసేస్తే వారికి అవకాశం పోయినట్టే కదా!

సాహిత్యసభలో అధ్యక్షస్థానంలో ఉన్నవారు తరువాత మాట్లాడవలసిన ప్రధాన వక్త మాట్లాడవలసిన విషయాలు అన్నీ తాము చెప్పటమే కాదు, వారి సమయం కూడా వీరే మింగేస్తారు. ప్రధానవక్త ఏం చేయాలి? సమయస్ఫూర్తి ఉంటే సరి. లేకపోతే చాలా అయోమయంలో పడిపోవటం గమనించవచ్చు. తెలియక చేసేవారు కొంత మంది అయితే, కావాలని చేసే వారు మరికొంత మంది. పుస్తకానికి ముందు మాట రాయమంటే గ్రంథంలో ఉన్న విషయాన్ని సంగ్రహంగా చెప్పేస్తారు. అది చదివిన వారికి గ్రంథం చదివే కుతూహలం చప్పబడిపోతుంది. ఉత్కంఠ కలిగించే విధంగా క్లుప్తంగా రాయటం ఎంతమందికి చేతనవును? ముందుమాట గాని, విమర్శ గాని, వ్యాఖ్యానం గాని చదివినా, విన్నా గ్రంథం చదవాలనే కుతూహలం కలగాలి. ఇందులో ఉన్నది ఇంతే కదా! అనే భావన కలుగ కూడదు. దీన్నే అంటారు బంగాళాఖాతం అంత ఉపోద్ఘాతం అని. తనకు ఎంత తెలుసు అన్నది ముఖ్యం కాదు ఎంత ప్రదర్శించాలి అన్నది ప్రధానం. అటువంటి వారిని మఱ్ఱిచెట్లతో పోలుస్తారు.

పోతనామాత్యులవారు శ్రీమద్భాగవతాన్ని అనువాదం చేస్తూ, తనకు కలిగిన భాగ్యం తన శిష్యులకి కూడా కలగాలని వారికి కూడా అవకాశం ఇచ్చాడు. వెలిగందల నారయ, గంగన, ఏల్చూరి సింగన పేర్లు కూడా గ్రంథస్థం చేశాడు. శిష్యుల చేత చేయించి, అది కూడా తన పేరుతో ప్రచురించుకునే 'బాధ గురువు' కాదు. ఆ అవకాశం ఇవ్వక పోతే వాళ్ళ పేర్లు ఎవరికి తెలిసేవి కావు.

> **మఱ్ఱి**
> చెట్టు నీడని ఇచ్చి సేద తీరుస్తుంది కాని, దాని నీడలో మరొక మొక్క గాని, కనీసం గడ్డి కూడా పెరగదు. తన విస్తరణ ఎదుగుదల మరి ఎవ్వరికీ అవకాశం లేకుండా చేయటం సమంజసం కాదు. సజ్జనులు అ విధంగా చేయరు. ఈ విషయం నత్కీరుడి కథలో బాగా తెలుస్తుంది. నత్కీరుడు ద్రవిడ దేశంలో పెద్ద పండితకవి. అందరి కవిత్వంలో తప్పులు పడతాడు. శివుడితోనే వాదించి శాపం పొంది, శాప విమోచనం కోసం కుమారస్వామిని సేవించుకోవడానికి రాజ్యం వదలి వెళ్ళాడు. అప్పుడు అక్కడ ఉన్న కవుల ముఖకమలాలు వికసించాయి అంటాడు శ్రీనాథుడు. అతడు ఉన్నంత కాలం ఎవరికి అవకాశం ఇచ్చే వాడు కాదు.

కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడు యుద్ధం చేసి ఉంటే అర్జునుడికి మహావీరుడనే ఖ్యాతి వచ్చేది కాదు. ఆ మాటే కుంతి దేవి అంటుంది. 'ధర్మరాజుని పట్టాభిషిక్తుణ్ణి చేయటానికి అర్జునుడికి మహావీరుడనే ఖ్యాతి రావటానికి నువ్వు అవతరించావని కొందరు అంటూ ఉంటారు.'' అంటుంది. నిజమే కదా!

అందరికీ తమని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలి. అది ఔదార్యం.

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆత్మదర్శనం

దైవకృప అంటే అదే!



సమస్యలు అనేవి ప్రత్యేకంగా ఉండవు. నీవు శరీరం–మనస్సులతో కలిసిపోయినపుడే సమస్యలనేవి కనిపిస్తాయి. ఆత్మతత్వంలో ఉన్నప్పుడు, సాక్షీభావనతో ఉన్నప్పుడు సమస్యలతో కలిసిపోవు. నీ మనస్సు నీ సంస్కారాలు ఎల్లప్పుడూ నిన్ను ఆత్మపథం నుండి దారిమళ్ళిస్తూనే ఉంటాయి. మనస్సు నిన్ను ఆత్మతత్వం వైపు వెళ్ళనివ్వదు. మనస్సుతో నీవు కలిసిపోతే సమస్యల్లో మునిగి ఆత్మకు దూరమవుతావు. లేదా శరీర సంబంధమైన సుఖాలు లేదా దుఃఖాలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు, ఇష్టాలు, అయిష్టాలు, జబ్బులు, భయాలు మొదలైన వాటిల్లో కూరుకుని పోయి నీ నిజతత్వానికి దూరమయ్యే అవకాశాలు చాలా ఉంటాయి. ఆత్మపథంలో ఇన్నిరకాల అవరోధాలు తప్పవు. ఐనప్పటికీ దైవ కృప వల్ల ఆత్మదర్శనం పొందుతావు. నీ సంస్కారాలు నశించి ఆత్మ ఉత్తేజితమైనప్పుడు ఆత్మదర్శనం జరుగుతుంది. నీవే ఆ చైతన్యమైపోతావు. ఇదే దైవకృప అంటే. ఆత్మ సహకారమే దైవకృప.

ఆత్మదర్శనం అంత సులభంగా జరిగిపోదు. మనస్సు నిన్ను ఎన్నిరకాలుగా బంధీ చేయవచ్చునో అన్ని రూపాల్లోనూ నీకు ఆటంకాలు కల్పిస్తూనే ఉంటుంది, నీ సంస్కారాలకు అనుగుణంగా. ఎన్ని ఆటంకాలు కల్గినా నేను ఆత్మను అనే ఎరుక నిరంతరంగా ఉండాలి. కీర్తి, అపనింద, అధికారం, రకరకాల ఆకర్షణలు, వ్యసనాలు, ఆందోళనలు మొదలైనవి కుటుంబం రూపంలో, పిల్లల రూపంలో భార్యభర్తల రూపంలో, తల్లిదండ్రుల రూపంలో నిన్ను కిందికి లాగటానికి ప్రయత్నిస్తూనే ఉంటాయి. ఐనప్పటికీ వీటికి అంటకుండా సాక్షీతత్వంలో ఉన్నప్పుడే సత్యాన్ని తెలుసుకోగలవు. అందుకే భగవద్గీతలో కృష్ణుడు అంటాడు. కోటిమందిలో ఒక్కరు మాత్రమే ఆత్మదర్శనాన్ని పొందగలరని. నిజానికి ఇక్కడ గెలుపు ఓటములనేవే ఉండవు. కేవలం సంఘటనలు జరుగుతుంటాయి. మనమే వాటితో కలిసిపోతూ ఉంటాము. నేను సాక్షీచైతన్యాన్ని అని తెలుసుకున్నప్పుడు ద్వంద్వాలు నీకు అంటనే అంటవు. జీవితంలో వచ్చే గెలుపు ఓటములు, లాభనష్టాలు, శరీరానికి వచ్చే వ్యాధులు మొదలైన వాటికి అతీతంగా ఎదగాలి. మన సంస్కారాల వల్లనే ఇవన్నీ ఏర్పడతాయి. శరీరం–మనస్సు నిత్యం మనల్ని ఆత్మతత్వం నుండి మళ్ళిస్తూ ఉంటుంది. ఇవన్నీ రకరకాల బంధనాలే. వేటికి చిక్కినా మళ్ళీ రాగద్వేషాల్లో పడి దుఃఖంలో కూరుకుపోతావు. అందుకే ఆత్మదర్శనం పొందడం అంత సులభం కాదంటారు. శరీరానికి కష్టం కల్గినపుడు లేదా ఏదైనా జబ్బు వచ్చినపుడు శరీరంతో మరింతగా కలిసిపోయి వ్యథలో కూరుకుపోయే అవకాశాలెక్కువ. శరీరానికి నొప్పి కల్గినప్పుడు ఈ శరీరం నేను కాదు, దీని వెనుక సాక్షిగా చూస్తున్న చైతన్యాన్నే నేను అనే ఎరుకను నిత్యం తీసుకురావాలి. అప్పుడే ఆ సంస్కారం నుండి బయట పడగలవు. అలాగే శత్రువులు, మిత్రులు, నీ పిల్లలు, భార్య/భర్త, తల్లిదండ్రులు, వృత్తి, సౌకర్యాలు మొదలైన వాటికి సంబంధించిన ఆలోచనలు వచ్చినప్పుడు కూడా వాటిని దూరం నుంచి సాక్షిగా చూడగలగాలి. ఈ సాక్షీతత్వం నిరంతరంగా ఉన్నప్పుడే శరీరం–మనస్సుల నుండి బయటపడగలవు. వాటికి అతీతుడివి కాగలవు.




– స్వామి మైత్రేయ
ఆధ్యాత్మిక బోధకులు

ఆధ్యాత్మికథ

ధర్మనిష్ఠ

అది ఒక గురుకులం. ఒక శిష్యుడికి శిక్షణ పూర్తయింది. గురువుగారు అతన్ని పిలిచి ''నాయనా! ఇక నీ శిక్షణ పూర్తయింది. నీవిక వెళ్లి, గృహస్థాశ్రమం స్వీకరించి, నీ విద్యలన్నిటినీ లోకకల్యాణానికి ఉపయోగించు.'' అని చెప్పాడు. ఆ శిష్యుడు చాలా పేదవాడు. అయినప్పటికీ, గురువుగారికి ఎంతో కొంత దక్షిణ చెల్లించాలనుకుని గురువుగారిని అడిగాడు దక్షిణ ఏమి కావాలని. అతని గురించి తెలిసిన గురువుగారు ''నాకేమీ వద్దు'' అని చెప్పారు. అయినా సరే, వదలకుండా పదే పదే అడుగుతుండడంతో విసిగిపోయిన గురువు ''నీకు నేను 14 విద్యలను నేర్పాను. ఒక్కో విద్యకూ లక్ష బంగారు నాణాల చొప్పున పద్నాలుగు లక్షల బంగారు నాణాలు చెల్లించు'' అని చెప్పాడు.

గురుదక్షిణ చెల్లించాలన్న సంకల్పమే తప్ప దానిని ఎలా సమకూర్చుకోవాలో తెలియని ఆ శిష్యుడు కౌత్సుడు. అయితే, రాజు తండ్రి వంటి వాడు కాబట్టి రాజునే అడుగుదామనుకుని నేరుగా రాజు వద్దకు వెళ్లాడు. ఆ రాజు రఘువు. మహాపరాక్రమవంతుడు, ధర్మనిష్ఠాగరిష్ఠుడు. ఆడిన మాట తప్పనివాడు. కౌత్సుడు ఆయన వద్దకు వెళ్లడానికి ముందురోజే ఆయన విశ్వజీ అనే యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞ నియమంగా తనకున్న సర్వస్వాన్నీ దానం చేశాడు. కౌత్సుడు వెళ్లేసరికి ఆయన మట్టిపిడతలతోనే సంధ్యావందనం చేసుకుంటున్నాడు. అది గమనించిన కౌత్సుడు ఏమీ అడగకుండానే వెనుదిరగబోతుండగా, రఘుమహారాజు అతన్ని ఉండమన్నట్లుగా సైగ చేసి, సంధ్యావందనం ముగియగానే ఏం కావాలని అడిగాడు. గురుదక్షిణ చెల్లించడానికి తనకు 14 లక్షల బంగారు నాణాలు కావాలన్నాడు కౌత్సుడు. ఎవరినీ ఖాళీ చేతులతో పంపకూడదన్న నియమం కలవాడైన ఆ రాజు ''అలాగే ఇస్తాను కానీ, ప్రస్తుతానికి లేవు కాబట్టి రేపు ఉదయం వచ్చి తీసుకు వెళ్లు'' అని చెప్పాడు.



సరేనంటూ సంతోషంగా సెలవు తీసుకున్నాడు కౌత్సుడు. తన వద్ద ధనం లేదు కాబట్టి, ఏం చేయాలో తగిన తరుణోపాయం చెప్పమని గురువైన వశిష్ఠుని అడిగాడు రఘుమహారాజు.

''రాజా! నీకు కావలసిన ధనాన్ని సమకూర్చగల సమర్థుడు ఇంద్రుడొక్కడే. కాబట్టి వెంటనే ఇంద్రుని మీద దండెత్తడమే ఉత్తమం'' అని సలహా ఇచ్చాడు వశిష్ఠుడు.

గురువు సలహా మేరకు వెంటనే ఇంద్రుని మీద యుద్ధం చేస్తున్నట్లుగా భేరీలు మోగించాడు రఘువు. ఆ భేరీ నాదాలు అయోధ్యా నగరం నుంచి వస్తున్నాయని తెలుసుకున్న ఇంద్రుడు వెంటనే ధర్మపరాయణుడు, పరాక్రమవంతుడు అయిన రఘుమహారాజుకు కోపం తెప్పించడం కంటే ఆయనతో సంధి చేసుకోవడమే మేలని, దిక్పాలకులను ఆదేశించి, ఆ రాజ్యమంతటా బంగారు వర్షం కురిపించాడు. కొద్దిసేపటిలోనే కోశాగారమంతా నిండి, రాజ్యమంతటా బంగారు నాణాలతో నిండిపోయింది. దాంతో వెంటనే ఇంద్రునిపై యుద్ధం విరమిస్తున్నట్లు ప్రకటించి రఘుమహారాజు, కౌత్సుడిని పిలిపించి, నీవడిగిన ధనం కోశాగారంలో ఉంది తీసుకు పొమ్మని చెప్పాడు.

తనకు కావలసిన దానికన్నా ఎక్కువ ధనం ఉందని తెలుసుకున్న కౌత్సుడు తనకు కావలసినంత మాత్రమే తీసుకుని వెళ్లి, గురుదక్షిణ చెల్లించుకున్నాడు.

మిగిలిన ధనమంతటినీ ఇంద్రుడికి తిరిగి పంపించేశాడు రఘువు.

అంతటి ధర్మాత్ముడైన రఘు వంశంలో పుట్టిన వాడు కాబట్టే రాముడికి ఆయన గుణాలన్నీ అలవడ్డాయి.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా



● చిరంజీవి

భారీ విశ్వంభర

● రూ. 75 కోట్లతో గ్రాఫిక్స్

'విశ్వంభర' విజువల్స్ ప్రేక్షకులను అబ్బురపరిచేలా ఉండబోతున్నాయని తెలిసింది. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న సోషియో ఫ్యాంటసీ యాక్షన్ మూవీ 'విశ్వంభర'. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఒక పాట మినహా ఈ సినిమా పూర్తయిందట. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. కాగా ఈ సినిమాలోని గ్రాఫిక్స్ కోసమే రూ. 75 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారని సమాచారం. హాలీవుడ్ సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం పని చేస్తున్నారు. సో... విజువల్స్ పరంగా 'విశ్వంభర' ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనున్నట్లుగా తెలుస్తోంది.

ఫైట్‌కి రెడీ..

ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీ మేకర్స్ పతాకాలపై కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కె. హరికృష్ణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ రేపటి నుంచి కర్ణాటకలో ప్రారంభం కానుంది. ఈ చిత్రీకరణలో పాల్గొనడానికి ఆదివారం కర్ణాటక వెళ్లారు ఎన్టీఆర్. కర్ణాటకలో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి యూనిట్ ప్లాన్ చేసిందనే వార్త వినిపించింది. దీంతో 'మారణ హోమానికి ముందు ప్రశాంతంగా..' అని అర్థం వచ్చేలా ఎన్టీఆర్ కొత్త స్టిల్స్‌ను యూనిట్ షేర్ చేసింది. ఆ విధంగా ఈ కొత్త షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్ తీయనున్నట్లు యూనిట్ స్పష్టం చేసింది.



● ఎన్టీఆర్



● ధనుష్

అట్నే ఉండు

'ఏ... వన్ డే హీరో నువ్వే ఫ్రెండు... నీ కోసమే డప్పుల్ సౌండు... అస్సల్ తగ్గక్... అట్నే ఉండు... మొక్కుతారు కాళ్లు రెండు...' అంటూ ఊర మాస్ పాట పాడారు హీరో ధనుష్. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మికా మందన్నా ముఖ్య తారలుగా సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న 'కుబేర' చిత్రంలో 'పోయిరా మామా...' అంటూ సాగే ఈ పాటను విడుదల చేశారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకి భాస్కరభట్ల సాహిత్యం అందించగా ధనుష్ పాడారు. శేఖర్ వీజే నృత్య రీతులు సమకూర్చారు. తమిళ, తెలుగు భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రం జూన్ 20న హిందీ, కన్నడ, మలయాళం భాషల్లోనూ విడుదల కానుంది.



● విజయ్ సేతుపతి

మొత్తం మలేసియాలోనే...

విజయ్ సేతుపతి హీరోగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం 'ఏసీఈ'. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యోగిబాబు, బి.ఎస్. అవినాష్, దివ్య పిళ్లై, బబ్లూ, రాజ్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఆరుముగ కుమార్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ మొత్తం మలేసియాలో జరగడం విశేషం. ఈ చిత్రాన్ని మే 23న రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, నేపథ్య సంగీతం: సామ్ సీఎస్.

నాడప్రభు పుట్టస్వామిగా శివ రాజ్‌కుమార్



కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ అతిథి పాత్రలో 'కేజీయఫ్, సలార్' చిత్రాల సంగీతదర్శకుడు రవి బస్రూర్ దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'వీర చంద్రహాస'. శిథిల్ శెట్టి, నాగశ్రీ జీఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి ముఖ్య పాత్రల్లో హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఎన్ఎస్ రాజ్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలైంది. ఈ చిత్రాన్ని తెలుగులో కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ త్వరలో రిలీజ్ చేయనున్నారు. ''వీర చంద్రహాస' మంచి వసూళ్లతో దూసుకెళుతోంది. రవి బస్రూర్ ఈ చిత్రంతో దర్శకుడిగానూ మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. శివ రాజ్‌కుమార్ చేసిన నాడప్రభు పుట్టస్వామి పాత్ర హైలైట్‌గా నిలుస్తుంది. యక్షగానం ప్రధానాంశంగా రూపొందిన ఈ చిత్రం మంచి అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని ఎమ్‌వీ రాధాకృష్ణ పేర్కొన్నారు.

ఉపేంద్రలాంటి పాత్ర చేయాలని ఉంది

– సంపూర్ణేష్ బాబు



● సంజోష్, సంపూర్ణేష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్ హీరోలుగా మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చగంలా నిర్మించిన చిత్రం 'సోదరా'. ఈ చిత్రం ఈ నెల 25న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధాన్ని 'సోదరా' గొప్పగా చూపించనుంది. మంచి కుటుంబ కథా చిత్రం ఇది. మన జీవితాల్లోని సంఘటనలు గుర్తుకు వస్తాయి. నేను నరసింహాచారి (సంపూర్ణేష్ బాబు అసలు పేరు)లా ఎలా ఉంటానో ఈ సినిమాలో అలా చేశాను. ఈ సినిమాలో భావోద్వేగాలతో పాటు హాస్యం కూడా ఉంది. ప్రస్తుతం కొన్ని సినిమాలతో పాటు 'సూపర్ సుబ్బు' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నాను. ఇక నాకైతే 'ఏ' సినిమాలో ఉపేంద్రలాంటి పాత్ర చేయాలని ఉంది'' అని తెలిపారు. సంజోష్ మాట్లాడుతూ – ''సోదరా'లో అమాయకుడైన అన్నగా సంపూర్ణేష్ బాబు, అప్‌డేటెడ్ తమ్ముడు పాత్రలో నేను నటించాం. ఈ సినిమాతో ప్రేక్షకులను నవ్విస్తాం... ఏడిపిస్తాం. ఇక నేను హీరోగా జూన్‌లో ఓ కొత్త సినిమా ప్రారంభం కానుంది. ఇందులో ఇగోయిస్ట్ పోలీసాఫీసర్‌గా కనిపిస్తా. ఇగోయిస్ట్ పోలీసాఫీసర్‌కి, ఓ కామన్‌మ్యాన్‌కి మధ్య జరిగే పోరే ఈ సినిమా'' అన్నారు.

ఓదెల 2 సక్సెస్ బాటలో వెళుతోంది

– సంపత్ నంది



● వశిష్ఠ, అశోక్ తేజ, డి. మధు, సంపత్ నంది

''నాలుగైదేళ్ల క్రితం భక్తి భావంలేని నేను 'ఓదెల 2' కథ రాశానంటే ఆ పరమశివుడే నాతో రాయించాడు. స్క్రీన్‌పై నంది, శివుడు విజువల్స్ కనిపించినప్పుడు ప్రేక్షకులు ఫీలైన విషయాన్ని నాకు ఫోన్ చేసి, చెప్తుంటే చాలా సంతోషంగా అనిపించింది. మా ఊరివాళ్లు ఫోన్ చేసి, 'ప్రైడ్ ఆఫ్ ఓదెల' అని చెబుతుంటే అద్భుతంగా భావిస్తున్నాను. ఈ సినిమా ఎప్పటికీ నా మనసులో ఉండిపోతుంది'' అన్నారు దర్శకుడు సంపత్ నంది. తమన్నా ప్రధాన పాత్రలో, వశిష్ఠ, హెబ్బా పటేల్ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'ఓదెల 2'. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్ వర్క్స్‌పై డి. మధు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలైంది. ఈ సందర్భంగా జరిగిన సక్సెస్‌మీట్‌లో సంపత్ నంది మాట్లాడుతూ– ''రిలీజ్‌కు ముందే ఈ సినిమా బ్రేక్ ఈవెన్ అయ్యింది. ఆల్రెడీ 'ఓదెల 2' సక్సెస్‌బాటలో వెళ్తోంది. ఈ సినిమా అనుకున్నప్పుడే తమన్నాగారిని అనుకున్నాం. ఆమె అద్భుతంగా నటించారు. 'ఓదెల 2' లోని సమాధి శిక్ష, సైకిల్ ఎపిసోడ్, క్లైమాక్స్... వీటి గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. సినిమాలో ఉన్న మంచిని మాత్రమే స్ప్రెడ్ చేయండి'' అన్నారు. ''సినిమా చూసిన ప్రేక్షకులు బాగుందని అంటున్నారు. కానీ కొంతమంది క్రిటిక్స్ మాత్రం నెగటివ్‌గా రాశారు. వారికంటే మాకు ప్రేక్షకుల ఫీలింగే ముఖ్యం'' అని తెలిపారు నిర్మాత డి. మధు. ''మా 'ఓదెల 2'కు మౌత్ టాక్ స్ప్రెడ్ అవుతోంది. కలెక్షన్స్ పెరుగుతున్నాయి'' అని అన్నారు అశోక్ తేజ.

సూర్యాపేట్ జంక్షన్‌లో...



● నైనా, ఈశ్వర్

'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ కీలక పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25 విడుదల కానుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గ్లోబల్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ఈ చిత్రంలో యాక్షన్ సీన్స్ కూడా చాలా సహజంగా ఉంటాయి'' అన్నారు. ''సూర్యాపేట్ జంక్షన్' సినిమాని థియేటర్స్‌లో చూసి, మమ్మల్ని ఆదరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం'' అన్నారు అనిల్‌కుమార్ కాట్రగడ్డ.

మా సినిమా మహిళలకు అంకితం

– సుమయ రెడ్డి



● రాజీవ్ కనకాల, సుమయ

''**డి**యర్ ఉమ'కి ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి హ్యాపీగా ఉంది. ఎన్నో సినిమాలు విడుదలకు నోచుకోవడం లేదు. కానీ, మేం సక్సెస్‌ఫుల్‌గా రిలీజ్ చేశాం. అదే నాకు పెద్ద సక్సెస్. మా చిత్రాన్ని మహిళలందరికీ అంకితం చేస్తున్నాను. మంచి కథతో తీసిన మా చిత్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుతున్నాను'' అని సుమయ రెడ్డి తెలిపారు. ఆమె కథ అందించి, హీరోయిన్‌గా నటించి, నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయిరాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరో. గత శుక్రవారం ఈ చిత్రం విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో సాయిరాజేశ్ మహాదేవ్ మాట్లాడుతూ– ''మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు. ''సుమయ ఎంతో కష్టపడి నిర్మించిన 'డియర్ ఉమ'ని ప్రేక్షకులు ఆదరించి, ముందుకు తీసుకువెళ్లాలి'' అని కోరారు రాజీవ్ కనకాల.

ప్రేమ... థ్రిల్



● పల్లవి, సమీర్ దత్త

పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం '6 జర్నీ'. రవిప్రకాశ్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి రాథోడ్, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. బసీర్ అలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాశ్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. ''ఈ సినిమా మేం అనుకున్న విధంగా బాగా రావడానికి కారణం మా టీమ్'' అన్నారు బసీర్. ''లవ్, యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు సమీర్ దత్త. ''యాక్షన్, మిస్టరీ, లవ్.... ఇలా అన్ని ఎలిమెంట్స్‌తో రూపొందించిన ఈ చిత్రం అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు రవిప్రకాశ్ రెడ్డి.



భారత జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ రమేశ్ సస్పెండ్

న్యూఢిల్లీ: భారత జూనియర్ అథ్లెటిక్స్ జట్టు చీఫ్ కోచ్ నాగపురి రమేశ్‌ను జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) సస్పెండ్ చేసింది. హైదరాబాద్‌లోని 'సాయ్' కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న అథ్లెట్ల నుంచి శాంపిల్స్ సేకరించేందుకు ఇటీవల 'నాడా' డోప్ కలెక్షన్ ఆఫీసర్లను పంపించింది. ఆ సమయంలో డోప్ కలెక్షన్ ఆఫీసర్లకు శాంపిల్స్ ఇవ్వకుండా ఇద్దరు అథ్లెట్లను రమేశ్ బయటకు పంపించారని సమాచారం. దాంతో 'నాడా' నియమావళిలోని ఆర్టికల్ 2.9 ప్రకారం రమేశ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. 'నేను ఎలాంటి తప్పుడు పనులు చేయలేదు. తప్పుడు పనులను చేసే వారిని ప్రోత్సహించను' అని రమేశ్ అన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన 59 ఏళ్ల రమేశ్ హైదరాబాద్‌లోని భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కేంద్రంలో కోచ్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2016లో 'ద్రోణాచార్య' అవార్డు గెల్చుకున్న రమేశ్... మహిళల 100 మీటర్ల పరుగులో జాతీయ రికార్డు నెలకొల్పిన ద్యుతీచంద్, పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జివాంజి దీప్తి, ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన నందిని లాంటి ఎందరో అథ్లెట్లకు శిక్షణ ఇచ్చారు. 2023 జూన్ నుంచి ఆయన జాతీయ జూనియర్ చీఫ్ కోచ్‌గా ఉన్నారు. మరోవైపు డోపింగ్ పరీక్షలకు అందుబాటులోకి రాని ఏడుగురు అథ్లెట్లను కూడా 'నాడా' సస్పెండ్ చేసింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షణ్ముగ శ్రీనివాస్, చెలిమి ప్రత్యూష ఉన్నారు.

ఇటు రోహిత్ అటు కోహ్లి

భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విజృంభించారు. భారీ షాట్లతో అలరిస్తూ ఆదివారం అభిమానులకు డబుల్ ధమాకా అందించారు. పంజాబ్ కింగ్స్‌తో పోరులో కోహ్లి క్లాసిక్ ఇన్నింగ్స్‌తో కదంతొక్కగా... చెన్నైతో మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఊర మాస్ షాట్లతో చెలరేగిపోయాడు. ఫలితంగా పంజాబ్‌పై బెంగళూరు బదులు తీర్చుకోగా... చెన్నైపై ముంబై ఇండియన్స్ భారీ విజయం నమోదు చేసుకుంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఓ మాదిరి ప్రదర్శనతో సరిపెట్టుకున్న రోహిత్.. తనను 'హిట్‌మ్యాన్' ఎందుకు అంటారో వాంఖడేలో నిరూపించాడు. విరాట్ దూకుడుతో బెంగళూరు పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి దూసుకెళ్లగా... రోహిత్ మెరుపులతో ముంబై నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. ఓపెనర్లుగా తొలి ఓవర్‌లోనే క్రీజులో అడుగుపెట్టిన ఈ ఇద్దరూ చివరి వరకు అజేయంగా నిలిచి తమ జట్లను గెలిపించడం కొసమెరుపు.



రోహిత్

ఆకాశమే హద్దుగా చెలరేగిన హిట్‌మ్యాన్, సూర్యకుమార్

- 177 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించిన ముంబై
- చెన్నైపై 9 వికెట్లతో జయభేరి

ముంబై: సిక్స్... ఫోర్... ముంబై ఇన్నింగ్స్ మొత్తం ఇదే తీరు! బంతి పడటమే ఆలస్యం బౌండరీ వెళ్లేందుకు ఓసారి, సిక్స్ అయ్యేందుకు మరోసారి బంతి అదేపనిగా ముచ్చట పడిందనిపించింది. 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ, టి20 స్పెషలిస్ట్ సూర్యకుమార్‌ల ఆట మ్యాచ్‌లో హైలైట్స్‌ను చూపించ లేదు. హైలైట్సే మ్యాచ్‌గా మార్చేసింది. దీంతో ముంబై 177 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించింది. చెన్నైపై 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ముందుగా చెన్నై సూపర్‌కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. జడేజా (35 బంతుల్లో 53 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివమ్ దూబే (32 బంతుల్లో 50; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ముంబై 15.4 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 177 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ (45 బంతుల్లో 76 నాటౌట్; 4 ఫోర్లు, 6 సిక్స్‌లు), సూర్య (30 బంతుల్లో 68 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) హోరెత్తించారు.

దంచేసిన జడేజా, దూబే

ఆంధ్ర కుర్రాడు షేక్ రషీద్ (20 బంతుల్లో 19; 1 ఫోర్)కు ఓపెనింగ్‌లో అవకాశమిస్తున్న ధోనిని నిరుత్సాహపరిచాడు. పవర్‌ప్లేలో 20 బంతులాడి కూడా ఒకే ఒక్క బౌండరీ బాదాడు. రచిన్ రవీంద్ర (5) విఫలమవగా, 17 ఏళ్ల 'లోకల్ బాయ్' ఆయుశ్ మాత్రే (15 బంతుల్లో 32; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఉన్నది కాసేపే అయినా ఫోర్లు, సిక్స్‌లతో అలరించాడు. తర్వాత వచ్చిన జడేజా, దూబే భారీషాట్లు బాదడంతో చెన్నై పుంజుకుంది. ఇద్దరు నాలుగో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. సిక్స్‌లు బాదిన దూబే 30 బంతుల్లో, జడేజా 34 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ధోని (4)ని బుమ్రా ఎంతో సేపు నిలువనీయలేదు.

బాదుడే... బాదుడు

రోహిత్ శర్మకు జతగా ఓపెనింగ్ చేసిన రికెల్టన్ తొలి ఓవర్లోనే బౌండరీలతో తమ ఉద్దేశం చాటగా, రెండో ఓవర్ నుంచి రోహిత్ విరుచుకుపడటంతో చెన్నై బౌలర్లకు కష్టాలు తప్పలేదు. మూడో ఓవర్లో సిక్స్, రెండు ఫోర్లు బాదాడు. జేమీ ఓవర్టన్ ఓవర్‌న్నర (9 బంతులు) వేసిన ఐదో ఓవర్లో రికెల్టన్, రోహిత్ చెరో సిక్స్ కొట్టడంతో 18 పరుగులు వచ్చాయి. దీంతో పవర్‌ప్లేలో 62 పరుగులు చేసిన ముంబై తర్వాతి ఓవర్లోనే రికెల్టన్ (19 బంతుల్లో 24; 3 ఫోర్లు, 1 సిక్స్) వికెట్‌ను కోల్పోయింది. సూర్యకుమార్ రావడం... రోహిత్‌తో కలిసి ధనాధన్ షోను డబుల్ చేసింది. ఇద్దరు బౌండరీలు, సిక్సర్లు కొట్టేందుకు పోటీపడటంతో స్టేడియం హోరెత్తింది. ముందుగా 'హిట్‌మ్యాన్' 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... సూర్య 26 బంతుల్లో అర్ధసెంచరీ అధిగమించాడు. ఇద్దరు బంతిని అదేపనిగా బౌండరీలైన్‌ను దాటిస్తూనే ఉండటంతో లక్ష్యం ముంబై వైపు నడిచివచ్చింది.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: షేక్ రషీద్ (స్టంప్డ్) రికెల్టన్ (బి) సాంట్నర్ 19; రచిన్ (సి) రికెల్టన్ (బి) అశ్వని 5; ఆయుశ్ (సి) సాంట్నర్ (బి) దీపక్ చహర్ 32; జడేజా (నాటౌట్) 53; దూబే (సి) జాక్స్ (బి) బుమ్రా 50; ధోని (సి) తిలక్ (బి) బుమ్రా 4; జేమీ ఓవర్టన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 176. **వికెట్ల పతనం:** 1–16, 2–57, 3–63, 4–142, 5–156. **బౌలింగ్:** చహర్ 4–0–32–1, బౌల్ట్ 4–0–43–0, అశ్వని 2–0–42–1, సాంట్నర్ 3–0–14–1, బుమ్రా 4–0–25–2, విల్ జాక్స్ 1–0–4–0, హార్దిక్ 2–0–13–0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) ఆయుశ్ (బి) జడేజా 24; రోహిత్ (నాటౌట్) 76; సూర్యకుమార్ (నాటౌట్) 68; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 177. **వికెట్ల పతనం:** 1–63. **బౌలింగ్:** ఖలీల్ 2–0–24–0, ఓవర్టన్ 2–0–29–0, అశ్విన్ 4–0–25–0, జడేజా 3–0–28–1, నూర్ 3–0–36–0, పతిరణ 1.4–0–34–0.

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా × గుజరాత్
వేదిక: కోల్‌కతా
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పంజాబ్‌పై 7 వికెట్లతో ఆర్‌సీబీ గెలుపు

- కట్టడి చేసిన కృనాల్, సుయశ్
- రాణించిన విరాట్, పడిక్కల్



కోహ్లి

ముల్లాన్‌పూర్: ముందు బౌలర్లు, తర్వాత బ్యాటర్లు రాణించడంతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు తమ సొంతగడ్డపై పోగొట్టుకున్న ఫలితాన్ని పంజాబ్‌కు వెళ్లి రాబట్టుకుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో బెంగళూరు 7 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. జోష్ ఇన్‌గ్లిస్ (17 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), శశాంక్ సింగ్ (33 బంతుల్లో 31; 1 ఫోర్) మెరుగ్గా ఆడారు. కృనాల్, సుయశ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. తర్వాత బెంగళూరు 18.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (54 బంతుల్లో 73 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టాడు. దేవదత్ పడిక్కల్ (35 బంతుల్లో 61; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించాడు.

కోహ్లి ఆఖరిదాకా...

పెద్ద లక్ష్యం కాకపోయినా... బెంగళూరు జట్టు తమ ఓపెనర్ ఫిల్ సాల్ట్ (1) వికెట్‌ను తొలి ఓవర్లోనే కోల్పోయింది. పంజాబ్‌కు దక్కింది ఈ ఆరంభ సంబరమే! అటు తర్వాత కథంతా కింగ్ కోహ్లి, పడిక్కల్ నడిపించారు. వన్‌డౌన్ బ్యాటర్ పడిక్కల్ భారీ సిక్సర్లతో విరుచుకుపడగా... కోహ్లి క్లాసిక్స్ షాట్‌లతో ముల్లాన్‌పూర్ ప్రేక్షకుల్ని గెలిచాడు. ఇద్దరు రెండో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. పడిక్కల్ అవుటైనా... ఆఖరిదాకా క్రీజులో నిలబడిన కోహ్లి జట్టును గెలిపించాడు.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	7	5	2	10	0.984
ఢిల్లీ	7	5	2	10	0.589
బెంగళూరు	8	5	3	10	0.472
పంజాబ్	8	5	3	10	0.177
లక్నో	8	5	3	10	0.088
ముంబై	8	4	4	8	0.483
కోల్‌కతా	7	3	4	6	0.547
రాజస్తాన్	8	2	6	4	-0.633
హైదరాబాద్	7	2	5	4	-1.217
చెన్నై	8	2	6	4	-1.392

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ష్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 22; ప్రభ్‌సిమ్రాన్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 33; అయ్యర్ (సి) కృనాల్ (బి) షెఫర్డ్ 6; ఇన్‌గ్లిస్ (బి) సుయశ్ 29; నేహల్ (రనౌట్) 5; శశాంక్ (నాటౌట్) 31; స్టొయినిస్ (బి) సుయశ్ 1; యాన్సెన్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 6 వికెట్లకు) 157. **వికెట్ల పతనం:** 1–42, 2–62, 3–68, 4–76, 5–112, 6–114. **బౌలింగ్:** భువనేశ్వర్ 4–0–26–0, యశ్ దయాళ్ 2–0–22–0, హాజల్‌వుడ్ 4–0–39–0, కృనాల్ పాండ్యా 4–0–25–2, షెఫర్డ్ 2–0–18–1, సుయశ్ 4–0–26–2. **రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** సాల్ట్ (సి) ఇన్‌గ్లిస్ (బి) అర్ష్‌దీప్ 1; కోహ్లి (నాటౌట్) 73; పడిక్కల్ (సి) నేహల్ (బి) హర్‌ప్రీత్ 61; పాటీదార్ (సి) యాన్సెన్ (బి) చహల్ 12; జితేశ్ శర్మ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (18.5 ఓవర్లలో 3 వికెట్లకు) 159. **వికెట్ల పతనం:** 1–6, 2–109, 3–143. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–26–1, జేవియర్ 3–0–28–1, హర్‌ప్రీత్ బ్రార్ 4–0–27–1, యాన్సెన్ 3–0–20–0, చహల్ 4–0–36–1, స్టొయినిస్ 1–0–13–0, నేహల్ 0.5–0–9–0.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

ఏపీలో టీచర్ కొలువుల పిలుపు

» 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
» ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» సీబీటీ విధానంలో జూన్ 6 నుంచి పరీక్షలు



ఏపీ డీఎస్సీ 2025

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలో మొత్తం 16,347 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఏపీ పాఠశాల విద్యాశాఖ ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో జిల్లా స్థాయిలో 14,088 పోస్టులు, జోనల్ స్థాయిలో 2,259 పోస్టులు ఉన్నాయి. వీటిల్లో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, టీజీటీ, ఎస్‌జీటీ–స్పెషల్ ఎడ్యుకేషన్, ప్రిన్సిపల్స్ తదితర పోస్టులు ఉన్నాయి.

ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్తు, పురపాలక, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, జువనైల్ సంక్షేమ పాఠశాలల్లోని పోస్టులకు జిల్లా స్థాయిలో నియామకాలు చేపడతారు. అదేవిధంగా బధిర, అంధుల పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్, ఏపీ ఆదర్శ పాఠశాలలు, సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లోని పోస్టులకు రాష్ట్ర, జోనల్ స్థాయిలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 16,347(ఎస్‌జీటీ – 6, 599 పోస్టుల, స్కూల్ అసిస్టెంట్–7,487 పోస్టులు)
- **అర్హతలు:** ఆయా పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియెట్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, డీఈఈడీ, ఏపీ టెట్/సీటెట్‌లో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 01.07.2024 నాటికి 18–44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ /ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి 49 ఏళ్లు, దివ్యాంగులకు గరిష్ఠ వయోపరిమితి 54ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక విధానం ఇలా

- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహిస్తారు. ఎక్కువ మంది హాజరయ్యే ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల పరీక్షలు 80 మార్కులకు ఉంటాయి. వీరికి టెట్‌కు 20 మార్కుల వెయిటేజీ ఉంటుంది.
- 80 మార్కులకు జరిగే ఎస్‌జీటీ పరీక్షలో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 8 మార్కులకు, పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 4 మార్కులకు, ఎడ్యుకేషనల్ సైకాలజీ 8 మార్కులకు, కంటెంట్ అండ్ మెథడాలజీ 60 మార్కులకు ఉంటాయి.
- స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి 80 మార్కులకు నిర్వహించే పరీక్షలో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 10 మార్కులకు, పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 5 మార్కులకు, ఎడ్యుకేషనల్ సైకాలజీ 5 మార్కులకు, సబ్జెక్ట్ కంటెంట్ అండ్ మెథడాలజీ 60 మార్కులకు ఉంటాయి.
- ప్రిన్సిపల్, పీజీటీ (నాన్ లాంగ్వేజ్), టీజీటీ(నాన్ లాంగ్వేజ్) పోస్టులకు పేపర్ 1గా 100 మార్కులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫెషియన్సీ టెస్ట్(ఇంటర్మీడియెట్ స్థాయి) ఉంటుంది. ఇందులో అర్హత సాధిస్తేనే పేపర్ 2 మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. వీరికి 100 మార్కులకు నిర్వహించే పేపర్ 2లో జీకే అండ్ కరెంట్ అఫైర్స్ 15 మార్కులకు, పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ 15 మార్కులకు, ఎడ్యుకేషనల్ సైకాలజీ 20 మార్కులకు, కంటెంట్ 35 మార్కులకు, మెథడాలజీ 15 మార్కులకు ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. గతంలో రద్దయిన డీఎస్సీ–2024కి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** 20.04.2025
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 15.05.2025
- **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సౌకర్యం:** 30.05.2025 నుంచి
- **డీఎస్సీ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీలు:** 06.06.2025 నుంచి 06.07.2025
- **వెబ్‌సైట్:** https://cse.ap.gov.in and https://apdsc.apcfss.in

సీఏ.. కార్పొరేట్ కొలువులకు మార్గం

» సీఏలకు పెరుగుతున్న డిమాండ్
» ఇంటర్‌తోనే సీఏలో చేరే అవకాశం



ఆఫ్టర్ ఇంటర్

చార్టర్డ్ అకౌంటెన్సీ.. సంక్షిప్తంగా సీఏ! కామర్స్ ప్రొఫెషనల్ కోర్సుల్లో.. అత్యంత క్రేజీ కోర్సు. ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు స్వాగతం పలకడం ఖాయం! అయితే ఈ కోర్సు పూర్తి చేయడం కష్టమని.. ఉత్తీర్ణత శాతం తక్కువనే అభిప్రాయాలు!! నిర్దిష్ట ప్రణాళికతో.. సిలబస్‌పై పట్టు సాధిస్తే విజయం సాధ్యమే అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో.. ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఉపయోగపడేలా.. సీఏ కోర్సు స్వరూపం, ప్రయోజనాలు, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..

భవిష్యత్తులో లే ఆఫ్‌లు, పింక్‌స్లిప్‌లు వంటి ఒడిదుడుకులు లేని కెరీర్‌కు మార్గం వేసే కోర్సుగా సీఏను పేర్కొనొచ్చు. ఇంటర్మీడియెట్ పూర్తయిన వెంటనే ఈ దిశగా అవగాహనతో అడుగులు వేస్తే.. కోర్సు పూర్తి చేసుకోవడం కష్టమేమీ కాదు అంటున్నారు నిపుణులు.

మూడు దశలుగా సీఏ

సీఏ కోర్సును ప్రస్తుతం ఐసీఏఐ మూడు దశల్లో నిర్వహిస్తోంది. అవి.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్.

ఫౌండేషన్ ఇలా

సీఏ కోర్సులో మొదటి దశ ఫౌండేషన్ కోర్సు. ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్నాక ఫౌండేషన్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకున్న నాలుగు నెలలకు పరీక్షకు హాజరయ్యే అర్హత లభిస్తుంది. సీఏ ఫౌండేషన్ పరీక్షను ప్రతి ఏటా మూడు సార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు.

- సీఏ ఫౌండేషన్ నాలుగు పేపర్లలో 400 మార్కులకు ఉంటుంది. అవి.. **పేపర్–1:** అకౌంటింగ్; **పేపర్–2:** బిజినెస్ 'లా'స్, **పేపర్–3:** క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, బిజినెస్ మ్యాథమెటిక్స్, లాజికల్ రీజనింగ్, స్టాటిస్టిక్స్; **పేపర్–4:** బిజినెస్ ఎకనామిక్స్.
- ఒక్కో పేపర్‌లో 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. 50 శాతం ప్రశ్నలు డిస్క్రిప్టివ్ విధానంలో, మరో 50 శాతం ప్రశ్నలు ఆబ్జెక్టివ్ పద్ధతిలో(ఎంసీక్యూలు) ఉంటాయి. ప్రతి పేపర్‌లో కనీసం 40 శాతం మార్కులు చొప్పున మొత్తం అన్ని పేపర్లు కలిపి 50 శాతం మార్కులు(200 మార్కులు) సాధిస్తే ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత పొందినట్లే. దీంతో రెండో దశ ఇంటర్మీడియెట్‌లో పేరు నమోదుకు అర్హత లభిస్తుంది.

సీఏ ఇంటర్మీడియెట్.. ఆరు సబ్జెక్ట్‌లు

- సీఏ కోర్సులో రెండో దశ సీఏ ఇంటర్మీడియెట్. ఐసీఏఐ నూతన మార్పుల ప్రకారం– ఇంటర్మీడియెట్‌లో రెండు గ్రూప్‌లుగా ఆరు సబ్జెక్ట్‌లలో పరీక్ష నిర్వహిస్తారు.
- సీఏ ఫౌండేషన్, డిగ్రీ ఉత్తీర్ణులు, సీఎంఏ ఇంటర్, సీఎస్ ఇంటర్ ఉత్తీర్ణులు సీఏ ఇంటర్మీడియెట్‌కు అర్హత పొందుతారు. కామర్స్ గ్రాడ్యుయేట్స్ 55 శాతం మార్కులతో, ఇతర సబ్జెక్ట్‌లలో గ్రాడ్యుయేట్స్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- డిగ్రీ తర్వాత ఇంటర్మీడియెట్‌కు నమోదు చేసుకున్న వారు సీఏ ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే నాలుగు వారాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్(ఐసీఐటీఎస్ఎస్) తరగతులకు హాజరుకావాలి. ఆ శిక్షణ పూర్తి చేసుకుని ప్రాక్టికల్ ట్రైనింగ్ ప్రారంభించాలి. 8 నెలల ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేసిన వారే సీఏ ఇంటర్ పరీక్షలకు హాజరవ్వడానికి అర్హులవుతారు.
- సీఏ ఇంటర్మీడియెట్‌లో రెండు గ్రూప్‌లలో ఆరు పేపర్లు ఉంటాయి.
- గ్రూప్–1లో..పేపర్–1(అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్), పేపర్–2(కార్పొరేట్ అండ్ అదర్ 'లా'స్), పేపర్–3 ట్యాక్సేషన్ (ఇన్‌కమ్ ట్యాక్స్ లా 50 మార్కులు–జీఎస్‌టీ 50–మార్కులు)ఉంటాయి. ప్రతి పేపర్‌కు 100 మార్కులు కేటాయిస్తారు.
- గ్రూప్–2లో.. పేపర్–4(కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్), పేపర్– 5 (ఆడిటింగ్ అండ్ ఎథిక్స్), పేపర్–6ఎ(ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్), పేపర్–6బి (స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్) ఉంటాయి. ప్రతి పేపర్ 100 మార్కులకు చొప్పున మొత్తం రెండు గ్రూప్‌లకు కలిపి ఆరు పేపర్లలో 600 మార్కులకు నిర్వహిస్తారు. అభ్యర్థులు ప్రతి పేపర్‌లో 40 శాతం చొప్పున.. మొత్తంగా ప్రతి గ్రూప్‌లో 50 శాతం మార్కులు సాధిస్తేనే సీఏ ఇంటర్మీడియెట్ పూర్తవుతుంది. ఫలితంగా సీఏ చివరి దశ ఫైనల్‌కు అవసరమైన ప్రాక్టికల్ ట్రైనింగ్‌కు అర్హత లభిస్తుంది. సీఏ ఇంటర్ పరీక్షలను కూడా ప్రతి ఏటా మూడుసార్లు (జనవరి, మే, సెప్టెంబర్) నిర్వహిస్తారు.

రెండేళ్ల ప్రాక్టికల్ ట్రైనింగ్

సీఏ ఇంటర్మీడియెట్ రెండు గ్రూప్‌లు పూర్తి చేసుకున్న అభ్యర్థులు.. సీఏ చివరి దశ అయిన ఫైనల్ పరీక్షలకు హాజరవ్వాలంటే.. రెండు సంవత్సరాల ప్రాక్టికల్ ట్రైనింగ్ చేయాలి. దీనినే గతంలో ఆర్టికల్ షిప్ అని పిలిచేవారు. ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో భాగంగా ఆడిట్ సంస్థలో లేదా ప్రాక్టీసింగ్ సీఏ వద్ద ట్రైనింగ్ పొందాల్సి ఉంటుంది. ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఆరు నెలల తర్వాత సీఏ ఫైనల్ పరీక్షలకు హాజరవ్వచ్చు.

సీఏ ఫైనల్ ఇలా

- సీఏ ఇంటర్మీడియెట్, ఆర్టికల్ షిప్ పూర్తి చేసుకున్న తర్వాత సీఏ కోర్సులోని చివరి దశ ఫైనల్‌కు అర్హత లభిస్తుంది.
- దీనికి ముందుగానే అభ్యర్థులు అడ్వాన్స్‌డ్ ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ స్కిల్స్ శిక్షణను, నాలుగు సెల్ఫ్ పేస్డ్ ఆన్‌లైన్ మాడ్యూల్స్‌ను పూర్తి చేయాలి.
- సీఏ ఫైనల్‌ను ప్రతి ఏటా రెండుసార్లు (మే, నవంబర్) నిర్వహిస్తారు.
- సీఏ ఫైనల్‌లో కూడా రెండు గ్రూప్‌లుగా ఆరు పేపర్లు ఉంటాయి. ఒక్కో గ్రూప్‌లో మూడు పేపర్లు చొప్పున పరీక్ష ఉంటుంది.
- గ్రూప్–1లో.. ఫైనాన్షియల్ రిపోర్టింగ్(పేపర్–1), అడ్వాన్స్‌డ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్(పేపర్–2), అడ్వాన్స్‌డ్ ఆడిటింగ్ అండ్ అష్యూరెన్స్ (పేపర్–3) ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు.
- గ్రూప్–2లో.. డైరెక్ట్ ట్యాక్స్ లాస్ అండ్ ఇంటర్నేషనల్ ట్యాక్సేషన్(పేపర్–4, 100 మార్కులు), ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ లాస్ (పేపర్–5, 100 మార్కులు), ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సొల్యూషన్స్, మల్టీ డిసిప్లినరీ కేస్ స్టడీ విత్ స్ట్రాటజిక్ కాస్ట్ మేనేజ్‌మెంట్ (పేపర్–6, 100 మార్కులు) పేపర్లు ఉంటాయి.
- పేపర్–6ను ఎలక్టివ్ పేపర్‌గా నిర్ణయించారు. విద్యార్థి ఇచ్చిన ఆరు సబ్జెక్ట్‌లలో ఏదో ఒకదాన్ని ఎలక్టివ్‌గా ఎంచుకొని పరీక్షకు హాజరుకావాలి. అదే విధంగా ఓపెన్ బుక్‌పరీక్షగా దీన్ని నిర్వహిస్తారు.
- మొత్తంగా రెండు గ్రూప్‌లలో ఆరు వందల మార్కులకు నిర్వహించే ఆరు పేపర్లలో.. ప్రతి పేపర్‌లో 40 శాతం చొప్పున.. ప్రతి గ్రూప్‌లో అన్ని పేపర్లు కలిపి 50 శాతం మార్కులు చొప్పున మార్కులు పొందితే సీఏ సర్టిఫికెట్ చేతికందుతుంది.

విస్తృత అవకాశాలు

సీఏ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలకు ఎలాంటి ఢోకా లేదు. ట్యాక్సేషన్ ఎక్స్‌పర్ట్, లీగల్ ఎక్స్‌పర్ట్ అవడం ఫలితంగా సీఏలకు మరింత ఉపాధి లభిస్తోంది. కొత్త నిబంధనల ప్రకారం– సీఏ ఇంటర్ రెండు గ్రూప్‌లు ఉత్తీర్ణత సాధించిన వారే ప్రాక్టికల్ ట్రైనింగ్(ఆర్టికల్ షిప్)కు అర్హులు. ఆ ప్రాక్టికల్ ట్రైనింగ్ వ్యవధిని మూడేళ్ల నుంచి రెండేళ్లకు తగ్గించడం విద్యార్థులకు ఉపశమనం కలిగించే అంశం. అదే విధంగా సీఏ ఇంటర్‌లో విద్యార్థులు కష్టంగా భావించే ఎంటర్‌ప్రైజ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పేపర్‌ను తొలగించారు. అలాగే ఫైనల్‌లో ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కంట్రోల్ అండ్ ఆడిట్ పేపర్‌ను కూడా తొలగించారు. సీఏ ఫౌండేషన్, ఇంటర్ పరీక్షలను ఏటా మూడుసార్లు నిర్వహించాలనే నిర్ణయం కూడా విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది.

–మట్టుపల్లి మోహన్, డైరెక్టర్,
మాస్టర్‌మైండ్స్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సీఏ

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–కెమిస్ట్రీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

స్టాక్ మార్కెట్లు (గురువారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,509	414
78,553	23,852

విదేశీ సూచీలు

సూచీ			
నాస్‌డాక్	16,286	▼	21
డోజోన్స్	39,142	▼	527
ఎఫ్‌టీఎస్ఈ 100	8,276	▲	1
డాక్స్	21,206	▼	105
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,277	▼	4
నికాయ్ (శుక్రవారం ముగింపు)	34,730	▲	353

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	116.01	111.10
€	యూరో	96.01	98.72
¥	జపాన్ ఎన్ (100)	59.30	60.86
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.07	56.93
S$	సింగపూర్ డాలర్	62.78	67.47
SAR	సౌదీ రియాల్	21.87	23.37
UAE D	యూఏఈ దిర్హామ్	22.35	24.13
¥	చైనా యువాన్	10.82	12.64





కొత్త పన్ను విధానం.. 'మార్పు' మంచిదే!

మధ్యతరగతి వారికి గుడ్‌న్యూస్. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి చాలా మందికి ఆదాయపన్ను పన్ను భారం తొలగిపోయింది. 2025 బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో చేసిన మార్పులతో వేతన జీవులు, పెన్షనర్లకు రూ.12.75 లక్షలు, ఇతరులకు రూ.12 లక్షల వరకు ఆదాయం మించనప్పుడు ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. ఆదాయం ఈ పరిమితి దాటినప్పుడే వారు తమ మొత్తం ఆదాయంపై నిర్ణీత శ్లాబుల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. గతంలో రూ.7-7.75 లక్షలుగా ఉన్న పరిమితులను ప్రభుత్వం గణనీయంగా పెంచేసింది. పాత విధానంలో పన్ను ఆదా కోసం ఎన్నో రకాల పెట్టుబడులు పెట్టాల్సి వచ్చేది. వీటికితోడు బీమా ప్రీమియం, ఇంటి రుణం చెల్లింపులు ఇలా ఎన్నో క్లెయిమ్ చేసుకుంటే గానీ పన్ను భారం గణనీయంగా తగ్గేది కాదు. ఇప్పుడు కొత్త పన్ను విధానంలో ఈ తలనొప్పులేవీ లేకుండానే గణనీయమైన ప్రయోజనం కల్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కొత్త పన్ను విధానంలోకి మారడం, లేదంటే పాత విధానాన్ని కొనసాగించడం వల్ల కలిగే లాభనష్టాలపై అవగాహన కల్పించే కథనమిది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

- గందరగోళానికి చెక్.. రిటర్నులు ఎంతో సరళతరం
- వేతన జీవులకు రూ.12.75 లక్షలపై పన్ను సున్నా
- ఇతరులకు రూ.12 లక్షల వరకు జీరో..
- పాత విధానంలో పన్ను ఆదాకు శ్రమకోర్చాల్సిందే
- 80సీ పెట్టుబడులు, గృహ రుణం, బీమా ఇలా ఎన్నో
- ఇవేవీ లేకుండా కొత్త విధానంలో తక్కువ పన్ను..

''మన దేశంలో పన్ను రిటర్నులు వేస్తున్న వారిలో 90 శాతం మంది ఆదాయం రూ.13 లక్షల కంటే తక్కువే ఉంది. అంటే 140 కోట్ల మంది ప్రజల్లో కేవలం కోటి మందే 2025-26 ఆర్థిక సంవత్సరంలో పన్ను చెల్లించనున్నారు. భారత్‌ను ఆదాయపన్ను రహితంగా మార్చడమే ఇది'' అంటూ షాదీ డాట్ కామ్ వ్యవస్థాపకుడు అనుపమ్ మిట్టల్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై చేసిన విమర్శనాత్మక పోస్ట్ తాజా పరిస్థితులకు అద్దం పడుతోంది. 2023-24 సంవత్సరం పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం మన దేశంలో వేతన జీవుల సగటు ఆదాయం రూ.20,039గా ఉంది. కనుక మెజారిటీ వేతన జీవులే కాదు, స్వయం ఉపాధిలో ఉన్న వారిలోనూ అధిక శాతం మంది ఆదాయం రూ.12 లక్షల్లోపే ఉంటుంది. కనుక వారికి కొత్త పన్ను విధానమే లాభదాయకం.

లక్ష్యాలకు అనుగుణంగా పెట్టుబడులు

పెట్టుబడులు అన్నవి ఎప్పుడూ తమ లక్ష్యాలు, ఆశించే రాబడి, రిస్క్ సామర్థ్యం వీటన్నింటికీ సరిపోయే సాధనాలతో ఉండాలి. అంతే కానీ పన్ను ఆదా కోసమని చెప్పి మెరుగైన రాబడుల్లేని చోట ఇన్వెస్ట్ చేస్తే లక్ష్యాలకు కావాల్సినంత సమకూర్చుకోవడం కఠినతరం అవుతుంది. పాత పన్ను విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల ఆదా కోసం పిల్లల ట్యూషన్ ఫీజులు మొదలు కొని జీవిత బీమా ప్రీమియం, పీపీఎఫ్, ఎన్‌సీఎస్, ఐదేళ్ల బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఇలా ఎన్నో సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తుంది. పైగా పన్ను ఆదా పెట్టుబడులకు మూడు నుంచి ఐదేళ్ల లాకిన్ పీరియడ్ (అప్పటి వరకు ఉపసంహరణ కుదరదు) కూడా ఉంటుందని మర్చిపోవద్దు. పీపీఎఫ్ అయితే 15 ఏళ్లు. కొత్త పన్ను విధానంలో ఇలాంటి షరతులేవీ లేకుండా రూ.12 లక్షలకు మించని ఆదాయం ఉన్న అందరికీ సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ కల్పించారు. కనుక తమకు నచ్చిన చోట పెట్టుబడులు పెట్టుకునే స్వేచ్ఛ కొత్త విధానం కల్పిస్తోంది. దీర్ఘకాల లక్ష్యాలకు ఇతర సాధనాల కంటే ఈక్విటీలే ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మించి మెరుగైన రాబడిని అందిస్తాయని చరిత్ర చెబుతోంది. కనుక మెజారిటీ పెట్టుబడులు ఈక్విటీలకు కేటాయించుకోవచ్చు. పాత పన్ను విధానంలో పన్ను ఆదా కోసం ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అదే కొత్త పన్ను విధానంలో అయితే పన్ను ఆదా కోసం చూడకుండా ప్యాసివ్ ఫండ్స్, ఫ్లెక్సీక్యాప్, ఈక్విటీ-డెట్ కలయికతో కూడిన హైబ్రిడ్ ఫండ్స్, బంగారంలోనూ పెట్టుబడులకు వీలు కల్పించే మల్టీ అస్సెట్ ఫండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు ఇలా ఎన్నో విభాగాల నుంచి తమకు అనుకూలమైన వాటిని నిపుణుల సూచనల మేరకు ఎంపిక చేసుకుని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

కొందరికి కొత్త.. కొందరికి పాత

పాత పన్ను విధానంలో వివిధ రకాల పన్ను పెట్టుబడులు, మినహాయింపుల రూపంలో రూ.5,75,000.. వేతనంలో 30 శాతాన్ని హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) కింద క్లెయిమ్ చేసుకున్నప్పటికీ.. రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి (వేతన జీవులకు రూ.12.75 లక్షల వరకు) నూతన పన్ను విధానామే మెరుగైనది. ఈ కింది టేబుల్‌లో దీన్ని గుర్తించొచ్చు. ఒకవేళ ఆదాయం రూ.12 లక్షలు మించితే (వేతన జీవులకు రూ.12.75 లక్షల ఆదాయం దాటితే).. పాత పన్ను విధానంలో అన్ని మినహాయింపులు, రాయితీలను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే.. కొత్త విధానం కంటే పాత విధానంలోనే కొంత అదనంగా ఆదా అవుతుంది.

పాత, కొత్త విధానంలో వ్యత్యాసం

ఆదాయం (రూ.లక్షల్లో)	మొత్తం మినహాయింపులు	హెచ్ఆర్ఏ రాయితీ	నికరంగా పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను(రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)
12.75	5.75	3.82	3.18	3,375	సున్నా
13	5.75	3.9	3.35	4,250	75,000
15	5.75	4.5	4.75	11,250	1.05 లక్షలు
20	5.75	6	8.25	77,500	2లక్షలు
24	5.75	7.2	11.05	1.44 లక్షలు	3లక్షలు

మినహాయింపులు: ● గృహరుణంపై సెక్షన్ 24బి కింద రూ.2 లక్షలు ● సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు ● 80సీసీడీ కింద ఎన్‌పీఎస్ రూ.50 వేలు ● 80డీ కింద మెడికల్ ఇన్సూరెన్స్ రూ.50 వేలు (పేరెంట్స్‌తో కలిపి) ● ఎల్‌టీఏ రూ.75,000 ● స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేలు

నోట్: రూ.13లక్షలకు పైన ఆదాయం ఉండి, ఇక్కడ చెప్పుకున్న విధంగా అన్నింటినీ క్లెయిమ్ చేసుకునేట్టు అయితే పాత విధానంతో తక్కువ పన్ను చెల్లించొచ్చు. వీటిల్లో కొన్నింటిని చేయలేకపోయినా, అప్పుడు కొత్త విధానమే లాభదాయకం.

ఉదాహరణ



బ్యాంక్ ఉద్యోగి మోనాలీ దేవ్ ఆదాయం రూ.20.5 లక్షలు. ఆఫీసుకు వెళ్లి వచ్చేందుకు ఆమె కారు లేదా ట్యాక్సీ వినియోగించడం లేదు. దీంతో రూ.1.2 లక్షల ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌పై పూర్తి పన్ను చెల్లించాల్సి వస్తోంది. సెలవుల కొరత కారణంగా ఎలాంటి పర్యటనలకూ వెళ్లే వీలు లేకపోవడంతో రూ.30,000 ఎల్‌టీఏ ప్రయోజనాన్ని కూడా క్లెయిమ్ చేసుకునే అవకాశం లేదు. కేవలం ఎన్‌పీఎస్, సెక్షన్ 80సీ, గృహ రుణం చెల్లింపులు రూ.1.6 లక్షలు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.11,500 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో తన ఆదాయంపై ఈ మినహాయింపులు క్లెయిమ్ చేసుకున్న తర్వాత పాత విధానంలో ఆమె 2023-24 సంవత్సరానికి రూ.3.15 లక్షల ఆదాయం చెల్లించాల్సి వచ్చింది. నిపుణుల సూచనలతో కొత్త విధానంలో మదింపు చేయగా చెల్లించాల్సిన పన్ను రూ.2.86 లక్షలుగా తేలింది. ఒకవేళ సెక్షన్ 80సీసీడీ (2) కింద కార్పొరేట్ ఎన్‌పీఎస్‌లో.. మూలవేతనంలో 14 శాతం చొప్పున ప్రతి నెలా రూ.15,156ను పనిచేసే సంస్థ నుంచి జమ చేయించుకుంటే అప్పుడు మోనాలీ దేవ్‌కు పన్ను భారం మరో రూ.57,000 తగ్గిపోతుంది. 2025-26 సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను విధానం శ్లాబుల ప్రకారం అయితే మోనాలీదేవ్ చెల్లించాల్సిన పన్ను (ఎన్‌పీఎస్ లేకుండా) కేవలం రూ.1.98 లక్షలే. ముందటి ఆర్థిక సంవత్సరం నుంచి చూస్తే రూ.88 వేలు ఆదా అవుతోంది. పనిచేసే సంస్థ నుంచి ఎన్‌పీఎస్ (కార్పొరేట్ ఎన్‌పీఎస్) జమ కూడా చేయించుకుంటే ఈ పన్ను ఇంకా తగ్గిపోనుంది. కనుక అధిక ఆదాయం పరిధిలోని వారు పాత-కొత్త విధానంలో మదింపు చేసుకుని తుదిగా తమకు ఏ విధానం లాభదాయకమో నిర్ణయించుకోవాలి. పన్ను చెల్లింపుదారుల్లో చాలా మంది గృహ రుణం తీసుకుని ఉండపోవచ్చు. అలాంటి వారు కేవలం హెచ్ఆర్ఏ మినహాయింపునకే పరిమితం కావాల్సి ఉంటుంది.

ఆదాయాన్ని బట్టి మార్పు..



''కొత్త విధానం ఆకర్షణీయంగా అనిపించొచ్చు. కానీ, అన్ని ప్రయోజనాలను వినియోగించుకుంటే పాత విధానంలో పన్ను తక్కువ. రూ.60 లక్షలు ఆర్జించే వారు రూ.8.5 లక్షల మినహాయింపు/రాయితీలను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే పాత విధానంలోనే రిటర్నులు వేసుకోవచ్చు'' అని ట్యాక్స్ స్పానర్ డాట్ కామ్ సీఈవో సుధీర్ కౌశిక్ సూచించారు.

- రూ.13.75 లక్షల ఆదాయం కలిగి కేవలం రూ.5.25 లక్షల పన్ను మినహాయింపుల వరకే క్లెయిమ్ చేసుకున్నా సరే పాత విధానంలో రూ.57,500 చెల్లించాల్సి వస్తే, కొత్త విధానంలో రూ.75,000 పన్ను పడుతోంది.
- రూ.15.75 లక్షల ఆదాయం ఉంటే హెచ్ఆర్ఏ ప్రయోజనం లేకుండా మిగిలిన మినహాయింపులను క్లెయిమ్ చేసుకుంటే పాత విధానంలోనే పన్ను తక్కువ.
- రూ.20 లక్షల ఆదాయం ఉన్న వారి విషయంలో (వేతన జీవులు అయితే రూ.20.75 లక్షలు) మళ్లీ ఇది మార్పునకు గురవుతుంది. హెచ్ఆర్ఏను పక్కన పెట్టి చూస్తే పాత విధానంలో రూ.5.25 లక్షల మొత్తాన్ని క్లెయిమ్ చేసుకుంటే అప్పుడు చెల్లించాల్సిన పన్ను రూ.2,40,000 కాగా, కొత్త విధానంలో రూ.2 లక్షలే కావడం గమనించొచ్చు. అలాగే రూ.24 లక్షల ఆదాయంపై కొత్త విధానంలో రూ.60 వేలు ఆదా చేసుకోవచ్చు.
- రూ.24.75 లక్షలపైన ఆదాయం కలిగిన వారు, మొత్తం మినహాయింపులు/తగ్గింపులు/రాయితీలు అన్నీ రూ.7.75 లక్షలకు మించితే అప్పుడు పాత విధానాన్ని పరిశీలించొచ్చు.
- గ్రాంట్ థార్న్‌టన్ అంచనా ప్రకారం రూ.1.5 కోట్ల ఆదాయం కలిగిన వారు పాత విధానంలో స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80సీ ప్రయోజనాలను వినియోగించుకుంటే చెల్లించాల్సిన పన్ను రూ.40.09 లక్షలు కాగా, కొత్త విధానంలో రూ.48.52 లక్షలు చెల్లించాల్సి వస్తుంది.
- పన్నుకు అదనంగా సెస్సు చెల్లించాలి. రూ.50లక్షల ఆదాయం మించిన వారు సర్‌చార్జీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.

హెచ్ఆర్ఏ విషయంలో షరతులు

గృహ రుణం ఈఎంఐలో అసలు మొత్తాన్ని సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు, వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షల వరకు సెక్షన్ 24బీ కింద పాత విధానంలో క్లెయిమ్ చేసుకోవచ్చు. అదే సమయంలో హెచ్ఆర్ఏ రాయితీని కూడా క్లెయిమ్ చేసుకోవచ్చా? అంటే అందరికీ అని చెప్పలేం. ఇక్కడ కొన్ని షరతులు వర్తిస్తాయి.

- వేతనంలో హెచ్ఆర్ఏ ప్రయోజనం తప్పకుండా ఉండాలి. పనిచేసే ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తూ అద్దె చెల్లించాలి.
- తన పేరు లేదా తన జీవిత భాగస్వామితో కలసి ఉమ్మడిగా రుణం తీసుకుని పనిచేసే చోట కాకుండా వేరే ప్రాంతంలో ఇల్లు సమకూర్చుకుని చెల్లింపులు చేస్తుండాలి.
- రుణంపై ఇల్లు సమకూర్చుకుని అందులోనే నివసిస్తూ.. వేతనంలో భాగంగా హెచ్ఆర్ఏ ప్రయోజనం తీసుకుంటున్న వారు.. గృహ రుణానికి చెల్లిస్తున్న అసలు, వడ్డీపైనే మినహాయింపును క్లెయిమ్ చేసుకోగలరు. అద్దె చెల్లించడం లేదు కనుక హెచ్ఆర్ఏ క్లెయిమ్‌కు అవకాశం లేదు.
- ఒకవేళ మీరు పనిచేసే పట్టణంలోనే ఇంటి కొనుగోలుకు రుణం తీసుకున్నారు. కానీ, ఆ ఇంటిలో కాకుండా, అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఇలాంటప్పుడు హెచ్ఆర్ఏపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేయలేరు. ఒకవేళ కార్యాలయానికి, రుణంపై సమకూర్చుకున్న ఇల్లు మరీ దూరంగా ఉంటే తప్పించి హెచ్ఆర్ఏ క్లెయిమ్‌కు అర్హులు కారు. కనుక హెచ్ఆర్ఏతోపాటు గృహ రుణంపై గరిష్ట ప్రయోజనం పొందాలంటే పనిచేసే ప్రాంతంలో కాకుండా దూరంగా సొంతిల్లును సమకూర్చుకోవడం ఒక మార్గం.



హెచ్ఆర్ఏ సూత్రం

- యాజమాన్యం నుంచి స్వీకరించిన వాస్తవ హెచ్ఆర్ఏ
- ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన మొత్తం ఇంటి అద్దె నుంచి.. ఏడాదిలో స్వీకరించిన మూలవేతనం, డీఏలో 10 శాతాన్ని తీసివేయగా మిగిలినది.
- మూలవేతనం, డీఏలో 40 శాతం (నాన్ మెట్రోలు)/50 శాతం (మెట్రోల్లో నివసించే వారు)
- ఈ మూడింటిలో తక్కువ మొత్తాన్ని హెచ్ఆర్ఏ కింద క్లెయిమ్ చేసుకుని పన్ను చెల్లించక్కర్లేదు.

కొత్త విధానంలోనూ కొన్ని మినహాయింపులు



పాత విధానంతో పోల్చి చూస్తే నూతన పన్ను విధానంలో చాలా వరకు మినహాయింపులు, రాయితీల్లేవు. హెచ్ఆర్ఏ, ఎల్‌టీసీ, టెలిఫోన్, ఇంటర్నెట్ వ్యయాలను క్లెయిమ్ చేసుకోలేరు. పన్ను ఆదా పెట్టుబడులూ లేవు. గృహ, విద్యా రుణాలపై అసలు, వడ్డీ చెల్లింపులకు సంబంధించిన ప్రయోజనాలు, లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపులకూ ఎలాంటి పన్ను మినహాయింపులు లేవన్న విషయాన్ని గుర్తించాలి. అదే సమయంలో వేతన జీవులకు కొన్ని ప్రయోజనాలు కల్పించారు.

కార్పొరేట్ ఎన్‌పీఎస్: సెక్షన్ 80సీసీడీ(2) కింద కార్పొరేట్ ఎన్‌పీఎస్ ప్రయోజనం ఉంది. ఉద్యోగి తరఫున ఎన్‌పీఎస్ ఖాతాకు యాజమాన్యం జమ చేయాల్సి ఉంటుంది. మూల వేతనం, డీఏ మొత్తంలో 14 శాతం చొప్పున యాజమాన్యం జమలపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. గరిష్ట జమ రూ.7.5 లక్షలకే ఇది వర్తిస్తుంది.

సర్‌చార్జ్: రూ.5 కోట్లకు పైన ఆదాయం కలిగిన వారికి పాత విధానంలో చెల్లించాల్సిన పన్ను మొత్తంపై 37 శాతం సర్‌చార్జ్ చెల్లించాల్సి వస్తుంది. కొత్త విధానంలో ఇది 25 శాతమే.

అలవెన్స్‌లు: దివ్యాంగులకు రవాణా భత్యం, ఉద్యోగులకు అధికారిక ప్రయాణాలు లేదా బదిలీ కోసం చెల్లించే అలవెన్స్, ఆఫీస్‌కు దూరంగా వేరే ప్రాంతంలో డ్యూటీ చేయాల్సి వస్తే చెల్లించే అలవెన్స్‌లకు పన్ను మినహాయింపులున్నాయి.


సెక్షన్ 80సీసీహెచ్: అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు ఇచ్చే విరాళాలపై పన్ను మినహాయింపు ఉంది.

ఏటా మారిపోవచ్చు..!



రెండు పన్ను విధానాల్లోనూ తమకు అనుకూలమైన దాన్ని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ వేతన జీవులకు ఉంది. ఒక విధానం నుంచి మరో విధానానికి ఏటా మారిపోవచ్చు కూడా. వేతనం/పింఛనుతోపాటు వ్యాపార ఆదాయం ఉంటే మాత్రం ఈ సదుపాయం లేదు. వ్యాపార ఆదాయం, వృత్తిపరమైన ఆదాయం కలిగిన వారు ఒక్కసారి నూతన విధానంలోకి మారితే.. తిరిగి పాత విధానంలోకి మళ్లేందుకు ఒక్కసారే అవకాశం ఉంటుంది. ఇక వేతన జీవులు, పెన్షనర్లు సైతం గడువులోపు (జూలై 31) ఐటీఆర్‌లు దాఖలు చేసినట్టయితేనే పాత, కొత్త విధానాల్లో తమకు నచ్చింది ఎంపిక చేసుకోగలరు. గడువు దాటిన తర్వాత సమర్పించే బీలేటెడ్ రిటర్నులు కొత్త విధానంలోనే సమర్పించడానికి అనుమతి ఉంటుంది. ఐటీఆర్ దాఖలు సమయంలో 'వెదర్ ఆప్టింగ్ అవుట్ న్యూ ట్యాక్స్ రెజిమ్ ఆఫ్ సెక్షన్ 115బీఏసీ?'' అని అడుగుతుంది. యస్ అని క్లిక్ చేస్తే పాత విధానంలో పన్ను రిటర్నులు దాఖలవుతాయి. నో అని క్లిక్ చేస్తే ఐటీఆర్ నూతన విధానం కింద సమర్పించినట్టు అవుతుంది.

బంగారం ఇంకా ఎంత పెరుగుతుంది?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను పదవీ విరమణ తీసుకున్నాను. ఉద్యోగ విరమణ తర్వాత వచ్చిన ప్రయోజనాలన్నింటినీ స్థిరమైన ఆదాయం కోసం.. ఈక్విటీ ఆధారిత హైబ్రిడ్ ఫండ్స్ లేదంటే బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ లేదా అచ్చమైన ఈక్విటీ ఫండ్స్‌లో ఎందులో ఇన్వెస్ట్ చేసుకోవాలి? – అజయ్ ప్రకాష్

ఈక్విటీ మార్కెట్ల అస్థిరతలను ఎదుర్కోవడంలో మీకు ఎంత మేరకు అవగాహన ఉన్నదన్న అంశం ఇక్కడ కీలక పాత్ర పోషిస్తుంది. ఒకవేళ ఈక్విటీల్లో గతంలో ఇన్వెస్ట్ చేసిన అనుభవం మీకు ఉండి.. మార్కెట్లలో ఆటుపోట్లను (ర్యాలీలు, దిద్దుబాట్లు) చూసి ఉన్నట్టయితే అప్పుడు అక్విటీ ఆధారిత ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇక ఎంత మేరకు ఇన్వెస్ట్ చేయగలరు? ప్రతి నెలా మీకు ఎంత ఆదాయం కావాలి? అన్నవి కూడా ఇక్కడ తేల్చుకోవాల్సిన అంశాలు. పెట్టుబడి నుంచి స్థిరమైన ఆదాయం కోరుకుంటున్నట్టు అయితే అప్పుడు అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడుల్లో ఎలాంటి అనుభవం లేకుండా, చేసే పెట్టుబడిపై ఆదాయం కోరుకుంటుంటే అప్పుడు కన్జర్వేటివ్ హైబ్రిడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. మార్కెట్లో మీకున్న అనుభవం, ఎంత ఆదాయం కోరుకుంటున్నారు? రిస్క్ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగానే ఎంపిక ఉండాలి.

బంగారం ధర ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగిపోయింది. ఇక్కడి నుంచి ఇంకా పెరుగుతుందా? – కృతి వాసన్

బంగారం బలంగా ర్యాలీ చేస్తున్నప్పుడు పెట్టుబడులు పెట్టాలని అనిపించడం సాధారణమే. ఈ ఏడాది ఇప్పటికే 23 శాతం ర్యాలీ చేసింది. కానీ, అది ఇంకా ఎంత వరకు పెరుగుతుందన్నది ప్రశ్నార్థకమే. ఇందుకు సరైన సమాధానం చెప్పడం కష్టమే. ఏ అస్సెట్ క్లాస్ (పెట్టుబడి సాధనం) విషయంలో అయినా ఇదే వర్తిస్తుంది. మీ పెట్టుబడుల ప్రణాళికకు బంగారం ఎంత మేర ప్రయోజనం కలిగిస్తుందో విశ్లేషించుకోండి. అనిశ్చిత పరిస్థితుల్లో బంగారం మంచి పనితీరు చూపిస్తుంటుంది. ద్రవ్యోల్బణం పెరిగిపోయినప్పుడు, భౌగోళిక ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ఈక్విటీ మార్కెట్లలో కల్లోల పరిస్థితులు నెలకొన్నప్పుడు బంగారం ర్యాలీ చేస్తుంటుంది. ఒక్కసారి ఈ పరిస్థితులు అన్నీ కుదుటపడితే అక్కడి నుంచి బంగారం పెరుగుదల పరిమితంగానే ఉంటుంది. గడ పదిహేనేళ్ల కాలంలో చూసుకుంటే బంగారం ఏటా 10 శాతం రాబడిని అందించింది. అదే ఫ్లెక్సీక్యాప్ మ్యూచువల్ ఫండ్స్ ఏటా 12 శాతం రాబడులను అందించాయి. రాబడుల్లో వ్యత్యాసం చూడ్డానికి ఎక్కువగా లేదు. కానీ, దీర్ఘకాలంలో కాంపౌండింగ్ ప్రయోజనంతో ఫండ్స్‌లో పెట్టుబడి వృద్ధి ఎక్కువగా ఉంటుంది. విలువను సృష్టించే వ్యాపారాల్లో వాటాను సొంతం చేసుకునేందుకు ఈక్విటీ పెట్టుబడులు వీలు కల్పిస్తాయి. బంగారం కేవలం నిల్వకే పరిమితం అవుతుంది. బంగారం దీర్ఘకాలంలో సంపద సృష్టించే సాధనం కాదు. హెడ్జ్ సాధనంగా పరిగణించి తమ పెట్టుబడుల్లో 10 శాతం వరకు బంగారానికి కేటాయించుకోవచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

క్యూ4 ఫలితాలే మార్కెట్‌కు దిక్సూచి	జెన్సోల్ ఓ ఉత్పత్తి కంపెనీ పుణె ఈవీ ప్లాంట్‌లో ఉత్పత్తి నిల్

సాక్షి స్టాక్ టిప్స్

హిందుస్తాన్ ఏరోనాటిక్స్ | బ్రోకరేజ్: ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 4,200 టార్గెట్: రూ. 5,000

ఎందుకంటే: హెలికాప్టర్ల తయారీ ప్రభుత్వ రంగ దిగ్గజం హిందుస్తాన్ ఏరోనాటిక్స్(హెచ్ఏఎల్) ఇటీవల తేజాస్ ఎంకే 1ఏ తయారీలో వినియోగించే ఎఫ్404-ఐఎన్20 రకం ఇంజిన్లను అందుకుంది. గ్లోబల్ దిగ్గజం జీఈ ఏరోస్పేస్ నుంచి 99 ఇంజిన్లు సమకూర్చుకుంది. కంపెనీ ఎగ్జిక్యూషన్ రిస్కులను తగ్గించడంలో దీనిని కీలక పరిణామంగా పేర్కొనవచ్చు. ఇవి హెచ్ఏఎల్ అభివృద్ధికి దోహదం చేయనున్నాయి. ఏరో ఇండియాలో కంపెనీ ఈ ఏడాది ఎఫ్404-ఐఎన్20 రకం 14 ఇంజిన్లను అందుకోనున్నట్లు విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. తద్వారా తేలికపాటి యుద్ధవిమానం(ఎల్‌సీఏ) ఎంకే 1ఏ తయారీకి వీలు చిక్కనుంది. తద్వారా 24 తేజాస్ ఎంకే 1ఏలను తయారు చేయగల సామర్థ్యాలను అందుకోనుంది. అయితే 2026కల్లా 10 ఎంకే ఏ1లను రూపొందించగలదని, తదుపరి క్రమంగా 2030కల్లా తయారీ 24కు చేరగలదని భావిస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆదాయం రెండేళ్లలో (2026-2027) వార్షికంగా 25 శాతం, 28 శాతం చొప్పున పుంజుకోగలదని అంచనా. దీంతో 2025 స్థాయితో పోలిస్తే 2027వరకూ షేరువారీ ఆర్జన(ఈపీఎస్) వార్షికంగా 39 శాతం చొప్పున బలపడే వీలుంది. తేజాస్ ఎంకే 1ఏ ఆర్డర్ల ఎగ్జిక్యూషన్ ప్రారంభంకానుండటం రక్షణ రంగ కంపెనీలకు సానుకూలంగా మారనుంది. కాగా.. 97 తేజాస్ ఎంకే 1ఏ, 156 ఎల్‌సీహెచ్ ప్రచండ్ ఆర్డర్లతో హెచ్ఏఎల్ ఆర్డర్ బుక్ మరింత బలపడే వీలుంది. 2025 అక్టోబర్‌కల్లా తొలి తేజాస్ ఎంకే-2 ఎయిర్‌క్రాఫ్ట్ అసెంబ్లీని పూర్తి చేసే లక్ష్యంతో కంపెనీ సాగుతోంది. 2026మార్చికల్లా తొలి దేశీ తయారీ విహంగాన్ని రూపొందించనుంది. అయితే ప్రస్తుత 83 తేజాస్ ఎంకే 1ఏ ఆర్డర్ల ఎగ్జిక్యూషన్‌లో ఆలస్యం, ముడిసరుకుల వ్యయాలు పెరగడం వంటి అంశాలతో మార్జిన్లు బలహీనపడవచ్చు. వీటిని కీలక రిస్కులుగా పరిగణించవచ్చు.

యూనిమెక్ ఏరోస్పేస్ | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,049 టార్గెట్: రూ. 1,315

ఎందుకంటే: వైమానిక, రక్షణ రంగ కంపెనీ యూనిమెక్ ఏరోస్పేస్ అండ్ మాన్యుఫాక్చరింగ్ అధిక విలువ(హైమిక్స్), తక్కువ పరిమాణ ఉత్పత్తి విభాగాలపై దృష్టిపెట్టి సాగుతోంది. దీనిలో భాగంగా కాంప్లెక్స్, హైప్రెసిషన్ ఏరో టూలింగ్, జీఎస్ఈ, ఎలక్ట్రోమెకానికల్ సబ్ అసెంబ్లీస్, ప్రెసిషన్ కంపోనెంట్స్ తయారీలో ప్రత్యేకతను చాటుకుంటోంది. అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్, పటిష్ట ఓఈఎం, లైసెన్సీ రిలేషన్‌షిప్స్ ఇందుకు మద్దతిస్తున్నాయి. తద్వారా వైమానిక విభాగం, అణు ఇంధన రంగాలలో మరింత లోతుగా విస్తరించే ప్రణాళికల్లో ఉంది. ఇవికాకుండా ఇతర హైమిక్స్, లోవ్యాల్యూమ్ రంగాలలోనూ ప్రవేశిస్తోంది. ఇందుకు అనుగుణంగా ఇతర సంస్థల కొనుగోళ్లకూ ఆసక్తి చూపుతోంది. కంపెనీకిగల బలమైన యాజమాన్యం వివిధ విభాగాలను 35 శాతం వృద్ధితో నిలకడగా పరుగుపెట్టించే వ్యూహాలు అమలు చేస్తోంది. తద్వారా 2027కల్లా వార్షికంగా దాదాపు 37.5 శాతం ఆర్‌వోఐసీని సాధించనుంది. సంక్లిష్ట విడిభాగాలు, కీలక ఏరో టూలింగ్, గ్రౌండ్ సపోర్ట్ ఎక్విప్‌మెంట్, ప్రెసిషన్ పరికరాలలో ప్రత్యేకతను చూపుతోంది. బలమైన వెండార్ నెట్‌వర్క్‌ను కలిగి ఉండటంతో ఉత్పత్తి పెంచుకోవడంలో సమర్ధతను చాటుకుంటోంది. వెరసి గరిష్టస్థాయిలో ఆస్తుల వినియోగాన్ని సాధిస్తోంది. వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణలోనూ దక్షతను చూపుతోంది. కంపెనీకిగల 1,80,000 చదరపు అడుగుల తయారీ సౌకర్యాలను 2026 మార్చికల్లా 3,30,000 చ.అ.లకు విస్తరించనుంది. తద్వారా భారీ వృద్ధిలో సాగేందుకు బాటలు వేసుకుంటోంది. వైమానిక, రక్షణ, ఇంధన రంగాలలో నెలకొంటున్న వ్యవస్థాగత డిమాండుతో కంపెనీ వ్యూహాత్మకంగా లబ్ధి పొందనుంది. వీటికితోడు ఐపీవో ముందు సమీకరించిన పెట్టుబడులను వృద్ధి అవకాశాలకు వినియోగించనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



'స్మార్ట్' ఎగుమతులు 2 లక్షల కోట్లు!

ఏడాదిలో 50%పెరిగిన ఎగుమతులు..	అందులో అధిక భాగం వాటా ఐఫోన్లదే	కంపెనీలకు అండగా నిలుస్తున్న కేంద్ర పథకం పీఎల్ఐ

సాక్షి, స్పెషల్ డెస్క్: దేశీయంగా వినియోగంలోనే కాదు.. ఎగుమతుల్లోనూ స్మార్ట్‌ఫోన్ల హవా నడుస్తోంది. 2024–25లో భారత్ నుంచి ఏకంగా రూ. 2,00,000 కోట్ల విలువైన మేడిన్ ఇండియా స్మార్ట్‌ఫోన్లు వివిధ దేశాలకు ఎగుమతి అయినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేస్తోంది. మొత్తం స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల్లో ఏడాదిలో 50 శాతం పెరగడం విశేషం. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతుల విలువపరంగా ఇప్పటివరకు ఇదే రికార్డు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచాక వాణిజ్య యుద్ధానికి దారితీయడం కూడా స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు పెరగడానికి గల కారణాల్లో ఒకటని పరిశ్రమ చెబుతోంది. ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకాన్ని స్మార్ట్‌ఫోన్లకు విస్తరించడం కొత్త రికార్డులకు దారితీసింది.

చైనా నుంచి భారత్‌కు..

గత ఆర్థిక సంవత్సరంలో విదేశాలకు చేరిన స్మార్ట్‌ఫోన్లలో ఐఫోన్ల వాటా రూ. 1,50,000 కోట్లుంది. 2024–25లో 4 కోట్లకుపైగా ఐఫోన్ల యూనిట్లను యాపిల్ భారత్‌లో తయారు చేసింది. వాటి విలువ రూ. 1,87,880 కోట్లు. గత ఆర్థిక సంవత్సరంలో తయారైన ఐఫోన్లలో 80 శాతం ఎగుమతుల కోసం కంపెనీ కేటాయించింది. 2021లో యాపిల్ తన తయారీని చైనా నుంచి భారత్‌కు బదిలీ చేయడమే ఈ దూకుడుకు కారణంగా కనిపిస్తోంది. అంతర్జాతీయంగా యాపిల్ 20 శాతం తయారీని భారత్‌కు మార్చింది.

జనవరి నాటికే..


కేంద్ర వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జనవరిలో భారత్ నుంచి రూ. 1,56,367 కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు వివిధ దేశాలకు సరఫరా అయ్యాయి. దేశ చరిత్రలో ఒక ఆర్థిక సంవత్సరంలో 10 నెలల కాలంలో ఎగుమతుల విలువ పరంగా తొలిసారిగా స్మార్ట్‌ఫోన్ల విభాగం అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. వాహనాల్లో వినియోగించే డీజిల్ రూ. 1,36,981 కోట్లతో రెండవ స్థానానికి పరిమితమైంది. 2023–24 ఏప్రిల్–జనవరి మధ్య జరిగిన ఎగుమతుల్లో స్మార్ట్‌ఫోన్ల విలువ నాలుగో స్థానంలో ఉండేది. ఆటోమోటివ్ డీజిల్ ఫ్యూయల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్, డైమండ్స్ తొలి మూడు స్థానాల్లో అప్పట్లో నిలిచాయి.


క్రమంగా పెరిగిన ర్యాంక్..

దేశం నుంచి ఎగుమతుల విలువపరంగా 2018–19లో స్మార్ట్‌ఫోన్లు 23వ స్థానంలో, 2013–14లో అయితే 167వ స్థానంలో ఉండేవి. స్మార్ట్‌ఫోన్ల తయారీని దేశీయంగా పెంచే లక్ష్యంతో 2020లో కేంద్రం పీఎల్ఐ పథకాన్ని ఈ విభాగానికి వర్తింపజేయడంతో 2021–22లో రూ. 48,678 కోట్ల ఎగుమతులను సాధించి స్మార్ట్‌ఫోన్ల విభాగం 9వ ర్యాంక్‌కు ఎగబాకింది. రెండేళ్లలోనే అంటే 2023–24 నాటికి ఎగుమతులు ఏకంగా రూ. 1,33,224 కోట్లకు పెరిగి నాలుగో ర్యాంక్ సాధించింది. 2024 డిసెంబర్ నాటికి రెండవ స్థానానికి.. ఆ తరువాత ఒక్క నెలలోనే భారత్ నుంచి అత్యధికంగా ఎగుమతి చేస్తున్న వస్తు విభాగంగా స్థానం సంపాదించింది.

ప్రధాన మార్కెట్‌గా అమెరికా

2023–24 ఏప్రిల్–జనవరి మధ్య భారత్ నుంచి ఎగుమతి అయిన స్మార్ట్‌ఫోన్ల విలువ రూ. 1,01,028 కోట్లు. అంటే 2024–25 ఆర్థిక సంవత్సరం తొలి 10 నెలల ఎగుమతుల్లో 54.7 శాతం వృద్ధి నమోదైందన్న మాట. టారిఫ్‌ల భారం పెరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో అమెరికాకు సరఫరా అధికం కావడం కూడా ఈ వృద్ధికి కారణమై ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. 2025 జనవరిలో అమెరికాకు యాపిల్ ఐఫోన్ల ఎగుమతులు ఏడాదిలో ఏకంగా 208 శాతం పెరిగి రూ. 13,920 కోట్లకు చేరుకున్నాయి. 2024–25 ఏప్రిల్–జనవరి మధ్య అమెరికాకు ఎగుమతి అయిన అన్ని బ్రాండ్ల స్మార్ట్‌ఫోన్ల విలువ 64 శాతం పెరిగి రూ. 56,364 కోట్లుగా నమోదైంది.





2023-24లో మేడిన్ ఇండియా స్మార్ట్‌ఫోన్లను దిగుమతి చేసుకున్న టాప్-4 దేశాలు
అమెరికా, యూఏఈ, నెదర్లాండ్స్, యూకే

భారత్‌లో స్మార్ట్‌ఫోన్ల తయారీ ముచ్చట్లు..

- స్మార్ట్‌ఫోన్ల విడిభాగాల్లో 99 శాతం దేశీయంగా ఉత్పత్తి అవుతున్నాయి.
- 2023–24లో 33 కోట్ల స్మార్ట్‌ఫోన్లు తయారయ్యాయి. ఇందులో 75 శాతం 5జీ మోడళ్లు.
- మొబైళ్ల తయారీ కేంద్రాలు 2014లో రెండు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 300 దాటింది.
- 2022–25 మధ్య పీఎల్ఐ స్కీమ్‌లో భాగంగా 19 కంపెనీలకు కేంద్రం సబ్సిడీ రూపంలో రూ. 8,700 కోట్లు అందించింది. అందులో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, పెగట్రాన్, సామ్‌సంగ్, ప్యాడ్‌జెట్ ఎలక్ట్రానిక్స్ 98 శాతం మొత్తాన్ని స్వీకరించాయి.
- స్మార్ట్‌ఫోన్లకు పీఎల్ఐ పథకం వల్ల 13 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించాయి. వారిలో అత్యధికం మంది మహిళలేనని ఐసీఈఏ తెలిపింది.

క్లుప్తంగా...



సీఆర్పీఎఫ్ డీఎస్పీ కేకేవీ రెడ్డికి 'రాష్ట్రపతి పోలీసు పతకం'

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ప్రదానం

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ కాలంగా పలువురు వీవీఐపీలతోపాటు కీలక భద్రతా విధులు నిర్వర్తిస్తూ దేశ సేవకు అంకితమైన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) డీఎస్పీ కర్రి కసి విశ్వేశ్వరరెడ్డికి (కేకేవీ) అత్యున్నత పురస్కారం దక్కింది. ఆయన 36 ఏళ్ల సర్వీస్‌లో ఎస్పీజీ సహా పలు కీలక బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించినందుకు గాను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీసెస్ (విశిష్ట సేవలకు రాష్ట్రపతి పోలీసు పతకం) అందుకున్నారు. సీఆర్పీఎఫ్ 86వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 17న మధ్యప్రదేశ్‌లోని నీమూచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తరపున అమిత్‌షా ఈ అవార్డును కేకేవీ రెడ్డికి అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్లకు చెందిన కేకేవీ రెడ్డి ప్రధానమంత్రులకు భద్రతకు కల్పించే అత్యంత కీలక బలగమైన ఎస్పీజీలో 11 ఏళ్లు పనిచేశారు. ఎస్పీజీలో పనిచేస్తున్న సమయంలో ఉత్తమ సేవలకు గాను 2016లో ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ దక్కింది. ఈ అవార్డును 2017లో న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా కేకేవీ రెడ్డి అందుకున్నారు. ఆయన ప్రస్తుతం రామంతాపూర్‌లోని సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

'మాల్'కు జాతీయ అవార్డ్

- ఆత్మ నిర్భర్ పంచాయతీ స్పెషల్ కింద ప్రకటించిన కేంద్రం
- తెలంగాణ నుంచి ఏకైక గ్రామం

యాచారం: రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామం పంచాయతీ ఆత్మ నిర్భర్ నేషనల్ స్పెషల్ అవార్డ్‌కు ఎంపికైంది. ఈ నెల 24న జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజు దేశ రాజధాని ఢిల్లీలో ఈ అవార్డును అందజేయనున్నారు. అవార్డుతో పాటు పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి నగదు పారితోషికం అందనుంది. ఈ అవార్డును కలెక్టర్ లేదంటే డీపీవో గానీ యాచారం ఎంపీడీవోగానీ అందుకోనున్నారు. ఆత్మ నిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డు ఎంపికలో భాగంగా గ్రామంలో అత్యధిక ఆర్థిక వనరుల కేటగిరీ కింద మాల్ పంచాయతీని అధికారులు ఎంపిక చేశారు. అవార్డుకు ఎంపిక కావడానికి ప్రధాన కారణం ఇక్కడి పశువుల సంతనే. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు ప్రాంతం, యాచారం మండల పరిధిలోని మాల్ గ్రామ పంచాయతీలో ప్రతి మంగళవారం పశువుల సంత జరుగుతుంది. సంత నిర్వహణతో పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. వచ్చే ఆదాయంతో అధికారులు గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఐదేళ్లుగా పంచాయతీకి పశువుల సంత నిర్వహణ వేలం పాట ద్వారా రూ.50 లక్షలకు పైగా రాబడి వస్తోంది. దీంతో ఏటా రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షలకుపైగా ఆదాయం వచ్చే గ్రామం కింద మాల్ పంచాయతీ గుర్తింపు పొందింది. గ్రామంలో అత్యధిక ఆర్థిక వనరుల కేటగిరీ కింద నేషనల్ పంచాయతీ రాజ్ ఉన్నతాధికారుల బృందం మాల్ పంచాయతీని నేషనల్ అవార్డుకు ఎంపిక చేసింది.

మళ్లీ పర్యావరణ అనుమతులు!

ఎస్ఎల్‌బీసీ కోసం దరఖాస్తు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

- ఇన్‌లెట్ వైపు నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు
- అభయారణ్యం కావడంతో సుప్రీం కోర్టు అనుమతీ తప్పనిసరి
- అవుట్‌లెట్ వైపు నుంచి మాత్రం టీబీఎంతోనే..



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ఇన్‌లెట్ వైపు నుంచి తవ్వకాలను 'డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్' విధానంలో చేపట్టడానికి పర్యావరణ, అటవీ అనుమతులు కోరుతూ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకోనుంది. దట్టమైన అటవీ ప్రాంతం , అమ్రాబాద్ పులుల అభయారణ్యం ఉండటంతో గతంలో టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం)తో సొరంగం తవ్వకాలకు మాత్రమే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిచ్చింది. సున్నితమైన వన్య ప్రాణులున్న అభయారణ్యం కావడంతో మానవ కార్యకలాపాలతో పాటు శబ్దాల నుంచి రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో అప్పట్లో కేంద్రం షరతులు విధించింది. సొరంగం తవ్వకాలతో భూఉపరితల ప్రాంతంలో వచ్చే శబ్దాల తీవ్రత 55 డెసిబెల్స్(డీబీఏ)కి మించరాదని, ఆ మేరకు నిరంతరం శబ్దాల తీవ్రతను పర్యవేక్షించాలని కోరింది.

ప్రమాదం నేపథ్యంలోనే..

ఏమ్మార్పీ ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులో భాగంగా శ్రీశైలం జలాశయం నుంచి నీళ్లను 43.93 కిలోమీటర్ల సొరంగ మార్గంలో తరలించి లింక్ కాల్వ ద్వారా డిండి జలాశయంలోకి పోయాల్సి ఉంది. శ్రీశైలం జలాశయం(ఇన్‌లెట్) వైపు నుంచి 13.93 కి.మీలు, అవతలి వైపు(అవుట్‌లెట్) నుంచి మరో 20.43 కి.మీల మేర సొరంగం తవ్వకాలు పూర్తికాగా, మధ్యలో 9.55 కి.మీల మేర తవ్వకాలు జరగాల్సి ఉంది. అయితే ఇన్‌లెట్ నుంచి 13.93 కి.మీ వరకు వెళ్లిన కార్మికులపై గత ఫిబ్రవరి 22న పైకప్పు కూలడంతో 8 మంది గల్లంతైన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి సొరంగం తవ్వకాలను ముందుకు కొనసాగించడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) హెచ్చరించిన నేపథ్యంలో 'డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్' విధానంలో తవ్వకాలకు ప్రభుత్వం పర్యావరణ అనుమతులు కోరనుంది.

సీఈసీ సిఫారసు చేసిన తర్వాతే..

వన్య ప్రాణుల అభయారణ్యాల్లో చేపట్టే ప్రాజెక్టులకు తాము ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార కమిటీ (సీఈసీ) పరిశీలించి సిఫారసు చేసిన తర్వాతే సుప్రీంకోర్టు తుది అనుమతులు ఇస్తోంది. ఇదే క్రమంలో గతంలో ఎస్ఎల్‌బీసీ సొరంగాల తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. అయితే తాజాగా ఇన్‌లెట్ వైపు నుంచి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరపాలని నిర్ణయించిన నేపథ్యంలో మళ్లీ సుప్రీంకోర్టు అనుమతి తీసుకోక తప్పదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఇంకా 9.559 కి.మీ నిర్మించాలి

43.93 కి.మీల సొరంగానికి గాను ఇప్పటివరకు 34.71 కి.మీల మేర పనులు పూర్తి కాగా, మరో 9.559 కి.మీల మేర సొరంగాన్ని నిర్మించాల్సి ఉంది. ఈ సొరంగాన్ని ఇప్పటివరకు రెండు టీబీఎంల సహాయంతో రెండు వైపుల (ఇన్‌లెట్, అవుట్‌లెట్) నుంచి తవ్వుకుంటూ వచ్చారు. అయితే ఇన్‌లెట్‌వైపు ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఇకపై ఆ వైపున టీబీఎంకు బదులు డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానంలో తవ్వకాలు జరపాలని నిర్ణయించగా.. అవుట్‌లెట్ వైపు నుంచి మాత్రం యథావిధిగా టీబీఎం ద్వారానే తవ్వకాలను పునరుద్ధరించనున్నారు.

'ఉచిత న్యాయం'పై అవగాహన అంతంతే..

- రాష్ట్రంలో లక్ష జనాభాకు ముగ్గురే పీఎల్‌వీలు
- లోక్ అదాలత్‌లో మాత్రం నంబర్ వన్‌గా తెలంగాణ
- 99.7 కేసుల పరిష్కార రేట్‌తో తొలి స్థానం
- నల్సా పథకాలపై ప్రచారం మరింత పెరగాలి
- అభిప్రాయపడిన ఇండియా జస్టిస్ రిపోర్టు



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్రం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు కావొస్తున్నా.. పేదలకు న్యాయం అందడం లేదు. న్యాయ సాయం కోసం ఎక్కడికి వెళ్లాలి.. ఎవరిని సంప్రదించాలి అనేది పేదలకు, గ్రామీణవాసులకు ఇప్పటికీ తెలియని పరిస్థితి. కోర్టు అనగానే నిరక్షరాస్యులు, పేదలకే కాదు.. ఆర్థికంగా మెరుగ్గా ఉన్న అక్షరాస్యులకూ భయమే. అది మనం ఏర్పాటు చేసుకున్న ఓ వ్యవస్థ అని.. అక్కడి ఉచిత న్యాయం పొందడం మన హక్కు అని తెలిసిన వారు అతి స్వల్పం. ప్రభుత్వం కూడా ఉచిత న్యాయ సాయంపై అవగాహన కల్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా), రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఆర్థిక లోటు, వసతుల లేమి కారణంగా అవి లక్ష్యాన్ని చేరుతున్నది అంతంత మాత్రమే. అయితే మధ్యవర్తిత్వం ద్వారా నిర్వహించే లోక్ అదాలత్‌లో మాత్రం అథారిటీ సత్తా చాటుతోంది. ఇటీవల 'ఇండియా జస్టిస్ రిపోర్ట్ 2025'పేరిట విడుదల చేసిన నివేదికలో లోక్ అదాలత్‌ల కేసుల పరిష్కార రేట్‌లో 99.7 శాతంతో తెలంగాణ నంబర్ స్థానం దక్కించుకుంది. ఓవరాల్‌గా న్యాయ సేవల్లో 10వ స్థానంలో నిలిచింది. దేశంలోని ఏ పౌరుడికైనా ఏ కారణంగానైనా న్యాయం పొందే అవకాశాలను నిరాకరించకూడదన్నది నల్సా ఉద్దేశం . ఇండియా జస్టిస్ రిపోర్ట్ ఆధారంగా కథనం..

1987లో...

లీగల్ సర్వీసెస్ అథారిటీస్ 1987 మేరకు రాష్ట్ర నిధులతో ఉచిత న్యాయ సాయం అందించడం కోసం ఒక సమగ్ర చట్రాన్ని రూపొందించారు. వాదనలు వినిపించడం, న్యాయ సలహా, కౌన్సెలింగ్, వివాద పరిష్కారంతో పాటు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. బహుళ ప్రచారంలోకి తీసుకెళ్లి లబ్ధిదారుల సంఖ్యను పెంచడంలో కొంత సత్ఫలితాలు సాధించింది.

తగ్గుతున్న పీఎల్‌వీలు..

దేశవ్యాప్తంగా పారా లీగల్ వలంటీర్లు (పీఎల్‌వీ) తగ్గుతూ వస్తున్నారు. కొత్తగా ఈ రంగంవైపు వచ్చే వారు లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తోంది.

దేశవ్యాప్తంగా పీఎల్‌వీల సంఖ్య ఇలా ఉంది..

2019	69,290
2020	51,077
2022	45,636
2025	43,050

2019తో పోలిస్తే 2025కు తగ్గిన పీఎల్‌వీల శాతం: 38

పీఎల్‌వీల తగ్గింపులో టాప్ రాష్ట్రాలు: తమిళనాడు, రాజస్తాన్, పంజాబ్

తెలంగాణలో లక్ష జనాభాకున్న పీఎల్‌వీలు ఇలా..

2019	7.47
2020	8.01
2022	5.32
2025	3.06

లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లు..

లీగల్ సర్వీసెస్ క్లినిక్ అనేది పేదలు, వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సాయం అందించే ఒక కార్యక్రమం. చట్టపరమైన అవగాహనను పెంపొందించడం, పేదలకు న్యాయ సాయం అందించడం దీని బాధ్యత.

దేశవ్యాప్తంగా సరాసరిన ఎన్ని గ్రామాలకు ఒక లీగల్ సర్వీసెస్ క్లినిక్ ఉందంటే..

2019....................42
2020....................42
2022....................127
2025....................163

- జార్ఖండ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా లీగల్ క్లినిక్ పరిధిలోకి వచ్చే గ్రామాల సంఖ్య: 800
- తెలంగాణలో సరాసరిన ఒక్క లీగల్ సర్వీసెస్ క్లినిక్ పరిధిలోకి వచ్చే గ్రామాల సంఖ్య: 440
- తెలంగాణలో సరాసరిన ఒక్క లీగల్ సర్వీసెస్ క్లినిక్ పరిధిలోకి వచ్చే జనాభా సంఖ్య: 39,440

అణగారిన వర్గాలకు న్యాయం అందడం లేదు..

ప్రచార రీతిలో సేవలను అందించడానికి అనేక సంవత్సరాలుగా చేసిన ప్రయత్నాలు అవగాహన పెంచడానికి సహాయపడ్డాయి.. అలాగే లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా పెంచాయి. లబ్ధిదారుల సంఖ్య 2019లో 12 లక్షల మంది కాగా, 2023–24లో ఈ సంఖ్య 15.5 లక్షలకు పెరిగింది. లోక్ అదాలత్‌తో మధ్యవర్తిత్వ పరిష్కారం, లీగల్ ఎయిడ్ డెఫెన్స్ కౌన్సిల్స్ (ఎల్ఏడీసీ) వ్యవస్థలతో ఆశాజనక పరిష్కారాలు వెలువడుతున్నాయి. అయితే ఎల్ఎస్ఏలకు నిధులు పెంపు, వనరులతో పాటు నాణ్యమైన కౌన్సిల్‌ల నియామకం జరగాల్సి ఉంది. జాతీయ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ (15100), సింగిల్–విండో విధానం, ఆన్‌లైన వ్యవస్థ రాక ప్రజలు న్యాయ సాయం పొందే మార్గాలను సులభతరం చేసింది. అయినా, గ్రామ లీగల్ క్లినిక్‌లు, పారాలీగల్ వాలంటీర్లు లాంటి కమ్యూనిటీ–ఆధారిత న్యాయ సహాయ సేవలు గణనీయంగా పెరిగినా, అణగారిన జనాభాకు మాత్రం ఇంకా న్యాయం అందని దాక్షగానే మారింది.

లోక్ అదాలత్..

ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 మధ్య లోక్ అదాలత్ ద్వారా తెలంగాణలో లక్షకు పైగా కేసులు నమోదు కాగా, 90 శాతం పరిష్కరించారు. జాతీయ, రాష్ట్ర లోక్ అదాలత్‌లో రాష్ట్రంలో ప్రీ–లిటిగేషన్(కోర్టుకు వెళ్లక ముందు) కేసుల నమోదు, పరిష్కారం ఇలా..

	నమోదు	పరిష్కారం
జాతీయ స్థాయి	1,43,22,549	1,42,91,356
రాష్ట్ర స్థాయి	81,264	75,979

(జాతీయ, రాష్ట్ర స్థాయి అదాలత్‌లు కలిపి పరిష్కార శాతం: 99.7)

ఇప్పుడంటే కూలర్లు, ఏసీలు.. మరి అప్పటి పరిస్థితేంటి?

వేసవి వచ్చిందంటే చాలు.. వేడి, ఉక్కపోత భరించలేం. ఫ్యానో, కూలరో, ఏసీ లేకుంటే ఉండలేం. ఇంకా ఇంటిని చల్లబరుచుకోవడానికి కూల్ రూఫ్‌లు, కూల్ పెయింట్లు వంటి మార్గాలు కూడా మనకు అందుబాటులో ఉన్నాయ్. మరి ఇవేమీ లేని ఆ రోజుల్లో జనం ఎలా ఉండేవారు? వేడి నుంచి తప్పించుకోవడానికి ఇళ్లలో ఎలాంటి ఏర్పాట్లు చేసుకునేవారు అనే సందేహాలు ఎప్పుడైనా వచ్చాయా?

నిజానికి ప్రకృతిలో లభించే గాలి, వెలుతురు, నీరు వంటి ఆహ్లాదకరమైన వనరులను మించి ఏముంటాయ్? వాటినే సమర్థవంతంగా వినియోగించుకుంటే ఈ ఏసీలు, కూలర్ల అవసరమే రాదు కదా! సైన్స్ అంతగా లేని ఆ పాతకాలంలో ఈ సహజ వనరులను తెలివిగా ఉపయోగించుకుని కట్టడాలు నిర్మించారు. వేసవిలో చల్లగా ఉండేలా చూసుకున్నారు. గాలిదిశను క్షుణ్నంగా అధ్యయనం చేయడంతోపాటు, వేడిని చల్లబరిచే అంశాలు, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అప్పటి నిర్మాణాల్లో జాగ్రత్తలు తీసుకునేవారు. అందుకే వాటిలో అద్భుతమైన కళా నైపుణ్యం ఉట్టిపడటమే కాదు.. చల్లని వాతావరణమూ ఉండేది. అవేంటో ఒకసారి చూద్దామా?..



హంపిలో ఇలా..

కర్ణాటక హంపిలోని లోటస్ మహల్‌నే చూడండి.. అందులోని గోడల్లో ఏర్పాటు చేసిన సన్నని పైపుల్లో నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఇది సహజ శీతలీకరణలాగా రాతి ఉపరితలాలను చల్లబరుస్తుంది. ఫలితంగా లోపల భాగం చల్లగా ఉంటుంది.

మండువా లోగిళ్లు..

తెలుగు రాష్ట్రాల్లోని మండువా లోగిళ్లు కూడా అద్భుతమే. ఈ గృహాల్లో ఇంటి మధ్యలో పైకప్పు ఓపెన్‌గా ఉంటుంది. ఇవి వాతావరణ పీడన ప్రాంతాలుగా పని చేస్తాయి. వీటి నుంచి వేడి గాలి బయటకు పోతుంది.. చల్లని గాలి లోపలకు వస్తుంది. ఫలితంగా ఇల్లు చల్లగా ఉంటుంది.





మెట్ల బావులు..

గుజరాత్, రాజస్తాన్‌లో ఉన్న మెట్ల బావులను నీటి నిల్వ కోసమే కాకుండా చల్లదనం కోణంలోనూ ఆలోచించి ఏర్పాటు చేశారు. లోతు, గాలి వచ్చే మార్గాలు తదితర అంశాలతో ఆ బావులు.. అక్కడి వాతావరణాన్ని ఉపరితలం కంటే ఐదు నుంచి ఆరు డిగ్రీల సెల్సియస్ చల్లగా ఉంచేవి.

జాలీ తెరలు..: సూఫీ మందిరాలు, రాజపుత్ ప్యాలెస్‌లలో సున్నితమైన జాలీ తెరల వంటివి ఏర్పాటు చేశారు. ఇవి అధిక వేడిని అడ్డుకుని గాలిని మాత్రమే లోపలికి పంపిస్తాయి.

మందపాటి రాతి గోడలు..: హళేబీడు, బేలూరులోని దేవాలయాల్లో మందపాటి రాతి గోడలు ఏర్పాటు చేశారు. ఇవి థర్మల్ బఫర్లుగా పని చేస్తాయి. అంటే పగటిపూట వేడిని గ్రహించి నెమ్మదిగా విడుదల చేస్తాయి. దీంతో లోపల గదులు చల్లగా ఉంటాయి.

మెటీరియలే అసలు మ్యాటర్..: ఆలయాల్లో వివిధ కళాకృతులను స్థానికంగా లభించే రాళ్లు, బంకమట్టితో చేయడం వెనుక కూడా కారణం ఇదే. అవి స్వభావరీత్యా నెమ్మదిగా వేడెక్కుతాయి. వాటిని తాకితే చల్లగా అనిపిస్తాయి.

షెడ్లు.. కారిడార్లు..: పెద్ద పెద్ద రాజభవనాలు, కోటల వంటి నిర్మాణాల్లో షెడ్లు, రూఫ్‌లు, కారిడార్లు, ఎండ నుంచి రక్షించే వాక్ వేలు ఉంటాయి. ఇవన్నీ సూర్యకిరణాలను నేరుగా రాకుండా అడ్డుకోవడంతోపాటు గాలిని స్వేచ్ఛగా లోపలికి వచ్చేలా చేస్తాయి.

ఫౌంటెయిన్లు.. నీటి కొలనులు..

నీటిని దాహం తీర్చుకోవడం కోసమే కాకుండా ఆ ప్రాంతాన్ని చల్లబరిచేందుకు కూడా వినియోగించుకోవచ్చని అప్పట్లోనే నిరూపించారు. నీటి కొలనులు, ఫౌంటెయిన్ల వంటి వాటితో గాలిని చల్లబరిచేవారు. తాజ్‌మహల్ ముందు ఏర్పాటు చేసిన నీటికొలను కూడా అలాంటిదే.



– సాక్షి, సెంట్రల్ డెస్క్

'కలుపు' నిర్మూలనకు లేజర్ టెక్నాలజీ

అమెరికా పరిశోధనా సంస్థ కార్బన్ రోబోటిక్స్ రూపకల్పన



సాక్షి, హైదరాబాద్ : లేజర్ కిరణాల ద్వారా పంట చేలల్లో కలుపు మొక్కలను నిర్మూలించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని కార్బన్ రోబోటిక్స్ అనే అమెరికన్ పరిశోధన సంస్థ రూపొందించింది. లేజర్ వీడర్‌గా పిలిచే ఈ యంత్రాలను కొన్నింటిని అమెరికాలో ప్రయోగాత్మకంగా విక్రయించారు. ట్రాక్టర్ సైజులో ఉండే ఒక్కో లేజర్ మెషీన్.. గంట సేపట్లో 20 ఎకరాల్లో లక్ష కలుపు మొక్కలను నిర్జీవం చేస్తుంది. దీని వల్ల కలుపు నిర్మూలనకు విషపూరిత హెర్బిసైడ్స్ వాడాల్సిన అవసరం ఉండదని నిపుణులు చెప్తున్నారు. దున్నడం ద్వారా కలుపును పెకిలించే అవసరం కూడా ఉండదని, కలుపును తొలగించడానికి ఖర్చు బాగా తగ్గుతుందని కార్బన్ రోబోటిక్స్ వెల్లడించింది. లేజర్ వీడర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పంట మొక్కలను, కలుపును వేర్వేరుగా గుర్తిస్తుంది. లేజర్ వీడర్ల ఖరీదు మన కరెన్సీలో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఉండొచ్చని తెలుస్తోంది. కార్బన్ రోబోటిక్స్ మాత్రం ఇంకా ధర నిర్ణయించలేదని చెబుతోంది. కాగా, లేజర్ టెక్నాలజీ.. మెట్ట పంటలకు మాత్రమే పనికొస్తుందా, వరి లాంటి మాగాణి పంటలకూ వాడొచ్చా అనేది తెలియాల్సి ఉంది. ట్రాక్టర్ సైజులో ఉండే యంత్రం టైర్లు వెళ్లేలా మడులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం । 21-4-2025


డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం

ఖిల్లా రామాలయం భళా..



ఏటా రెండుసార్లు కల్యాణోత్సవాలు..

ఏటా మాఘశుద్ధ ఏకాదశి నుంచి పాడ్యమి వరకు దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. త్రయోదశి రోజు శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. శ్రీరామనవమి రోజు శ్రీసీతారామస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఇలా ఏటా రెండుసార్లు స్వామి వారి కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఆలయం దక్షిణ దిక్కున సుమారు రెండు వందల ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. చెరువు మధ్యలో మండపం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది.

గిచ్చు బొమ్మలు..

ఈ ఆలయం గోడలపై గిచ్చు (శృంగార) బొమ్మలు చెక్కి ఉన్నాయి. గతంలో నిజాం రాజు ఈ ఆలయాన్ని సందర్శిస్తారని వర్తమానం రాగా, ఆయన ఈ బొమ్మలను చూసి ఎలా స్పందిస్తారోనని స్థానికులు వీటిపై సిమెంట్ పూశారు. అయితే పూర్వీకులు ఏ ఉద్దేశంతో వీటిని చెక్కారో తెలియదని, వాటిని అలాగే ఉంచాలని నిజాం రాజు ఆదేశించడంతో సిమెంట్‌ను తొలగించారు.


ఆలయంపై గజ కేసరి శిల్పాలు


ఆలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన తోరణం

అద్భుతం.. డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం
శతాబ్దాల చరిత్రకు నిలయం
అపురూప శిల్పకళానిలయం

డిచ్‌పల్లి(నిజామాబాద్ రూరల్): శతాబ్దాల చరిత్రకు, కళాచాతుర్యానికి, అపురూపమైన శిల్పకళకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం. ఈ ఆలయం క్రీ.శ. 16 వ శతాబ్దంలో నిర్మితమైనట్లు చరిత్రకారులు పేర్కొంటున్నారు. డిచ్‌పల్లి గ్రామానికి చివర సుమారు 60 అడుగుల ఎత్తులో ఉన్న గుట్టపై ఈ ఆలయాన్ని నిర్మించారు. ద్వారాలపై నగిషీ, గోపురాల మీద ద్రావిడుల సంప్రదాయం కనిపిస్తుంది. ఈ దేవాలయం విజయనగర రాజుల శిల్పకళా రీతిని చూపుతోంది. పదహారో శతాబ్దం మధ్య కాలంలో రామరాయల హయాంలో దీనిని నిర్మించి ఉండవచ్చని చరిత్రకారులు భావిస్తున్నారు. మరికొందరు.. ఈ ఆలయ నిర్మాణం 14వ శతాబ్దంలో నిర్మితం కావచ్చని అభిప్రాయ పడుతున్నారు. ఈ కట్టడాన్ని వైష్ణవులు నిర్మించారా?.. శైవులు నిర్మించారా? అన్నది పరిశీలకులకు కూడా అంతుబట్టడం లేదు. కాకతీయుల కాలంలోనే వైష్ణవులు ఈ ఆలయాన్ని నిర్మించి ఉంటారని మరికొందరి అభిప్రాయం. గర్భగుడి వద్ద ఉన్న ముఖ ద్వారాలను పరిశీలిస్తే కాళీమాత విగ్రహాలు కనిపిస్తాయి. దీంతో ఈ గుడి శైవులకు సంబంధించిందనే భావన కలుగుతుంది.

ఆలయ గోడలపై గజకేసరి (ఏనుగుపై దాడి చేస్తున్న సింహం) చిత్రాలు మలచబడి ఉన్నాయి. విజయనగర రాజులు, కాకతీయ రాజ్యాన్ని స్వాధీన పరచుకున్నామని చాటడానికి గుర్తుగా ఈ ఆలయాన్ని నిర్మించి గజకేసరి విగ్రహాలను చెక్కించారన్నది చరిత్రకారుల అభిప్రాయం.

డిచ్‌పల్లి రామాలయంలో 1947 వరకు ఎలాంటి విగ్రహాలు ఉండేవి కావు. గ్రామ సర్పంచ్ గజవాడ చిన్నయ్య గుప్తా అప్పట్లో రాజస్తాన్ నుంచి శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుడి పాలరాతి విగ్రహాలను తెప్పించి ఆలయంలో ప్రతిష్ఠింపజేశారు. అప్పటి నుంచి ఈ చారిత్రక శిల్పకళా నిలయం రామాలయంగా ప్రసిద్ధి చెందింది. ఈ మూల విగ్రహాలను ఇతర దేవాలయాల్లా కాకుండా ఉప పీఠంపై ప్రతిష్ఠించారు. గర్భగుడి మధ్యలో ఎత్తయిన రాతి సింహాసనం ఉంది. సింహాసనం ఎడమ భాగాన మూల విగ్రహాలను ప్రతిష్ఠించక ముందు నుంచి.. రెండు విగ్రహాలు ప్రతిష్ఠించడానికి అనువుగా నిర్ధారిత పరిమాణంలో రెండు సాంచలు (రంధ్రాలు) చేసి ఉన్నాయి.

మొదట్లో దేవాలయం చేరడానికి మెట్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడేవారు. తర్వాత కాలంలో దేవాలయం చేరుకోవడానికి 125 మెట్లు నిర్మించారు. క్రమంగా భక్తుల రద్దీ పెరుగుతూ వస్తోంది. 1971 వరకు డిచ్‌పల్లి సర్పంచ్‌గా పని చేసిన గజవాడ చిన్నయ్య ఆలయం అభివృద్ధికి విశేష కృషి చేశారు. నిత్య నైవేద్యం, పూజలు చేయడానికి అర్చకుడిని ఏర్పాటు చేశారు. అర్చకుడి కుటుంబ జీవనోపాధికి రెండు ఎకరాల భూమిని దేవాలయం పేరిట ఏర్పాటు చేశారు.



రాతి కట్టడం..

ఆలయం చుట్టూ చక్కగా మలచిన రాతి స్తంభాలు ఉన్నాయి. స్తంభాల పీఠభాగాలు రెండున్నర మీటర్ల చుట్టు కొలతను కలిగి ఉంటాయి. దేవాలయం నిర్మాణం చాలా వరకు నల్లరాయితోనే చేశారు. ఈ ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. అప్పట్లో గోపురం ఉండేది కాదు. కొద్ది సంవత్సరాల క్రితం సిమెంట్‌తో గోపురం నిర్మించారు. నిజామాబాద్ జిల్లాలోనే ఈ ఆలయానికి శిల్పకళలో అగ్రస్థానం లభిస్తుంది.

అబ్బురపరిచే శిల్పకళా నైపుణ్యం

ఆలయంపై గజకేసరి శిల్పాలతో పాటు ఇతర శిల్ప కళ సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుంది. నాట్యమాడుతున్న నెమళ్లు, పోట్లాడుతున్న జింకలు, పడగ విప్పిన నాగరాజు, విష్ణువు దశావతారాలు, ఐదు తలల ఆవు, తాబేలు ఆకారం ఇలా పలు చిత్రాలు కనువిందు చేస్తాయి.




డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం పక్కనే గల చెరువు, చెరువు మధ్యలో రాతిమండపం

ఆలయం పక్కనే చెరువు.. మధ్యలో మండపం

డిచ్‌పల్లి ఖిల్లా రామాలయం పక్కనే విశాలమైన చెరువు.. చెరువు మధ్యలో రాతి మండపం ఉన్నాయి. వేసవి కాలంలో చెరువులో నీళ్లు తగ్గిపోయిన తర్వాత.. ఈ రాతి మండపంలో అప్పటి కళాకారుల నృత్య ప్రదర్శనలు జరిగేవని పూర్వీకులు తెలిపారు. రామాలయం నుంచి మండపానికి, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రఘునాథ ఆలయానికి వెళ్లడానికి సొరంగాలు ఉండేవని ప్రస్తుతం వాటిని మూసివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి కృషితో.. ఆలయ పర్యాటకంలో భాగంగా చెరువులో బోటింగ్ ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనుంది.


ఆలయంపై ఆకట్టుకునే శిల్పకళ


గర్భగుడిలో కొట్టిన కొబ్బరి కాయల నీళ్లు బయటికెళ్లేందుకు ఏర్పాటు చేసిన మకర తోరణం

సలహా కమిటీ అడుగులు ముందుకు..

గల్ఫ్ మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న కమిటీ

- యూఏఈ నుంచి మృతదేహాలను స్వదేశానికి తెప్పించడంలో చొరవ
- మృతుల కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాలు
- కృతజ్ఞతలు తెలుపుతున్న గల్ఫ్ కార్మిక కుటుంబాలు


స్వర్గం శ్రీనివాస్ పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


ప్రేమ్‌సాగర్‌కు నివాళులర్పిస్తున్న సలహా కమిటీ సభ్యులు

మోర్తాడ్ (బాల్కొండ): తెలంగాణ ప్రవాసీ విధానం (ఎన్ఆర్ఐ పాలసీ) రూపకల్పన, గల్ఫ్ బోర్డు ఏర్పాటు కోసం నిర్దేశించిన గల్ఫ్ సలహా కమిటీ అడుగులు ముందుకు పడ్డాయి. సలహా కమిటీ బాధ్యతలను స్వీకరించిన వారం రోజులలోనే యూఏఈలో ఒక దుర్ఘటన చోటు చేసుకోవడం, ఈ అంశంలో కమిటీ సభ్యులు వేగంగా స్పందించి మృతదేహాలను స్వదేశానికి తెప్పించడంతో బాధిత కుటుంబాలకు ఊరట లభించింది. యూఏఈలోని ఆల్‌కూజ్ ప్రాంతంలోని బేకరీలో పాకిస్తాన్‌కు చెందిన వ్యక్తి చేతిలో నిర్మల్ జిల్లా సోన్‌కు చెందిన ప్రేమ్‌సాగర్, జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమన్నపేట్‌కు చెందిన స్వర్గం శ్రీనివాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈనెల 11న వీరు హత్యకు గురి కాగా వారం రోజుల వ్యవధిలోనే మృతదేహాలను స్వదేశానికి తెప్పించారు. ఇందులో సలహా కమిటీ కీలకపాత్ర పోషించింది. గల్ఫ్ సలహా కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, ఇతర సభ్యులు ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారులతో యూఏఈ ఘటనపై చర్చించారు. సీఎంవో నుంచి కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ శాఖకు సమాచారం అందించడంతో వారం రోజులలోనే మృతదేహాలను స్వదేశానికి తీసుకురాగలిగారు. గతంలో గల్ఫ్‌లో ఎవరైనా మరణిస్తే మృతదేహం ఇంటికి రావడానికి నెల రోజుల వరకు సమయం పట్టేది.

బాధిత కుటుంబాలకు భరోసా

యూఏఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. సలహా కమిటీ విజ్ఞప్తి మేరకు బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. హత్యకు గురైన వ్యక్తుల కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ విధానంలో ఏదైనా ప్రభుత్వ శాఖలో ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. గల్ఫ్ భరోసా కింద రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు.

అంత్యక్రియలకు ప్రభుత్వ సాయం

స్వర్గం శ్రీనివాస్ అంత్యక్రియలకు జగిత్యాల జిల్లా కలెక్టర్ రూ.15 వేల ఆర్థికసాయం మంజూరుచేశారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి అంతిమ సంస్కారాలకు మాత్రమే ప్రభుత్వ సాయం అందుతుంది. గల్ఫ్‌లో హత్యకు గురైన ఘటనను మానవతా దృక్పథంతో పరిగణనలోకి తీసుకున్న జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తన విచక్షణాధికారాలను ఉపయోగించుకుని స్వర్గం శ్రీనివాస్ అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. శనివారం జరిగిన శ్రీనివాస్ అంతిమ యాత్రలో ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పాడె మోశారు. ఆయన కూడా సొంతంగా రూ.10 వేల సాయం అందించారు. ఇద్దరు మృతుల ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో వారి కుటుంబ సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రకటించారు. సలహా కమిటీ ఏర్పడిన వెంటనే గల్ఫ్ ప్రవాసులకు ప్రయోజనం కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంపై గల్ఫ్ కార్మిక కుటుంబాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి.

సింగరేణిలో ఇక సీబీఎస్ఈ

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు
- ఈనెల 19న అనుమతులు జారీ
- 2025–26 విద్యా సంవత్సరం నుంచే తరగతుల బోధన
- వచ్చే ఏడాది కొత్తగూడెం, భూపాలపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు



సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం యాజమాన్యం 2025–26 విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి ఈనెల 19న అనుమతులు రాగా, రామగుండం–2 ఏరియాలోని సెక్టార్–3 పాఠశాలను మోడల్‌గా ఎంపిక చేశారు. ఇందులో 1 నుంచి 8వ తరగతి వరకు ప్రస్తుతం సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తుండగా రానున్న రోజుల్లో 9, 10 తరగతులకు కూడా అనుమతి వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా ప్రయత్నం..

సింగరేణి పాఠశాలలకు పూర్వ వైభవం తేవాలని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ అందించాలనే ఉద్దేశంతో 2022, జనవరిలో సింగరేణి అధికారులు విద్యాశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. వివిధ ప్రాంతాల్లో సీబీఎస్ఈ బోధన అందిస్తున్న పాఠశాలలను పరిశీలించారు. ఆ తర్వాత సింగరేణి యాజమాన్యం సీబీఎస్ఈ బోర్డుకు దరఖాస్తు చేయగా, పాఠశాలల్లో సరైన తరగతి గదులు, ల్యాబ్‌లు, విద్యార్థులకు ఆట స్థలం వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులు సూచించారు. దీంతో సింగరేణి పరిధిలో నడిచే పలు స్కూళ్లను ఆధునీకరించారు. వసతులపై సంతృప్తి వ్యక్తం చేసిన సీబీఎస్ఈ అధికారులు ఈ మేరకు ఎట్టకేలకు అనుమతులు మంజూరు చేశారు.

సీబీఎస్ఈతో పూర్వవైభవం

సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం 1976లో 11 ఏరియాల్లో 17 పాఠశాలలు ఏర్పాటు చేశారు. వాటిలో సుమారు 15 వేల మంది విద్యార్థులు చదివేవారు. అప్పట్లో ప్రైవేట్ పాఠశాలలు ఎక్కువగా లేకపోవడంతో సంస్థలో పనిచేసే అధికారుల పిల్లలు కూడా ఈ పాఠశాలల్లోనే విద్యనభ్యసించేవారు. అయితే క్రమంగా ప్రైవేట్ పాఠశాలలు పెరగడం, సింగరేణి విద్యాసంస్థల్లో చదివే వారు తగ్గడంతో ప్రస్తుతం 9 పాఠశాలలకు కుదించగా వాటిలో 5,300 మంది విద్యార్థులు మాత్రమే చదువుతున్నారు. ఈ సంఖ్యను గణనీయంగా పెంచాలని, ఇటీవల సంస్థలో కొత్తగా చేరిన 10 వేల మంది ఉద్యోగుల పిల్లలను కూడా ఈ పాఠశాలల్లో చేర్పించాలని, అందరికీ నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో సీబీఎస్ఈ బోధన అమలుకు సంస్థ సిఫార్సు చేసింది. దీంతో సింగరేణి పాఠశాలలకు పూర్వవైభవం రానుందని సంస్థ ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్ మాటేంటి?

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రతి మూడు నుంచి ఐదేళ్లకు ఓసారి ప్రమోషన్ వస్తుంది. ఎస్జీటీగా ఉద్యోగంలో చేరిన వారికి 30 సంవత్సరాల సర్వీసులో కనీసం ఎంఈఓ, డిప్యూటీ డీఈఓగా పదోన్నతి లభించే అవకాశం ఉంది. కానీ సింగరేణి పాఠశాలల్లో టీచర్‌గా చేరిన వారు అదే పోస్టులో ఉద్యోగ విరమణ చేస్తున్నారు. 1988–90 మధ్య అపాయింట్ అయిన వారు తప్పితే ఆ తర్వాత కొత్త పోస్టులు కూడా లేవు. ఇక సింగరేణి ఉద్యోగులలాగా వీరికి క్వార్టర్, గ్యాస్ ఇస్తున్నా.. వాటికి డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో ఇంటర్నల్ పరీక్షలకు అవకాశం ఉండగా.. ఇప్పుడా సౌకర్యం కూడా లేదు. సింగరేణి సంస్థలో పనిచేసే తమపై యాజమాన్యం సవతితల్లి ప్రేమ చూపుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన విద్యనందించేందుకే..



సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకే సీబీఎస్ఈ సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. కొందరు ఉద్యోగులు రూ.లక్షలు ఖర్చు చేసి తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. కొందరికి ఆ అవకాశం కూడా లేదు. దీంతో కార్మికులు, ఉద్యోగులు, అధికారుల పిల్లలందరికీ మెరుగైన బోధన అందించేలా కృషి చేస్తున్నాం. మూడేళ్లుగా చేస్తున్న తమ ప్రయత్నానికి ఇప్పుడు ఫలితం వచ్చింది.

– ఎస్.బలరామ్, సింగరేణి సీఎండీ

వెలవెలబోతున్న హార్బర్



ఎప్పుడు కళకళలాడే విశాఖ ఫిషింగ్ హార్బర్ మత్స్య వేట నిషేధం అమల్లోకి రావడంతో బోసిపోయింది. తూర్పు తీరంలో ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపల వేట నిలిచిపోయింది. ఎక్కడ బోట్లు అక్కడే ఉండిపోయాయి. పది నెలలపాటు సముద్రంలో అవిశ్రాంతంగా చేపల వేట చేసే మత్స్యకారులకు రెండు నెలల పాటు విశ్రాంతి లభించనుంది. ఈ నెల 14వ తేదీ నాటికి దాదాపు 2,500 బోట్లు హార్బర్‌లో జెట్టీకి చేరుకున్నాయి. అన్ సీజన్ కావడంతో బోట్లకు మరమ్మతులు చేస్తున్నారు. జూన్ 15వ తేదీ నుంచి చేపల వేట మొదలవుతుంది.

\- మహారాణిపేట











ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్డు

మే మే.. ముందు



అల్లూరి జిల్లాలో మేనెలరాక ముందే మే పుష్పాలు విరబూస్తూ కనువిందు చేస్తున్నాయి. ప్రతి ఏడాది మే నెలలో విరబూసే ఈ పువ్వులు.. గత 10 రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ముందస్తుగానే ఏప్రిల్ నెలలో విరబూసి కనువిందు చేస్తున్నాయి. హుకుంపేట మండలంలోని సన్యాసమ్మపాలెం గ్రామ శ్మశాన వాటిక సమీపంలో మే పుష్పాలు ముందుగానే విరబూశాయి. – సాక్షి, పాడేరు

ఫుడ్డు మారినా.. గుడ్డు మారలే

దేశంలో మారుతున్న ఆహార అలవాట్లు

తగ్గుతున్న పప్పు ధాన్యాలు, చక్కెర, ఉప్పు, నూనె వినియోగం

- తృణ ధాన్యాల వినియోగంలో భారీగా తగ్గుదల
- డ్రైఫ్రూట్స్ వాడకంలో పెరుగుదల నమోదు
- ఆందోళన కలిగిస్తున్న ప్రాసెస్డ్ ఫుడ్ అండ్ డ్రింక్స్ వినియోగం పెరుగుదల
- 2023-24 గృహ వినియోగ వ్యయ సర్వే స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: దేశంలో ఆహార అలవాట్లు మారుతున్నాయి. పుష్కర కాలంగా పప్పు ధాన్యాలు, చక్కెర, ఉప్పు, నూనె వాడకం తగ్గుతోంది. తృణ ధాన్యాల వినియోగంలో భారీగా తగ్గుదల నమోదవుతుండగా.. ప్రాసెస్ చేసిన ఆహారం, పానీయాల వినియోగం భారీగా పెరుగుతూ ఆందోళన కలిగిస్తోంది. గ్రామాలు, పట్టణాలు అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోంది. డ్రైఫ్రూట్స్ వినియోగంలో క్రమంగా పెరుగుదల నమోదవుతోంది. ఈ విషయాలు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ నిర్వహించిన 2023–24 గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నివేదికలో తేటతెల్లమయ్యాయి.

నెలవారీ తలసరి ఆహారపు వినియోగం శాతంలో మార్పులు ఇలా

	గ్రామాల్లో			పట్టణాల్లో (శాతం)		
ఆహార రకం	2011-12	2022-23	2023-24	2011-12	2022-23	2023-24
తృణ ధాన్యాలు	10.69	4.89	4.97	6.61	3.62	3.74
పప్పు ధాన్యాలు	2.76	1.77	1.78	1.93	1.21	1.22
చక్కెర-ఉప్పు	1.83	0.93	0.89	1.15	0.60	0.57
పాలు, పాల ఉత్పత్తులు	8.04	8.33	8.44	7.01	7.22	7.19
కూరగాయలు	6.62	5.38	6.03	4.63	3.80	4.12
తాజా పండ్లు	2.25	2.54	2.66	2.64	2.50	2.61
డ్రైఫ్రూట్స్	0.58	1.17	1.19	0.78	1.31	1.26
గుడ్లు, చేప, మాంసం	4.79	4.91	4.92	3.65	3.57	3.56
మంచినూనె	3.74	3.59	2.77	2.66	2.37	1.82
ప్రాసెస్ చేసిన ఆహారం	7.90	9.62	9.84	8.98	10.64	11.09


2024లో భారీగా పెరిగిన వడగాడ్పులు

- అన్ని రాష్ట్రాల్లో కలిపి 554 వేడిరోజులు నమోదు
- రాయలసీమలో 16 రోజులు... తెలంగాణలో 12 రోజులు
- 2023లో 230... 2022లో 467 నమోదు
- 2022లో వడదెబ్బకు 730మంది మృతి
- కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ గర్భ శాస్త్రాల మంత్రిత్వ శాఖ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో గతేడాది వడగాడ్పుల రోజుల సంఖ్య భారీగా పెరిగింది. అన్ని రాష్ట్రాల్లో కలిపి 2024లో 554 వేడి రోజులు నమోదైనట్లు కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ గర్భ శాస్త్రాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2022లో దేశంలో 467 వేడి గాలుల రోజులు నమోదుకాగా 2023లో 230 నమోదైనట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2023లో రాయలసీమలో ఒక్కరోజు మాత్రమే వేడి గాలులు నమోదుకాగా, 2024లో 16 రోజులు నమోదైనట్లు పేర్కొంది. తెలంగాణలో 2023లో 14 రోజులు, 2024లో 12 రోజులు వేడి గాలులు నమోదైనట్లు పేర్కొంది. గతేడాది అత్యధికంగా ఒడిశాలో 37 రోజులు, తూర్పు ఉత్తరప్రదేశ్‌లో 33 రోజులు, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో 32 రోజులు, బిహార్‌లో 30 రోజులు, పశ్చిమ రాజస్థాన్‌లో 29 రోజులు వేడి గాలులు నమోదైనట్లు తెలిపింది. వేడి గాలుల ప్రభావాన్ని తగ్గించడానికి అనుసరించాల్సిన మార్గదర్శకాలను జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ జారీ చేస్తుందని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. వేసవి కాలం ప్రారంభానికి ముందుగానే జాతీయ, రాష్ట్ర స్థాయి హీట్ వేవ్ సంసిద్ధత సమావేశాలను నిర్వహిస్తుందని పేర్కొంది. ఎండాకాలంలో సాధారణంగా నమోదయ్యే ఉష్ణోగ్రతల కంటే 4 నుంచి 5.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదైతే ఆ పరిస్థితులను హీట్‌వేవ్‌గా పేర్కొంటారు. కొన్నిసార్లు అది 6.4 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉంటే దానిని తీవ్రమైన హీట్‌వేవ్ అంటారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు తలెత్తుతాయని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. వడగాడ్పుల రోజుకు ఐఎండీ ఇచ్చిన నిర్వచనం ప్రకారం.. ఒక రాష్ట్రంలో 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత దాటిన రోజును 'ఒక వడగాడ్పు రోజు'గా పరిగణిస్తున్నారు. ఒకే తేదీలో 10 రాష్ట్రాల్లో వడగాడ్పులు ఉంటే '10 వడగాడ్పు రోజులు'గా పరిగణిస్తారు.

2018 నుంచి 2022 వరకు దేశంలో వడదెబ్బకు ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య



క్లుప్తంగా...

సాగర్‌మాత దేవాలయంలో ఈస్టర్ వేడుకలు



విజయపురిసౌత్: గుంటూరులోని స్థానిక సాగర్‌మాత దేవాలయంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే ఆలయంలో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఆ తరువాత క్రీస్తు నేడు లేచెను అని నినాదాలు చేశారు. అనంతరం భక్తులు ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ భక్తులనుద్దేశించి ప్రసంగించారు.

మార్టూరులో 15వ రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు



మార్టూరు: మార్టూరులోని మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో ఈనెల 24, 25, 26 తేదీలలో 15వ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మోహనరావు మాట్లాడుతూ మార్టూరు రోటరీ క్లబ్, శ్రీకారం కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాటికల పోటీలలో మొత్తం తొమ్మిది నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు.

జర్మనీ అబ్బాయి.. ఆంధ్రా అమ్మాయి



పెదవడ్లపూడి(మంగళగిరి): ప్రేమించుకున్న జర్మనీ అబ్బాయి ఆంధ్రా అమ్మాయి ఇరు కుటుంబాల అంగీకారంతో ఆదివారం గుంటూరు జిల్లా మంగళగిరికి సమీపంలోని పెదవడ్లపూడిలో వైభవంగా హిందూ సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నారు. పెదవడ్లపూడికి చెందిన సుందర్శనం రవికుమార్, లక్ష్మీ దంపతుల కుమార్తె మౌనిక జర్మనీలో పిహెచ్‌డి చేస్తూ ఉద్యోగం చేస్తోంది. అదే కంపెనీలో ఉద్యోగం చేస్తున్న జర్మనీకి చెందిన ఫాబియన్ డువెన్ బేక్‌తో పరిచయమై అది ప్రేమగా మారింది. దీంతో ఇరువురు తమ ఇళ్లల్లో తల్లిదండ్రులకు తెలియజేసి అందరి అంగీకారంతో పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో వైభవంగా వివాహం చేసుకున్నారు.

కవరు కట్టు.. లాభాలు పట్టు



- పెరుగుతున్న ఫ్రూట్ కవర్ల వినియోగం
- వంద శాతం నాణ్యత పెంచేందుకు అవకాశం
- మామిడి, దానిమ్మ, జామ, డ్రాగన్‌ఫ్రూట్స్‌కు అనుకూలం

రాయచోటి జగదాంబసెంటర్: పండ్లలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే దిశగా ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. అన్నమయ్య జిల్లాలో మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పండ్ల తోటలు విస్తృతంగా సాగవుతున్నాయి. వీటిలో చెక్కగుజ్జుతో తయారైన పేపరు సంచులను వినియోగించడం ద్వారా నాణ్యమైన ఫలసాయం పొందే వీలుంది. పేపరు సంచులను కాయలకు గాలి చొరబడకుండా కడితే వంద శాతం నాణ్యతను పెంపొందించుకున్నట్లే. అన్నమయ్య జిల్లాలో మామిడి తోటలు దాదాపు 33 వేల హెక్టార్లలో సాగు కాగా.. వీటిలో దిగుబడి 30 నుంచి 40 శాతం మాత్రమే వచ్చాయి. ఈ పేపరు సంచుల ద్వారా పండించిన పండ్లు విదేశాలకు ఎగుమతి చేసే నాణ్యతతో ఉంటాయని చెబుతున్నారు. గతేడాది అనేక మంది రైతులు ఫ్రూట్ కవర్లు వినియోగించి అధిక ధరలు పొందారు.

అధిక ఉష్ణోగ్రతలతో రాలిన పూత, పిందె

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు మామిడిపై తీవ్ర దుష్ప్రభావం చూపాయి. మొదట్లో పూత, పిందె బాగున్నా.. అధిక ఉష్ణోగ్రతలు మామిడి రైతుల ఆశలను రాల్చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఉష్ణోగ్రతలు దంచి కొడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల రైతుల కళ్ల ముందే 60–70 శాతం పూత, పిందె రాలిపోయాయి. ఈ పరిస్థితుల్లో అంతంత మాత్రంగా ఉన్న దిగుబడులను కాపాడుకోవడంతోపాటు నాణ్యను పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం ఫ్రూట్ కవర్ల వినియోగం ఊరటనిచ్చింది.

ఏ పండ్లకు వాడవచ్చు..



- జామలో థైవాన్ గోవా పిందె ఏర్పడిన 20–25 రోజుల తర్వాత ఒక్కొక్క పిందెకు ఒక్కొక్క తెల్ల రంగు సంచి వాడాలి. 60 రోజు తర్వాత కాయలను కోయవచ్చు.
- దానిమ్మలో పిందె ఏర్పడ్డాక.. ఒక్కొక్క పిందెకు ఒక్కో తెల్లరంగు సంచి వాడాలి. 90 రోజుల తర్వాత కాయలను కోయాలి.
- ద్రాక్షలో గుత్తులు ఏర్పడిన 60 రోజుల తర్వాత ఒక్కో గుత్తికి ఒక్కో తెల్లరంగు సంచి వినియోగించాలి. 50 రోజుల తర్వాత గుత్తులను కోసుకోవాలి.

పురుగుల నుంచి రక్షణ: ఫ్రూట్ కవర్ వినియోగంతో మంగు, మచ్చలు, మంచుపురుగు, ముడ్డిపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలగు వాటిని నియంత్రించి నాణ్యమైన పండ్ల దిగుబడికి తోడ్పడుతుంది. పిందె దశలో అంటే నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నపుడు వాడాలి. మంచి పలక పిందెలను సంచిలో పెట్టి 3 సెంటీమీటర్ల పైన తొడిమకు, సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలి.



కొండంత జనం

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల ఆదివారం తిరుమల భక్తులతో కిక్కిరిసిపోయింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. టీటీడీ కూడా దీనికి తగినట్టుగా ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం చోటు చేసుకోకుండా భక్తులకు పాలు, పులిహోర వంటివి నిరంతరం పంపిణీ చేస్తోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 78,821 మంది స్వామివారిని దర్శించుకోగా 33,568 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు.

కిక్కిరిసిన బోయకొండ



చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే ఆరాధ్య దైవంగా పేరుగాంచిన బోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం తరలివచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

అలరించిన సాంస్కృతికం



తిరుపతి రూరల్ : తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతపురానికి చెందిన అనంత కళా స్రవంతి అనితా నాగరాజు వారి శిష్య బృందం మోక్ష, లాస్య ప్రియ, ధ్రువర్షిత, దీక్షిత, గీతికా, పూజశ్రీత, ఇషితా, జెనిషా, దేవాన్షకిత, లాస్య, నైనిక, నైనిత, కల్పన సిరి ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం ఆకట్టుకుంది.



ఆధునిక కాలానికి సంస్కృతం అవసరం

తిరుపతి సిటీ: ఆధునిక కాలానికి సంస్కృత భాష ఎంతో అవసరమని, భాష ఆవశ్యకతను భవిష్యత్తు తరాలకు పెద్ద ఎత్తున తెలియజేయాల్సిన అవసరం ఉందని అఖిల భారతీయ సంఘ కార్యవాహ్ సురేష్ సోని అభిప్రాయపడ్డారు. జాతీయ సంస్కృత వర్సిటీ, సంస్కృత భారతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్ఫూర్తి సంఘమం కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సంస్కృతాన్ని ప్రతి ఒక్కరూ చదువుకుని, అందులోని జ్ఞానాన్ని పొందాలని సూచించారు.

బీచ్ కబడ్డీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక



చినగంజాం: బీచ్ కబడ్డీ ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక ఎంఎస్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. మే నెల 2వ తేదీ నుంచి కాకినాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననున్నట్లు అంతర్జాతీయ క్రీడాకారుడు, కోచ్ ఎం.గిరిబాబు తెలిపారు. ప్రకాశం జిల్లా నుంచి పోటీల్లో పాల్గొనే స్త్రీ, పురుషుల జట్టులకు ప్రయాణపు ఖర్చులు, ఇతర ఖర్చులు చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు.

మార్టూరులో 15వ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు

మార్టూరు: మార్టూరులోని మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో ఈనెల 24, 25, 26 తేదీలలో 15వ రాష్ట్రస్థాయి నాటికల పోటీలు నిర్వహించనున్నట్లు మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎఫర్ట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జేవీ మోహనరావుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మోహనరావు మాట్లాడుతూ మార్టూరు రోటరీ క్లబ్, శ్రీకారం కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నాటికల పోటీలలో మొత్తం తొమ్మిది నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు.


'వింగ్స్ ఆఫ్ జటాయు విత్ హౌస్‌బోట్' ఈ టూర్‌లో ➤

టెక్నాలజీతో రూపుదిద్దుకున్న రామాయణ ఘట్టం ఉంది.
అరేబియా తీరాన కొలువుదీరిన అతిపెద్ద గంగాధరుడున్నాడు.
అనంత సంపన్నుడు అనంత పద్మనాభ స్వామి ఉన్నాడు.
భారతీయ మూర్తులకు పశ్చిమ రంగులద్దిన రవివర్మ ఉన్నాడు.
కేరళ సిగ్నేచర్ హౌస్‌బోట్ విహారం ఉంది...
కథకళి... కలరిపయట్టు విన్యాసాలూ ఉన్నాయి.
టీ తోటలు... మట్టుపెట్టి డ్యామ్ బ్యాక్ వాటర్స్...
ఇవే కాదు... ఇంకా చాలా చూపిస్తోంది ఐఆర్‌సీటీసీ.

అరేబియా తీరం హౌస్‌బోట్ విహారం


అళిమలలోని గంగాధరేశ్వరుడి విగ్రహం

1వ రోజు


కోవళమ్ బీచ్

త్రివేండ్రమ్ ఎయిర్‌పోర్ట్ లేదా రైల్వే స్టేషన్, కొచువెలి రైల్వేస్టేషన్‌ల నుంచి పికప్ చేసుకుని బస చేయాల్సిన హోటల్‌కు తీసుకెళ్తారు. హోటల్ త్రివేండ్రమ్ లేదా కోవళమ్‌లలో ఉంటుంది. సాయంత్రం కోవళం బీచ్, అళిమల శివుని విగ్రహాన్ని దర్శించుకుని విశ్రాంతి తీసుకోవడమే.

అరేబియా తీరాన గంగాధరుడు

అళిమలలోని శివుడు గంగాధరుడు. అరేబియా తీరాన ఉన్న గంగాధరేశ్వరుడి విగ్రహం ఎత్తు 58 అడుగులు. ఈ విగ్రహాన్ని చూడడమే ఇక్కడ ప్రధానం. స్థానిక శిల్పి దేవదథన్ ఐదున్నరేళ్లు కష్టపడి దీనిని చెక్కాడు. ఈ పెద్ద విగ్రహం కేరళలోకే కాదు దేశమంతటికీ రికార్డు. ఈ ఆలయం తమిళ నిర్మాణశైలిలో ఉంటుంది.

2వ రోజు


ఉదయం త్రివేండ్రమ్‌లోని పద్మనాభస్వామి ఆలయ దర్శనం. జటాయు ఎర్త్ సెంటర్‌ని చూసిన తర్వాత ప్రయాణం కుమర్‌కోమ్ వైపు సాగుతుంది. ఈ ప్యాకేజ్ పేరుతో ఉన్న హౌస్‌బోట్ విహారం ఇక్కడ మొదలవుతుంది. కుమర్‌కోమ్ లేదా అలెప్పీలో క్రూయిజ్‌లోకి మారాలి. రాత్రి భోజనం, బస, ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అన్నీ హౌస్‌బోట్‌లోనే.

తెరవని ఆరవ గది


అనంతపద్మనాభస్వామి ఆలయం

త్రివేండ్రమ్... ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడైన అనంత పద్మనాభ స్వామి వల్ల ఈ పేరు విశ్వవ్యాప్తంగా ప్రచారం సంతరించుకుంది. ఈ నగరానికి ఆ పేరు వచ్చింది కూడా అనంత పద్మనాభ స్వామి వల్లనే. తిరు అనంత పురం... క్రమంగా మలయాళీల వ్యవహారంలో తిరువనంతపురం అయింది. బ్రిటిష్ వారి వ్యవహారంలో త్రివేండ్రమ్‌గా మారింది. ఇక్కడ పద్మనాభ స్వామి ఆలయంలో తెరవని ఆరో గది ఇప్పటికీ ఆసక్తికరమే. నాగబంధంతో మూసిన ఆ గదిని తెరవడానికి చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. పద్మనాభ స్వామి ఆలయ దర్శనంలో ఈ గదిని తప్పనిసరిగా చూడాలి. ఇక త్రివేండ్రమ్ అనగానే గుర్తొచ్చే మరో పేరు రాజా రవి వర్మ. భారతీయ దేవతల చిత్రాలకు కొత్తరంగులద్దిన ట్రావెన్‌కోర్ రాజవంశానికి చెందిన రవివర్మ నివాసాన్ని కూడా చూడవచ్చు.

జటాయు ఎర్త్ సెంటర్... ఇది ఒక థీమ్ పార్క్. జటాయు పక్షి ఆకారంలో నిర్మించారు. రామాయణంలో సీతాదేవిని రావణాసురుడు అపహరించిన సమయంలో రావణుడితో పోరాడి ప్రాణాలు వదిలిన పక్షి జటాయు. ఆ పక్షి రావణుడితో యుద్ధం చేసి నేల కొరిగిన ప్రదేశం ఇదేనని చెబుతారు. ఈ పార్క్‌ను పశ్చిమ కనుమల్లో ఓ కొండ మీద 65 ఎకరాల్లో నిర్మించారు. ఈ కొండమీదకు వెళ్లడానికి ఎనిమిది వందలకు పైగా మెట్లెక్కాలి. కేబుల్‌కార్ కూడా ఉంది. ఆరోగ్యవంతులు ఎక్కగలిగిన కొండే అయినప్పటికీ బయటి ప్రదేశాల నుంచి పర్యటన కోసం వచ్చిన వాళ్లు టైమ్ వేస్ట్ చేసుకోకుండా పశ్చిమ కనుమల సౌందర్యాన్ని వీక్షిస్తూ కేబుల్ కార్‌లో వెళ్లడమే మంచిది. వెకేషన్ కోసం వెళ్లి నాలుగైదు రోజులు బస చేసేవాళ్లు ఒక రోజు కొండ ఎక్కడాన్ని ఆస్వాదించవచ్చు. ఇక్కడ ప్లాస్టిక్‌ని అనుమతించరు.


జటాయు ఎర్త్ సెంటర్

3వ రోజు

అలెప్పీ నుంచి మునార్‌కు ప్రయాణం. రోడ్డు మార్గాన మునార్‌కు చేరాలి. మధ్యలో పునర్జనిలో కేరళ సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను ఆస్వాదించాలి. రాత్రి బస మునార్‌లో.

కలరిపయట్టు... కథకళి చూద్దాం!



కలరిపయట్టు




పునర్జని ట్రెడిషనల్ విలేజ్... కేరళ సంప్రదాయ కళల ప్రదర్శన వేదిక. అలాగే ఆయుర్వేద చికిత్సల నిలయం కూడా. మునార్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ రోజూ సాయంత్రం ఆరు గంటలకు కథకళి నాట్యం, కలరిపయట్టు యుద్ధకళా విన్యాసాలను ప్రదర్శిస్తారు. రిలాక్సేషన్ థెరపీలు ఐదు నుంచి పదిహేను వేలు చార్జ్ చేస్తారు. అవి ఈ ప్యాకేజ్‌లో వర్తించవు.


కథకళి

4వ రోజు


ఎరవికులమ్ నేషనల్ పార్క్


లోకార్ట్ టీ తోటలు


నీలకురింజి పూలు

రోజంతా మునార్‌లోనే. ఎరవికులమ్ నేషనల్ పార్క్ పర్యటన, టీ మ్యూజియం, మట్టుపెట్టి డ్యామ్, ఎకో పాయింట్, కుందల డ్యామ్ లేక్‌లో విహరించిన తర్వాత రాత్రి బస మునార్‌లోనే.

మునార్ టీ తోటల మధ్య విహారం, ఝుమ్మనే వాటర్ ఫాల్స్ ను దూరం నుంచే చూస్తూ ముందుకు సాగిపోవడంతోపాటు టీ మ్యూజియం సందర్శన బాగుటుంది. మట్టుపెట్టి డ్యామ్, రిజర్వాయర్ చుట్టూ విస్తరించిన టీ తోటల దృశ్యం కనువిందు చేస్తుంది. ఎరవికులమ్ నేషనల్ పార్క్ విజిట్ మరిచిపోలేని అనుభూతి. నీలగిరుల్లో పన్నెండేళ్లకోసారి పూచే నీలికురింజి పువ్వు దట్టంగా పూసేది ఇక్కడే. నీలకురింజి మళ్లీ పూసేది 2030లో. కానీ ఎక్కడో ఓ చోట ఒకటి రెండు గుత్తులు కనిపిస్తాయి. గైడ్‌లు వాటిని చూపించి కొండ మొత్తం పూసినప్పుడు దృశ్యం ఎలా ఉంటుందో ఫొటోలు చూపిస్తారు.

5వ రోజు


కొచ్చిలోని స్పైసెస్ మార్కెట్

మునార్‌లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి కొచ్చి వైపు సాగిపోవాలి. కొచ్చిలో హోటల్ చెక్ ఇన్. మెరైన్ డ్రైవ్‌ను ఎంజాయ్ చేసిన తర్వాత షాపింగ్ తర్వాత నైట్ స్టే.

కొచ్చిలో షాపింగ్ చేయడం మొదలు పెడితే మన లగేజ్ పెరిగిపోతుంది. లవంగాలు, యాలకులు, మిరియాల వంటివి చక్కటి ఘాటు వాసనతో స్వచ్ఛంగా ఉంటాయి. టూర్ గుర్తుగా కేరళ చీర ఒక్కటైనా కొనుక్కోవాలి. అవి బాగా మన్నుతాయి కూడా! స్థానిక హస్తకళాకృతులకు కొదవే ఉండదు. కోకోనట్ కాయిర్‌తో చేసిన గృహోపకరణాలు కూడా బాగుంటాయి. కథకళి సావనీర్‌లు తెచ్చుకోవచ్చు. ఆయుర్వేద తైలాల పేరుతో దొరికేవన్నీ స్వచ్ఛమైనవి కాదు, నకిలీలు కూడా ఉంటాయి. వీటిని గవర్నమెంట్ ఆథరైజ్‌డ్ స్టోర్‌లలో మాత్రమే కొనాలి. షాపింగ్ చేసేటప్పుడు ఫ్లయిట్‌లో లగేజ్ బరువు పరిమితిని దృష్టిలో ఉంచుకోవాలి. వెళ్లేటప్పుడు ఫ్లయిట్, తిరిగి వచ్చేటప్పుడు ట్రైన్‌లో ప్రయాణం చేస్తే లగేజ్ బరువు విషయంలో కొంత వెసులుబాటు ఉంటుంది.

6వ రోజు


యూదుల మందిరం సినగోగ్

కొచ్చిలో హోటల్ చెక్ అవుట్ చేసి, కొచ్చి లోని డచ్ ప్యాలెస్ సందర్శనం. యూదుల సినగోగ్ (ధార్మిక సమావేశ మందిరం), సర్ ఫ్రాన్సిస్ చర్చ్, సాంటా క్రాజ్ బాసిలికా పర్యటన తర్వాత కొచ్చి ఎయిర్ పోర్ట్ లేదా ఎర్నాకుళం రైల్వే స్టేషన్‌లో డ్రాప్ చేయడంతో టూర్ పూర్తవుతుంది. కొచ్చి, ఎర్నాకుళం మన హైదరాబాద్- సికింద్రాబాద్ వంటి జంట నగరాలు. ఎయిర్‌పోర్టు కొచ్చిలో ఉంది, రైల్వే స్టేషన్ ఎర్నాకుళంలో ఉంది.


వాస్కోడిగామా రాక ఫలితం!

డచ్ ప్యాలెస్... అనగానే పాశ్చాత్య నిర్మాణశైలిని ఊహిస్తాం. కానీ ఇది పూర్తిగా కేరళ సంప్రదాయ నాలుకెట్టు నిర్మాణశైలిలో ఉంటుంది. పోర్చుగీసు వాళ్లు నిర్మించడం వల్ల డచ్ ప్యాలెస్‌గా అనే పేరు వచ్చింది. ఇది కొచ్చి నగరానికి సమీపంలోని మత్తన్ చెర్రి అనే ప్రదేశంలో ఉండడంతో స్థానికులు మత్తన్‌చెర్రి ప్యాలెస్ అనే పిలుస్తారు. వాస్కోడిగామా మన దేశంలో కేరళతీరం, కొచ్చి రాజ్యం, కప్పడ్ దగ్గర ప్రవేశించాడు. కొచ్చి రాజు అతడికి సాదర స్వాగతం పలికాడు. మనదేశం బ్రిటిష్ వలస పాలనలోకి వెళ్లడానికి దారులు వేసిన ఒక కారణం ఇది. ఈ ప్యాలెస్ భవనాల సముదాయం హెరిటేజ్ సైట్‌ల జాబితా కోసం యునెస్కో పరిశీలనలో ఉంది. ఈ ప్యాలెస్ లోపల నాటి చిత్రరీతుల ప్రదర్శన ఉంది.


డచ్ ప్యాలెస్...

యూదులు వచ్చారు!

మత్తన్‌చెర్రిలో డచ్ ప్యాలెస్ పక్కనే యూదు మతస్థుల ధార్మిక సమావేశ మందిరం సినగోగ్ కూడా ఉంది. ఇది కూడా డచ్ ప్యాలెస్ నాటి 16వ శతాబ్దం నాటి నిర్మాణమే. పశ్చిమం నుంచి మనదేశానికి అరేబియా సముద్రం మీదుగా జలమార్గాన్ని కనుక్కున్న తర్వాత పాశ్చాత్య దేశాలతో వర్తక వాణిజ్యాలు ఊపందుకున్నాయి. వర్తకులు, నౌకాయాన ఉద్యోగులు తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకోవడం మొదలైంది. అలా స్పెయిన్, పోర్చుగల్ నుంచి వచ్చిన వారిలో కొంతమంది ఇక్కడే స్థిరపడ్డారు. ఆ కాలనీలు క్రమంగా వారి మత విశ్వాసాలను కొనసాగించడానికి మందిరాలు కట్టుకున్నారు. అలాంటిదే ఇది కూడా. ఈ సినగోగ్ క్రిస్టల్ షాండ్లియర్‌లతో అందంగా ఉంటుంది. తమ మత సంప్రదాయాలను గౌరవిస్తూ భారతదేశంలో భారతీయులుగా మమేకమయ్యారు.



ఎరవికులమ్ పార్క్ ఓపెన్ అయింది!

'వింగ్స్ ఆఫ్ జటాయు విత్ హౌస్‌బోట్'...

ఇది 5 రాత్రులు, 6 రోజుల టూర్ ప్యాకేజ్. ఇందులో త్రివేండ్రమ్, అలెప్పీ, మునార్, కొచ్చి ప్రదేశాలు కవర్ అవుతాయి. నీలగిరి తార్‌కు ప్రసూతి సమయం కావడంతో మునార్‌లోని ఎరవికులమ్ నేషనల్ పార్క్‌ను ఏప్రిల్ 1 వరకు క్లోజ్ చేశారు. ప్రస్తుతం పర్యాటకులను అనుమతిస్తున్నారు. కాబట్టి 'వింగ్స్ ఆఫ్ జటాయు విత్ హౌస్‌బోట్' టూర్‌కి ఇది అనువైన సమయం.

- కంఫర్ట్ కేటగిరీలో సింగిల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి దాదాపుగా 57 వేల రూపాయలవుతుంది. డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 30 వేలవుతుంది. ట్రిపుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 23 వేలవుతుంది. పిల్లలకు విడిగా బెడ్ తీసుకుంటే తొమ్మిది వేలు, బెడ్ తీసుకోకపోతే దాదాపుగా ఐదు వేల ఐదు వందలు.
- టూర్‌లో ఏసీ వాహనంలో ప్రయాణం, ట్రావెల్ ఇన్స్యూరెన్స్, మార్గమధ్యంలో టోల్ ఫీజులు, పార్కింగ్ ఫీజులు, ప్యాకేజ్‌లో చెప్పిన ప్రదేశాల్లో ఎంట్రీ టికెట్‌లు, హోటల్ గది బస, హౌస్‌బోట్‌లో బస, నాలుగు బ్రేక్‌ఫాస్ట్‌లు, హౌస్‌బోట్‌లో లంచ్, డిన్నర్ ఈ ప్యాకేజ్‌లో ఉంటాయి.
- ప్యాకేజ్‌లో మన ప్రదేశం నుంచి త్రివేండ్రమ్‌కు చేరడం, కొచ్చి లేదా ఎర్నాకుళం నుంచి ఇంటికి రావడానికి అయ్యే రైలు లేదా విమాన ఖర్చులు వర్తించవు. త్రివేండ్రమ్‌లో రిసీవ్ చేసుకోవడం నుంచి కొచ్చిలో వీడ్కోలు పలకడం వరకే ఈ ప్యాకేజ్.
- ఇటీవల పర్యాటకులు యూ ట్యూబ్ వీడియోల కోసం ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తున్నారు. పర్యాటకుల భద్రత దృష్ట్యా హౌస్‌బోట్ ప్రయాణంలో నిర్వహకుల సూచనలను విధిగా పాటించాలి.
- ఈ టూర్‌లోని పర్యాటక ప్రదేశాల్లో మునార్ టీ మ్యూజియానికి సోమవారం సెలవు, కొచ్చిలోని డచ్ ప్యాలెస్ శుక్రవారం, యూదుల సినగోగ్‌కి శనివారం సెలవు. వీటిలో ఒకటి - రెండు మిస్ కాక తప్పదు.

టూర్ లింక్:
https://www.irctctourism.com/pacakage_description?packageCode=SEH050
టూర్ కోడ్ : WINGS OF JA-TAYU WITH HOUSEBOAT (SEH050)

విమానాశ్రయంలో దేవుని ఊరేగింపు!


విమానాశ్రయంలో దేవుని ఊరేగింపు


త్రివేండ్రమ్ చేరడానికి విమానంలో వెళ్లడం వల్ల బోనస్ థ్రిల్ ఉంటుంది. పద్మనాభస్వామి ఊరేగింపు కోసం విమానాలు ల్యాండింగ్ ఆపేస్తారు. ఏడాదికి రెండు దఫాలు ఈ విచిత్రం చోటు చేసుకుంటుంది. ఏప్రిల్ నెలలో పైన్‌కుని పండుగ సందర్భంగా జరిగే పది రోజుల వేడుకలో చివరి రోజు ఆరట్టు (సముద్రస్నానం) కోసం పద్మనాభ స్వామి ఊరేగింపు ఆలయం నుంచి షంగుముగమ్ బీచ్ వరకు ఆరు కిలోమీటర్ల దూరం సాగుతుంది. అలాగే అక్టోబర్ లేదా నవంబర్ నెలలో అల్పాటి పండుగ వేడుకల సందర్భంగా కూడా రన్‌వేని మూసివేస్తారు. ఎందుకంటే విమానాశ్రయం రన్‌వే ఈ దారిలోనే ఉంది. విమానాశ్రయాన్ని నిర్మించేటప్పుడే (1932) ప్రభుత్వం విధించిన నియమం ఇది. ఈ మేరకు ఏడాదిలో రెండుసార్లు ఇక్కడ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ తీసుకోవు. పండుగకు రెండు నెలల ముందే ఆలయ ట్రస్ట్ బోర్డు వేడుకల షెడ్యూల్‌ను ఎయిర్‌పోర్ట్ అథారిటీకి తెలియచేస్తుంది. ఆ మేరకు ఏ తేదీన ఏ సమయంలో ఎయిర్‌పోర్ట్ రన్‌వేను మూసివేయనున్నారనే సమాచారం అక్కడ రాకపోకలు సాగించే విమానాల సంస్థలకు అందుతుంది. ఇది ప్రపంచవింత కాదు కానీ విచిత్రం.






హౌస్‌బోట్ లోపలి దృశ్యాలు

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి





మీ బ్రాండ్ అనేది మీరు ఎదురుగా లేనపుడు
ఇతరులు మీగురించి చెప్పే మాట.
- జెఫ్ బెజోస్, అమెజాన్ వ్యవస్థాపకుడు

సాక్షి ప్లస్
సోమవారం। 21-4-2025

బిజినెస్ రీల్

రూ.8,346 కోట్ల రుణ చెల్లింపుల్లో ఎంటీఎన్ఎల్ డిఫాల్ట్

అత్యధికంగా యూనియన్ బ్యాంక్‌కు..

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం కంపెనీ ఎంటీఎన్ఎల్ రూ.8,346 కోట్ల బ్యాంక్ రుణ చెల్లింపుల్లో విఫలమైంది. ఏడు ప్రభుత్వరంగ బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించలేకపోయినట్లు, 2025 మార్చి 31 నాటికి కంపెనీ మొత్తం రుణ భారం రూ.33,568 కోట్లకు పెరిగినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది. ఇందులో అత్యధికంగా యూనియన్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3,633 కోట్ల రుణాన్ని చెల్లించడంలో విఫలమైంది. ఆ తర్వాత ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌కు రూ.2,374 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.1,077 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.464 కోట్లు, ఎస్‌బీఐకి రూ.350 కోట్లు, యూకో బ్యాంక్‌కు రూ.266 కోట్లు, అసలు, వడ్డీ కలసి మరో రూ.180 కోట్ల చెల్లించాల్సి ఉన్నట్లు ఎంటీఎన్ఎల్ ప్రకటించింది. 2024 ఆగస్ట్ నుంచి 2025 ఫిబ్రవరి మధ్య ఈ రుణాలను చెల్లించడంలో విఫలమైనట్లు తెలిపింది. కంపెనీ మొత్తం రుణ భారంలో రూ.8,346 కోట్లు బ్యాంక్ రుణాల రూపంలో ఉంటే, రూ.24,071 కోట్లు సావరీన్ గ్యారంటీ బాండ్, టెలికం శాఖ నుంచి రుణం రూపంలో తీసుకున్న రూ.1,151 కోట్ల బకాయిలు ఉన్నట్లు వివరించింది.

గతేడాది డీమ్యాట్ ఖాతాల జోరు

2024–25లో 84 లక్షల ఖాతాల జమ



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో దేశీ క్యాపిటల్ మార్కెట్లు జోరు చూపడం పలువురు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చింది. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈలో నికరంగా 84 లక్షల డీమ్యాట్ ఖాతాలు కొత్తగా జమయ్యాయి. వెరసి మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 4.92 కోట్లను తాకింది. ఇందుకు ప్రధానంగా మార్కెట్లు జోరందుకోవడానికితోడు డిజిటల్ బ్రోకరేజీ సంస్థలు దోహదం చేశాయి. కొత్తగా జత కలిసిన ఖాతాలలో గ్రో, ఏంజెల్ వన్ నుంచే 57 శాతం నమోదయ్యాయి. 34 లక్షల డీమ్యాట్ ఖాతాలు గ్రో నుంచి ఓపెన్‌కాగా.. ఏంజెల్ వన్ నుంచి 14.6 లక్షల ఖాతాలు జమయ్యాయి. అంటే 84 లక్షల కొత్త ఖాతాలలో ఈ రెండు సంస్థల నుంచే 48.6 లక్షల ఖాతాలు జత కలిశాయి. ఈ బాటలో ఇన్వెస్టర్లు మరో బ్రోకింగ్ సంస్థ జిరోధా నుంచి 5.4 లక్షల ఖాతాలు తెరిచినట్లు ఎన్ఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. మొబైల్ ఆధారిత సరళీకృత లావాదేవీల కారణంగా ఇన్వెస్టర్లు డిజిటల్ బ్రోకరేజీలను ఆశ్రయిస్తున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల నుంచి ఇన్వెస్టర్లు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా లావాదేవీలకు ఆసక్తి చూపుతున్నట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-4-2025

విశాఖ	425–00
చిత్తూరు	440–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	395–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

క్యూ4 ఫలితాలే దిక్సూచి

జాబితాలో హెచ్‌సీఎల్ టెక్, హెచ్‌యూఎల్, మారుతీ

- యూఎస్ టారిఫ్‌లపై ఇన్వెస్టర్ల దృష్టి
- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు కీలకం
- ఈ వారం స్టాక్ మార్కెట్‌పై విశ్లేషకుల అంచనాలు

గత ఆర్థిక సంవత్సరం(2024-25) చివరి త్రైమాసిక(క్యూ4) ఫలితాలే ప్రధానంగా ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. వీటికితోడు యూఎస్ టారిఫ్ వార్తలు కీలకంగా నిలవనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. వారాంతాన వెలువడిన వర్షపాత అంచనాలు సెంటిమెంటుకు జోష్‌నివ్వనున్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్లు ఈ వారం ప్రధానంగా కార్పొరేట్ దిగ్గజాల క్యూ4(జనవరి–మార్చి) ఫలితాల ఆధారంగా కదలనున్నాయి. క్యూ4తోపాటు మార్చితో ముగిసిన పూర్తి ఏడాది పనితీరును సైతం వెల్లడించనున్నాయి. కొన్ని రంగాల కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో ప్రభావిత అంశాలు, పనితీరుపై అంచనాలు సైతం వెలువరించనున్నాయి. ఈ జాబితాలో కార్ల దిగ్గజం మారుతీసహా.. ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎఫ్ఎంసీజీ బ్లూచిప్ హిందుస్తాన్ యూనిలీవర్, ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తదితరాలున్నాయి. ఐటీ బ్లూచిప్ ఇన్ఫోసిస్‌తోపాటు వారాంతాన(19న) ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐసహా యస్ బ్యాంక్ ఫలితాలు విడుదల చేశాయి. దీంతో నేడు(21న) ఈ కౌంటర్లపై ఫలితాల ప్రభావం కనిపించనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

ఇతర అంశాలు

ప్రపంచ ప్రధాన(ఆరు) కరెన్సీలతో మారకంలో ఇటీవల డాలరు బలహీనపడుతుండటంతో దేశీ కరెన్సీ బలపడుతోంది. డాలరు ఇండెక్స్ కొద్ది రోజులుగా 104 స్థాయి నుంచి 99కు నీరసించడం రూపాయికి జోష్‌నిస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనికితోడు దేశీ స్టాక్స్‌లో తిరిగి విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) భారీగా పెట్టుబడులు చేపడుతుండటం మరింత మద్దతిస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ పేర్కొన్నారు. కాగా.. ముడిచమురు ధరలు బ్యారల్ 65–60 డాలర్ల స్థాయికి దిగిరావడం దేశీయంగా సానుకూల అంశమని, ఇది ద్రవ్యోల్బణం తగ్గేందుకు దోహదపడుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌కూ ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు.

రుతుపవనాల ఎఫెక్ట్

ఈ ఏడాది సాధారణానికంటే అధిక వర్షపాతానికి వీలున్నట్లు దేశీ వాతావరణ శాఖ(ఐఎండీ) విడుదల చేసిన అంచనాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు. ఇది ధరల(ద్రవ్యోల్బణ) క్షీణతకు దారి చూపవచ్చని పేర్కొన్నారు. అయితే యూఎస్ టారిఫ్ వార్తలు మార్కెట్లలో హెచ్చుతగ్గులకు కారణంకావచ్చని విశ్లేషించారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థలుగల యూఎస్, చైనా సుంకాల విధింపులో పోటాపోటీగా వ్యవహరిస్తుండటం ఇన్వెస్టర్లలో ఆందోళనలకు కారణమవుతున్నట్లు పలువురు నిపుణులు తెలియజేశారు. ఇకపై టారిఫ్‌ల యుద్ధం మరింత వేడెక్కడం లేదా చల్లబడటం అనే అంశాలపై మార్కెట్లు దృష్టిపెట్టనున్నట్లు వివరించారు.

గత వారమిలా

కేవలం మూడు రోజులు జరిగిన గత వారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ ఏకంగా 4 శాతం పైగా జంప్‌చేయడం విశేషం! ఇందుకు ప్రధానంగా విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడం తోడ్పాటునిస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. గత వారం సెన్సెక్స్ నికరంగా 3,396 పాయింట్లు(4.5 శాతం)దూసుకెళ్లగా, నిఫ్టీ సైతం 1,023 పాయింట్లు(4.5 శాతం) ఎగసింది. వెరసి సెన్సెక్స్ 78,553 వద్ద, నిఫ్టీ 23,852 వద్ద ముగిశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ ఇదేస్థాయిలో ర్యాలీ చేయడం గమనార్హం!

ఎఫ్‌పీఐల దన్ను

3 రోజుల్లో రూ. 8,500 కోట్లు

గత వారం మూడు ట్రేడింగ్ సెషన్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 8,472 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. నిజానికి ఈ నెల మొదట్లో సైతం ఎఫ్‌పీఐలు అమ్మకాలకే ప్రాధాన్యమిచ్చారు. ఈ బాటలో గత వారం తొలి రోజు రూ. 2,352 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. తదుపరి రెండు సెషన్లలో ఏకంగా రూ. 10,824 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. దీంతో ఈ నెలలో ఇప్పటివరకూ ఎఫ్‌పీఐలు దేశీ స్టాక్స్ నుంచి రూ. 23,103 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. అంటే 2025 జనవరి నుంచి రూ. 1.4 లక్షల కోట్ల పెట్టుబడులు ఉపసంహరించారు.

సాంకేతికంగా

గత వారం సెలవుల నేపథ్యంలో సాంకేతికంగా మార్కెట్లు మూడు ట్రేడింగ్ సెషన్లలోనే భారీగా బలపడ్డాయి. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 23,600 పాయింట్ల స్థాయిలో బలమైన మద్దతును కూడగట్టుకుంటున్నట్లు సాంకేతిక నిపుణులు తెలియజేశారు. దీంతో మరోసారి నిఫ్టీకి ఈ స్థాయి సపోర్ట్‌గా నిలిచే వీలున్నట్లు అంచనా వేశారు. ఇదేవిధంగా 24,550 పాయింట్ల వద్ద అవరోధాలు ఎదురుకావచ్చని పేర్కొన్నారు. వెరసి సమీప భవిష్యత్‌లో సపోర్ట్ లేదా రెసిస్టెన్స్‌లను అధిగమిస్తే మార్కెట్ల తీరు వెల్లడికావచ్చని అభిప్రాయపడ్డారు.

నెట్‌వర్క్18 మీడియా నష్టం రూ.29 కోట్లు

ముంబై: గత ఆర్థిక సంవత్సరం (2024–25)) చివరి త్రైమాసికంలో ప్రైవేట్ రంగ నెట్‌వర్క్18 మీడియా అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి (క్యూ4)లో రూ.29 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. నిర్వహణ ద్వారా రూ.561 కోట్ల ఆదాయం ఆర్జించింది. అంతకు ఆర్థిక సంవత్సరం (2023–24)లో నికర నష్టం రూ.196 కోట్లు, ఆదాయం రూ. 2,792 కోట్లుగా నమోదైంది. స్టార్ ఇండియాతో తన అనుబంధ సంస్థ వయాకామ్ 18 విలీనం నేపథ్యంలో ఆర్థిక ఫలితాలు వార్షిక ప్రాతిపదికన పోల్చలేమని సంస్థ తెలిపింది. 2025 మార్చి 31తో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్వహణ ఆదాయం రూ.6,888 కోట్లుగా నమోదైంది. కంపెనీ దీర్ఘకాలిక వృద్ధిపై సానుకూల ధోరణితో ఉన్నామంటూ చైర్మన్ అదిల్ జైనుల్‌భాయ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

టెలీనిటీకి కీలక మార్కెట్‌గా భారత్

న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో కార్యకలాపాల విస్తరణకు కోసం భారత్ తమకు కీలక మార్కెట్‌గా నిలుస్తోందని టెలికం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ టెలీనిటీ సీఈవో ఇల్హాన్ బెగోరెన్ తెలిపారు. తమ టాప్ 5 దేశాల్లో భారత్ కూడా ఒకటని, ఆదాయాల్లో 15–20 శాతం వాటా ఇక్కడి నుంచే ఉంటోందని పేర్కొన్నారు. దేశీయంగా తమ ఉద్యోగుల సంఖ్యను ఈ ఏడాది ఆఖరు నాటికి రెట్టింపు స్థాయిలో 100–120కి పెంచుకోనున్నట్లు బెగోరెన్ చెప్పారు. సేల్స్, ప్రోడక్ట్ మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ తదితర విభాగాల్లో నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు. జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లాంటి టెలికం దిగ్గజాలకు సేవలందిస్తున్న టెలీనిటీ.. భారత్‌లో కార్యకలాపాల ప్రారంభించి ఇరవై ఏళ్లయిన సందర్భంగా బెగోరెన్ ఈ విషయాలు వివరించారు.

జెన్సోల్.. ఓ ఉత్తుత్తి కంపెనీ!

పుణె ఈవీ ప్లాంట్‌లో ఉత్పత్తి నిల్...

- ఉన్నది ఇద్దరు ముగ్గురు కార్మికులే
- ఎన్ఎస్ఈ అధికారి తనిఖీల్లో బట్టబయలు...
- గతంలో 30,000 ఈవీలకు ప్రి–ఆర్డర్లు ఉన్నాయని ప్రకటించిన జెన్సోల్
- అదంతా బోగస్ అని బయటపెట్టిన సెబీ



ముంబై: కంపెనీ నిధులను ఇష్టానుసారం వాడేసుకుని, ఇన్వెస్టర్లను నిండా ముంచేసిన జెన్సోల్ ఇంజినీరింగ్ అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. కంపెనీ షేరు ధరతో పాటు నిధుల్లో గోల్‌మాల్ చోటు చేసుకుందని గతేడాది జూన్‌లో సెబీకి అందిన ఫిర్యాదుపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ చేపట్టిన దర్యాప్తులో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)అధికారి పుణెలోని కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) ప్లాంట్‌లో జరిపిన తనిఖీల్లో అసలు ఎలాంటి తయారీ కార్యకలాపాలు లేనట్లు బట్టబయలైంది. అలాగే, అక్కడ కేవలం ఇద్దరు ముగ్గురు కార్మికులు మాత్రమే ఉన్నారని ఈ నెల 15న సెబీ జారీ చేసిన మధ్యంతర ఆదేశాల్లో సెబీ వెల్లడించింది. జెన్సోల్ ప్రమోటర్లు అన్మోల్ సింగ్ జగ్గీ, పునీత్ సింగ్ జగ్గీ.. కంపెనీ నిధుల విషయంలో అవకతవకలకు పాల్పడటమే కాకుండా ఇన్వెస్టర్లను పక్కదారి పట్టించిన విషయాన్ని నియంత్రణ సంస్థ బయటపెట్టింది.

తవ్వేకొద్దీ...

సెబీ తరఫున ఎన్ఎస్ఈ అధికారి ఈ నెల 9న పుణె దగ్గర్లోని చకన్ వద్దనున్న జెన్సోల్ ఎలక్ట్రిక్ వెహికల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్లాంట్‌లో విచారణ చేపట్టారు. 'ఈ సందర్భంగా అక్కడ ఉత్పత్తి కార్యకలాపాలు ఏవీ కనబడలేదు. ఇద్దరు ముగ్గురు కార్మికులే ఉన్నారు. దీంతో గత 12 నెలల కరెంట్ బిల్లులను అధికారి కోరగా 2024 ఏడాది డిసెంబర్ నెలలో మాత్రమే అత్యధికంగా రూ.1,57,037 మొత్తాన్ని ఈ యూనిట్ చెల్లించినట్లు వెల్లడైంది' అని సెబీ తెలిపింది. కాగా, ఈ ఏడాది జనవరిలో జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పోలో జెన్సోల్ కొత్త ఈవీని ప్రదర్శించడమే కాకుండా, దాదాపు 30,000 ఈవీలకు ప్రి–ఆర్డర్లు కూడా వచ్చాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేయడం గమనార్హం. అయితే, కంపెనీ డాక్యుమెంట్ల ప్రకారం 29,000 ఈవీల కొనుగోలుకు వ్యక్తం చేసిన 9 సంస్థలతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మాత్రమే కుదిరినట్లు సెబీ గుర్తించింది. ఎలాంటి ధర, డెలివరీ తేదీలు లేకపోవడాన్ని చూస్తే, ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించిన విషయం స్పష్టమవుతోందని సెబీ పేర్కొంది. జెన్సోల్ ప్రమోటర్లు జగ్గీ బ్రదర్స్ 6,400 ఈవీలను కొనుగోలు చేయడం కోసం ఇరెడా, పీఎఫ్‌సీ నుంచి 978 కోట్ల రుణాలు తీసుకుని కేవలం 4,704 ఈవీలను మాత్రమే (రూ.568 కోట్లు) కొనుగోలు చేసిన విషయం సెబీ దర్యాప్తులో తాజాగా బయటపడిన విషయం తెలిసిందే. మిగతా నిధులను పక్కదారి పట్టించి, జగ్గీ బ్రదర్స్ సొంతానికి వాడేసుకున్నట్లు కూడా సెబీ తేల్చింది. దీంతో జెన్సోల్ సహా ప్రమోటర్లను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి నిషేధించడంతో పాటు జగ్గీ సోదరులు కంపెనీలో ఎలాంటి పదవులూ చేపట్టకుండా కఠిన చర్యలు చేపట్టింది. దీంతో ప్రమోటర్లు తమ డైరెక్టర్ పదవులను రాజీనామా చేశారు, మరోపక్క, జెన్సోల్ ఇంజినీరింగ్ షేరు విభజన ప్రణాళికను కూడా సెబీ పక్కనబెట్టింది.

ప్రజా ప్రయోజనాలే ముఖ్యం

ఎన్ఎస్ఈ ఐపీవోపై తుహిన్ పాండే



ముంబై: ప్రజా ప్రయోజనాలను వాణిజ్య ప్రాధాన్యతలు అధిగమించేందుకు అనుమతించబోమని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) పబ్లిక్ ఇష్యూ ప్రణాళికలపై పాండే తాజాగా స్పందించారు. ఈ అంశాన్ని నియంత్రణ సంస్థలు బలపరచవలసి ఉన్నట్లు సీఐఐ నిర్వహించిన కార్పొరేట్ పాలన సదస్సులో తెలియజేశారు. వాణిజ్య లేదా లాభార్జన సంస్థలు ఎక్స్ఛేంజీలుగా ఆవిర్భవించేందుకు భారత్ అనుమతిస్తుందని, అయితే నియంత్రణ సంస్థలు మాత్రం సాధారణ ప్రజల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తాయని వివరించారు. ఈ అంశంలో సర్దుబాట్లకు అవకాశంలేదని వ్యాఖ్యానించారు. ఇదేవిధంగా స్టాక్ ఎక్స్ఛేంజీల మధ్య ఘర్షణలు తలెత్తితే పరిష్కరించడం సెబీ బాధ్యతగా పేర్కొన్నారు. కాగా.. ఎనిమిదేళ్లుగా ఎన్ఎస్ఈ ఐపీవో ప్రణాళికలు కొనసాగుతున్నాయి. ఇందుకు అనుగుణంగా ఈ ఏడాది మొదట్లో సెబీ అనుమతిని కోరింది. దీంతో ఎన్ఎస్ఈ ఐపీవోపై సెబీ ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది. అన్నిరకాల సమస్యలనూ పరిష్కరించుకోవలసిందిగా ఎన్ఎస్ఈని ఆదేశించింది.

'విశ్లేషణ' తర్వాత 'విషయం' ఏమిటంటే..?



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఆర్థిక సంవత్సరం 2025 ప్రారంభం నుంచి ముగింపు వరకు మీకున్న అన్నీ బ్యాంకు అకౌంట్లలో వ్యవహారాలు జమలు/ఖర్చులు... అంటే క్రెడిట్‌లు/డెబిట్‌లు.. అన్నీ విశ్లేషించిన తర్వాత మీకు కొన్ని ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి.

(1). ఏఏ ఆదాయం వచ్చింది?
(2). జమ ఆదాయమా కాదా?
(3). ఆదాయం అయితే దాని స్వభావం ఏమిటి?
(4). జీతమా.. అద్దె? వ్యాపారం మీద వచ్చిందా., వృత్తి వలన వచ్చిందా? క్యాపిటల్ గెయిన్స్ ద్వారా వచ్చిందా? ఇతర ఆదాయమా?
(5). ఆదాయం కాకపోతే దేని నిమిత్తం వచ్చింది?
(6). ఎవరు ఇచ్చారు? లేదా మీరే చెల్లించారా?
(7). వారి వివరాలు... ఎవరు... ఎందుకు, ఎలా కావాలి...? ఇక విషయానికొద్దాం...

చట్ట ప్రకారం ప్రతి బ్యాంకు దగ్గర ఉన్న కస్టమర్ పొదుపు ఖాతా(సేవింగ్ బ్యాంకు)లో జమలు.., నగదు ఖాతాలు, నగదు డిపాజిట్లు ఒక ఆర్థిక సంవత్సర కాలంలో రూ.10,00,000 దాటితే ఈ వ్యవహారాలన్నీ ఇన్‌కం టాక్స్ వారికి ఒక రిటర్ను ద్వారా తెలియజేయాలి. డిపార్ట్‌మెంట్ వారు జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం ప్రతి జమ పంపాల్సిన అవసరం లేదు. కానీ సంవత్సర కాలం నగదు, జమ వెరసి మొత్తం ఎంతో తెలియజేయమన్నారు. ఆర్థిక సంవత్సరం మొత్తానికి సంబంధించి ఈ సమాచారం పంపుతారు. దానికి తుది గడువు తేదీ 31.5.2025.

ఇవన్నీ డిపార్ట్‌మెంట్‌కి చేరిన తర్వాత వారు ఒక పట్టిక తయారుచేస్తారు. ఇది మామూలు పట్టిక కాదు. మిమ్మల్ని పూర్తిగా పట్టించే పట్టిక. దీనినే ఏఐఎస్(యాన్యువల్ ఇన్‌కం స్టేట్‌మెంట్) అంటారు. ఇందులో ఏమి ఉంటాయంటే జీతం, ఇంటి అద్దె, నగదు జమలు, రూ.50వేలు బ్యాలెన్స్ దాటిన ప్రతి బ్యాంకు అకౌంట్ నిల్వలు, నగదు చెల్లింపులు, క్రెడిట్ కార్డు వివరాలు, డెబిట్ కార్డు వివరాలు, డివిడెండ్లు, బ్యాంకు ద్వారా వచ్చిన వడ్డీ, మీరు చేసిన డిపాజిట్లు, డిపాజిట్ల మీద వడ్డీ, షేర్ల క్రయవిక్రయాలు, మ్యూచువల్ ఫండ్ల కొనుగోలు, అమ్మకాల వడ్డీ, చెక్కులతో ఏం కొన్నారో వివరాలు, ప్రావిడెంట్ ఫండ్ ద్వారా వచ్చింది, ఇన్సూరెన్స్ పాలసీ ద్వారా వచ్చింది, ఇన్‌కం టాక్స్ రిఫండ్ మీద వచ్చిన వడ్డీ, అద్దె చెల్లింపులు, విదేశీ ప్రయాణ చెల్లింపులు, స్థిరాస్తి కొనుగోలు, అమ్మకాలు, విదేశాల నుంచి వచ్చిన డబ్బులు, ఇతర ఆస్తుల నుంచి వచ్చే అద్దెలు, లాటరీలు, గవర్నమెంట్ బాండ్లు, నాన్ రెసిడెంట్ల మీద వచ్చిన ఆదాయం, ల్యాండ్ అమ్మకాలు, ఆఫ్‌లైన్ డెబిట్లు, క్రెడిట్లు వ్యాపార ఆదాయం, వృత్తి మీద ఆదాయం, వ్యాపార ఖర్చులు, చిల్లర చెల్లింపులు, వాహన కొనుగోలు, ట్రస్ట్ మీద ఆదాయం....

ఇలా ఇదో పెద్ద జాబితా.. మీ ఖాతా..., ఏదీ వదలిపెట్టరు. 'పన్ను ఎగవేత' ప్లానింగ్‌కు తిలోదకాలు ఇవ్వాలి. సుందరకాండలో హనుమంతుల వారు సీతాదేవీ అన్వేషణలో నాలుగు అంగుళాల జాగా కూడా వదిలిపెట్టలేదు అలా ఉంటుంది డిపార్ట్‌మెంట్ వైఖరి. వారి వద్ద ఉన్న సమాచారం కాగితాల ప్రకారం కొన్ని వేల కోట్ల కాగితాలు. బైనరీ కోడ్ యూనిట్లలో చెప్పాలంటే కిలో బైట్లు, మెగా బైట్లు, గిగా బైట్లు.., ఇన్ని బైట్లుంటే మన పాట్లు ఏమని చెప్పాలి? అరకొర సిబ్బందే కానీ కోరలు తీయించే సాధనాలు. వేగం, ఖచ్చితత్వం, భద్రత, నిజం, ఋజువుల సహితం సంకట పరిస్థితి. మళ్లీ అందులోనే ఆటవిడుపు. జాలి గడువు. హెచ్చరిక, బోధన, శోధన, మనకు రోదన. దీనికి తగ్గట్టుగా మనం కూడా అన్ని వ్యవహారాలూ ఆన్‌లైన్ చేస్తున్నాం. గురుత్వాకర్షణ శక్తి రాయి కిందకు పడినట్లు సమాచారం పడవలిసిన వారి చేతుల్లోనే పడింది. మనం బయట పడాలంటే 'విషయానికి' మన నిజాయితీ జతకట్టాలి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వం

కెనరా రొబెకో బ్లూచిప్ ఈక్విటీ ఫండ్



ఈక్విటీ మార్కెట్లలో ఎన్నో ఆటుపోట్లను చూస్తున్నాం. ఈ సమయంలో లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు ఆదరణ కనిపిస్తోంది. ఇతర విభాగాలతో పోల్చి చూస్తే లార్జ్‌క్యాప్ కంపెనీల విలువలు ఆకర్షణీయంగా/సహేతుకంగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. మార్కెట్లు అనిశ్చితులను ఎదుర్కొంటున్న తరుణంలో ఇన్వెస్టర్లు కాస్త రిస్క్ తక్కువగా ఉండే విభాగాల వైపు చూస్తుంటారు. ఆర్థికంగా, భౌగోళికంగా ప్రతికూల పరిస్థితుల్లో లార్జ్‌క్యాప్ కంపెనీలు నిలకడైన ప్రదర్శన చూపించగలవు. పెద్ద కంపెనీలుగా వాటికి ఉండే సామర్థ్యాలు రాణించేలా చేస్తాయి. కనుక దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేస్తున్న వారు మెరుగైన రాబడితోపాటు పోర్ట్‌ఫోలియోకి స్థిరత్వాన్నిచ్చే లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ను తప్పకుండా ఎంపిక చేసుకోవాలన్నది నిపుణుల సూచన. ఈ విభాగంలో మంచి ట్రాక్ రికార్డు ఉన్న పథకాల్లో కెనరా రొబెకో బ్లూచిప్ ఈక్విటీ ఫండ్ ఒకటి. ఇన్వెస్టర్లు కనీసం ఐదేళ్లు, అంతకుమించిన దీర్ఘకాల లక్ష్యాల కోసం ఈ పథకంలో పెట్టుబడులను పరిశీలించొచ్చు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రిస్కును మరింత సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

రాబడులు

గత పదేళ్లలో కెనరా రొబెకో బ్లూచిప్ ఈక్విటీ ఫండ్ ఏటా 14 శాతానికి పైనే డైరెక్ట్ ప్లాన్‌లో రాబడులు అందించింది. 2013 జనవరిలో ఈ పథకంలో డైరెక్ట్ ప్లాన్ అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి చూస్తే వార్షిక రాబడి 15 శాతానికి పైనే ఉంది. గత ఏడాది కాలంలో రాబడిని చూస్తే 13 శాతంగా ఉంది. మరీ ముఖ్యంగా ఆరు నెలల రాబడిని చూస్తే (మార్కెట్లు గత ఆరు నెలలు దిద్దుబాటు ఉన్న నేపథ్యంలో) ఈ పథకంలో పెట్టుబడిపై నష్టం 2.68 శాతంగా ఉంది. ఒక విధంగా నష్టాలను చాలా వరకు పరిమితం చేసినట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గత మూడేళ్లలో ఏటా 15 శాతం, ఐదేళ్లలో ఏటా 22.65 శాతం, ఏడేళ్లలోనూ ఏటా 16.22 శాతం చొప్పున పెట్టుబడులపై ఇన్వెస్టర్లకు ఈ పథకం ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది.

పెట్టుబడుల విధానం

ఈ పథకం నాణ్యమైన కంపెనీలను ఎంచుకుని దీర్ఘకాలం పాటు పెట్టుబడులను కొనసాగిస్తుంటుంది. పోర్ట్‌ఫోలియోలోని స్టాక్స్‌ను తరచుగా మార్చే విధానానికి దూరంగా ఉంటుంది. మంచి వృద్ధికి అవకాశం ఉన్న వ్యాల్యూ స్టాక్స్‌ను ఫండ్ మేనేజ్‌మెంట్ బృందం అన్వేషించి ఇన్వెస్ట్ చేస్తుంటుంది. సాధారణ మార్కెట్‌తో పోలిస్తే మంచి పనితీరు చూపించేందుకు అవకాశం ఉన్న రంగాల్లోని కంపెనీలను ఎంచుకుంటుంది. మంచి పోటీనిచ్చే యాజమాన్యం, వ్యాపార మూలాలు బలంగా ఉండడం, షేరు ధర సహేతుక స్థాయిల్లో ఉండడం అనే మూడు విధానాలను స్టాక్స్ ఎంపికకు అనుసరిస్తుంటుంది.



టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9.29
ఐసీఐసీఐ బ్యాంక్	8.23
రిలయన్స్ ఇండస్ట్రీస్	4.79
ఇన్ఫోసిస్	4.11
భారతీ ఎయిర్‌టెల్	4.04
ఎల్అండ్‌టీ	3.47
ఎస్‌బీఐ	2.99
బజాజ్ ఫైనాన్స్	2.93
అల్ట్రాటెక్ సిమెంట్	2.92
మహీంద్రా అండ్ మహీంద్రా	2.91

పోర్ట్‌ఫోలియో

పథకం నిర్వహణలో రూ.14,965 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 96 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, మిగిలిన మొత్తం నగదు రూపంలో కలిగి ఉంది. ప్రస్తుతానికి ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 59 స్టాక్స్ ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే 96 శాతానికి పైన బ్లూచిప్ కంపెనీల్లోనే ఉన్నాయి. కేవలం 3.40 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీలకు కేటాయించింది. ఏక మొత్తంలో పెట్టుబడి అయితే కనీసం రూ.5,000, సిప్ అయితే రూ.100 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 33 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీల్లో 15 శాతం, కన్స్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీల్లో 10.56 శాతం చొప్పున పెట్టుబడులు కలిగి ఉంది.



సచిన్ యాదవ్

నేటి నుంచి ఫెడరేషన్ కప్ అథ్లెటిక్స్ మీట్

కొచ్చి: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించడమే లక్ష్యంగా... భారత అగ్రశ్రేణి అథ్లెట్లు జాతీయ ఫెడరేషన్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్‌లో దేశవ్యాప్తంగా 400 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. ఇందులో 167 మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో మొత్తం 38 మెడల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. ఇందులో సత్తాచాటిన వారు మే 27 నుంచి 31 వరకు దక్షిణ కొరియా వేదికగా జరగనున్న ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధిస్తారు. పోటీల తొలిరోజు పురుషుల 10,000 మీటర్ల రేసు జరగనుంది. ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిచిన సావన్ బర్వాల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. 'సాధన సరైన దిశలో సాగుతోంది. వ్యక్తిగత అత్యుత్తమ టైమింగ్ (28 నిమిషాల 49.93 సెకన్లు)ను సవరించాలని భావిస్తున్నా' అని సావన్ పేర్కొన్నాడు. ఇక పురుషుల జావెలిన్ త్రోలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సచిన్ యాదవ్... ప్రపంచ అథ్లెటిక్స్ క్వాలిఫికేషన్ మార్క్ (85.50 మీటర్లు) దాటడంపై దృష్టి పెట్టాడు. ఇటీవల అతడు 84.39 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. పురుషుల, మహిళల 400 మీటర్ల ఈవెంట్‌లోనూ మంచి పోటీ ఉండనుంది.

భారత బాక్సర్ల బోణీ

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ శుభారంభం చేసింది. భారత యువ బాక్సర్లు హార్దిక్ దహియా, రుద్రాక్ష్ సింగ్ ఈ టోర్నీలో విజయాల బోణీ కొట్టారు. బాలుర అండర్-15 విభాగం 43 కేజీల పోరులో హార్దిక్ 5-0 పాయింట్ల తేడాతో బొలుషోవ్ (కిర్గిస్తాన్)పై విజయం సాధించాడు. బాలుర అండర్-17 విభాగం 46 కేజీల పోరులో రుద్రాక్ష్ 5-0తో ఇబ్రహీం మరల్ (మంగోలియా)పై గెలుపొందాడు.



ఎదురులేని హంపి

భారత గ్రాండ్‌మాస్టర్ ఖాతాలో మూడో విజయం • మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నీ

పుణే: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి జోరు కొనసాగుతోంది. మంగోలియాకు చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) బత్కుయాగ్ మున్‌గున్‌తుల్‌తో ఆదివారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హంపి 33 ఎత్తుల్లో గెలుపొందింది. ఈ టోర్నీలో హంపికిది మూడో విజయం కావడం విశేషం. మరో మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకున్న హంపి 4.5 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. భారత్‌కే చెందిన మరో స్టార్ గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్‌కు చెందిన ద్రోణవల్లి హారిక, ప్రపంచ జూనియర్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్‌ల మధ్య జరిగిన ఆరో రౌండ్ గేమ్ 'డ్రా'గా ముగిసింది. 27 ఎత్తుల య్యాక గేమ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇద్దరూ 'డ్రా'కు అంగీకరించారు. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు రెండో పరాజయాన్ని చవిచూసింది. జు జినెర్ (చైనా)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో వైశాలి 41 ఎత్తుల్లో ఓడిపోయింది. మెలియా సలోమి (జార్జియా)తో జరిగిన మరో గేమ్‌లో పొలీనా షువలోవా (రష్యా) 45 ఎత్తుల్లో గెలిచింది. నుర్గుల్ సలీమోవా (బల్గేరియా), అలీనా కష్లిన్‌స్కాయా (పోలాండ్) మధ్య జరిగిన మరో గేమ్ 67 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్ల పాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఆరో రౌండ్ తర్వాత జు జినెర్ ఐదు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దివ్య దేశ్‌ముఖ్ నాలుగు పాయింట్లతో మూడో స్థానంలో, ద్రోణవల్లి హారిక మూడు పాయింట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. నేడు జరిగే ఏడో రౌండ్ గేముల్లో సలోమితో సలీమోవా; అలీనాతో వైశాలి; జు జినెర్‌తో హంపి; మున్‌గున్‌తుల్‌తో దివ్య దేశ్‌ముఖ్; పొలీనాతో హారిక తలపడతారు.

భారత షూటర్లకు రెండు రజతాలు



అర్జున్



ఆర్య
రుద్రాంక్ష్

లిమా (పెరూ): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) రెండో ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత షూటర్ల నిలకడైన ప్రదర్శన కొనసాగుతోంది. ఆదివారం భారత షూటర్లు రెండు రజత పతకాలను సొంతం చేసుకున్నారు. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో అర్జున్ బబూటా... 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రుద్రాంక్ష్ పాటిల్-ఆర్య బోర్సే రజత పతకాలు సాధించారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అర్జున్ బబూటా 252.3 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు. 253.4 పాయింట్లతో చైనా షూటర్ షెంగ్ లిహావో స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. పెనీ మార్టన్ (హంగేరి; 229.8 పాయింట్లు) కాంస్య పతకాన్ని సాధించాడు. ఫైనల్‌కు చేరిన మరో భారత షూటర్ రుద్రాంక్ష్ పాటిల్ 104.8 పాయింట్లతో చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ ఫైనల్లో రుద్రాంక్ష్ పాటిల్-ఆర్య ద్వయం 11-17తో జెనెట్ హెగ్-జాన్ హెర్మన్ హెగ్ (నార్వే) జంట చేతిలో ఓడిపోయింది. సోమవారంతో ముగియనున్న ఈ టోర్నీలో ప్రస్తుతం భారత్ రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి ఆరు పతకాలతో మూడో స్థానంలో ఉంది.

ప్రపంచ స్క్వాష్ పోటీలకు వీర్, అనాహత్ అర్హత

కౌలాలంపూర్: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత స్క్వాష్ స్టార్స్ వీర్ చోత్రాని... అనాహత్ సింగ్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు. ఆదివారం ముగిసిన ఆసియా క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో వీరిద్దరూ చాంపియన్స్‌గా అవతరించారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వీర్ చోత్రాని 11-3, 11-4, 11-8తో అమీషెన్‌రాజ్ చందరన్ (మలేసియా)పై గెలుపొందగా... మహిళల సింగిల్స్ ఫైనల్లో 17 ఏళ్ల అనాహత్ 11-4, 9-11, 11-2, 11-8తో టోబీ సె (హాంకాంగ్)ను ఓడించింది. ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్ ఈ ఏడాది మే 9 నుంచి 17వ తేదీ వరకు చికాగోలో జరుగుతుంది.







జయహో జ్వెరెవ్

మూడోసారి బీఎండబ్ల్యూ ఓపెన్ టైటిల్ గెలిచిన జర్మనీ స్టార్

మ్యూనిక్ (జర్మనీ): స్వదేశంలో జర్మనీ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ అదరగొట్టాడు. తన 28వ పుట్టిన రోజున... తనకెంతో కలిసొచ్చిన బీఎండబ్ల్యూ ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో జ్వెరెవ్ మూడోసారి విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ జ్వెరెవ్ 6-2, 6-4తో అమెరికాకు చెందిన రెండో సీడ్ బెన్ షెల్టన్‌ను ఓడించాడు. ఈ ఏడాది తన ఖాతాలో తొలి టైటిల్‌ను జమ చేసుకున్నాడు. 2017, 2018లలో కూడా ఈ టైటిల్ నెగ్గిన జ్వెరెవ్ ఓవరాల్‌గా తన కెరీర్‌లో 24వ టైటిల్‌ను సాధించాడు. చాంపియన్‌గా నిలిచిన జ్వెరెవ్‌కు 4,67,485 యూరోల (రూ. 4 కోట్ల 54 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు రూ. 1 కోటీ 40 లక్షలు విలువ చేసే బీఎండబ్ల్యూ ఐఎక్స్ ఎం70 మోడల్ ఎలక్ట్రిక్ కారు లభించింది.

బంగ్లాదేశ్ 191 ఆలౌట్



మోమినుల్

సిల్హెట్: సొంతగడ్డపై జింబాబ్వేతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో బంగ్లాదేశ్ బ్యాటింగ్ ఆర్డర్ తడబడింది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా ఆదివారం ప్రారంభమైన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్య బంగ్లాదేశ్ 61 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌటైంది. మోమినుల్ హక్ (105 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో చెలరేగగా... కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ షాంటో (40; 6 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబానీ, వెల్లింగ్టన్ మసకద్జ చెరో 3 వికెట్లు పడగొట్టగా... విక్టర్, వెస్లీ మధెవెరె రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే తొలి రోజు ఆట ముగిసే సమయానికి 14.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 67 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రియన్ బెన్నెట్ (37 బంతుల్లో 40 బ్యాటింగ్; 6 ఫోర్లు), బెన్ కరన్ (49 బంతుల్లో 17 బ్యాటింగ్; 2 ఫోర్లు) మెరుగైన ప్రదర్శన కనబర్చారు. చేతిలో 10 వికెట్లు ఉన్న జింబాబ్వే ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 124 పరుగులు వెనుకబడి ఉంది.

అల్‌కరాజ్‌ను ఓడించి...

బార్సిలోనా ఓపెన్ టైటిల్ నెగ్గిన హోల్గర్ రూనె

బార్సిలోనా: టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)ను బోల్తా కొట్టించిన డెన్మార్క్ టెన్నిస్ స్టార్ హోల్గర్ రూనె రెండేళ్ల తర్వాత తన ఖాతాలో తొలి టైటిల్ జమ చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన బార్సిలోనా ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో ప్రపంచ 13వ ర్యాంకర్ రూనె చాంపియన్‌గా అవతరించాడు. గంటా 40 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆరో సీడ్ రూనె 7-6 (8/6), 6-2తో టాప్ సీడ్ అల్‌కరాజ్‌ను ఓడించాడు. అల్‌కరాజ్ 2022, 2023లలో ఈ టైటిల్‌ను సాధించాడు. విజేతగా నిలిచిన రూనెకు 5,35,185 యూరోల (రూ. 5 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



టైటాన్స్ జోరు సాగేనా!

- నేడు కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో పోరు
- రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

కోల్‌కతా: ఐపీఎల్‌లో చక్కటి ప్రదర్శన కనబరుస్తున్న గుజరాత్ టైటాన్స్ డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో పోరుకు సిద్ధమైంది. కేకేఆర్ జట్టు లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు 259 మ్యాచ్‌లాడగా... అందులో మూడు సార్లు మాత్రమే గుజరాత్ టైటాన్స్‌తో తలపడింది. షెడ్యూల్ కారణంగా ఇరు జట్ల మధ్య తక్కువ మ్యాచ్‌లు జరగగా... సోమవారం పోరులో అటు కేకేఆర్, ఇటు గుజరాత్ టైటాన్స్ స్పిన్నర్లే ప్రధాన ఆయుధంగా బరిలోకి దిగనున్నాయి. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ రూపంలో ఇద్దరు మిస్టరీ స్పిన్నర్లు కోల్‌కతాకు అందుబాటులో ఉండగా... గుజరాత్ తరఫున రషీద్ ఖాన్, సాయికిషోర్ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుత సీజన్‌లో శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ 7 మ్యాచ్‌లాడి 5 విజయాలు, 2 పరాజయాలతో 10 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో అగ్రస్థానంలో ఉంది. గతంలో కోల్‌కతాకు ప్రాతినిధ్యం వహించిన గిల్... తన పాత జట్టుపై విజృంభించాలని చూస్తుంటే... విండీస్ ద్వయం రసెల్, నరైన్ సమష్టిగా కదంతొక్కి జట్టును గెలుపు బాట పట్టించాలని కోల్‌కతా మేనేజ్‌మెంట్ భావిస్తోంది. టీమిండియా అసిస్టెంట్ కోచ్ పదవి నుంచి తప్పించిన అనంతరం తిరిగి కేకేఆర్ గూటికి చేరిన అభిషేక్ నాయర్ ఈ మ్యాచ్‌లో డగౌట్ నుంచి కోల్‌కతా ప్లేయర్లకు సలహాలు ఇవ్వనున్నాడు. మరి ఈ మ్యాచ్‌లో విజయంతో గుజరాత్ అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటుందా... లేక సొంతగడ్డపై కోల్‌కతా విజయ దరహాసం చేస్తుందా చూడాలి!

నిలకడ లేమి సమస్య...

డిఫెండింగ్ చాంపియన్‌గా సీజన్ ఆరంభించిన కోల్‌కతా... స్థాయికి తగ్గ ఆటతీరు కనబర్చలేకపోతోంది. పంజాబ్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 112 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన కేకేఆర్... 95 పరుగులకే కుప్పకూలింది. బ్యాటర్లు ముకుమ్మడిగా విఫలమవడంతో కోల్‌కతా మూల్యం చెల్లించుకుంది. అయితే అభిషేక్ నాయర్ రాకతో జట్టులో జవసత్వం నిండుతుందని యాజమాన్యం ఆశిస్తోంది. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే ఇకపై ఆడనున్న అన్నీ మ్యాచ్‌లు కీలకమైన నేపథ్యంలో... ప్లేయర్లంతా సమష్టిగా సత్తా చాటాలని చూస్తున్నారు. ముఖ్యంగా వేలంలో రూ. 23.75 కోట్లు పెట్టి కొనుగోలు చేసుకున్న వెంకటేశ్ అయ్యర్ కనీస ప్రదర్శన కనబర్చలేకపోతున్నాడు. ఈ సీజన్‌లో వెంకటేశ్ 24.20 సగటుతో 121 పరుగులు చేయగా... రమణ్‌దీప్ కేవలం 29 పరుగులే చేశాడు. హిట్టర్లుగా పేరున్న రసెల్ 5 మ్యాచ్‌ల్లో 34 పరుగులకే పరిమితం కాగా... రింకూ సింగ్ 38.66 సగటుతో 116 పరుగులు చేశాడు. కెప్టెన్ అజింక్య రహానే 2 అర్ధశతకాల సాయంతో 221 పరుగులు చేయగా... 20 ఏళ్ల రఘువంశీ 170 పరుగులతో ఫర్వాలేదనిపించాడు. ఓపెనర్లు సునీల్ నరైన్, డికాక్ కొన్ని మెరుపులు మెరిపిస్తున్నా... నిలకడగా జట్టుకు శుభారంభం అందించలేకపోతున్నారు. ఈ లోపాలన్నీ సరిద్దిద్దుకుంటేనే కేకేఆర్ తిరిగి గెలుపు పట్టాలెక్కనుంది. బౌలింగ్‌లో హర్షిత్ రాణా, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి మంచి ఫామ్‌లో ఉన్నారు.



అన్నీ రంగాల్లో పటిష్టంగా...

అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో గుజరాత్ టైటాన్స్ బలంగా కనిపిస్తోంది. టాప్-3 ఆటగాళ్లు శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, బట్లర్ చక్కటి ఫామ్‌లో ఉండటం ఆ జట్టుకు కలిసిరానుంది. రూథర్‌ఫర్డ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా రూపంలో మిడిలార్డర్ కూడా పటిష్టంగా ఉంది. గత మ్యాచ్‌లో శతకానికి మూడు పరుగుల దూరంలో నిలిచిపోయిన బట్లర్ ఈ సీజన్‌లో 63.00 సగటుతో 315 పరుగులు చేయగా... సాయి సుదర్శన్ 365 పరుగులతో ఆరెంజ్ క్యాప్ రేసులో ముందు వరుసలో ఉన్నాడు. బౌలింగ్‌లోనూ గుజరాత్‌కు ఇబ్బందులు లేవు. సీనియర్ పేసర్ ప్రసిధ్ కృష్ణ తాజా సీజన్‌లో 14 వికెట్లు పడగొట్టి దూకుడు మీద ఉండగా... హైదరాబాద్ పేసర్ మొహమ్మద్ సిరాజ్, ఇషాంత్ శర్మ అతడికి చక్కటి సహకారం అందిస్తున్నారు. తమిళనాడు స్పిన్నర్ సాయి కిషోర్ తనకు ఇచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తుండగా... రషీద్ ఖాన్ గురించి కొత్తగా చెప్పుకోవాల్సిన పనిలేదు.

తుది జట్లు (అంచనా)

కోల్‌కతా నైట్ రైడర్స్: రహానే (కెప్టెన్), నరైన్, డికాక్, వెంకటేశ్ అయ్యర్, రఘువంశీ, రింకూ సింగ్, రసెల్, రమన్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, నోర్జే, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి.

గుజరాత్ టైటాన్స్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, రూథర్‌ఫర్డ్, షారుక్ ఖాన్, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, అర్షద్ ఖాన్, సాయి కిషోర్, సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ.






కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం సీఐటీయూ భారీ ర్యాలీ నిర్వహించింది. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ ర్యాలీకి భారీ సంఖ్యలో జనం హాజరయ్యారు.

ఆయనకింకా ఆ క్రెడిట్ దక్కలేదు!

- సింధూలోయ నాగరికతను వెలుగులోకి తెచ్చిన రఖల్‌దాస్ బెనర్జీ
- మొహెంజోదారోలో తవ్వకాలతో బయటపడిన గొప్ప నగరం
- బ్రిటిష్ పాలకుల కుట్రలతో భారతీయుడికి దక్కని గుర్తింపు
- ఘనత కొట్టేసిన బ్రిటిష్ జాతీయుడు జాన్ మార్షల్



మొహెంజోదారాలో తవ్వకాల్లో బయల్పడిన ప్రాచీన నాగరికత ఆనవాళ్లు



ఆర్‌డీ బెనర్జీ

భారతదేశంలో 5,300 సంవత్సరాలకు పూర్వమే గొప్ప నాగరికత వర్ధిల్లింది. అదే సింధూలోయ నాగరికత లేదా హరప్పా నాగరికత. ప్రణాళికాబద్ధమైన వీధులు, ఇళ్లు, మురుగు నీటి వ్యవస్థతో ఈ నాగరికత ఇప్పటి ఆధునిక నగరాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఉండేది. 1990వ దశకం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో సింధూలోయ నాగరికత ఆనవాళ్లు బయట పడ్డాయి. భూమి పొరల కింద శతాబ్దాలుగా కప్పబడి ఉన్న శిథిలాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అవిశ్రాంతమైన తవ్వకాలతో ఈ గొప్ప నాగరికతను నేటి తరానికి పరిచయం చేశారు. ఈ మహాయజ్ఞం వెనుక ఉన్నది ఎవరో తెలుసా? భారతీయుడైన రఖల్‌దాస్ బెనర్జీ. కానీ, మొత్తం క్రెడిట్ కొట్టేసింది మాత్రం అప్పటి భారత పురావస్తు సర్వే విభాగం(ఏఎస్‌ఐ) చీఫ్, బ్రిటిష్ జాతీయుడైన జాన్ మార్షల్. సింధూలోయ నాగరికతను బయటపెట్టింది జాన్ మార్షల్ అని బ్రిటిష్ ప్రభుత్వం లోకాన్ని నమ్మించింది. పాఠ్య పుస్తకాల్లోనూ అదే చేర్చారు. ఇప్పటికీ పిల్లలు అదే చదువుకుంటున్నారు. కానీ, వాస్తవం అది కాదని చరిత్రకారులు, పరిశోధకులు తేల్చిచెబుతున్నారు. అసలైన కథానాయకుడు రఖల్‌దాస్ బెనర్జీ అనామకంగా ఉండిపోవడానికి కారణం ఏమిటి? అసలు ఆయనెవరు? ఆ మహా మనిషిని మనం ఎందుకు మర్చిపోయాం?

చిన్నప్పుడే చరిత్రపై ఆసక్తి

పురావస్తు పరిశోధకుడైన రఖల్‌దాస్ బెనర్జీ 1885లో పశ్చిమ బెంగాల్‌లో ఓ సంపన్న కుటుంబంలో జన్మించారు. బహరాంపూర్ పట్టణంలో పెరిగారు. ఆ మధ్య యుగాల నాటి కట్టడాలు అధికంగా ఉండేవి. ఆయన వాటిని చూస్తూ ప్రాచీన నాగరికతలు, చరిత్రపై ఆసక్తి పెంచుకున్నారు. కాలేజీలో చేరి చరిత్రను అధ్యయనం చేశారు. మధ్యయుగ భారతదేశ చరిత్రపై వ్యాసం రాసే బాధ్యత అప్పగించగా, అందుకోసం స్వయంగా పరిశోధన ప్రారంభించారు. పొరుగు రాష్ట్రం వెళ్లి అక్కడి శిల్పాలు, రాతపత్రులను పరిశీలించారు. దాంతో చరిత్ర, నాగరికతలపై ఆసక్తి మరింత పెరిగింది. 1910లో ఏఎస్‌ఐలో ఎక్స్‌వేషన్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. చురుకైన వ్యక్తి కావడంతో తక్కువకాలంలోనే సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు స్థాయికి ఎదిగారు. 1917లో విధుల్లో భాగంగా పశ్చిమ భారతదేశానికి చేరుకున్నారు. 1919లో సింధూ ప్రాంతంలోని మొహెంజోదారోలో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతం పాకిస్తాన్‌తో లర్కానాలో జిల్లాలో ఉంది.

5,300 ఏళ్ల నాటి నగరం

మొహెంజోదారో అంటే సింధీ భాషలో మృతిచెందిన మనిషి దిబ్బ అని అర్థం. ఇదే చోట రఖల్‌దాస్ బెనర్జీ తవ్వకాలు ప్రారంభించారు. తొలుత బౌద్ధ స్తూపాలు, నాణేలు, ముద్రలు, కుండలు, ఇతర కళాకృతులు లభించాయి. మరిన్ని ఆధారాల కోసం 1922, 1923లో తవ్వకాలు ఊపందుకున్నాయి. ప్రాచీన సింధూలోయ నాగరికత బయటపడింది. కాల్చిన ఇటుకలతో నిర్మించిన అప్పటి భవనాలు, నీటి తొట్టెలు, స్నానపు గదులు, రహదారులు వెలుగులోకి వచ్చాయి. ఇది 5,300 ఏళ్ల క్రితం నాటిదని తేల్చారు. సింధూనది లోయ 3.86 లక్షల చదరపు మైళ్ల మేర విస్తరించి ఉండేది. ఈశాన్య అఫ్గానిస్తాన్ నుంచి వాయువ్య భారత్ దాకా గొప్ప రాజ్యం వర్ధిల్లింది. తర్వాత ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వరదల కారణంగా చాలావరకు తుడిచిపెట్టుకుపోయింది.

ఇప్పటికైనా గుర్తింపు దక్కేనా?

సింధూలోయలో ప్రాచీన నగరాన్ని తవ్వకాల్లో బయటకు తెచ్చిన ఘనత నిశ్చయంగా రఖల్‌దాస్ బెనర్జీదే. అందుకోసం ఆయన ఎంతగానో కష్టపడ్డారు. వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకున్నారు. కానీ, ఒక భారతీయుడికి ఆ పేరు ప్రఖ్యాతలు దక్కడం బ్రిటిష్ ప్రభుత్వానికి ఇష్టం లేకపోయింది. ఆయనపై ఎన్నో అభియోగాలు మోపింది. అంతేకాకుండా రఖల్‌దాస్‌ది ధిక్కరించే తత్వం. తనపై ఎవరైనా పెత్తనం చెలాయించాలని చూస్తే సహించేవారు కాదు. ఈ లక్షణమే ఆయనను బ్రిటిష్ అధికారులకు విరోధిగా మార్చింది. నిధులు దుర్వినియోగం చేశారని, అవినీతికి పాల్పడ్డారని రఖల్‌దాస్‌పై నిందలు మోపారు. అరుదైన శిల్పాలు, పెయింటింగ్‌లు దొంగిలించారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో చోరీకి గురైన ఒక బుద్ధిస్టు దేవత విగ్రహం కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. అవమానాలు భరించలేక ఆయన 1927లో ఏఎస్‌ఐలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. కానీ, ఆయనపై వచ్చిన అభియోగాలను తర్వాత కోర్టులు కొట్టివేశాయి. ఉపాధి కోసం రఖల్‌దాస్ 1928లో బనారస్ హిందూ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1930లో మరణించారు. అప్పుడు ఆయన వయసు కేవలం 45 ఏళ్లు. గొప్ప చరిత్రను వెలికితీసిన రఖల్‌దాస్‌కు చివరకు చరిత్రలో స్థానం లేకుండాపోవడం ఒక వైచిత్రి. ఇప్పటి తరానికి ఆయనెవరో తెలియదు. సింధూలోయలో ప్రాచీన నగరాన్ని సందర్శించేవారికి కూడా ఆయన గొప్పతనం ఏమిటో తెలిసే అవకాశం లేదు. ఇప్పటికైనా భారత ప్రభుత్వం స్పందించాలని, రఖల్‌దాస్ బెనర్జీకి తగిన గుర్తింపు ఇవ్వాలని చరిత్రకారులు కోరుతున్నారు. – సాక్షి, నేషనల్ డెస్క్

హిందువులకు ఒకే గుడి, ఒకే బావి, ఒకే శ్మశానం ఉండాలి

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ పిలుపు

అలీగఢ్: హిందువులంతా 'ఒకే ఆలయం, ఒకే బావి, ఒకే శ్మశాన వాటిక'అనే సూత్రానికి కట్టుబడి సామాజిక సామరస్యం కోసం పాటుపడాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. యూపీలోని అలీగఢ్‌లో ఆదివారం జరిగిన సంఘ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ శాంతిని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశం అందుకోసం ముందుగా నిజమైన సామాజిక ఐక్యతను సాధించడం అత్యంత కీలకమని నొక్కిచెప్పారు. హిందూ సమాజానికి విలువలే పునాదిగా ఉన్నాయని అని ఆయన వ్యాఖ్యానించారు. సంప్రదాయాలు, సాంస్కృతిక విలువలు, నైతిక నియమాల ఆధారంగా సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆయన కోరారు. సమాజంలోని అన్ని వర్గాలకు సన్నిహితంగా మెలగాలని స్వయం సేవకులను ఆయన కోరారు. అట్టడుగు స్థాయిలో ఐక్యత, సామరస్యాన్ని వ్యాప్తి చేసేందుకు అన్ని వర్గాల ప్రజలను తమ ఇళ్లకు ఆహ్వానించాలని సూచించారు. పండగలను కలిసి జరుపుకోవాలన్నారు. బలమైన విలువలే ఆధారంగా నిర్మితమైన మన కుటుంబ వ్యవస్థ సమాజంలో ప్రాథమిక ప్రమాణంగా ఉందని భాగవత్ పేర్కొన్నారు.

అది పచ్చి అవకాశవాద కూటమి

బిహార్‌లో జేడీ(యూ)–బీజేపీ బంధంపై ఖర్గే మండిపాటు

బక్సర్: బిహార్‌లో అధికార జేడీ(యూ)–బీజేపీ కూటమి పచ్చి అవకాశవాద కూటమి అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుర్చీ కోసం కూటములు మార్చేయడంలో సిద్ధహస్తుడు అని ధ్వజమెత్తారు. ఆదివారం బిహార్‌లోని బక్సర్ పట్టణంలో 'జైబాపు, జైభీమ్ జై సంవిధాన్' ర్యాలీలో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి ఖర్గే ప్రసంగించారు. బిహార్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేని చిత్తుచిత్తుగా ఓడించి ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీని హత్య చేసిన దుష్టశక్తులతో నితీశ్ కుమార్ చేతులు కలపడం దారుణం అంటూ దుయ్యబట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అబద్ధాల ఫ్యాక్టరీ నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. బిహార్‌కు రూ.1.25 లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజీ ఇస్తానంటూ మోదీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ ప్యాకేజీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధి కావాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ పార్టీలను గెలిపించాలని బిహార్ ప్రజలను కోరారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీలు దేశం కోసం ఎన్నో త్యాగాలు చేశారని ఉద్ఘాటించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లు పేదలు, మహిళలు, బలహీన వర్గాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కులం, మతం పేరిట ప్రజలను విడదీసి పబ్బం గడుపుకోవడంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆరితేరిపోయాయని నిప్పులు చెరిగారు. వక్ఫ్(సవరణ) చట్టం కూడా ఆ కుట్రలో అందులో భాగమేనని తేల్చిచెప్పారు.

షేక్ హసీనాపై రెడ్ నోటీసు జారీ చేయండి

ఇంటర్‌పోల్‌కు బంగ్లాదేశ్ పోలీసు శాఖ విజ్ఞప్తి

ఢాకా: పదవిచ్యుతురాలై భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాను ఎలాగైనా స్వదేశానికి రప్పించడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఆమెతోపాటు మరో 11 మందిపై రెడ్ నోటీసు జారీ చేయాలని బంగ్లాదేశ్ పోలీసు శాఖకు చెందిన నేషనల్ సెంట్రల్ బ్యూరో(ఎన్‌సీబీ) తాజాగా ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి చేసింది. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వాన్ని పడగొట్టడానికి హసీనా కుట్రలు సాగిస్తున్నట్లు బంగ్లా పాలకులు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెను స్వదేశానికి రప్పించి విచారించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. హసీనాను బంగ్లాదేశ్‌కు తీసుకురావడానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోర్టులు, ప్రభుత్వ న్యాయవాదులు, దర్యాప్తు సంస్థలు తేల్చిచెబుతున్నాయి. కోర్టు ఆదేశాల మేరకే హసీనా కోసం ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. సాధారణంగా విదేశాల్లో తలదాచుకుంటున్న నేరస్థుల కోసం ఇంటర్‌పోల్‌కు విజ్ఞప్తి చేస్తుంటారు. షేక్ హసీనాపై స్వదేశంలో ఇప్పటికే వందకుపైగా కేసులు నమోదయ్యాయి. అవినీతి, హత్య, హింసను ప్రేరేపించడం వంటి అభియోగాలు మోపారు.

పాక్‌లో హిందూ మంత్రిపై దాడి

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్న నిరసనకారులు అక్కడి హిందూమతానికి చెందిన ఒక మంత్రిపై దాడికి దిగారు. అధికార పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్)కు చెందిన ఖియాల్ దాస్ కొహిస్తానీ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కేబినెట్‌లో మత వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. శనివారం సింధ్ ప్రావిన్స్‌లోని థట్టా జిల్లాలో మంత్రి కొహిస్తానీ కాన్వాయ్‌పై కొందరు టమాటాలు, ఆలుగడ్డలు విసిరారు. షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులతో నష్టం జరుగుతుందని కొందరు ఆందోళన చేస్తున్నారని అధికారులు తెలిపారు. దాడి నుంచి కొహిస్తానీ సురక్షితంగా బయటపడ్డారని వివరించారు. ప్రధాని షరీఫ్ దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. ఘటనపై విచారణ జరిపిస్తామని, దోషులను కఠినంగా శిక్షిస్తామని కొహిస్తానీకి ఆయన హామీ ఇచ్చారు. సింధ్‌లోని జంషోరో జిల్లాకు చెందిన కొహిస్తానీ 2018, 2024 ఎన్నికల్లో వరుసగా రెండు పర్యాయాలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు.

శివసేన(ఉద్ధవ్), ఎంఎన్‌ఎస్ మధ్య భావోద్వేగపూరిత చర్చలు

కూటమి ఏర్పాటు ప్రతిపాదన ప్రస్తుతానికి లేదు: సంజయ్ రౌత్

ముంబై: మహారాష్ట్రలో విపక్ష శివసేన(ఉద్ధవ్), మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్‌ఎస్) చేతులు కలుపబోతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఆ రెండు పార్టీల అధినేతలు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే వరుసకు సోదరులే. రెండు పార్టీల మధ్య త్వరలో పొత్తు కుదరబోతున్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. అయితే, రెండు పార్టీలతో కూటమి ఏర్పాటు అనే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని శివసేన(ఉద్ధవ్) సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ ఆదివారం తెలిపారు. రెండు పార్టీల నడుమ భావోద్వేగపూరిత చర్చలు నడుస్తున్నాయని వెల్లడించారు. కుటుంబ కార్యక్రమాలు, వేడుకల్లో ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే కలుసుకోవడం, మాట్లాడుకోవడం సాధారణమేనని చెప్పారు. ఉమ్మడి శివసేన పార్టీలో పని చేసినప్పుడు ఉద్ధవ్ ఠాక్రేతో ఎలాంటి విభేదాలు తలెత్తలేదని తాజాగా ఓ ఇంటర్వ్యూలో రాజ్ ఠాక్రే చెప్పడం సంచలనాత్మకంగా మారింది. ఇరువురు నేతలు చేతులు కలుపబోతున్నట్లు మహారాష్ట్రలో ఊహాగానాలు మొదలయ్యాయి. మహారాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకొనే విషయంలో కలిసికట్టుగా పనిచేయడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఉద్ధవ్, రాజ్ ఠాక్రేలు ఇప్పటికే సంకేతాలిచ్చారు. ఉమ్మడి శివసేనలో కీలకంగా వ్యవహరించిన రాజ్ ఠాక్రే 2006లో ఎంఎన్‌ఎస్ పేరిట సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్న సంగతి తెలిసిందే.

తల్లి మృతదేహం పక్కనే.. చాక్లెట్ తింటూ

సజీవంగా బయటపడిన చిన్నారి 'ప్రామిస్'

న్యూయార్క్: తల్లి, సోదరుడు గుర్తు తెలియని కారణాలతో చనిపోగా వారి మృతదేహాల పక్కనే బెడ్‌పై దొరికిన చాక్‌లెట్ మాత్రమే తింటూ ఓ నాలుగేళ్ల చిన్నారి 'ప్రామిస్' సజీవంగా బయటపడింది. ఈ విషాదం ఘటన అమెరికాలోని న్యూయార్క్‌లో శుక్రవారం వెలుగు చూసింది. ముఖం నిండా చాక్లెట్ పూసుకుని, ఈగలు ముసిరిన స్థితిలో ఉన్న పాపను పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రామిస్‌కు ఎటువంటి ప్రమాదం లేదని వైద్యులు ధ్రువీకరించారు. లిసా కాటన్(38), కుమారుడు నాజిర్ మిల్లియెన్(8), కుమార్తె ప్రామిస్‌తో కలిసి ఓ ఫ్లాట్‌లో ఉంటున్నారు. కొన్ని రోజుల క్రితం ఆ ఇంట్లో వారు ఎవరూ కనిపించడం లేదంటూ గుర్తు తెలియని వ్యక్తి ఒకరు అత్యవసర 911 నంబర్‌కు కాల్ చేశారు. అక్కడికి వెళ్లిన పోలీసులు తలుపు తట్టగా ఎవరూ సమాధానమివ్వలేదు. పక్క ఫ్లాట్‌లో విచారించగా ఆ ఇంట్లోని వారెవరూ కొంతకాలంగా కనిపించడం లేదని, ఎటువంటి శబ్దాలు కూడా ఆ ఫ్లాట్ నుంచి రావడం లేదని బదులిచ్చారు. ఎటువంటి అనుమానాస్పద జాడలు లేకపోవడంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఆ ఫ్లాట్ యజమాని శుక్రవారంలిసా తండ్రి హుబర్ట్(71)కు ఫోన్ చేశారు. లిసా చాలా రోజులుగా కనిపించడం లేదు, ఆమె ఫ్లాట్‌ను ఖాళీ చేశారా అంటూ వాకబు చేశారు. అపాయం శంకించిన హుబర్ట్ వెంటనే మరో కుమార్తెను లిసా ఫ్లాట్ వద్దకు పంపించారు. ఆమె అక్కడికి వెళ్లి చూడగా సోదరి లిసా మృతదేహం పక్కనే చిన్నారి ప్రామిస్ చాక్లెట్ తింటూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడి చేరుకున్న పోలీసులు ఘర్షణలు జరిగినట్లు ఎలాంటి ఆనవాళ్లు లేవని గుర్తించారు. విషాదంపై హుబర్ట్ మాట్లాడారు. తమ కుమార్తె లిసా చాలా కాలంగా ఉబ్బసంతో బాధపడుతోందని, గుండెపోటుకు గురై చనిపోయి ఉంటుందని చెప్పారు. అదేవిధంగా, తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న నాజిర్‌కు ట్యూబ్ ద్వారానే ఆహారం అందించాల్సి ఉంటుందని, బహుశా అతడు ఆకలితోనే చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. వీరి మరణానికి కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. లిసా ఉండే ఫ్లాట్ నుంచి కొన్ని రోజులుగా దుర్వాసన వస్తోందని పొరుగు వారు చెప్పారు. చిన్నారి ప్రామిస్‌కి వైద్య పరీక్షలు జరిపించామని, ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వమే పార్టీగా ఉన్న

పెండింగ్ కేసులు 7 లక్షలు



- ఆర్థిక శాఖకు సంబంధించిన కేసులు 1.90 లక్షలు
- పెండింగ్ కేసుల పరిష్కారంపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు కొండల్లా పెరిగిపోతున్నాయి. అవి ఎప్పుడు పరిష్కారానికి నోచుకుంటాయో ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రజాసంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు, విధానాలను క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు చేయలేకపోవడం చివరకు కోర్టు కేసులకు దారితీస్తోంది. బాధితులు ప్రభుత్వంపై కోర్టుల్లో కేసులు వేస్తున్నారు. పిటిషన్లలో కేంద్ర ప్రభుత్వాన్ని ఒక పార్టీగా మారుస్తున్నారు. లీగల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్, బ్రీఫింగ్ సిస్టమ్(ఎల్‌ఐఎంబీఎస్) గణాంకాల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వ ఒక పార్టీ(కక్షిదారు)గా ఉన్న 7 లక్షల కేసులు దేశవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో కేంద్ర ఆర్థిక శాఖ ఒక పార్టీగా ఉన్న కేసుల సంఖ్య 1.90 లక్షలు కావడం గమనార్హం. ఈ కేసులు సకాలంలో పరిష్కారానికి నోచుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. బాధితులకు న్యాయం జరగడంలేదు. అందుకే ప్రభుత్వం పార్టీగా ఉన్న పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడానికి చర్యలు చేపట్టామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమల్లో లోపాలు, అసమర్థత వల్ల అసలైన లబ్ధిదారులు నష్టపోవచ్చు. కొన్నిసార్లు అనర్హులకు లబ్ధి చేకూరవచ్చు. ఇలాంటి సందర్భాల్లో బాధితులకు అందుబాటులో ఉన్న మార్గం న్యాయస్థానాలే. అందుకే ప్రభుత్వంపై దావాలు వేయడం పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉన్న పెండింగ్ కేసులను నివారించడం, తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర న్యాయ శాఖలోని డిపార్టుమెంట్ ఆఫ్ లీగల్ అఫైర్స్ చర్యలకు ఉపక్రమించింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. న్యాయపరమైన ప్రక్రియను సులభతరంగా మార్చడం, అనవసరమైన లిటిగేషన్లను నివారించడం, నోటిఫికేషన్లు, ఆర్డర్లలో పొరపాట్లకు తావు ఇవ్వకపోవడం, అవాంఛిత అప్పీళ్లను తగ్గించడం వంటి చర్యలు చేపట్టాలని స్పష్టంచేసింది.

కాల్పుల విరమణ ఓ నాటకం

రష్యాపై జెలెన్‌స్కీ ధ్వజం

కీవ్: రష్యా ఓ వైపు తమ సైన్యంపైకి దాడులు కొనసాగిస్తూనే ఈస్టర్ పండగ సందర్భంగా కాల్పుల విరమణ అంటూ భ్రమ కల్పిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ధ్వజమెత్తారు. 'ఈస్టర్ పర్వదినాన ఆదివారం కాల్పుల విరమణ అనే భ్రాంతి కల్పించేందుకు రష్యా సైన్యం ప్రయత్నిస్తోంది. ప్రచారంపైనే ఆ దేశానికి ఆసక్తి. అంతే తప్ప, యుద్ధం ఆపాలనుకోవడం లేదు'అని అన్నారు. 'వాస్తవానికి ఉక్రెయిన్‌లోని కొన్ని చోట్ల ముందుకు చొచ్చుకు వచ్చేందుకు ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉంది. అయితే, గగనతలం మీదుగా దాడులు చేయకపోవడం మంచిదే'అని ఆయన 'ఎక్స్'లో తెలిపారు. డొనెట్స్క్ ప్రాంతంలో రష్యా బలగాలు పొంచి ఉండి జరిపిన దాడిలో తమ బలగాలకు నష్టం వాటిల్లిందన్నారు. కాగా, కాల్పుల విరమణకు తాము కట్టుబడి ఉండగా, తమ భూభాగంపైకి ఉక్రెయిన్ 48 డ్రోన్లను ప్రయోగించిందని రష్యా రక్షణ శాఖ తెలిపింది.

పుట్టి.. మళ్లీ కడుపులోకి వెళ్లి.. మళ్లీ పుట్టి

- రెండుసార్లు జన్మించిన పిల్లాడు
- బ్రిటన్‌లో అత్యంత అరుదైన ఘటన

బ్రిటన్‌లో రాఫర్టీ ఇసాక్ అనే పిల్లాడు రెండు సార్లు పుట్టాడు. ఒకసారి జన్మించిన పిల్లాడు పెరిగి పెద్దవాడయ్యాక ముదిమి వయసులో చనిపోతే తర్వాత జన్మలో కదా పుట్టేది అని చాలా మంది అనుకోవచ్చు. కానీ ఈ పిల్లాడు 'సాంకేతికంగా'రెండుసార్లు జన్మించాడు. తల్లికి క్యాన్సర్ కణుతులు పెరిగి క్యాన్సర్ రెండోస్టేజీకి చేరుకున్నాక తప్పనిసరి పరిస్థితుల్లో అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. అప్పటికి పిల్లాడు ఇంకా 20 వారాల వయసులో గర్భస్థ పిండంగా గర్భాశయంలోనే ఉన్నాడు. ఆలస్యం చేస్తే పిల్లాడు బతుకుతాడేమోగాని క్యాన్సర్ ముదిరి తల్లి ప్రాణాలు వదలడం ఖాయం. ఈ పరిస్థితుల్లో అత్యంత నిష్ణాతుడైన డాక్టర్ సొల్మనీ మజిద్ తన 15 మంది వైద్య బృందంతో కలసి చాలా సంక్లిష్టమైన ఆపరేషన్ చేసి అటు తల్లిని, ఇటు గర్భస్థ శిశువును సంరక్షించాడు.

అరుదైన ఆపరేషన్

బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ ప్రాంతానికి చెందిన లూసీ ఇసాక్ వృత్తిరీత్యా టీచర్. 32 ఏళ్ల లూసీ గత ఏడాది గర్భందాల్చింది. గర్భిణి కావడంతో సాధారణ అల్ట్రాసౌండ్ పరీక్ష చేయించడంతో అనూహ్యంగా ఓవరీ క్యాన్సర్ బారిన పడ్డట్లు తేలింది. గర్భంతో ఉన్న కారణంగా కీహోల్ తరహాలో శస్త్రచికిత్స చేయడం కుదరలేదు. అలాగని గర్భాన్ని తొలగించలేని పరిస్థితి. దాంతో పిండాన్ని ప్రసవం తరహాలో అలాగే బయటకు తీసుకొచ్చి బయట క్షేమంగా పక్కనే పెట్టి తల్లిని శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా జాన్ రాడ్‌క్లిఫ్ ఆస్పత్రిలో వైద్యుల బృందం రంగంలోకి దిగి గర్భస్థ పిండాన్ని బయటకు తీశారు. తల్లి శరీరంతో అనుసంధానమైన రక్తనాళాలు, కణజాలం జోలికి వెళ్లలేదు. వెచ్చగా పొత్తికడుపులో ఉండాల్సిన పిండం బయటి వాతావరణంలో మనగలగడం అసాధ్యం. అందుకే వెచ్చని 'సలీన్'బ్యాగ్‌లో పెట్టారు. దాదాపు ఐదు గంటలపాటు కష్టపడి తల్లి ఓవరీ క్యాన్సర్ కణాలను వైద్యులు తొలగించారు. బ్యాగులో పిండం ఆరోగ్యపరిస్థితిని ఇద్దరు వైద్యుల బృందం అనుక్షణం గమనించింది. ప్రతి 20 నిమిషాలకొకసారి బ్యాగును మార్చారు. ఈలోపు ఆపరేషన్‌ను పూర్తిచేసి గర్భాశయాన్ని మళ్లీ తల్లి పొత్తికడుపులో పెట్టి కుట్లేశారు. ఇలా ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. ఈ ఏడాది జనవరిలో నిండు గర్భిణిగా మళ్లీ ఆస్పత్రికి వచ్చిన లూసీ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పిల్లాడు పుట్టినప్పుడు 2.86 కేజీల బరువున్నాడు. ఇలా రెండు సార్లు పుట్టిన పిల్లాడిగా రాఫర్టీ అరుదైన ఘనత సాధించాడు. ఆపరేషన్ చేసిన వైద్యుడు సొల్మనీ మజిద్‌ను పిల్లాడి తల్లిదండ్రులు ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ''మూడేళ్ల క్రితం నాకు మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స జరిగింది. అలా నాకు అది పునర్జన్మ. క్యాన్సర్ బారిన పడి కూడా కోలుకుని నా భార్య లూసీ పునర్జన్మ ఎత్తింది. ప్రసవానికి ముందే పుట్టి మళ్లీ తల్లికడుపులోకి వెళ్లి మరోసారి పుట్టి నా కుమారుడు కూడా పునర్జన్మ ఎత్తాడు''అని పిల్లాడి తండ్రి ఆడమ్ ఆనందంగా చెప్పారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

అసమర్థ అధ్యక్షుడు జో బైడెన్: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌తోపాటు పలువురు న్యాయమూర్తులు, దర్యాప్తు అధికారులపై మరోసారి విరుచుకుపడ్డారు. వారి మతిలేని చర్యల వల్లే అమెరికాలోకి అక్రమ వలసలు యథేచ్ఛగా కొనసాగాయని మండిపడ్డారు. ఈస్టర్ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ''హంతకులను, మాదక ద్రవ్యాల వ్యాపారులను, నేరస్థులను, ఎంఎస్–13 గ్యాంగ్‌లను, గృహహింసకు పాల్పడే వారిని అమెరికాలోకి అనుమతించాలని పోరాడుతున్న వారందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు. మన దేశంపై దాడికి పాల్పడానికి అనుమతి ఇస్తున్న అసమర్థ న్యాయమూర్తులకు, దర్యాప్తు అధికారులకు సైతం నా శుభాకాంక్షలు. అలాగే 2020లో అధ్యక్ష ఎన్నికల సమయంలో నన్ను మోసం చేయడానికి ప్రయత్నించిన వారికి కూడా శుభాకాంక్షలు''అంటూ పోస్టు చేశారు. అమెరికా చరిత్రలో అత్యంత అసమర్థ అధ్యక్షుడు బైడెన్ అని ట్రంప్ నిప్పులు చెరిగారు.

ఏ గ్రంథంలో పట్టువస్త్రాల ప్రస్తావన కనిపిస్తుంది?

హసన్ గంగూ 1350లో కౌలాస్ దుర్గంపై దండెత్తాడు. పానగల్లు కోటను ఆక్రమించి, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. ఇతడు 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఒకటో మహమ్మద్‌షా భారతదేశంలో మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

కాకతీయానంతర యుగం

బహమనీ సుల్తాన్లు

కాకతీయ రాజ్య పతనం తర్వాత దక్షిణాపథమంతా ఢిల్లీ సుల్తాన్ మహ్మద్ బిన్ తుగ్లక్ ఆధీనంలోకి వచ్చింది. తర్వాత కొద్ది కాలానికే ఆంధ్ర దేశంలో స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి. తుగ్లక్ మీద తిరుగుబాటు చేసిన అనేక మంది సర్దారుల్లో హసన్ గంగూ అబ్దుల్ ముజఫర్ ఒకడు. తెలంగాణకు పశ్చిమోత్తర ప్రాంతంలో బహమనీ షా వంశీయుడైన హసన్‌గంగూ ఢిల్లీ చక్రవర్తి మహమ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేశాడు. 1341లో దౌలతాబాద్ రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఆ సమయంలో ఉత్తర తెలంగాణను ముసునూరి వంశానికి చెందిన కాపయ నాయకుడు పాలిస్తున్నాడు. తిరుగుబాటు సమయంలో కాపయ హసన్ గంగూకు సహాయపడ్డాడు. తర్వాతి కాలంలో ఇది నష్టానికి దారి తీసింది. బహమనీ రాజ్యం సుదీర్ఘ కాలంపాటు తెలంగాణకు పక్కలో బల్లెంలా తయారైంది.

బహమనీలు అనేకసార్లు తెలంగాణపై దండయాత్ర చేశారు. 1350లో హసన్ గంగూ కౌలాస్(నిజామాబాద్ జిల్లా) దుర్గాన్ని ఆక్రమించాడు. పానగల్లు కోటను స్వాధీనం చేసుకొని, అమరావతి దాకా తన రాజ్యాన్ని విస్తరించాడు. నీలగిరి కోటను కూడా ఆక్రమించాడు. అప్పటి నుంచే నీలగిరి నల్లగొండగా మారింది. ఇరు రాజ్యాలకు గోల్కొండ సరిహద్దుగా ఉండేలా కాపయ సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ తుంగభద్ర వరకు పురోగమించి విజయనగర రాజ్యభాగాలను, పశ్చిమాన కొంకణ్ రాజ్యాన్ని ఆక్రమించాడు. 1356లో రెండోసారి దండెత్తి భువనగిరి దుర్గాన్ని ఆక్రమించాడు. హసన్ గంగూ తన రాజధానిని దౌలతాబాద్ నుంచి గుల్బర్గాకు మార్చాడు. రాజ్యాన్ని గుల్బర్గా, దౌలతాబాద్, బీదర్, బీరార్ అనే నాలుగు రాష్ట్రాలుగా విభజించాడు. ఇతడి రాజ్యానికి ఉత్తరాన మాండు, దక్షిణాన రాయచూర్, పశ్చిమాన గోవా, తూర్పున భువనగిరి (కొంతకాలం) సరిహద్దులుగా ఉండేవి.

బహమనీ పాలకులు..

హసన్ గంగూ తర్వాత ఒకటో మహమ్మద్‌షా (1358-75), ముజాహిద్‌షా (1375-78), రెండో మహమ్మద్ షా (1378-97), ఫిరోజ్‌షా (1397-1422), అహ్మద్‌షా (1422-36), రెండో అల్లావుద్దీన్ అహ్మద్‌షా (1436-58), హుమాయూన్ (1458-61), నిజాంషా (1461-63), మూడో మహమ్మద్‌షా (1463-82), మహమూద్‌షా (1482-1518) బహమనీ రాజ్యాన్ని పాలించారు.

హసన్ గంగూ తర్వాత కూడా బహమనీలు అనేక సార్లు తెలంగాణ సహా ఇతర తెలుగు ప్రాంతాలపై దండెత్తారు. ఒకటో మహమ్మద్‌షా 1364-65లో గోల్కొండ దుర్గం సహా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఇతడు భారతదేశంలోనే మొదటిసారిగా యుద్ధ రంగంలో గన్‌పౌడర్ ఉపయోగించాడు.

పద్మనాయకులతో మైత్రి

1366లో పద్మనాయక వంశానికి చెందిన రేచర్ల అనపోత నాయకుడి చేతిలో కాపయ మరణించాడు. తెలంగాణ పద్మనాయకుల వశమైంది. వీరి కాలంలో బహమనీ సుల్తాన్లు కొంతకాలం మిత్రులుగా మరి కొంతకాలం శత్రువులుగా మెలిగారు. రెండో హరిహరరాయలు పద్మనాయక రాజ్యంపై రెండో బుక్కరాయలను దండయాత్రకు పంపాడు. ఈ సమయంలో బహమనీలు పద్మనాయకులకు అండగా నిలిచారు. విజయనగర రాజుల ఆధీనంలోని కొత్తకొండ (మహబూబ్‌నగర్ జిల్లా)ను పద్మనాయకులు స్వాధీనం చేసుకోవడానికి తోడ్పడ్డారు. బుక్కరాయలు మరోసారి ఓరుగల్లు, మెదక్, పానుగల్లును ముట్టడించాడు. ఈ సమయంలోనూ బహమనీలు పద్మనాయకులకు తోడుగా నిలిచారు.

సామంతులుగా పద్మనాయకులు

ఫిరోజ్‌షా 1417-19లో పానగల్లును ముట్టడించాడు. విజయనగర రాజుల సహాయంతో పద్మనాయకులు అతణ్ని ఓడించారు. దీంతో విజయనగర, పద్మనాయక రాజ్యాలు సన్నిహితమయ్యాయి. ఇదే సమయంలో బహమనీలతో పద్మనాయకుల వైరం తీవ్రమైంది. ఫలితంగా తర్వాతి కాలంలో పద్మనాయకుల రాజ్యానికి నష్టం వాటిల్లింది. అహ్మద్‌షా రెండో దేవరాయలతో యుద్ధం చేశాడు. ఈ సమయంలో రేచర్ల మాదానాయుడు విజయనగర పక్షం వహించాడు. ఇది బహమనీ సుల్తాన్ల ఆగ్రహానికి కారణమైంది. 1425లో బహమనీలు ఓరుగల్లు సహా అనేక దుర్గాలను ఆక్రమించారు. దీంతో పద్మనాయక రాజ్యం విచ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. అహ్మద్‌షా 1432లో తెలంగాణ మీద దండయాత్ర చేసి రాయగిరి, భువనగిరి దుర్గాలను ఆక్రమించాడు. తెలంగాణలో అధిక భాగం బహమనీ రాజ్యంలో కలిసిపోయింది. పద్మనాయకులు కొంతకాలం సామంతులుగా రాజ్యాన్ని పాలించారు. అహ్మద్‌షా తన రాజధానిని గుల్బర్గా నుంచి బీదర్‌కు మార్చాడు.

అహ్మద్‌షా గుజరాత్, మాళవ ప్రాంతాలపై దండయాత్ర చేశాడు. ఇదే అదనుగా పద్మనాయకులు కోల్పోయిన తమ ప్రాంతాలను తిరిగి ఆక్రమించారు. కానీ ఆ యుద్ధాలు ముగిశాక అహ్మద్‌షా తెలంగాణపై దండెత్తాడు. ఓరుగల్లు, రామగిరి (కరీంనగర్) మొదలైన దుర్గాలన్నింటినీ స్వాధీనం చేసుకున్నాడు. 1435 నాటికి (దేవరకొండ మినహా) రాచకొండ సహా తెలంగాణలో అధిక భాగం తిరిగి బహమనీల వశమైంది. బహమనీ రాకుమారుడైన దాసూర్‌ఖాన్ రాచకొండ రాజప్రతినిధి అయ్యాడు.

1444లో సింగమనాయుడు, కపిలేశ్వర గజపతి సాయంతో తన రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. సుల్తాన్ తమ్ముడైన మహమూద్ ఖాన్ రాచకొండలో సామంత రాజయ్యాడు.

హుమాయూన్ రాజైన తర్వాత బహమనీ రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. వీటిని ఆసరా చేసుకొని తెలంగాణను తిరిగి జయించడానికి పద్మనాయకులు ప్రయత్నించారు. జలాల్‌ఖాన్, సికిందర్ బాలకొండలో స్వతంత్రం ప్రకటించుకున్నారు. వీరు పద్మనాయకులతో స్నేహం చేశారు. హుమాయూన్ తిరుగుబాట్లను అణచివేసి, దేవరకొండను ముట్టడించాడు. పద్మనాయకులు 1461లో బహమనీ సైన్యాలను పారదోలి రాచకొండ, భువనగిరి, ఓరుగల్లు మొదలైన దుర్గాలను తిరిగి పొందగలిగారు. పద్మనాయకులకు కపిలేశ్వర గజపతి కుమారుడైన హంవీరుడు సహాయం చేశాడు. తెలంగాణలో బహమనీలకు స్థానం లేకుండా చేశారు. హుమాయూన్‌షా తర్వాత నిజాంషా కాలంలో బహమనీలు తెలంగాణను తిరిగి ఆక్రమించే ప్రయత్నం చేశారు. కపిలేశ్వరుని సాయంతో పద్మనాయకులు వారిని ప్రతిఘటించారు.

కొంత కాలానికి గజపతుల్లో అంతఃకలహాలు తలెత్తాయి. ఇదే అదనుగా తెలంగాణను జయించడానికి మూడో మహమ్మద్‌షా తన సేనాని అయిన నిజాం ఉల్‌ముల్క్ ఇబ్రహీంను పంపాడు. 1475 నాటికి తెలంగాణ మొత్తం బహమనీల వశమైంది. పద్మనాయక రాజ్యం అంతరించింది. అనంతరం బహమనీలు తెలుగు దేశాన్నంతా జయించి రెండు భాగాలుగా విభజించారు. తెలంగాణకు ఓరుగల్లు రాజధాని కాగా, రెండో భాగానికి రాజధాని రాజమహేంద్రవరం. మూడో మహమ్మద్‌షా 1481లో కంచి మీద దాడి చేసే నాటికి రాజమహేంద్రవరం, తెలంగాణ తరఫ్‌లను బహ్రీ నిజాం ఉల్‌ముల్క్, ఆజంఖాన్‌ల ఆధీనంలో ఉంచాడు.



బహమనీ రాజ్య విచ్ఛిన్నం

మూడో మహమ్మద్‌షా 1482లో మరణించడంతో బహమనీ రాజ్యం విచ్ఛిన్నం కావడం మొదలైంది. ఇతడి తర్వాత రాజైన మహమూద్ షా కాలంలో ఓరుగల్లు పాలకుడైన ఆదిల్‌ఖాన్ మరణించాడు. రాజమహేంద్ర పాలకుడైన కివాన్ ఉల్ ముల్క్ తన రాజ్యాన్ని కోల్పోయి ఓరుగల్లును ఆక్రమించాడు. సుల్తాన్ అతణ్ని పారదోలాడు. సుల్తాన్ నలుగురు కుమారుల్లో చివరి వాడైన కలీముల్లా 1537లో మరణించాడు. దీంతో బహమనీ వంశం అంతరించింది. 1500 ప్రాంతంలో బహమనీ సామ్రాజ్యం నుంచి అయిదు స్వతంత్ర రాజ్యాలు ఆవిర్భవించాయి.

రాజ్యాలు	-	స్థాపకులు
అహ్మద్‌నగర్	-	నిజాం ఉల్ ముల్క్
బీజాపూర్	-	ఆదిల్ షా
గోల్కొండ	-	కుతుబ్ ఉల్ ముల్క్
బీరారు	-	ఇమాదుల్ ముల్క్
బీదర్	-	బరీద్ ఇమమాలిక్

వీటిలో గోల్కొండ రాజ్యం తెలంగాణ భూభాగంలో ఏర్పడింది.

పద్మనాయకుల పాలనా విశేషాలు

పాలనా విధానం

పద్మనాయకులు పాలనలో కాకతీయులను అనుసరించారు. పాలనా వ్యవహారాల్లో ప్రధానులు, సేనానులు, పురోహితులు రాజుకు సలహా ఇచ్చేవారు. పద్మనాయక రాజ్యంలో రాచకొండ, దేవరకొండ, అనుముల, పాడిచేడు, ఆమనగల్లు, అనంతగిరి, ఉర్లుకొండ, ఉండ్రుగొండ, స్తంభగిరి, ఓరుగల్లు, భువనగిరి, జల్లపల్లి, పానగల్లు మొదలైన దుర్గాలు ఉండేవి. వీటికి దుర్గాధ్యక్షులు ఉండేవారు. వీరు సైన్యాన్ని పోషించి పద్మనాయకులకు యుద్ధాల్లో తోడ్పడేవారు. రాజ్య విభాగాల్లో ముఖ్యమైంది 'సీమ'. గ్రామం రాజ్యానికి పునాది. గ్రామాల్లో పన్నెండు రకాల వృత్తి పనివాళ్లు ఉండేవారు.

పన్నులు: రాజ్యానికి భూమి మీద వచ్చే పన్నులే ప్రధాన ఆదాయం. పంటలో 1/6వ వంతు శిస్తు రూపంలో వసూలు చేసేవారు. పద్మనాయకులు పొరుగు రాజ్యాలైన విజయనగర, రెడ్డి, గజపతులు, బహమనీ సుల్తాన్లతో నిరంతరం యుద్ధాలు చేయడం వల్ల ప్రజల మీద పన్నుల భారం ఎక్కువగా పడింది.

ఆర్థిక పరిస్థితులు, వ్యవసాయం

పద్మనాయకులు కాకతీయుల వ్యవసాయ విధానాన్నే అనుసరించారు. అనపోత సముద్రం, రాయసముద్రం, నాగ సముద్రం, పర్వతరావు తటాకం, వేదగిరి తటాకం మొదలైన తటాకాలను తవ్వించారు. ఏతాము, రాట్నాల ద్వారా కూడా పొలాలకు నీటి వసతి కల్పించేవారు.

'కాలమెడసేసిన / ఏతములెత్తి కాల్వలున్ పాయలు, కోళ్ల, నూతులను / బావులు రాట్నములున్ బలార్థమై'అన్న కొరవి గోపరాజు పద్యం తరీ (పొలం) సేద్యంలో వచ్చిన కొత్త మార్పును తెలుపుతుంది. గ్రావిటీ పద్ధతిలో నీరందించే చెరువులతోపాటు నూతన నీటి పారుదల పద్ధతులు వచ్చినట్టు తెలుస్తోంది. కరవు సమయాల్లో గ్రావిటీ పద్ధతిలో నీరందని పొలాలకు కూడా నీరందించే కొత్త పద్ధతులు, సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. అవి.. ఏతాము,పఠ్రెకాల్వలు, కోల్(కోళ్లు) బావులు (వాగుల నుంచి వచ్చే నీళ్లను గుంతలకు మళ్లించి వాటి నుంచి మోట ద్వారా తరలించే పద్ధతి), నూతులు, రాట్నాలు, మోటలు. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. పోతన కూడా వ్యవసాయం చేయడమే దీనికి నిదర్శనం. వరి, జొన్న, సజ్జ, చెరకు, నువ్వులు, పత్తి మొదలైనవి నాటి ముఖ్య పంటలు, అరటి, ద్రాక్ష తోటలు కూడా ఉండేవి.

పరిశ్రమలు

నాటి పరిశ్రమల్లో నేత పరిశ్రమదే అగ్రస్థానం. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రంగుల పరిశ్రమ ఉండేది. 'సింహాసన ద్వాత్రింశిక' అనే గ్రంథంలో పలు రకాల పట్టువస్త్రాల ప్రస్తావన కనిపిస్తుంది. ఓరుగల్లు, దేవరకొండ, గోల్కొండ ప్రాంతాలు వస్త్ర పరిశ్రమ కేంద్రాలుగా ఉండేవి. నిర్మల్ కత్తులు విదేశాల్లో కూడా ప్రసిద్ధి చెందాయి.

వ్యాపారం

ఈ కాలంలో ఉక్కు, గాజు, అద్దాలు, కాగితం వాడుకలోకి వచ్చాయి. వైశ్య, తెలగ, బలిజలు వ్యాపారం చేసేవారు. కృష్ణానది పక్కన ఉన్న వాడపల్లి పద్మనాయకుల వ్యాపార కేంద్రం.

సాంఘిక పరిస్థితులు

వర్ణాశ్రమ ధర్మం స్థూలంగా అమల్లో ఉండేది. బ్రాహ్మణుల్లో వైదిక, నియోగి భేదాలు ఏర్పడ్డాయి. వెలమ, రెడ్డి కులాలకు చెందిన కొందరు వ్యవసాయాన్ని వదిలిపెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. మిగిలిన శూద్ర కులాల వారు వ్యవసాయం, వృత్తి పనులను అవలంబించారు. వైష్ణవ భక్తి ఉద్యమం వల్ల అన్ని కులాల్లో భక్తిభావం పెరిగింది. విద్యాభిలాష మొలకెత్తింది. ప్రజలు అధిక వడ్డీలు చెల్లించాల్సి వచ్చేది. నాటి పురుషులు ధోతి, అంగీ,ఉత్తరీయం, తలపాగ ధరించేవారు. స్త్రీలు రవిక, కాసెకట్టు, రంగుల చీరలు ధరించేవారు. ప్రజలు భజనలు, కోలాటాలు, వీధి నాటకాలు, కోడి పందేలు, ఓమన గుంటలాట, గచ్చకాయలాట, పుంజీతం లాంటి క్రీడలతో వినోదించేవారు. సామాన్య ప్రజలు పేదరికం కారణంగా చదువుకోలేకపోయేవారు.

తెలంగాణలో ఇప్పటికీ 'సాకబోయడం' అనే ఆచారం ఉంది. ఇది పూర్వం నుంచే ఉందని సింహాసన ద్వాత్రింశిక ఆధారంగా తెలుస్తోంది. కొరవి గోపరాజు ఏకశిలా నగరాన్ని ఓరుగల్లుకు పర్యాయపదంగా వాడటాన్ని బట్టి వరంగల్లుకే ఏకశిలానగరమనే మరో పేరు ఉందని తెలుస్తోంది. కొరవి గోపరాజు 'దివ్వెల పండుగ' అనే పదప్రయోగం చేశారు. దీన్ని బట్టి తెలంగాణలో దీపావళిని 'దివిలి పండుగ' అని కూడా పిలిచే అలవాటు ఆ కాలం నుంచే ఉందని తెలుస్తోంది.

పార్సీ భాష ప్రభావం మొదలైంది. తెలుగు ప్రజల వేషధారణపై కూడా పార్సీ ప్రభావం పడింది. దూదేకుల(పింజారులు) కులం ఉనికిలోకి వచ్చింది. ముస్లింల దండయాత్రల వల్ల ఉత్తర భారతంలోని సతీసహగమనం తెలంగాణలోనూ అక్కడక్కడా కొన్ని ఉన్నత వర్గాల్లో కనిపించేది. తెలంగాణ సాంఘిక జీవితానికి ప్రతిబింబం సింహాసన ద్వాత్రింశిక. బతుకమ్మ, కోలాటం, హోళీ తదితర పండగలు ప్రాచుర్యం పొందాయి.

తెలుగు లిపి ఏ లిపి నుంచి ఉద్భవించిందని అంటున్నారు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు మెథడ్స్

మాదిరి ప్రశ్నలు

1. భాష అనే పదం ఏ ధాతువు నుంచి వచ్చింది?
   1) భాస్ 2) భాష్
   3) భాశ్ 4) భాష్యతి
2. భాష్యత ఇతిభాషా అంటే అర్థమేమిటి?
   1) భావ వినిమయ సాధనం భాష
   2) భావ గ్రహణ సాధనం భాష
   3) భాషించేది భాష
   4) భావ ప్రకటన చేసేది భాష
3. 'మానవులు తమ అభిప్రాయాలను ఎదుటి వారికి తెలుపుతూ పరస్పరం సహకరించుకోవడానికి తోడ్పడే మౌఖిక ధ్వనుల స్వతంత్ర వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
   1) హాకెట్ 2) సైమన్ పాటర్
   3) ఎస్.కృష్ణస్వామి 4) రామచంద్రవర్మ
4. 'పలు భాషణ అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ భాష' అని ఎవరన్నారు?
   1) హాకెట్ 2) రామచంద్రవర్మ
   3) ఎస్.కె.వర్మ 4) రామచంద్ర శుక్లా
5. మనసులోని భావ పరంపరను ఏ పదాలు, ఏ వాక్యాలు ఎదుటివారికి అందిస్తాయో, ఆ పదాలు, ఆ వాక్యాలే భాష అని నిర్వచించింది?
   1) హాకెట్ 2) సైమన్ పాటర్
   3) రామచంద్ర శుక్లా 4) రామచంద్ర వర్మ
6. బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తే భాష అని ఎవరన్నారు?
   1) ఐజ్లర్ 2) రామచంద్రవర్మ
   3) హాకెట్ 4) సైమన్ పాటర్
7. క్రియా పదాల నుంచి భాష పుట్టిందన్న ధాతు వాదాన్ని సమర్థించిన భారతీయ భాషావేత్త?
   1) కాత్యాయనుడు 2) యాస్కాచార్యుడు
   3) ఋష్యశృంగుడు 4) మాక్స్‌ముల్లర్
8. ప్రకంపన వాదమని ఏ వాదాన్ని అంటారు?
   1) పూ-పూ వాదం
   2) యోహిహో వాదం
   3) డింగ్-డాంగ్ వాదం
   4) భౌవౌ వాదం
9. డింగ్-డాంగ్ వాదాన్ని ఎవరు ప్రతి పాదించారు?
   1) యాస్కాచార్యుడు 2) మాక్స్‌ముల్లర్
   3) చామ్‌స్కీ 4) కాత్యాయనుడు
10. ఆనందం, దుఃఖం, ఆశ్చర్యం వంటి ఉద్వేగాల ప్రకటనాభిలాషే భాషకు మూలమని చెప్పిన వాదం?
    1) ప్రకంపన వాదం
    2) యొహిహో వాదం
    3) పూ-పూ వాదం
    4) వివక్షా ప్రేరణ వాదం
11. చామ్‌స్కీ అనే హేతువాది ప్రతిపాదించిన వాదం?
    1) సంపాదన వాదం 2) స్వతస్సిద్ధ వాదం
    3) సాంకేతిక వాదం 4) ధాతు వాదం
12. తత్వశాస్త్రంలోని అనుభవవాదం ఆధా రంగా ప్రతిపాదించిన వాదం?
    1) సంపాదన వాదం 2) సాంకేతిక వాదం
    3) స్వతస్సిద్ధ వాదం 4) ధాతు వాదం
13. సంపాదన వాదాన్ని ఇలా కూడా వ్యవహరిస్తారు?
    1) ప్రకృతి వాదం 2) సాంకేతిక వాదం
    3) అనుభవ వాదం
    4) క్రమ పరిణామ వికాస వాదం
14. 'మనిషి పుట్టుకతో భాష రాదు. శిశువు పెరిగే కొద్దీ పరిసరాలతో తాను పొందే అనుభవాల నుంచి భాషాభివృద్ధి జరుగు తుంది' అని చెప్పిన వాదం?
    1) సాంకేతిక వాదం
    2) సంపాదన వాదం
    3) స్వతస్సిద్ధ వాదం
    4) డింగ్-డాంగ్ వాదం
15. ఏ గూటి చిలుక ఆ గూటి పలుకులు పలుకుతుందనే నానుడి ఏ భాషావాదాన్ని సమర్థిస్తుంది?
    1) స్వతస్సిద్ధవాదం
    2) క్రమ పరిణామ వికాస వాదం
    3) సాంకేతిక వాదం
    4) సంపాదన వాదం
16. ఏ శాస్త్రంలోని ప్రవృత్తివాదం సంపాదన వాదాన్ని బలపరుస్తుంది?
    1) తత్వశాస్త్రం 2) మనస్తత్వశాస్త్రం
    3) భాషాశాస్త్రం 4) జంతుశాస్త్రం
17. ఎవరు తన ప్రయోగాల ద్వారా సంపాదన వాదాన్ని నిరూపించారు?
    1) పావ్‌లోవ్ 2) మాక్స్‌ముల్లర్
    3) బి.ఎఫ్.స్కిన్నర్ 4) థార్న్‌డైక్
18. 'భాష ఒక తరం నుంచి తర్వాతి తరాలకు ప్రసరిస్తుంది. అంటే సంస్కృతి వలే భాష కూడా తర్వాత తరతరాలకు సంక్రమిస్తుం ది'. ఇది భాష ఏ లక్షణం?
    1) ప్రత్యేకత 2) ప్రేరణ దూరత
    3) ద్వివిధ నిర్మాణం
    4) సాంస్కృతిక ప్రసరణం
19. లిపి అనే పదం ఏ భాషలోని డిపి నుంచి పుట్టింది?
    1) లాటిన్ 2) గ్రీకు
    3) పార్సీ 4) సంస్కృతం
20. ఎక్కడ లభించిన అశోకుని శిలాశాసనం ఆధారంగా 1వ శతాబ్దం నాటికే ఆంధ్ర దేశంలో లిపి ఉన్నట్లు తెలుస్తుంది?
    1) అద్దంకి 2) అమరావతి
    3) ఎర్రగుడిపాడు 4) పొట్లదుర్తి
21. తెలుగు లిపి ఏ లిపికి సన్నిహితంగా ఉన్నట్లు అశోకుని శిలాశాసనం వల్ల తెలుస్తుంది?
    1) వంగలక్ర లిపి 2) కన్నడ లిపి
    3) బ్రాహ్మీ లిపి 4) దేవనాగరి లిపి
22. తెలుగు లిపి ఏ లిపి నుంచి ఉద్భవించిందని అంటున్నారు?
    1) కన్నడ లిపి 2) మౌర్య లిపి
    3) దేవనాగరి లిపి 4) దక్షిణ బ్రాహ్మీ లిపి
23. ఎవరి కాలంలో ద్రావిడ భాషకు సంబంధించిన 'ఱ' అనే అక్షరం శాసనాల్లో కనిపి స్తుంది?
    1) శాతవాహనులు 2) శాలంకాయనులు
    3) చాళుక్యులు 4) విష్ణుకుండినులు
24. లిపి పరిణామ క్రమాన్ని తెలుగు భాషా చరిత్ర అనే గ్రంథంలో చక్కగా వివరించినవారు?
    1) జి.యన్. రెడ్డి 2) భద్రిరాజు కృష్ణమూర్తి
    3) పి.ఎస్. సుబ్రహ్మణ్యం
    4) తూమాటి దోణప్ప
25 చాళుక్య వంశానికి చెందిన ఎరికల్ ముత్తురాజు వేయించిన తొలి తెలుగు శాసనం ఎక్కడ లభిస్తుంది?
    1) కలమండలపాడు 2) అద్దంకి
    3) ఎర్రగుడిపాడు
    4) పొట్లదుర్తి- మాలెపాడు
26. నన్నయ ఏ లిపిలో భారతం రాశాడు?
    1) దేవనాగరి లిపి 2) వేంగి చాళుక్య లిపి
    3) బ్రాహ్మీ లిపి 4) మూలద్రావిడ లిపి
27. ఏ కవి కాలం నాటి లిపికి, నేటి తెలుగు లిపికి సన్నిహిత సంబంధం ఉంది?
    1) నన్నయ 2) తిక్కన
    3) పాల్కురికి సోమనాథుడు
    4) శ్రీనాథుడు
28. తెలుగు వర్ణమాలలోని చ, జ అక్షరాల్లో దంత్యోచ్చారణ కోసం '_' గుర్తును ఎవరు చేర్పించినట్లు గుర్తించారు?
    1) సి.పి. బ్రౌన్ 2) చిన్నయసూరి
    3) బిషప్ కాల్డ్వెల్
    4) వేటూరి ప్రభాకరశాస్త్రి
29. తెలుగు భాషకు చిన్నయసూరి రాసిన అత్యంత ప్రామాణిక వ్యాకరణ గ్రంథం?
    1) ప్రౌఢ వ్యాకరణం
    2) సూత్రాంధ్ర వ్యాకరణం
    3) ఆంధ్రశబ్ద లక్షణ సంగ్రహం
    4) బాల వ్యాకరణం
30. 'తెలుగునకు వర్ణములు ముప్పదియారు' అని ఎవరు ఏ గ్రంథంలో చెప్పారు?
    1) ప్రౌఢ వ్యాకరణం- బహుజనపల్లి సీతారామాచార్యులు
    2) బాల వ్యాకరణం- చిన్నయసూరి
    3) ఆంధ్రశబ్ద చింతామణి- నన్నయ
    4) శబ్దరత్నాకరం- బహుజనపల్లి సీతారామాచార్యులు
31. మనకు గాలి, నీరు, ఆహారం ఎంత ముఖ్యమో ఇది కూడా అంతే ముఖ్యం?
    1) ధ్వని 2) వాక్యం
    3) భావ ప్రకటన 4) భాష
32. తనకు తానే మాట్లాడుకోవడం లేదా తనకే పరిమితమైన లేఖనాన్ని ఏమంటారు?
    1) గ్రహణం 2) అభివ్యక్తి
    3) ఆత్మగతం 4) ప్రకాశం
33. భాషోపాధ్యాయుడు తరగతి గదిని ఎలా భావించి, కృత్రిమ సన్నివేశాలు, ఘట్టాలు, సృష్టించి విద్యార్థులకు అనుభవపూర్వకమైన భాషా వినియోగం కలిగించాలి?
    1) ఒక ప్రయోగశాలగా
    2) సొరకుటుంబంలా
    3) ఒక సూక్ష్మ సమాజంగా
    4) వసుధైక కుటుంబంగా
34. భాషాధ్వనులకు పుట్టుక, పలకడంలో ముఖ యంత్ర వినియోగం, ధ్వనితరంగాల లక్షణం వివరించేది?
    1) వ్యాకరణ శాస్త్రం 2) భాషాశాస్త్రం
    3) మనోవిజ్ఞాన శాస్త్రం 4) ధ్వని విజ్ఞానం
35. వాగుత్పత్తిలో కంఠం, తాలువు, మూర్ధం, దంత మూలం, పై పెదవి వీటిని ఏమంటారు?
    1) కంఠధ్వనులు 2) స్థానాలు
    3) కరణాలు 4) ప్రయత్నాలు
36. వాగుత్పత్తిలో జిహ్వ, ఓష్ఠం, గళగర్తంలను ఏమంటారు?
    1) కరణాలు 2) స్థానాలు
    3) ప్రయత్నాలు 4) ధ్వని వర్ణాలు
37. నన్నయ నుంచి పరవస్తు చిన్నయసూరి వరకు వెల్లివిరిసిన సాహిత్యమంతా ఏ భాష లో నిక్షిప్తమైంది?
    1) ప్రామాణిక భాష 2) సరళగ్రాంథిక భాష
    3) గ్రాంథిక భాష 4) మాండలిక భాష
38. ప్రామాణిక భాషనే ఇలా వ్యవహరిస్తారు?
    1) మాండలికం 2) గ్రాంథికం
    3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
39. వ్యవహారిక భాష కోసం ఉద్యమం చేపట్టినవారు?
    1) వేదం వెంకటరాయశాస్త్రి
    2) గిడుగు సీతారామశాస్త్రి
    3) గిడుగు రామమూర్తి
    4) గురజాడ అప్పారావు
40. ఉపభాష, ప్రాదేశిక భాష అని ఏ భాషను పిలుస్తారు?
    1) వ్యవహారికం 2) గ్రాంథికం
    3) మాండలికం 4) ప్రామాణికం
41. ఏ మండలంలో సొమ్ములు అంటే ఆవులు అని అర్థం?
    1) పూర్వ మండలం
    2) మధ్య మండలం
    3) దక్షిణ మండలం
    4) ఉత్తర మండలం
42. నాగలిని మడక అని ఏ ప్రాంతంలో పిలుస్తారు?
    1) గోదావరి 2) కోస్తాంధ్ర
    3) తెలంగాణ 4) రాయలసీమ
43. మూలభాష నుంచి లక్ష్యభాషలోకి భాషాంతరీకరణం చేసే నేర్పును ఏమంటారు?
    1) అనుకరణశక్తి
    2) భాషాంతరీకరణ సామర్థ్యం
    3) లక్ష్యాధారిత సామర్థ్యం
    4) భాషా వినియోగం
44. 'మూల భాషా రచనాశైలి లక్ష్యభాషలో కూడా ఉంటూ, మూలానికి కట్టుబడి చేసే అనువాదం ' ఏది?
    1) మూలానువాదం
    2) మూల విధేయానువాదం
    3) స్వేచ్ఛానువాదం 4) పదానువాదం
45. అనువాదకుడు లక్ష్యభాషకు తగిన, తనదైన శైలిని, స్వతంత్రతను ప్రదర్శిస్తే దానిని ఏమంటారు?
    1) స్వేచ్ఛానువాదం
    2) భావానువాదం 3) పదానువాదం
    4) మూల విధేయానువాదం
46. దినచర్య రహస్యలేఖలు దేనికి ఉదా హరణలు?
    1) ప్రకాశం 2) అభివ్యక్తం
    3) గ్రహణం 4) ఆత్మగతం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 1; 5) 4; 6) 1; 7) 2; 8) 1; 9) 2; 10) 4; 11) 2; 12) 1; 13) 3; 14) 2; 15) 4; 16) 2; 17) 3; 18) 4; 19) 3; 20) 2; 21) 3; 22) 4; 23) 4; 24) 2; 25) 3; 26) 2; 27) 4; 28) 1; 29) 4; 30) 3; 31) 4; 32) 3; 33) 3; 34) 4; 35) 2; 36) 1; 37) 3; 38) 4; 39) 3; 40) 3; 41) 1; 42) 4; 43) 2; 44) 2; 45) 1; 46) 4.

గత టెట్, డీఎస్సీ ప్రశ్నలు

1. భాషకు మూలం?
   1) వాక్యం 2) ధ్వని
   3) భావం 4) ఆలోచన
2. భాషకు మూలం కొన్ని ధాతువులే అని ప్రతిపాదించినవారు?
   1) నోమ్‌చామ్‌స్కీ 2) బ్లూమ్‌ఫీల్డ్
   3) యాస్కాచార్యుడు 4) కాత్యాయనుడు
3. ఆంధ్రభాషా బోధన సరస్వం పుస్తక రచయిత?
   1) శ్రీరామచంద్రుని వేంకట శేషయ్య
   2) పావులూరి కామేశ్వరరావు
   3) గొడవర్తి సూర్యనారాయణ
   4) కె.వి.వి.యల్. నరసింహారావు
4. మాక్స్‌ముల్లర్ ప్రతిపాదించిన భాషావాదం?
   1) ధ్వన్యనుకరణ సిద్ధాంతం
   2) ధాతు జన్యువాదం
   3) డింగ్ డాంగ్ వాదం
   4) భగవదత్తం
5. 'ఉండుద్ది, వచ్చుద్ది' మొదలైన క్రియా పదాలు వాడుకలో ఉన్న జిల్లా?
   1) తూర్పుగోదావరి 2) పశ్చిమగోదావరి
   3) కృష్ణా 4) గుంటూరు
6. బిందుపూర్వక 'బ' కారం ఏ భాషలో కన్పిస్తుంది?
   1) మాండలిక 2) గ్రాంథిక
   3) ప్రామాణిక 4) వ్యవహారిక
7. ప, ఫ, బ, భ, మ అనే వర్ణాలు?
   1) దంత్యాలు 2) దంతోష్ఠ్యాలు
   3) ఓష్ఠ్యాలు 4) తాలవ్యాలు
8. వ్యవహారంలో ఉణ్యాధి క్రియారూపం కనిపించే జిల్లా?
   1) శ్రీకాకుళం 2) నెల్లూరు
   3) ఆదిలాబాద్ 4) తూర్పుగోదావరి

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 3; 5) 4; 6) 2; 7) 3; 8) 2.

ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే...?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

హైడ్రోజన్ - దాని సమ్మేళనాలు

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. సాధారణ హైడ్రోజన్ పరమాణు సంఖ్య ఒకటి, పరమాణు భారం ఒకటి. న్యూట్రాన్లు లేని ఒకే ఒక కేంద్రకం హైడ్రోజన్. దీన్నే ప్రోటియం అని కూడా అంటారు. దీని సమస్థానీయాలు (ఐసోటోపులు) డ్యుటీరియం, ట్రిటియం.

- డ్యుటీరియంనే భార హైడ్రోజన్ అంటారు. ట్రిటియం రేడియోధార్మిక కేంద్రకం.
- హైడ్రోజన్ అత్యంత శ్రేష్ఠమైన ఇంధనం. దీన్ని మండించినప్పుడు నీటి ఆవిరి (H_2O) మాత్రమే విడుదలవుతుంది. కాబట్టి వాతావరణ కాలుష్యం ఉండదు.
- నక్షత్రాల్లోని శక్తికి మూలాధారం హైడ్రోజన్. హైడ్రోజన్‌కు చెందిన ఐసోటోపులు 'కేంద్రక సంలీన' చర్య ద్వారా అత్యధిక శక్తిని విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలోనే వివిధ మూలకాలు ఏర్పడతాయి.
- కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్‌ల మిశ్రమాన్నే ($CO+H_2$) 'వాటర్ గ్యాస్' అంటారు. దీన్నే నీలిగ్యాస్ అని కూడా అంటారు.
- హైడ్రోజన్‌ను ఇంధన ఘటాల్లో ఉపయోగిస్తారు. హైడ్రోజన్ లేదా కార్బన్ మోనాక్సైడ్ లేదా మీథేన్ లాంటి ఇంధనాలను దహనం చేయడం ద్వారా వచ్చే శక్తిని సరళరీతిలో విద్యుత్‌శక్తిగా మార్చే ఘటాలే ఇంధన ఘటాలు. వీటిలో 'ఆక్సిజన్' వాయువు 'ఆక్సీకరణి'గా పనిచేస్తుంది.
- ఇది నూనెలను 'హైడ్రోజనీకరణం' చేసి 'కొవ్వులు'గా మార్చడానికి ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియలో ఉత్ప్రేరకం 'నికెల్' లోహం. డాల్డాను ఈ విధానంలోనే రూపొందిస్తారు.
- 'ఫిషర్ - ట్రాప్స్' పద్ధతిలో కృత్రిమంగా పెట్రోల్ తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో 'వాటర్ గ్యాస్'ను దానిలో సగం పరిమాణం ఉన్న 'హైడ్రోజన్'తో కలిపి ఐరన్ ఆక్సైడ్, కోబాల్ట్ ఉత్ప్రేరకాల సమక్షంలో 200°C వద్ద వేడిచేస్తే హైడ్రోకార్బన్ల మిశ్రమం (కృత్రిమ గ్యాసోలిన్) వస్తుంది.
- ఆమ్లాల్లో ఒక ముఖ్యమైన అనుఘటకం హైడ్రోజన్.
- లోహ సంగ్రహణలో.. లోహ ఆక్సైడ్‌ల నుంచి క్షయకరణ పద్ధతిలో లోహాల్ని నిష్కర్షించడానికి హైడ్రోజన్‌ను ఉపయోగిస్తారు.

నదీజలం కంటే సముద్ర జలాల్లో లవణాలు ఎక్కువ కాబట్టి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల అత్యంత లవణమయమైన 'డెడ్ సీ' నీటిపై నడవవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే మినరల్ వాటర్‌ను 'తిరోగామి ద్రవాభిసరణ' (రివర్స్ ఆస్మాసిస్) ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఇదే ఆర్.ఓ. ప్రక్రియగా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రక్రియలో 'మెంబ్రేన్' (అతి సూక్ష్మ రంధ్రాలున్న పలుచని పొర) ద్వారా ఉప్పు (కఠిన) నీటిని అధిక పీడనాన్ని ఉపయోగించి పంపిస్తారు. మెంబ్రేన్ నుంచి స్వాదుజలం బయటకు వస్తుంది. దీనిలో అయాన్‌లన్నీ తొలగిపోతాయి. కాబట్టి 'డీ అయోనైజ్డ్ వాటర్' అని కూడా అంటారు.

నీరు

గాలి తర్వాత అత్యంత అవసరమైంది నీరే. ప్రకృతిలో లభ్యమయ్యే నీటిలో అత్యంత శుద్ధమైంది 'వర్షపు నీరు'. తాగడానికి పనికివచ్చే నీటిని 'పోటబుల్ నీరు' అంటారు. నాలుగింట మూడు వంతుల నీరు సముద్రాల్లోనే ఉంది. సముద్ర జలాల్లో అనేక రకాల లవణాలుంటాయి. ఈ నీరు తాగడానికి పనికి రాదు. నబ్బుతో నురగనివ్వదు. ఇలాంటి నీటిని కఠిన జలం అంటారు. ప్రధానంగా కాల్షియం, మెగ్నీషియం బైకార్బొనేట్లు; క్లోరైడ్‌లు; సల్ఫేట్లు ఉండటం వల్ల నీటికి కఠినత్వం వస్తుంది. నీటి కాఠిన్యత రెండు రకాలు. ఒకటి తాత్కాలిక కాఠిన్యత, రెండోది శాశ్వత కాఠిన్యత.

తాత్కాలిక కాఠిన్యత: కాల్షియం బై కార్బొనేట్, మెగ్నీషియం బై కార్బొనేట్ లవణాల కారణంగా నీటికి తాత్కాలిక కాఠిన్యం వస్తుంది.

- నీటిని మరిగించడం ద్వారా తాత్కాలిక కాఠిన్యతను పూర్తిగా తొలగించవచ్చు. మరిగిస్తే బైకార్బొనేట్లు కార్బొనేట్లుగా అవక్షేపితమవుతాయి. నీటిని మరిగించినప్పుడు పాత్ర అడుగుభాగంలో తెల్లని పొలుసులను గమనించవచ్చు. ఈ పొలుసుల్లో ఉండేది కాల్షియం, మెగ్నీషియం కార్బొనేట్‌లు. ఈ ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ కూడా విడుదలవుతుంది. దీని కారణంగానే నీటిని మరిగిస్తున్నప్పుడు బుడగలు వస్తాయి.
- తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించడానికి తోడ్పడే మరో విధానం 'క్లార్క్ పద్ధతి'. కఠిన జలానికి సున్నపు నీరు లేదా మిల్క్ ఆఫ్ లైమ్ (కాల్షియం హైడ్రాక్సైడ్) కలపడం ద్వారా నీటి తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించవచ్చు.

నీటి శాశ్వత కాఠిన్యత: కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్‌లు, సల్ఫేట్లు నీటికి శాశ్వత కాఠిన్యాన్ని కలుగజేస్తాయి. అంటే నీటిలో కాల్షియం క్లోరైడ్, కాల్షియం సల్ఫేటు, మెగ్నీషియం క్లోరైడ్, మెగ్నీషియం సల్ఫేట్లు కరిగి ఉంటాయి.

- సాధారణంగా పెర్మ్యుటిట్ (సోడియం అల్యూమినియం ఆర్థోసిలికేట్) లేదా కాల్గన్ (సోడియం హెక్సామెటా ఫాస్ఫేట్) ద్వారా కఠిన జలాన్ని పంపిస్తే అందులోని కాల్షియం, మెగ్నీషియం అయాన్‌లు తొలగిపోతాయి.
- అయాన్ మార్పిడి రెజిన్‌లు కూడా కఠిన జలాన్ని స్వాదుజలంగా మారుస్తాయి.

	పరమాణు సంఖ్య	పరమాణు భారం	ప్రోటాన్ల సంఖ్య	న్యూట్రాన్లు
ప్రోటియం (H)	1	1	1	0
డ్యుటీరియం(D)	1	2	1	1
ట్రిటియం (T)	1	3	1	2



- 'స్వేదన' (డిస్టిలేషన్) ప్రక్రియ ద్వారా కూడా నీటి కఠినత్వాన్ని తొలగించవచ్చు. నీటిని మరిగించినప్పుడు ఆవిరవుతుంది. ఆవిరిని చల్లారిస్తే పరిశుద్ధ జలం (100% పరిశుద్ధమైంది) వస్తుంది.
- సముద్ర జలాన్ని 'ఆవిరి చేయడం' వల్ల చివరగా ఉప్పు మిగులుతుంది.
- నీటి రసాయన నామం హైడ్రోజన్ ఆక్సైడ్ (H_2O)
- నీటికి అనేక పదార్థాలను కరిగించుకునే స్వభావం ఉంటుంది. కాబట్టి దీన్ని సార్వత్రిక ద్రావణి అంటారు.
- 4°C వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది. అందుకే నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేసినప్పుడు ఉష్ణోగ్రత - ఘనపరిమాణానికి వక్రాన్ని గీస్తే 'హాకీ స్టిక్'లా ఉంటుంది. ఘనపరిమాణం మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
- నీరు 0°C (273K) వద్ద ఘనీభవిస్తుంది. 100°C (373K) వద్ద మరుగుతుంది.
- లవణాలు ఎక్కువగా ఉండటం వల్ల సముద్ర నీటి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల ఏదైనా వస్తువు నది నీటి నుంచి సముద్రం నీటిలోకి ప్రవేశిస్తే కొంచెం పైకి తేలుతుంది.
- నీటిని విద్యుద్విశ్లేషణ చేస్తే విఘటనం చెంది హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడిపోతుంది.
- నీటిని క్రిమిరహితం చేయడానికి విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) లేదా క్లోరిన్ వాయువు లేదా అతి నీలలోహిత (UV) కిరణాలను ఉపయోగిస్తారు.
- పాత్రలో నీటిని వేడిచేసినప్పుడు పై నుంచి మరుగుతుంది.
- పొడిగాలి కంటే తడిగాలిలో ధ్వని వేగం ఎక్కువ.

భారజలం

రసాయనికంగా భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ (D_2O) అంటారు. దీన్ని హెచ్‌సీ యురే కనుగొన్నాడు. భారజలం ఘనీభవన స్థానం 3.82°C, బాష్పీభవన స్థానం 101.42°C. దీన్ని న్యూక్లియర్ రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారిగా వాడతారు.

మాదిరి ప్రశ్నలు

1. హైడ్రోజన్ ఇంధన వాహనాలు కిందివాటిలో దేని 'ఎగ్జాస్ట్'ను ఉత్పత్తి చేస్తాయి? (సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-2010)
   1) NH_3 2) CH_4
   3) H_2O 4) H_2O_2
2. రసాయనికంగా నీరు అనేది?
   1) ఆక్సిజన్ హైడ్రైడ్
   2) హైడ్రోజన్ ఆక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) నైట్రోజన్ హైడ్రైడ్
3. కిందివాటిలో స్వచ్ఛమైన జలం ఏది?
   1) నది నీరు 2) సముద్రపు నీరు
   3) భూమిని చేరకముందు వర్షపునీరు
   4) బావి నీరు
4. కిందివాటిలో రాకెట్ ఇంధనంగా ఉపయోగపడేది?
   1) ద్రవ హైడ్రోజన్ 2) ద్రవ అమ్మోనియా
   3) భారజలం 4) నీటి ఆవిరి
5. కిందివాటిలో దేనిలో హైడ్రోజన్ ఉండదు?
   1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
   3) అమ్మోనియా 4) కార్బన్ డై ఆక్సైడ్
6. నీరు అనేది ఒక?
   1) మిశ్రమం 2) మూలకం
   3) సంయోగ పదార్థం 4) పరమాణువు
7. ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే..?
   1)అది సముద్ర నీటిలో పైకి తేలుతుంది
   2) నీటిలోకి మరింతగా మునుగుతుంది
   3) ఎలాంటి మార్పూ ఉండదు
   4) ఓడలోని సరుకుపై ఆధారపడి ఉంటుంది
8. నీటిపై తేలుతున్న ఐస్ కరిగినప్పుడు బీకర్‌లోని నీటి స్థాయి?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) యథావిధిగా ఉంటుంది
   4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
9. నీటికి శాశ్వత కాఠిన్యత కిందివాటిలో దేని వల్ల ఏర్పడుతుంది? (గ్రూప్-I, 2010)
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం బై కార్బొనేట్
   3) సోడియం బై కార్బొనేట్
   4) మెగ్నీషియం బై కార్బొనేట్
10. కృత్రిమ వర్షం కురిపించడానికి ఉపయోగించే సమ్మేళనం?
    1) సిల్వర్ అయోడైడ్
    2) సోడియం నైట్రేట్
    3) సోడియం క్లోరైడ్
    4) హైడ్రోజన్ పెరాక్సైడ్
11. గాయాలను క్రిమిరహితం చేయడానికి ఉపయోగించే హైడ్రోజన్ సమ్మేళనం ఏది?
    1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
    3) భారజలం 4) అమ్మోనియా
12. నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) అయానిక బంధం
    2) సమయోజనీయ బంధం
    3) లోహబంధం
    4) హైడ్రోజన్ బంధం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1;
5) 4; 6) 3; 7) 1; 8) 3;
9) 1; 10) 1; 11) 2; 12) 4.

Pronoun must be in subject form



Bank Exams

GENERAL ENGLISH

Sentence correction section is one of the important areas in many competitive examinations. Eight types of errors pertaining to the following broad areas are generally given. Candidates who wish to secure good scores need to enhance their knowledge on these areas.

They are:

1. Collocation
2. Idioms and Phrases
3. Pronoun agreement
4. Concord
5. Modifiers
6. Verb sequences
7. Comparisons
8. Parts of speech

Out of these we have studied the first two topics collocation and idioms and phrases in the last sessions. Let us learn about pronoun agreement in this session.

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing. Take a look at the following tips:

1. A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
2. When two singular nouns are joined by and refer to the same person the pronoun used in their place should be singular in form.
3. A singular pronoun should be used when two singular nouns are joined by either or neither nor.
4. A pronoun in the plural form should be used when two nouns of different members are joined by 'or' or 'nor'.
5. The distributive pronouns 'either, neither, none, any, no one are used with singular verbs.
6. The indefinite pronoun 'one' should be used as 'one's for its possessive case.
7. The verbs such as cheat, prostrate, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of are followed by either an object or a reflexive pronoun.
8. The word 'who' as a relative pronoun in the nominative case takes a verb.
9. If a pronoun is to be placed after 'to be', the pronoun in the subjective case is used. A very important point to be noted is that we should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.

Pronoun Subject Vs Pronoun Object

Once you've found a pronoun in a Sentence Correction question, check whether it's acting as the SUBJECT or the OBJECT of the sentence or phrase. Is the following sentence correct or incorrect?

How could she blame you and he for the accident?

The first step is to identify the pronoun(s). There are three in this sentence: "she," "you," and "he". Next, try to define whether each pronoun is acting as a subject or object. Here, "she" is the subject, and the pronouns "you" and "he" are acting as the objects of the sentence.

How do we know this? Because "she" is doing the action (blaming) and "you" and "he" are receiving it (getting blamed). However, "he" does not seem to be in the correct form. "Who did she blame?", which is "him" not "he." ("Who did she blame? She blamed him")

The pronouns acting as objects must be in the objective case; "him" is objective - while "he," used in the sentence, is subjective, and therefore incorrect.

Incorrect: How could she blame you and he for the accident?

Correct: How could she blame you and him for the accident?

Who Vs Whom

If the pronoun is acting as a subject, use who. If it is acting as an object, use whom.

I don't know whom Kavitha married.

Why is "whom" correct? Because Kavitha is the subject of this sentence - not the person she married.

Singular and Plural Pronouns

Pronouns also act like nouns in the realm of verb agreement. For some pronoun questions, you also need to check if the pronoun and its verb agree in number.

Here's an example:

Incorrect: Everyone on the project have to come to the meeting.

Correct: Everyone on the project has to come to the meeting.

The pronoun "everyone" is singular. Its verb must therefore be singular as well: "has" is correct, not "have".

Possessive Pronoun Agreement

When you come across possessive pronouns such as your, their, his, and hers, check to see whether they agree with other pronouns in the sentence. Most possessive pronouns are used messily in spoken language, so be careful to take special note when you see two pronouns in a sentence.

Incorrect: Some of you will have to bring their own bags.

Correct: Some of you will have to bring your own bags.

In this sentence, the possessive pronoun towards the end of the sentence should match the pronoun following "Some of". Because the first pronoun is "you", the possessive pronoun must be your, not their.

Objects of to be verbs are in the subject form.

Watch for pronouns following "to be" verbs such "It should have been," "It is," "It could have been," "It was", and make sure they are in subject form.

Incorrect: It must have been her who called.

Correct: It must have been she who called.

"It must have been" is a "to be" verb, so the pronoun must be in subject form: "she," not "her".

Relative Pronouns

Which, that and who are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position. Which introduces non-essential clauses; that introduces essential clauses. Who refers to individuals; that refers to a group of persons, class, type, or species.

Incorrect: The person whom draws the winning number hits the jackpot.

Correct: The person who draws the winning number hits the jackpot.

Here the relative pronoun 'who' is the correct form as it is the subject of the verb draws and also introduces the clause draws twinning number.

Impersonal Pronouns

We can use impersonal pronouns to talk about people in general or unspecified objects. The pronouns "one" and "you," which are included in a class of pronouns called "impersonal pronouns," are often improperly matched with their respective possessive pronouns.

Incorrect: One should have their teeth checked every six months.

Correct: One should have one's teeth checked every six months.

PRACTICE TEST

1. Her was better suited for the job.
2. Johnny and me drank a bottle of champagne.
3. The dinner was eaten by Smith and I.
4. Whom took out the trash?
5. Neither his bodyguards nor he were there.
6. Neither he nor his bodyguards was there.
7. If anyone comes over, take their name.
8. One should take your responsibilities seriously.
9. This test is for students which native language is not English.
10. My pencil is broken. Can I borrow its?

Answers and explanation:

1. She was better suited for the job.
   Here, the pronoun is the subject of the sentence, as "the job" is clearly not the subject, and there are no other nouns in the sentence. Because the pronoun stands in for "the woman", the pronoun should be the subject form of the her/she pronoun meaning, "she".
2. Johnny and I drank a bottle of champagne.
   Because it's confused so often in spoken language, it can be difficult to tell when the pronoun in the phrase "someone else and me/I" is used incorrectly. But it's actually quite easy to remember when to use "me" and when to use "I": cross out everything in the "someone else and me/I" phrase except the pronoun - and then read it aloud. How does it sound? If it sounds fine, the pronoun is correct; if it sounds really odd, the pronoun is incorrect.
   "Me drank a bottle of wine" sounds odd, so the proper pronoun is clearly "I".
3. The dinner was eaten by Smith and me.
   "I/me" is acting as the object, so the proper pronoun is "me."
4. Who took out the trash?
   You wouldn't say "him took out the trash," so the pronoun in the original sentence must match the form of the pronoun "he," which is a subject pronoun: who is correct.
5. Neither his bodyguards nor he was there.
6. Neither he nor his bodyguards were there.
   The constructions "either... or" and "neither... nor" always take the verb form that matches the noun that is closer to the verb. Thus, "were" is incorrect in the fifth sentence because "he," a singular pronoun, is closer to the verb than "bodyguards," a plural noun; but "were" is correct in the sixth sentence because the order of the subjects is reversed, so that the plural noun "bodyguards" is closer to the verb.
7. If anyone comes over, take his or her name.
   The subject is anyone, which is singular, and therefore requires a singular pronoun such as "his" or "her".
8. One should take one's responsibilities seriously.
   The subject is one, which is singular, and therefore requires a singular pronoun.
9. This test is for students whose native language is not English.
   The correct relative pronoun to be used in this sentence is 'whose'.
10. My pencil is broken, can I borrow yours?
    The correct possessive pronoun is 'yours'.